

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శుక్రవారం | 13-12-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 238 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి రా. 7.40 తదుపరి చతుర్దశి; నక్షత్రం: భరణి ఉ. 7.50 తదుపరి కృత్తిక తె. 5.48 వరకు; వర్జ్యం: రా. 6.49-8.16; దుర్ముహూర్తం: ఉ. 8.51-9.35, మ. 12.31-1.15; అమృతఘడియలు: తె. 3.36-5.04; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.40; సూర్యాస్తమయం: 5.38 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

64 గళ్ల రాజ్యాన్ని జయించాడు!



ప్రపంచ చెస్ చాంపియన్ గుకేష్ | **పిన్నవయస్కుడిగా సరికొత్త చరిత్ర** | **ఆఖరి రౌండ్‌లో డింగ్‌కు చెక్**

అరవైనాలుగు గళ్ల సమరంలో గుకేష్ చరిత్ర సృష్టించాడు. 18 ఏళ్ల ప్రాయంలోనే చెస్ ప్రపంచానికి రారాజుగా అవతరించాడు. 'క్యాండిడేట్స్' విజేతగా వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించిన భారత జీఎం.. గత విజేత డింగ్ లిరెన్‌ను ఓడించి అగ్రపీఠాన్ని అధిష్ఠించాడు. హోరాహోరీగా సాగిన 14 రౌండ్ల పోరులో.. ఆఖరి గేమ్‌లో ప్రత్యర్థి ఎత్తును చిత్తు చేసిన గుకేష్.. చదరంగ చరిత్రలో తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకొన్నాడు.

సింగపూర్: భారత టీనేజ్ గ్రాండ్ మాస్టర్ గుకేష్ దొమ్మరాజు ప్రపంచ చెస్ చాంపియన్‌గా సరికొత్త చరిత్ర సృష్టించాడు. 18 ఏళ్ల పిన్నవయసులోనే చెస్ రారాజుగా అత్యంత అరుదైన ఘనతను అందుకొన్నాడు. 18వ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భాగంగా.. 14 రౌండ్లపాటు హోరాహోరీగా సాగిన పోరులో డిఫెండింగ్ చాంపియన్, చైనాకు చెందిన డింగ్ లిరెన్ (32)ను గుకేష్ 7.5-6.5 పాయింట్ల తేడాతో ఓడించాడు. టోర్నీ నిబంధనల ప్రకారం తొలుత 7.5 పాయింట్లు సాధించిన ఆటగాడిని విజేతగా ప్రకటిస్తారు. గురువారం నాలుగు గంటలపాటు జరిగిన 14వ, ఆఖరి క్లాసిక్ రౌండ్‌లో 58 ఎత్తుల్లో లిరెన్ ఆటకట్టించిన దొమ్మరాజు విశ్వకిరీటాన్ని అందుకొన్నాడు. టోర్నీ ఆరంభానికి ముందు భారత జీఎంను ఫేవరెట్‌గా పరిగణించినా.. తొలి రౌండ్‌లోనే షాకిచ్చిన లిరెన్ తనను ఏమాత్రం తక్కువగా అంచనా వేయొద్దన్న హెచ్చరికలు పంపాడు. కానీ, కీలక గేమ్ డ్రా దిశగా సాగుతున్న క్రమంలో.. లిరెన్ చేసిన ఒక్క తప్పిదాన్ని గుకేష్ తన విజయానికి మెట్టుగా మార్చుకొన్నాడు. 1985లో రష్యన్ చెస్ లెజెండ్ గ్యారీ కాస్పరోవ్ (22 ఏళ్ల 6 నెలల 27 రోజులు) పిన్నవయసులో చాంపియన్‌గా నిలవగా.. ఆ రికార్డును గుకేష్ (18 ఏళ్ల 8 నెలల 14 రోజులు) బద్దలుకొట్టాడు. ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ ఘనతను సాధించిన రెండో భారతీయుడిగా దేశ ప్రజలను ముగ్ధులను చేశాడు. 2013లో విషీ విజేతగా నిలవగా.. దశాబ్దం తర్వాత గుకేష్ అద్భుతం చేశాడు.

ఒక్క ఎత్తుతో చిత్తు..

13వ రౌండ్ ముగిసేసరికి చెరో 6.5 పాయింట్లతో నిలిచిన గుకేష్-లిరెన్‌కు 14వ రౌండ్ అత్యంత కీలకం. క్లాసిక్ గేమ్‌లో ఎంతో పట్టున్న దొమ్మరాజుకు టోర్నీ టైబ్రేక్ దారితీస్తే మాత్రం ఎంతో సంక్లిష్టమయ్యేది. ఈ నేపథ్యంలో తీవ్ర ఒత్తిడి మధ్య నల్లపావులతో ఆడిన గుకేష్ ఆది నుంచే దీటుగా ఎత్తులు వేస్తూ ప్రత్యర్థిని ఇరుకునబెట్టే ప్రయత్నం చేశాడు. తెల్లపావులతో ఆడిన డింగ్.. జుకర్‌టార్ట్ ఓపెనింగ్‌తో ఆరంభించాడు. దీనికి గుకేష్ కింగ్స్ రివర్స్‌డ్ గ్రెన్‌ఫెల్డ్ ఓపెనింగ్ ప్యాట్రన్‌తో దీటుగా బదులిచ్చాడు. గత రౌండ్లలో ఆరంభంలో ఎత్తులు వేయడానికి ఎంతో సమయం తీసుకొన్న లిరెన్ ఈ రౌండ్‌లో చకచకా పావులు కదిపాడు. బదులుగా గుకేష్ కూడా కౌంటర్ మూవ్స్‌తో టైమ్ కంట్రోల్ గేమ్ ఆడాడు. ఇద్దరూ మధ్య బోర్డులో ఆధిక్యం కోసం తీవ్రంగా ప్రయత్నించారు. 32 ఎత్తులు ముగిసేసరికి ఇద్దరి వద్ద చెరో బిషప్, రుక్ మాత్రమే మిగిలున్నాయి. అయితే, గుకేష్ వద్ద ఒక్క పాన్ అదనంగా ఉంది. ఈ క్రమంలో 40 ఎత్తులు పూర్తయ్యే సరికి.. చాలా మంది విశ్లేషకులు ఫలితం టైబ్రేక్‌కు మళ్లుతుందన్న ఊహాగానాలు చేశారు. మరోవైపు డింగ్ కూడా తదనుగుణంగా ఎత్తులు వేశాడు. కచ్చితంగా డ్రా అనుకొంటున్న సమయంలో 55వ ఎత్తులో లిరెన్ ఘోర తప్పిదం చేశాడు. తన రుక్‌ను గుకేష్ రుక్‌కు ఎదురుగా నిలిపాడు. దీన్ని గమనించిన గుకేష్ ఒక్కసారిగా విరుచుకుపడ్డాడు. అనంతరం మరో మూడు ఎత్తుల్లోనే చైనా గ్రాండ్ మాస్టర్ ఓటమిని అంగీకరించాడు. దీంతో గుకేష్ ఒక్కసారిగా ఉద్వేగానికి లోనయ్యాడు. అతడి కంటి నుంచి ఆనందభాష్పాలు జలజలా రాలాయి. చేతులతో ముఖాన్ని దాచుకొన్న భారత జీఎం.. ఆ తర్వాత తేరుకొని సంబరాలు చేసుకొన్నాడు.

నిశితంగా పరిశీలించే వాడు: అప్టన్

టోర్నీ ఆసాంతం ఒడిదొడుకులు ఎదురైనా.. గుకేష్ ఎంతో కూల్‌గా వ్యవహరించాడు. తొలి గేమ్‌లోనే కంగుతున్నా అద్భుతంగా పుంజుకొన్నాడు. మానసికంగా గుకేష్ ఎంతో బలంగా ఉండడం వెనుక ప్రముఖ మెంటల్ కండీషనింగ్ కోచ్ ప్యాడీ అప్టన్ పాత్ర చాలా ఉంది. గత ఆరునెలలుగా గుకేష్‌కు అప్టన్ వర్చువల్‌గా శిక్షణనిచ్చాడు. గంటలకొద్దీ సెషన్‌లు కొనసాగేవని చెప్పాడు. చిన్నవయసులోనే అతడి ఆలోచనల్లో ఎంతో పరిపక్వత కనిపించిందని ప్యాడీ చెప్పాడు. ప్రతి చిన్న విషయాన్ని నిశితంగా గమనించి.. శోధించి తెలుసుకోవడం వల్లే అతడు ఎంతో ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగాడని చెప్పాడు. 2011లో టీమిండియా వరల్డ్‌కప్ నెగ్గినప్పుడు కూడా అప్టన్ సేవలు అందించాడు.

విజేతకు రూ.11.45 కోట్లు

వరల్డ్ చెస్ చాంపియన్‌గా నిలిచిన గుకేశ్ ఖాతాలో ప్రైజ్‌మనీ కూడా భారీగా చేరనుంది. 14 రౌండ్లపాటు సాగిన ఈ చాంపియన్‌షిప్ మొత్తం ప్రైజ్‌మనీ 2.5 మిలియన్ డాలర్లు (రూ.21.22 కోట్లు). అలాగే ఫిడే నిబంధనల ప్రకారం ఇందులో ఒక్కో రౌండ్ గెలిచిన విజేతకు రూ.1.69 కోట్లు లభిస్తాయి. కాబట్టి ఈ చాంపియన్‌షిప్‌లో మూడు గేమ్‌లు గెలిచిన గుకేశ్ రూ.5.07 కోట్లు సాధించాడు. లిరెన్ రెండు గేమ్‌లు గెలవడంతో అతడికి రూ.3.38 కోట్లు దక్కాయి. ఇక మిగిలిన 1.5 మిలియన్ డాలర్ల ప్రైజ్‌మనీని ఇరువురికి సమానంగా పంచారు. దీంతో గుకేశ్‌కు మొత్తంగా రూ.11.45 కోట్లు లభించగా.. రన్నరప్‌గా నిలిచిన లిరెన్‌కు రూ.9.75 కోట్లు అందాయి.

ఇదీ టీమ్..

- గ్రజ్‌గోర్జ్ గజూస్కి
- రడోస్లావ్ వోజ్‌టస్జక్
- పెంట్యాల హరికృష్ణ
- విన్సెంట్ కీమర్
- జాన్ క్లిమ్‌కోస్కి
- జాన్ క్రజిస్టోఫ్ డుడా
- విశ్వనాథన్ ఆనంద్
- ప్యాడీ అప్టన్



సంబరాలు.. వినూత్నంగా..

గుకేష్ తన గెలుపు సంబరాలను వినూత్నంగా చేసుకొన్నాడు. గేమ్ ముగిసిన తర్వాత చెస్ బోర్డుపై పావులను ఆయా స్థానాల్లో ఉంచి తన గౌరవాన్ని చాటాడు. బోర్డుపై పావులను సర్దుతున్న వీడియో ఇప్పుడు నెట్‌లో వైరల్‌గా మారింది. బలగాలను వాటివాటి స్థానాల్లో పెట్టిన తర్వాతనే అతడు పైకిలేచి విజయదరహాసం చేశాడు.

కల నెరవేరింది: గుకేష్

'గత పదేళ్లుగా ఈ రోజుకోసమే కలలు కంటున్నా. నా స్వప్నం నిజమైనందుకు ఎంతో సంతోషంగా ఉంది. విజేతగా నిలుస్తానని ఊహించలేదు. అందుకే భావోద్వేగానికి గురయ్యా. అవకాశం చిక్కడంతో.. ప్రత్యర్థిపై విరుచుకుపడ్డా. తొలి గేమ్‌లో ఓడినప్పుడు విషీ సర్ ధైర్యం చెప్పాడు. పిన్నవయసు చాంపియన్‌గా నిలవాలని 2017లో అనుకొన్నా.'

నా అంచనాలను మించాడు



తొలి ప్రపంచ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లోనే గుకేష్ ఆటతీరు అద్భుతంగా ఉందని ఐదుసార్లు చాంపియన్ ఆనంద్ కొనియాడాడు. 'గుకేష్ నా అంచనాలను మించి రాణించాడు. గుకేష్ విశ్వ విజయం భారత్ చెస్‌పై ఎంతో ప్రభావం చూపుతుంది. ఎందరో యువకులు చెస్ క్రీడలోకి అడుగుపెట్టేందుకు గుకేష్ టైటిల్ గెలుపు దోహదం చేస్తుంది' అని ఆనంద్ స్పష్టంజేశాడు.


డింగ్ లిరెన్

చెస్‌కు అంతం: క్రామ్నిక్

వరల్డ్ చాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ చాంప్ లిరెన్ చిన్నపిల్లాడిలా ఆడి తప్పిదం చేయడంపై మాజీ విజేత వ్లాదిమిర్ క్రామ్నిక్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. చెస్‌కు ఇది అంతమన్నాడు. 'ఎటువంటి వ్యాఖ్యలు చేయదల్చుకోలేదు. బాధగా ఉంది. మాకు తెలిసిన చెస్ అంతమైంది' అని ఎక్స్‌లో పోస్టు చేశాడు. పిల్లలు కూడా చేయని తప్పిదం.. వరల్డ్ చెస్ టైటిల్ ఫలితాన్ని నిర్ధారించిందని మరో పోస్టులో అసహనం వ్యక్తం చేశాడు.

పిన్నవయసు వరల్డ్ చాంపియన్లు

గుకేష్	18 ఏళ్ల 8 నెలల 14 రోజులు
గ్యారీ కాస్పరోవ్	22 ఏళ్ల 6 నెలల 27 రోజులు
మాగ్నస్ కార్ల్‌సన్	22 ఏళ్ల 11 నెలల 24 రోజులు
మిఖైల్ తాల్	23 ఏళ్ల 5 నెలల 28 రోజులు
అనతోలి కార్పోవ్	23 ఏళ్ల 10 నెలల 11 రోజులు
వ్లాదిమిర్ క్రామ్నిక్	25 ఏళ్ల 4 నెలల 10 రోజులు
ఎమ్మాన్యుయేల్ లాస్కర్	25 ఏళ్ల 5 నెలల 2 రోజులు

యువతకు ప్రేరణ

'చారిత్రకం.. ఆదర్శవంతం..! అద్భుత విజయం సాధించిన గుకేష్‌కు అభినందనలు. ఇది ప్రతిభ, కఠిన శ్రమ, పట్టుదలకు దక్కిన ప్రతిఫలం. అతడి విజయం చెస్‌లో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించడమే కాదు.. ఎంతోమంది యువతకు ప్రేరణ. భవిష్యత్‌లో అతడు మరిన్ని విజయాలు అందుకోవాలని కోరుకొంటున్నా'

- ప్రధాని నరేంద్ర మోదీ

'ఎంతో గర్విస్తున్నాం. గొప్ప విజయం సాధించిన నీకు అభినందనలు. చెస్‌కు భారత్ పవర్ హౌస్ అని నిరూపించావు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిష్ఠించాలి'

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

అందనంత 'ఎత్తు'లో..

నిన్న క్యాండిడేట్స్, నేడు వరల్డ్ చెస్ టైటిళ్లు

నా లక్ష్యం ఇంకా పెద్దది..

జనవరి 15, 2019న 12 ఏళ్ల ఏడు నెలల 17 రోజుల వయస్సులో గ్రాండ్‌మాస్టర్ అయిన సందర్భంగా గుకేష్ చేసిన ఆ వ్యాఖ్య అతడిలోని ఆత్మవిశ్వాసానికి అద్దం పడుతుంది. అందుకు తగ్గట్టుగానే గత ఏప్రిల్‌లో క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన గుకేష్ తొలి సంచలనం సృష్టించాడు. 17 సంవత్సరాలకే క్యాండిడేట్స్ టైటిల్ అందుకున్న పిన్నవయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. ఇప్పుడేమో ఏకంగా ప్రపంచ చాంపియన్‌గా ఆవిర్భవించిన గుకేష్ తన అతిపెద్ద లక్ష్యాన్ని చేరుకున్నాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ స్ఫూర్తిగా భారత్ నుంచి ఎందరో చెస్ ఆటగాళ్లు ఉద్భవించారు. పెద్ద సంఖ్యలో ఆటగాళ్లు దూసుకురావడమేకాదు విశ్వ చెస్ వేదికపై ప్రకంపనలు సృష్టిస్తున్నారు. పెంటేల హరికృష్ణ మొదలుకొని కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, వైశాలీ రమేష్‌బాబు, ప్రజ్ఞానంద, అర్జున్ ఇరిగేసితో ఈ జాబితా ఎంతో సుదీర్ఘంగా ఉంటుంది. ప్రస్తుతం గుకేష్ 'విశ్వ' కిరీటంతో ప్రపంచ చెస్‌లో తిరుగులేని శక్తిగా భారత్ స్థానం మరింత సుస్థిరమైంది. దొమ్మరాజు గుకేష్ కూడా తెలుగువాడే. అతడి తండ్రి రజనీకాంత్ కంటి వైద్యుడు. తల్లి డా.పద్మ మైక్రోబయాలజిస్ట్. వృత్తి, ఉద్యోగ రీత్యా గుకేష్ తల్లిదండ్రులు చెన్నైలో స్థిరపడ్డారు.

లేలేత ప్రాయంలోనే..: ఏడు సంవత్సరాల వయస్సులోనే గుకేష్ చెస్‌లోకి అడుగుపెట్టాడు. చదువుతోపాటు చెస్ ఆటగాళ్లను తీర్చిదిద్దే చెన్నైలోని ప్రసిద్ధ వేలమ్మాల్ విద్యాలయంలో చేరడంతో గుకేష్ చదరంగ ప్రస్థానం ప్రారంభమైంది. 2015లో అండర్-9 ఆసియా స్కూల్ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్ విజయంతో గుకేష్ ఘనమైన పయనం మొదలైంది. 2018లో వరల్డ్ యూత్ చెస్ అండర్-12 టైటిల్ గెలవడంతో అందరి చూపు ఈ చిన్నోడిపై పడింది. అదే ఏడాది ఏషియన్ యూత్ చెస్ చాంపియన్‌షిప్ అండర్-12 కేటగిరిలో ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగాల్లో కలిపి ఏకంగా ఐదు స్వర్ణ పతకాలు కొల్లగొట్టడంతో దేశ చెస్‌లో గుకేష్ పేరు మార్మోగిపోయింది. 2017లో ఇంటర్నేషనల్ మాస్టర్ నార్మ్ దక్కించుకున్న గుకేష్ మరో రెండు సంవత్సరాలకు గ్రాండ్‌మాస్టర్ అయ్యాడు. ప్రపంచ చెస్‌లో రెండో పిన్నవయసు జీఎంగా గుకేష్ రికార్డు నెలకొల్పాడు. 2022 చెస్ ఒలింపియాడ్‌లో వ్యక్తిగత పసిడి పతకం నెగ్గిన గుకేష్.. మరుసటి సంవత్సరం 2750 ఎలో రేటింగ్‌తో ఇంకో రికార్డు సాధించాడు. 2023 సెప్టెంబరులో ఆనంద్‌ను వెనక్కునెట్టి భారత టాప్ ర్యాంక్ ఆటగాడిగా ఖ్యాతిగాంచాడు. ఇక..ఈ సంవత్సరం ఏప్రిల్‌లో క్యాండిడేట్స్ టోర్నీ టైటిల్ అందుకోవడం ద్వారా ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్ పోరుకు అర్హత సాధించాడు.



ఆకాశ్‌దీప్ ఆడేనా?

విరాట్.. పద్ధతి మార్చుకో : గవాస్కర్
మిడిలార్డర్‌లోనే రోహిత్ ▸▸ జోరుగా ప్రాక్టీస్

రేపటి నుంచే మూడో టెస్టు
ఉ. 5.50 నుంచి



బ్రిస్బేన్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా శనివారం నుంచి ఆస్ట్రేలియాతో జరిగే మూడో టెస్టు కోసం రోహిత్ సేన ముమ్మరంగా ప్రాక్టీస్ సాగిస్తోంది. అలాగే 1-1తో సిరీస్ సమమైన వేళ ఇరు జట్లకు ఈ మ్యాచ్ అత్యంత కీలకమే. అందుకే అత్యంత పకడ్బందీగా బరిలోకి దిగాలని టీమిండియా భావిస్తోంది. దీంట్లో భాగంగా తుది జట్టులోనూ మార్పులు ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా బౌలింగ్ విభాగంలో పేసర్ హర్షిత్ రాణాపై వేటు పడే చాన్సుంది. అతడి స్థానంలో మరో పేసర్ ఆకాశ్ దీప్‌ను ఆడించేందుకు కోచ్ గౌతం గంభీర్ మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. పెర్త్ టెస్టులో మెరుగ్గా రాణించిన రాణా.. గులాబీ బంతితో తేలిపోయాడు. దీంతో బుమ్రా, సిరాజ్‌లపైనే అధిక ఒత్తిడి పడింది. తొలి ఇన్నింగ్స్‌లో 16 ఓవర్లు వేసిన తను 86 పరుగులిచ్చుకోవడం గమనార్హం. దీంతో గాబా టెస్టులో అతడిని తప్పించి ఆకాశ్‌ను తీసుకోవాలనే డిమాండ్ వినిపిస్తోంది. దీనికి తగ్గట్టుగానే గురువారం నాటి నెట్స్‌లో ఆకాశ్ తీవ్రంగా సాధన చేశాడు. బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్ చేయడం కూడా కనిపించింది. కొత్త బంతితో చక్కటి స్వింగ్‌ను రాబట్టే ఆకాశ్‌ను ఆరంభంలో వినియోగించుకుంటే.. సిరాజ్ మధ్య ఓవర్లలో బ్యాటర్లను ఇబ్బందిపెట్టగలడు. గత టెస్టులో బుమ్రా, సిరాజ్ ఓవర్లను ఓపిగ్గా ఆడి మూడో పేసర్ రాణాను టార్గెట్ చేశారు. అందుకే ఈసారి ఆసీస్ బ్యాటర్లను వణికించే పేస్ త్రయంతో బరిలోకి దిగాలనుకుంటోంది. మరోవైపు కెప్టెన్ రోహిత్ ఓపెనర్‌గా వస్తాడా? లేక మిడిలార్డర్‌లోనే కొనసాగుతాడా? అనేది సస్పెన్స్‌గానే ఉంది. ప్రాక్టీస్‌లో కొత్త బంతిని ముందుగా ఓపెనర్లు రాహుల్, జైస్వాల్ ఎదుర్కొన్నారు. బంతి కాస్త పాతది అయ్యాక రోహిత్ బ్యాటింగ్ చేశాడు. కాసేపయ్యాక రాహుల్‌తో కలిసి మరో నెట్స్‌లో కొత్త బంతితోనూ సాధన చేయడం విశేషం. అలాగే నెట్స్ ఆరంభానికి ముందు ఆటగాళ్లంతా సర్కిల్‌లో నిల్చోగా విరాట్ కోహ్లీ ఉత్తేజపూరితంగా సంభాషించాడు.

సచిన్‌ను అనుసరించు: సన్నీ

ఆఫ్‌స్టంప్‌నకు ఆవల బంతులను వేటాడి వికెట్‌ను సమర్పించుకోవడం విరాట్ కోహ్లీకి అలవాటు. అడిలైడ్ టెస్టులోనూ అదే రీతిన వెనుదిరిగాడు. అందుకే అతడిని సచిన్ ఆటతీరును అనుసరించాలని మాజీ కెప్టెన్ గవాస్కర్ సూచించాడు. 'సచిన్‌కు కూడా ఇలాంటి బలహీనతే ఉండేది. కానీ 2004 సిడ్నీ టెస్టులో దాన్ని అధిగమిస్తూ ఆఫ్‌స్టంప్ ఆవల వేసిన బంతులను పూర్తిగా వదిలేశాడు. ఒక్క కవర్‌డ్రైవ్ కూడా ఆడకుండా అక్కడ డబుల్ సెంచరీ సాధించాడు. అందుకే విరాట్ కూడా అదే రీతిన ఆడేందుకు ప్రయత్నించాలి. స్ట్రయిట్‌గా ఆడి మిడాన్, మిడ్ వికెట్ మీదుగా పరుగులు సాధించవచ్చు' అని సన్నీ సూచించాడు.

షమి.. ఇక కష్టమే

వెటరన్ పేసర్ మహ్మద్ షమి ఆస్ట్రేలియా పర్యటన దాదాపుగా లేనట్టే. ఎందుకంటే.. ఈనెల 21నుంచి జనవరి 18 వరకు జరిగే విజయ్ హజారే వన్డే ట్రోఫీలోనూ బెంగాల్ జట్టు షమిని ఆడించాలనుకుంటోంది. ఇప్పటికే తను సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పూర్తి మ్యాచ్‌లు ఆడి 11 వికెట్లు తీసిన సంగతి తెలిసిందే.

సెమీస్ ఆశలు సజీవం

రెండో మ్యాచ్‌లో గాయత్రి జోడీ విజయం

హాంగ్జౌ (చైనా) : వరల్డ్ టూర్ ఫైనల్స్ గ్రూపు దశ తొలి మ్యాచ్ ఓటమి నుంచి భారత జోడీ గాయత్రి/ట్రీసా జాలీ త్వరగానే కోలుకుంది. రెండో మ్యాచ్ విజయంతో ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీ సెమీఫైనల్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. గ్రూప్ 'ఎ'లో గురువారం జరిగిన ఉత్కంఠ భరిత రెండో మ్యాచ్‌లో గాయత్రి గోపీచంద్/ట్రీసా జాలీ జంట 21-19, 21-19తో మలేసియా ద్వయం పియర్లీ టాన్/తినా మురళీధరన్‌ను చిత్తు చేసింది. నాలుగు జట్లు తలపడుతున్న ఈ గ్రూప్‌లో గాయత్రి జోడీ ప్రస్తుతం చైనా తర్వాత రెండో స్థానంలో కొనసాగుతోంది. మలేసియా జంటతో పోరులో ఆది నుంచే దూకుడు ప్రదర్శించిన గాయత్రి/ట్రీసా తొలి గేమ్‌లో 6-2 ఆధిక్యానికి దూసుకు పోయింది. ఈ దశలో మలేసియా జంట పుంజుకోవడంతో గేమ్ రసవత్తరంగా మారింది. అయితే ఒత్తిడిని అధిమిపట్టిన భారత జోడీ మొదటి గేమ్‌ను సొంతం చేసుకుంది. ఇక రెండో గేమ్‌కూడా నువ్వా..నేనా అనేలా సాగింది. ఈక్రమంలో మలేసియా ద్వయం స్వల్ప ఆధిక్యం దక్కించుకున్నా..గాయత్రి జంట గేరు మార్చడంతో గేమ్ హోరాహోరీగా సాగింది. కానీ ఒత్తిడిని దరిచేరనీయని గాయత్రి/ట్రీసా గేమ్‌ను నెగ్గి జయకేతనం ఎగుర వేసింది.



అండర్-19 మహిళల ఆసియా కప్

భారత జట్టులో త్రిష, షబ్నమ్


నికీ ప్రసాద్

న్యూఢిల్లీ : మొట్టమొదటి జూనియర్ మహిళల ఆసియా కప్ క్రికెట్‌లో పాల్గొనే భారత జట్టును గురువారం ప్రకటించారు. ఈనెల 15 నుంచి 22 వరకు కౌలాలంపూర్‌లో జరిగే ఈ టోర్నీలో తలపడే జట్టుకు నికీ ప్రసాద్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. జట్టులో తెలుగు క్రికెటర్లు జి.త్రిష, ఎండీ షబ్నమ్‌తోపాటు స్టాండ్ బైగా కావ్యశ్రీకి చోటు లభించింది. పాకిస్థాన్, నేపాల్ జట్లతో కలిసి గ్రూప్ 'ఎ'లో భారత్ తలపడనుంది. గ్రూప్ 'బి'లో బంగ్లాదేశ్, శ్రీలంకతోపాటు ఆతిథ్య మలేసియా అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. 15న జరిగే ఆరంభ మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను భారత్ ఢీకొననుంది. 17న నేపాల్‌తో ఆడనుంది. రెండు గ్రూపుల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచే జట్లు సూపర్-4కి అర్హత సాధిస్తాయి.

రోహిత్ స్థూలకాయుడు : కలినన్



జొహాన్నెస్‌బర్గ్: అధిక బరువును కలిగి ఉండే భారత కెప్టెన్ రోహిత్ శర్మ ఇంకెంతో కాలం క్రికెట్ ఆడలేడని దక్షిణాఫ్రికా మాజీ బ్యాటర్ డారిల్ కలినన్ అభిప్రాయపడ్డాడు. ఫ్లాట్ ట్రాక్‌పై మాత్రమే అతడు బ్యాటింగ్ చేయగలడని ఎద్దేవా చేశాడు. 'విరాట్, రోహిత్ శరీరాలను ఓసారి గమనించండి. రోహిత్ చాలా బరువుతో ఉంటాడు. అందుకే తను ఎక్కువకాలం క్రికెట్‌లో ఉండలేడు. సుదీర్ఘ టెస్టు సిరీస్‌ల్లో ఆడే ఫిట్‌నెస్ కూడా అతనికి లేదు. పైగా తను స్వదేశంలోనే మెరుగ్గా ఆడుతూ, విదేశీ పిచ్‌లపై తేలిపోతుంటాడు. దక్షిణాఫ్రికాలో షార్ట్‌పిచ్ బంతులను బాల్స్‌ను ఆడడంలో ఎప్పుడూ విఫలమవుతుంటాడు' అని కలినన్ విమర్శించాడు.



తెలుగు టైటాన్స్‌కు మరో ఓటమి

పుణె: ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్‌కు మరో ఓటమి ఎదురైంది. గురువారం దబాంగ్ ఢిల్లీతో జరిగిన మ్యాచ్‌లో 27-33 తేడాతో ఓడింది. ఈ విజయంతో ఢిల్లీ 61 పాయింట్లతో పట్టికలో రెండో స్థానానికి చేరింది. ఈ పోరు హోరాహోరీగా సాగినప్పటికీ చివర్లో నవీన్ కుమార్ సూపర్ 10 సాధించడంతో ఢిల్లీ నాలుగు పాయింట్లతో ఆధిక్యంలోకి వెళ్లింది. మొత్తంగా నవీన్ 11 పాయింట్లు సాధించాడు. ఆ తర్వాత యూపీ యోధ-బెంగాల్ వారియర్స్ మధ్య జరిగిన మ్యాచ్ 31-31 స్కోరుతో టైగా ముగిసింది.

మన అమ్మాయిలకు జరిమానా

బ్రిస్బేన్: ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌ను భారత మహిళల జట్టు 0-3తో కోల్పోయింది. అయితే, రెండో వన్డేలో స్లో ఓవర్ రేట్ కారణంగా భారత జట్టు మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధించారు. నిర్ణీత సమయంలో వేయాల్సిన దానికంటే 2 ఓవర్లు వెనుకబడినట్టు మ్యాచ్ రెఫరీ తేల్చాడు.



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 13-12-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

రోడ్డు ప్రమాదాల ప్రస్తావన వస్తే సిగ్గుతో ముఖం దాచుకుంటున్నా



ఏటా ప్రమాదాల్లో 1.78 లక్షల మంది మృతి

రోడ్డు పక్కన ట్రక్కులు నిలపడం ప్రమాదాలకు ప్రధాన కారణం: గడ్కరీ

2



2

ప్రార్థనా స్థలాలపై విచారణ ఆపండి

మేం తదుపరి ఉత్తర్వులిచ్చేదాకా కొత్త వ్యాజ్యాలు స్వీకరించొద్దు.. పెండింగ్ కేసుల్లో తీర్పులివ్వొద్దు

సర్వే నిర్వహణ సహా మధ్యంతర ఆదేశాలూ ఇవ్వొద్దు

కింది కోర్టులకు సుప్రీంకోర్టు ఆదేశం

కౌంటర్ దాఖలుకు కేంద్రానికి 4 వారాల సమయం

స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ నేడే



విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో కార్యక్రమం

దేశానికి రోల్‌మోడల్‌గా ఈ డాక్యుమెంట్: చంద్రబాబు

ప్రజలకు సత్వర సేవలందించాలని అధికారులకు సూచన

12



స్పోర్ట్స్‌లో..

విశ్వవిజేత గుకేష్

ప్రపంచ చెస్ చాంపియన్‌గా భారత గ్రాండ్‌మాస్టర్

18 ఏళ్ల పిన్న వయసులోనే చరిత్ర

డిఫెండింగ్ చాంప్ లిరెన్‌పై 14వ గేమ్‌లో విజయం

'ప్రపంచ చెస్‌లో భారత్‌కు స్వర్ణయుగం' అని దిగ్గజ ఆటగాడు విశ్వనాథన్ ఆనంద్ అన్న మాట నిజమేనని టీనేజ్ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేష్ నిరూపించాడు. 64 గళ్ల సామ్రాజ్యంలో విశ్వవిజేతగా ఆవిర్భవించడం ద్వారా అంతర్జాతీయ చదరంగ యవనికపై మన స్థానాన్ని సమున్నతం చేశాడు. గురువారం సింగపూర్‌లో జరిగిన 14 గేమ్‌ల వరల్డ్ చాంపియన్‌షిప్ ఫైనల్లో తెలుగు మూలాలున్న చెన్నై చిన్నోడు గుకేష్ చైనాకు చెందిన 32 ఏళ్ల డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్‌ను ఓడించాడు. ఆఖరి రౌండ్‌లో నల్లపావులతో చెక్ పెట్టాడు. మొత్తం 7.5 పాయింట్లతో టైటిల్ సొంతం చేసుకున్నాడు. పిన్నవయసులో ప్రపంచ చెస్ చాంపియన్‌గా నిలిచిన ఆటగాడిగా గుకేష్ చరిత్ర సృష్టించాడు.

జమిలికి సై

లోక్‌సభ, అన్ని అసెంబ్లీలకు ఒకేసారి పోలింగ్

రెండు సవరణ బిల్లులకు కేంద్ర కేబినెట్ ఆమోదం

వచ్చే వారమే పార్లమెంటులో ప్రవేశపెట్టే చాన్స్.. వెంటనే జేపీసీకి వెళ్తుందంటున్న బీజేపీ వర్గాలు

2 బిల్లులను పార్లమెంటు ఆమోదిస్తే చాలు.. తొలి బిల్లుకు ఉభయసభల్లో 2/3 మెజారిటీ అవసరం


స్థానిక సంస్థలను చేర్చే ఆలోచనకు విరామం

సగం రాష్ట్రాల ఆమోదం అవసరమవడం వల్లే

బిల్లులను చూసి స్పందిస్తామన్న కాంగ్రెస్

జమిలి కన్నా పెద్ద సమస్యలున్నాయని వ్యాఖ్య

తీవ్రంగా వ్యతిరేకించిన డీఎంకే, తృణమూల్





జమిలి ప్రజాస్వామ్య వ్యతిరేకం. ప్రాంతీయ ఆకాంక్షలకు గొంతు లేకుండా పోతుంది. సమాఖ్య వ్యవస్థ దెబ్బతింటుంది.

- తమిళనాడు సీఎం స్టాలిన్

అనుకూలం

బీజేపీ, అన్నాడీఎంకే, అప్నాదళ్, బిజూజనతాదళ్, అసోం గణపరిషత్, శివసేన, జేడీయూ, అకాలీదళ్

వ్యతిరేకం

కాంగ్రెస్, సీపీఎం, తృణమూల్ కాంగ్రెస్, ఎస్పీ, ఎంఐఎం, సీపీఐ, డీఎంకే, బీఎస్పీ, ఆప్

స్పందించనివి టీడీపీ, వైసీపీ, బీఆర్ఎస్, ఎన్‌సీపీ, ఆర్జేడీ, ఆర్ఎల్‌డీ, జేడీఎస్, జార్ఖండ్ ముక్తి మోర్చా, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్, నేషనల్ కాన్ఫరెన్స్, కేరళ కాంగ్రెస్

న్యూఢిల్లీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికల దిశగా మోదీ సర్కారు కీలకమైన ముందడుగు వేసింది. లోక్‌సభకు, దేశంలోని అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన రెండు బిల్లులకు గురువారం కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వచ్చే వారం మొదటి రెండు రోజుల్లో పార్లమెంటు ఉభయ సభల్లో బిల్లులను ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. రెండు బిల్లుల్లో మొదటిది లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లు కాగా, రెండోది శాసనసభలున్న కేంద్ర పాలిత ప్రాంతాలైన ఢిల్లీ, పుదుచ్చేరి, జమ్మూ కశ్మీర్‌లకు ఎన్నికలను ఒకేసారి నిర్వహించేందుకు ఉద్దేశించిన సాధారణ బిల్లు. పార్లమెంటు ఉభయ సభల్లో కేవలం సాధారణ మెజారిటీ ఉన్న ఎన్డీయే ప్రభుత్వం రాజ్యాంగ సవరణ బిల్లును నెగ్గించుకోవాలంటే తప్పనిసరిగా అద్భుతం చేయాలి. లేదా విపక్షాల సహకారాన్ని తీసుకోవాలి. ఈ విషయంలో చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్న ప్రభుత్వం గురువారం నాటి కేబినెట్ సమావేశానికి సంబంధించి ఎలాంటి బ్రీఫింగ్ ఇవ్వలేదు. నోట్ కూడా విడుదల చేయలేదు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కేవలం ఉభయ సభల్లో బిల్లులను ప్రవేశపెట్టి, వెంటనే సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) పరిశీలనకు పంపుతారని బీజేపీ వర్గాలు వెల్లడించాయి. జమిలి ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనే విషయంపైనా స్పష్టతనివ్వలేదు. తదుపరి సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు జరిగినా జమిలి ఎన్నికల రూపంలోనే జరుగుతాయని పార్టీ వర్గాలు తెలిపాయి. ఒకే దేశం ఒకే ఎన్నికల దిశగా ఎంతోకొంత ముందుకు వెళ్లాలని కృత నిశ్చయంతో ఉన్న ప్రభుత్వం ఇందుకు జేపీసీ మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఈసారి పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల విషయంలో మాత్రం కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకోలేదు. స్థానిక ఎన్నికలను తర్వాత దశలో

మిగతా 2వ పేజీలో...



గురువారం కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు అనగాని, లోకేశ్

భూ వివాదాలపై

టాస్క్‌ఫోర్స్

కలెక్టర్, ఎస్పీ, ఆర్డీవో, డీఎస్పీలతో జిల్లాల్లో ఏర్పాటు

'టైట్లింగ్' దెబ్బకు భూమి కోల్పోయిన వారికి న్యాయం

మరిన్ని సమస్యలు తెచ్చిన ఫ్రీ హోల్డ్ విధానం

13 లక్షల్లో 25 వేల ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసేశారు

రెవెన్యూ పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగేలా చేయాలి

సింఛన్లపై 3 నెలల్లో నివేదిక.. అనర్హుల తొలగింపు

నేరాల కట్టడికి.. త్రిముఖ వ్యూహం

'సోషల్' సైకోల నియంత్రణకు కఠిన చట్టాలు

అధ్యయనానికి మంత్రివర్గ ఉపసంఘం

ఇసుక రవాణాలో ఎవరున్నా కచ్చితంగా చర్యలు

ఐదేళ్లలో పేదలందరికీ ఇళ్లు.. గ్రామాల్లో 3, పట్టణాల్లో 2 సెంట్లు.. త్వరలో లక్ష గృహప్రవేశాలు

రూ.1,878 కోట్లతో బీసీల సంక్షేమానికి చర్యలు

ఎస్పీలు, కలెక్టర్లకు చంద్రబాబు దిశా నిర్దేశం

అమరావతి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): "లోపభూయిష్టమైన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ తెచ్చి పట్టాదారు పాస్‌పుస్తకాలపై వాళ్ల బొమ్మలు వేసుకున్నారు. ఇప్పుడు వాటన్నింటినీ చక్కదిద్ది, భూమిని పోగొట్టుకున్న అభాగ్యులకు న్యాయం చేయాల్సిన బాధ్యత మనపై ఉంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. జిల్లా కలెక్టర్ల సమావేశంలో రెవెన్యూ సమస్యలపై కూలంకషంగా చర్చించారు. తొలుత రెవెన్యూశాఖ స్పెషల్ సీఎస్ ఆర్.పి.సిసోడియా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం సీఎం చంద్రబాబు... కలెక్టర్లు, ఎస్పీలకు పలు సూచనలు చేశారు. రెవెన్యూ వ్యవస్థల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పునరుద్ధరించాలని ఆదేశించారు. "గత ప్రభుత్వంలో ఫ్రీ హోల్డ్ భూములను కాజేశారు. ఎన్ఆర్ఐలకు వారి తల్లిదండ్రులు ఇచ్చిన ఆస్తులు కూడా కొట్టేశారు. వారిని భయభ్రాంతులకు గురి చేశారు. ప్రభుత్వానికి వచ్చిన ఫిర్యాదుల్లో

మిగతా 13వ పేజీలో...

సోది చెబుతానమ్మ.. సోది!

గాడి తప్పిన కలెక్టర్ల సదస్సు.. కొందరు సీనియర్ ఐఏఎస్‌ల మెహర్బానీ

సూటిగా చెప్పకుండా సాగదీత.. సీఎం వారిస్తున్నా వినకుండా స్పీచులు

గంటలకొద్దీ ప్రజెంటేషన్లు.. లక్ష్య నిర్దేశంపై స్పష్టత కరువు

అక్కర్లేని అంశాలకే టైం స్వాహా.. కీలక అంశాలపై నామమాత్ర చర్చ

12



పల్నాడు జిల్లా మాచవరం మండలంలో జగన్ కుటుంబం సరస్వతి పవర్ ఇండస్ట్రీస్ పేరుతో కొనుగోలు చేసిన భూమి

'సరస్వతి'లో అసైన్డ్ భూములు వెనక్కి!

రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

యాజమాన్యం కొన్న భూముల్లో 17.69 ఎకరాలు అసైన్డ్

అటవీ, రెవెన్యూ అధికారుల గుర్తింపు.. నోటీసులకు స్పందించని రైతులు.. దీంతో వాటి స్వాధీనానికి రంగం సిద్ధం

పిడుగురాళ్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు రాష్ట్రప్రభుత్వం గట్టి షాకిచ్చింది. ఆయన కుటుంబసభ్యులు సరస్వతి పవర్ ఇండస్ట్రీస్ పేరుతో కొనుగోలు చేసిన భూముల్లో అసైన్డ్ భూములు కూడా ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించడంతో ఆ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని

మిగతా 11వ పేజీలో...

అమరావతి రయ్.. రయ్!

రూ.6,800 కోట్ల రుణానికి ఏడీబీ ఓకే

17న ఢిల్లీలో ప్రపంచ బ్యాంకు బృందంతో సమావేశం

మరో 6,800 కోట్ల రుణానికి అనుమతి లభించే చాన్స్

రూ1,400 కోట్లు మంజూరు చేయనున్న కేంద్రం

తొలి విడతగా ఈ నెలాఖరుకు 25 శాతం నిధులు

రుణంపై ఐదేళ్ల మారటోరియం అమలు

ఆ తర్వాత 6 నెలలకు ఒక వాయిదా చొప్పున 23 సంవత్సరాల పాటు చెల్లించే వెసులుబాటు

భావి గ్రీన్‌ఫీల్డ్ నగరాలకు అమరావతి ఆదర్శం

ఏడీబీ ఇండియా డైరెక్టర్ మియో ఓకా వ్యాఖ్యలు



అమరావతిలో శరవేగంగా సాగుతున్న విద్యుత్ లైన్ల ఏర్పాటు

అమరావతి/విజయవాడ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణంలో మరో కీలక అడుగు పడింది. అమరావతి నిర్మాణానికి రూ.6,800 కోట్ల రుణం మంజూరుకు అనుమతిస్తూ ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ) బుధవారం జరిగిన సమావేశంలో తీర్మానించింది. అలాగే ప్రపంచ బ్యాంకు నుంచి రుణ సమీకరణ యత్నాలు కూడా కొలిక్కి వచ్చాయి. ఈ నెల 17న జరగనున్న

మిగతా 12వ పేజీలో...



వర్షాలతో తిరుమల ఘాట్ రోడ్డుపై పడిన భారీ కొండరాయి

3 జిల్లాల్లో ఎడతెరపిలేని వాన

చిత్తూరులో పొంగిపొర్లిన జలాశయాలు, చెరువులు, కుంటలు

తిరుపతి జిల్లాలో పాఠశాలలకు సెలవు.. ఘాట్‌లో కొండచరియలు

నెల్లూరు జిల్లాలోనూ స్తంభించిన జనజీవనం.. 162 మిల్లీమీటర్ల వర్షం

నేడు బలహీనపడనున్న తీవ్ర అల్పపీడనం.. 2 రోజుల్లో అల్పపీడనం

11 రాయలసీమ, దక్షిణ కోస్తాలో విస్తారంగా వర్షాలు పడే అవకాశం



అవంతి శ్రీనివాసరావు | గ్రంధి శ్రీనివాస్

బైబై జగన్

నీతో వేగలేం.. ఇక రాజకీయాల్లోనే ఉండం.. మాజీ ఎమ్మెల్యేలు గుడ్‌బై

మాజీ ముఖ్యమంత్రి వ్యవహార శైలిపై తీవ్ర అసంతృప్తి

రాజీనామా లేఖలు పంపిన అవంతి, గ్రంధి

5 నెలలకే పాలక పక్షంపై ఎదురుదాడి సరికాదు

ఓటమి తర్వాత జగన్ తప్పులు దిద్దుకోలేదు: ముత్తంశెట్టి

జగన్‌కు ఓ విధానమే లేదు.. వలంటీర్లతో కార్యకర్తలకు గుర్తింపు లేకుండా పోయింది: శ్రీనివాస్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల్లో భారీ పరాజయం తర్వాత.. వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో కలిసి నడిచేందుకు పలువురు మాజీ ఎమ్మెల్యేలు విముఖత చూపుతున్నారు. కొందరు బయటపడుతుండగా.. ఇంకొందరు గుంభనంగా ఉంటున్నారు. ఇతర పార్టీల్లో అవకాశాలు ఉన్నవారు వెంటనే నిష్క్రమిస్తున్నారు. అవకాశాలు దక్కనివారు అసలు రాజకీయాలకే గుడ్‌బై చెప్పేస్తున్నారు. గురువారం వైసీపీకి పెద్దషాకే తగిలింది. మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు వైసీపీకి రాజీనామా చేశారు. ఇదే బాటలో

మిగతా 14వ పేజీలో...

ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టుల మృతి

ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మఢ్‌లో ఘటన

మృతులంతా ఇంద్రావతి దళ సభ్యులు.. వారిలో ఇద్దరు మహిళలు

విప్లవ సాహిత్యం, తుపాకులు సీజ్

అమిత్‌షా పర్యటన వేళ అలజడి! 2

టీడీపీ కండువాతో టోల్ నాటకం!

రక్తికట్టించేలా వైసీపీ నేత డ్రామా

సోషల్ మీడియాలో వైరల్

కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచడమే లక్ష్యం

కర్నూలులో కేసు

గుంటూరులో అదుపులోకి!

14



టీడీపీ కండువాతో టోల్ ఫీజు వసూలు చేస్తున్న ప్రేమ్‌కుమార్



టమోటా కిలో రూపాయే!

పత్తికొండ మార్కెట్‌లో భారీగా పడిపోయిన ధర

14

సినిమాల్లోనే నటన.. జీవితంలో కాదు

మీడియా ప్రతినిధిపై దాడి చేయాలనుకోలేదు

రాత్రి ఇంట్లోకి వచ్చి ఇబ్బంది పెట్టారు

మైక్ నా కంటికి తగిలింది.. అందువల్లే లాక్కుని కొట్టా: మోహన్‌బాబు

2

ఆయనపై హత్యాయత్నం కేసు నమోదు



హెచ్-1బీ వీసాదారుల జీవిత భాగస్వాములకు శుభవార్త

2

ఆటోమేటిక్ రెన్యువల్ గడువు 180 నుంచి 540 రోజులకు పొడిగింపు

ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టుల మృతి

- ఆపరేషన్‌లో నాలుగు జిల్లాల పోలీసులు
- ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మఢ్‌లో ఘటన

చర్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అబూజ్‌మడ్ అడవులు మరోమారు ఎరుపెక్కాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటన నేపథ్యంలో.. దక్షిణ అబూజ్‌మడ్‌లో ఇంద్రావతి దళం నక్సల్స్ సమావేశమైనట్లు ఉప్పందుకున్న నాలుగు జిల్లాల పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు జరిపిన కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. పోలీసులు ఘటనాస్థలి నుంచి తుపాకులు, విప్లవ సాహిత్యాన్ని సీజ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 13 నుంచి మూడ్రోజుల పాటు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఛత్తీస్‌గఢ్‌లో పర్యటించనున్నారు. 13వ తేదీన మావోయిస్టు పీఎల్‌జీఏ కమాండర్ హిడ్మా స్వగ్రామమైన బీజాపూర్ జిల్లా పూవర్తిని కూడా ఆయన సందర్శించనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో దక్షిణ అబూజ్‌మడ్‌లో ఇంద్రావతి దళానికి చెందిన 50 మందికి పైగా నక్సలైట్లు సమావేశమైనట్లు భద్రతాబలగాలకు సమాచారం అందింది. దీంతో.. మంగళవారం రాత్రి నుంచే దంతెవాడ, నారాయణపూర్, కొండగావ్, బస్తర్ జిల్లాలకు చెందిన డీఆర్‌జీ పోలీసులు.. సీఆర్‌పీఎఫ్, ఎస్టీఎఫ్ బలగాలు.. మొత్తం వెయ్యిమంది ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో మావోయిస్టులు భద్రతాబలగాలపై కాల్పులు జరిపారని బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. దాంతో పోలీసులు బలగాలు ఎదురుకాల్పులకు దిగాయని, సుమారు ఐదు గంటల పాటు కాల్పులు కొనసాగాయని చెప్పారు. మావోయిస్టుల వైపు కాల్పులు నిలిచిపోయాక బలగాలు ముందుకు సాగగా.. ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయన్నారు. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నట్లు తెలిపారు. మృతులను ఇంకా గుర్తించాల్సి ఉందని, కాగా.. శుక్రవారం ఛత్తీస్‌గఢ్‌కు రానున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా.. పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమవుతారని తెలుస్తోంది. ముఖ్యంగా 2026కల్లా నక్సల్స్‌ను అంతమొందించాలనే అజెండా నేపథ్యంలో రాష్ట్ర పోలీసులు, కేంద్ర బలగాలకు దిశానిర్దేశం చేస్తారని సమాచారం. మరోవైపు.. సుకుమా జిల్లాలో గురువారం 11 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు పోలీసులు తెలిపారు. వీరిలో చింతల్నార్‌కు చెందిన హేమ్లు, జోగేంద్ర యాదవ్, మడ్కం హంగా మినహా.. మిగతా వారంతా 20-25 సంవత్సరాల వయసున్న యువకులేనని పేర్కొన్నారు.

నక్సల్స్‌తో సంబంధాలు.. ఎన్ఐఏ సోదాలు

ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా, ఒడిసాలోని మల్కనగిరి జిల్లాల్లో నక్సల్స్‌తో సంబంధాలున్న వ్యక్తులపై జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) దృష్టి పెట్టింది. సుకుమాలోని భేజీ ప్రాంతానికి చెందిన మంటోష్ మండల్, మరో మహిళ ఇళ్లలో గురువారం ఎన్ఐఏ అధికారులు సోదాలు నిర్వహించారు. వీరిద్దరితోపాటు.. మల్కన్‌గిరికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులకు నక్సలైట్లతో సంబంధాలున్నట్లు ఎన్ఐఏ వర్గాలు తెలిపాయి.

నటన సినిమాల్లోనే .. జీవితంలో కాదు

- మీడియా ప్రతినిధిపై దాడి చేయాలనుకోలేదు
- రాత్రి వేళ ఇంట్లోకి దూసుకొచ్చి ఇబ్బంది పెట్టారు
- మా కుటుంబ సమస్య మేమే పరిష్కరించుకుంటాం
- మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదు



హైదరాబాద్ సిటీ/పహాడిషరీఫ్ డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మీడియా ప్రతినిధులపై దాడి చేసే ఉద్దేశం తనకు లేదని.. మీడియా ముసుగులో ప్రత్యర్థులు తనపై దాడి చేసే అవకాశముంది కాబట్టే ఆ విధంగా ప్రవర్తించానని నటుడు మోహన్ బాబు అన్నారు. మీడియా ప్రతినిధిపై దాడి ఘటన గురించి గురువారం ఆయన ఒక ఆడియో ప్రకటన విడుదల చేశారు. "సినిమాల్లో నటిస్తాను తప్ప నిజజీవితంలో నటించాల్సిన అవసరం నాకు లేదు. గేటు బయట అసభ్యకరంగా ప్రవర్తించి, కొట్టి ఉంటే నాపై 100 కేసులు పెట్టుకోవచ్చు. నన్ను అరెస్టు చేసుకోవచ్చు. నేనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అరెస్టు అయ్యేవాడిని. కానీ, నా ఇంట్లోకి వచ్చి నా ఏకాగ్రతను, ప్రశాంతతను భగ్నం చేశారు" అని ఆయన ఆ సందేశంలో పేర్కొన్నారు. తన కుటుంబ సమస్యను పెద్దదిగా చేసి చూపుతున్నారని.. రాత్రివేళ తన ఇంట్లోకి వచ్చి తనకు మనశ్శాంతి లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. "రాత్రి సమయంలో నా ఇంట్లోకి దూసుకొచ్చి మైకులు పెట్టారు. మైక్ నా కంటికి తగిలింది. నా కన్ను పోయే అవకాశం కూడా ఉంది. కాబట్టి చీకట్లో మైక్ లాక్కుని ప్రతిదాడి చేశా" అని వివరణ ఇచ్చారు. "నా పిల్లలతో ఉన్న సమస్యను నేనే పరిష్కరించుకుంటానని మీడియాకు చెప్పా. నా ఇంట్లోకి దూసుకొచ్చే వాళ్లు మీడియా వాళ్లా? ఇంకా ఎవరైనా ఉన్నారో నాకు తెలియదు. మీడియాను అడ్డుపెట్టుకొని నాపై దాడి చేసే అవకాశం ఉందని ఆలోచించా. మీడియాను కొట్టాలని దైవసాక్షిగా నేను అనుకోలేదు. చీకట్లో ఘర్షణ జరిగింది. నేను కొట్టిన దెబ్బ అతనికి తగిలింది. అందుకు బాధపడుతున్నా. ఆ మీడియా ప్రతినిధి నాకు తమ్ముడిలాంటివాడు. అతడి భార్యాబిడ్డల గురించి ఆలోచించాను. నా బాధ గురించి ఎవరూ ఆలోచించలేదు. నేను కొట్టడం తప్పే. కానీ, ఏ సందర్భంలో కొట్టానో ఆలోచించాలి. మీకు టీవీలు ఉండొచ్చు. నేను కూడా రేపు టీవీ పెట్టొచ్చు. నేను మీడియా ప్రతినిధిని కొట్టినందుకు చింతిస్తున్నాను. నా విషయంలో మీడియా చూపిస్తోంది తప్పని ఎవరూ అనట్లేదు. పైన భగవంతుడు చూస్తున్నాడు. నేను చేసింది న్యాయమా? అన్యాయమా? ప్రజలు ఆలోచించాలి. నా ఇంటి తలుపులు బద్దలుకొట్టుకుని రావడం న్యాయమా?" అని ప్రశ్నించారు. తన బిడ్డే తన ప్రశాంతతను చెడగొడుతున్నాడంటూ ఆవేదన వెలిబుచ్చారు. తాము కూర్చుని మాట్లాడుకుంటామని, కుటుంబసభ్యుల గొడవకు మధ్యవర్తులు అవసరం లేదని స్పష్టం చేశారు. కాగా.. జర్నలిస్టు మీద దాడి చేసిన మోహన్‌బాబుపై పహాడిషరీఫ్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఇక.. జర్నలిస్టుపై దాడి ఘటన అనంతరం అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరిన ఆయన్ను వైద్యులు గురువారం డిశ్చార్జ్ చేశారు.

హెచ్-1బీ వీసాదారుల జీవిత భాగస్వాములకు శుభవార్త

- ఆటోమేటిక్ రెన్యువల్ గడువు 540 రోజులకు పొడిగింపు

వాషింగ్టన్, డిసెంబరు 12: హెచ్-1బీ వీసాదారుల జీవిత భాగస్వాములకు అమెరికా ఓ శుభవార్త ప్రకటించింది. యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోం ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) గురువారం ఓ ప్రకటన చేస్తూ.. హెచ్-1బీ, ఎల్1 వీసాదారుల జీవిత భాగస్వాములకు ఆటోమేటిక్ వర్క్ పర్మిట్ రెన్యువల్ కాలపరిమితిని పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటి వరకూ ఈ పరిమితి 180 రోజుల వరకు మాత్రమే ఉంది. తాజా ప్రకటనతో ఈ కాలపరిమితి 540 రోజులకు పెరిగింది. వచ్చే ఏడాది జనవరి 13 నుంచి ఇది అమలులోకి వస్తుంది. 2022, మే 4న లేక ఆ తరువాత దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే ఇది వర్తిస్తుంది.

సంపద సృష్టికర్తలను వివాదాల్లోకి లాగొద్దు

- పార్లమెంటు స్తంభనపై సద్గురు స్పందన

న్యూఢిల్లీ, డిసెంబరు 12: దేశంలో సంపద సృష్టించేవారిని, ఉద్యోగాలు కల్పించేవారిని రాజకీయ వివాదాల్లోకి లాగొద్దని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సద్గురు జగ్గీవాసుదేవ్ పేర్కొన్నారు. ఏవైనా అవకతవకలు ఉంటే చట్ట ప్రకారం చర్యలు ఉండాలని, అంతేకానీ రాజకీయంగా ఫుట్‌బాల్ ఆడటం సరికాదన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త అదానీపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ పార్లమెంటులో ప్రతిపక్షాలు నిరసనలు కొనసాగిస్తున్న నేపథ్యంలో 'ఎక్స్' వేదికగా సద్గురు ఓ పోస్టు చేశారు. 'ప్రపంచంలో ప్రజాస్వామ్యానికి భారత్ దీపస్తంభం కావాలని ఆకాంక్షిస్తున్న తరుణంలో పార్లమెంటులో కార్యకలాపాలను అడ్డుకోవడం నిరుత్సాహం కలిగిస్తోంది. మన దేశం భవ్య భారత్‌గా ఎదగాలంటే వ్యాపారాలు అభివృద్ధి చెందడం ఒక్కటే మార్గం' అని సద్గురు పేర్కొన్నారు.

ట్రంప్ ప్రమాణ స్వీకారానికి జిన్‌పింగ్!

- టైమ్ మ్యాగజీన్ 'పర్సన్ ఆఫ్ ది ఇయర్'గా ట్రంప్

వాషింగ్టన్, డిసెంబరు 12: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్ జనవరి 20న బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆ కార్యక్రమానికి చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు ఆహ్వానం పంపినట్లు అంతర్జాతీయ మీడియాల్లో కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ ఆహ్వానంపై వాషింగ్టన్‌లోని చైనా రాయబార కార్యాలయం స్పందించలేదు. మరోవైపు అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే దాదాపు 25 ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లను జారీ చేసేందుకు ట్రంప్ సిద్ధమవుతున్నారు. సరిహద్దు విధానాలకు సంబంధించి బైడెన్ తీసుకున్న నిర్ణయాలను వెనక్కి తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

1539 మందికి బైడెన్ క్షమాభిక్ష: వాషింగ్టన్, డిసెంబరు 12: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ గురువారం 1500 మందికి గృహనిర్బంధం నుంచి విముక్తి కలిగించగా.. మరో 39 మందికి క్షమాభిక్ష ప్రసాదించారు. ఒకేరోజు ఇంతమందికి క్షమాభిక్ష ఇవ్వటం ఆధునిక చరిత్రలో ఇదే తొలిసారి అని పలువురు భావిస్తున్నారు.

విశాఖ లైట్ మెట్రో ప్రతిపాదన అందింది

- సీఎంపీని మరోసారి పంపాలని కోరాం
- విజయవాడ మెట్రో ప్రతిపాదన రాలేదు: కేంద్ర మంత్రి ఖట్టర్

న్యూఢిల్లీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): విశాఖ లైట్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు సంబంధించి ఈ ఏడాది జనవరిలో రాష్ట్రప్రభుత్వం నుంచి ప్రతిపాదన అందిందని కేంద్రం వెల్లడించింది. రూ.14,309 కోట్ల ప్రాజెక్టు అంచనాతో ప్రతిపాదన, సమగ్ర మొబిలిటీ ప్లాను(సీఎంపీ)ని కూడా పంపించిందని తెలిపింది. అయితే సీఎంపీ ఐదేళ్ల నాటిదని, సవరించిన మార్గదర్శకాలకు అనుగుణంగా లేకపోవడంతో మరోసారి పంపించాలని రాష్ట్రాన్ని కోరినట్లు పేర్కొంది. ఈ మేరకు టీడీపీ ఎంపీ శ్రీభరత్ అడిగిన ప్రశ్నకు కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ సమాధానం ఇచ్చారు. ఏపీ ప్రభుత్వం నుంచి విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టుకు సంబంధించి ఎటువంటి ప్రతిపాదనా రాలేదని ఆయన పేర్కొన్నారు.

జమిలికి సై



(మొదటి పేజీ తరువాయి)

పరిశీలిస్తారని బీజేపీ వర్గాలు తెలిపాయి. జమిలి కోసం మొత్తం ఆరు బిల్లులు పెట్టాల్సి ఉండగా ప్రస్తుతం రెండింటికే పరిమితమవుతున్నారు. తర్వాత దశల్లో మిగతావి జత చేరతాయని అంటున్నారు. తొలి బిల్లులో ఆర్టికల్ 83(పార్లమెంటు కాలపరిమితి), ఆర్టికల్ 172(అసెంబ్లీ కాలపరిమితి)లను సవరిస్తారు. ఇందుకు ఉభయ సభల్లో హాజరైన సభ్యుల్లో మూడింట రెండొంతుల మంది మద్దతు అవసరం. లోకసభలో 361 మంది మద్దతు కావాలి. ఎన్డీయే బలం 293 మాత్రమే. వైసీపీ, బీజేడీ, అన్నాడీఎంకే మద్దతు ఇచ్చినా 2/3 చేరుకోవడం అసాధ్యం. రాజ్యసభలోనూ 154 మంది ఎంపీల మద్దతు కావాలి. ఎన్డీయే బలం నామినేటెడ్ సభ్యులు కలుపుకొని కూడా 119 మాత్రమే. అంటే, ఉభయ సభల్లో బిల్లు నెగ్గడం అంత తేలికేమీ కాదు.

లోక్‌సభ, అసెంబ్లీ జమిలిపైనే దృష్టి

లోక్‌సభ, అసెంబ్లీలకు మాత్రమే జమిలి ఎన్నికలు నిర్వహిస్తే రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రదించాల్సిన అవసరం ఉండదని కేంద్రం భావిస్తోంది. స్థానిక ఎన్నికలను వాటితోపాటు కలిపితే కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీల్లోనైనా ఆమోదం పొందాల్సి ఉంటుందని బీజేపీ వర్గాలు అంటున్నాయి. ప్రస్తుతం లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలపైనే పూర్తి దృష్టి కేంద్రీకరించాలని మోదీ ప్రభుత్వం భావిస్తున్నట్లు ఈ వర్గాలు తెలిపాయి. మూడు నెలల క్రితం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సమర్పించిన నివేదికలో లోక్‌సభ, అసెంబ్లీలతో పాటు స్థానిక సంస్థలకు కూడా ఒకేసారి ఎన్నికలు జరపాలని, దేశవ్యాప్తంగా ఒకే ఓటర్ల జాబితా రూపొందించాలని సిఫారసు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలను కూడా చేర్చాలంటే 324(ఎ) పేరుతో ఆర్టికల్‌ను చేర్చాలని చెప్పింది. దీనికి సగం రాష్ట్రాల శాసనసభల ఆమోదం అవసరం. దీన్ని ప్రస్తుతానికి పక్కనబెట్టారు. కోవింద్ కమిటీ మూడు రాజ్యాంగ అధికరణలకు, మూడు చట్టాలకు కలిపి మొత్తం 18 సవరణలు సూచించింది. ప్రభుత్వ పాలన సాఫీగా జరగడం కోసం జమిలి ఎన్నికలు అవసరమని తాము భావిస్తున్నట్లు బీజేపీ చీఫ్ విప్ సంజయ్ జైశ్వాల్ తెలిపారు. ప్రతి కొద్ది నెలలకు ఎన్నికలు జరగడం వల్ల ప్రభుత్వ సమర్థత తగ్గిపోతుందని, అధికారులు, రాజకీయ నాయకులు నిరంతరం ఎన్నికల ప్రక్రియలో తల మునకలై ఉంటారని, సంక్షేమ పథకాలు అమలు చేయడం సాధ్యం కాదని జైశ్వాల్ చెప్పారు. జమిలిని ప్రవేశపెడితే ఐదేళ్లపాటు పాలన సాఫీగా సాగుతుందని ఆయన ఒక జాతీయ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. 1971 వరకు జమిలి ఎన్నికలు నిరాటంకంగా జరిగాయని, తర్వాతే వాటికి అంతరాయం కలిగిందన్నారు. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడాన్ని 30కి పైగా పార్టీలు సమర్థిస్తున్నాయి. కాంగ్రెస్ సహా మరో 15 పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ ప్రతిపాదన ఆచరణాత్మకమైనది కాదని కాంగ్రెస్ అంటోంది. జమిలి ప్రజాస్వామ్య వ్యతిరేకమని, ప్రాంతీయ ఆకాంక్షలకు గొంతు లేకుండా పోతుందని, సమాఖ్య వ్యవస్థ దెబ్బతింటుందని తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత స్టాలిన్ వ్యాఖ్యానించారు. బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ అధినేత మమతా బెనర్జీ కూడా జమిలిని వ్యతిరేకించారు. జమిలి ఎన్నికలపై తమకు అనేక సందేహాలు ఉన్నాయని, బిల్లులు సభలోకి వచ్చాక స్పందిస్తామని లోక్‌సభలో కాంగ్రెస్ ఉప నేత గౌరవ్ గొగోయ్ అన్నారు. జమిలిపై ప్రధాని ఎప్పుడూ ఒక మాట మీద లేరని, తనకు అనుకూలంగా ఉన్నప్పుడే జమిలి ఎన్నికలను లేవనెత్తుతారని విమర్శించారు. నాలుగు రాష్ట్రాల్లో ఒకేసారి ఎన్నికలు పెట్టలేని పరిస్థితి దేశంలో ఉందని, దేశమంతా పెడతానని చెబుతున్న మోదీకి ఎంతటి సాధనా సంపత్తి అవసరమో అంచనా ఉందా? అని వి.హనుమంతరావు ప్రశ్నించారు.

మద్దతు ఇచ్చిన పార్టీలు: బీజేపీ, అన్నాడీఎంకే, అప్నాదళ్, బిజూజనతాదళ్, అసోం గణపరిషత్, శివసేన, జేడీయూ, అకాలీదళ్.

వ్యతిరేకించిన పార్టీలు: కాంగ్రెస్, సీపీఎం, తృణమూల్ కాంగ్రెస్, ఎస్పీ, ఎంఐఎం, సీపీఐ, డీఎంకే, బీఎస్పీ, ఆప్.

స్పందించనివి: టీడీపీ, వైసీపీ, బీఆర్ఎస్, ఎన్సీపీ, ఆర్జేడీ, ఆర్ఎల్‌డీ, జేడీఎస్, జార్ఖండ్ ముక్తి మోర్చా, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్, నేషనల్ కాన్ఫరెన్స్, కేరళ కాంగ్రెస్.

ఏడు దేశాల్లో పరిశీలన

కోవింద్ కమిటీ జమిలి ఎన్నికలకు అనుకూలంగా నివేదిక ఇవ్వడానికి ముందు జమిలి ఎన్నికలను నిర్వహించే ఏడు దేశాలను సందర్శించింది. దక్షిణాఫ్రికా, జర్మనీ, స్వీడన్, జపాన్, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, బెల్జియం దేశాల ఎన్నికల విధానాలను పరిశీలించింది. కోవింద్ కమిటీ నివేదిక ప్రకారం లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలి. తర్వాత వంద రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు ఒకేసారి నిర్వహించాలి. గత సెప్టెంబరులో మోదీ ప్రభుత్వం ఆ నివేదికను ఆమోదించింది. దక్షిణాఫ్రికాలో లోక్‌సభ, శాసనసభల ఎన్నికలు ఒకేసారి ఐదేళ్లకు జరుగుతాయి. తర్వాత స్థానిక ఎన్నికలు జరుగుతాయి. స్వీడన్‌లో పార్లమెంటు నుంచి స్థానిక సంస్థల వరకు ఒకేసారి నాలుగేళ్లకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అవిశ్వాస తీర్మానం విషయంలో జర్మనీ పద్ధతిని అనుసరించాలని కోవింద్ కమిటీ సభ్యుడు సుభాష్ కశ్యప్ సూచించారు. ప్రస్తుత ప్రధానిని తొలగించేందుకు పెట్టే తీర్మానంలోనే మరో ప్రధానిని సాధారణ మెజారిటీతో ఎన్నుకోవాలి. సభ రద్దయితే మిగిలిన కాలానికి మాత్రమే ఎన్నికలు జరగాలి. లోక్‌సభ కాలపరిమితితో శాసనసభల కాలపరిమితి ముగిసిపోవాలి. అన్ని ఎన్నికలకూ ఒకే ఓటర్ల జాబితా ఉండాలి. అలాగే ప్రభుత్వం ఏర్పాటుకు రాష్ట్రపతి ఒకర్ని పిలవడం కాకుండా పార్లమెంటే సభానాయకుడిని ఎన్నుకోవాలని, అతన్నే రాష్ట్రపతి ప్రభుత్వం ఏర్పాటుకు పిలవాలని కశ్యప్ ప్రతిపాదించారు. ఇది జపాన్‌లో అనుసరిస్తున్న విధానం. 2019లో ఇండోనేసియా విజయవంతంగా ఒకేరోజు దేశవ్యాప్తంగా అన్ని సభలకు ఎన్నికలు జరిపి జమిలి వ్యవస్థలోకి ప్రవేశించింది. 20 కోట్ల మంది ఇండోనేసియన్ పౌరులు ఒకేరోజు ఓటేశారు. ఇది ప్రపంచంలోనే ఒకే రోజు జరిగిన అతిపెద్ద పోలింగ్.

లోకం తీరు



రోడ్డు ప్రమాదాల ప్రస్తావన వస్తే సిగ్గుతో ముఖం దాచుకుంటున్నా

- ఏటా ప్రమాదాల్లో 1.78 లక్షల మంది మృతి
- రోడ్డు పక్కన ట్రక్కులు నిలపడం ప్రమాదాలకు ప్రధాన కారణం: గడ్కరీ



న్యూఢిల్లీ, డిసెంబరు 12: దేశంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య నానాటికీ పెరిగిపోతోందని, అంతర్జాతీయ సదస్సుల్లో ఈ అంశం ప్రస్తావనకు వస్తే సమాధానం చెప్పలేక సిగ్గుతో ముఖాన్ని దాచుకోవాల్సి వస్తోందని కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. గురువారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో రోడ్డు ప్రమాదాలపై ఆయన మాట్లాడారు. తాను రోడ్డు, రవాణా మంత్రిగా తొలిసారి బాధ్యతలు చేపట్టినప్పుడు రోడ్డు ప్రమాదాలను 50% మేర తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నానని, కానీ ఇంకా ఇంకా పెరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నప్పుడు దేశంలో రోడ్డు ప్రమాదాలపై చర్చ జరిగితే సిగ్గుతో ముఖం దాచుకోవాల్సి వస్తోందని వాపోయారు. దేశంలో ప్రజలకు చట్టాలంటే భయం లేదని పేర్కొన్నారు. కొంత మంది రెడ్ సిగ్నల్ జంప్ చేస్తున్నారని, కొంత మంది ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్లు ధరించడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాలు తగ్గాలంటే ప్రజలు మారాలని, చట్టాలను గౌరవించాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. రోడ్డు పక్కన ట్రక్కులను నిలిపి ఉంచడం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. దేశంలో ప్రతి ఏటా 1.78 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని, వారిలో 60% మంది 18 నుంచి 34 ఏళ్ల వయసు వారేనని తెలిపారు. తాను, తన కుటుంబం కూడా ఓసారి రోడ్డు ప్రమాదానికి గురై చాలా రోజులు ఆస్పత్రిలో ఉండాల్సి వచ్చిందని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని లోక్‌సభ సభ్యులను గడ్కరీ కోరారు.

తమిళనాడు ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం

- ఏడుగురు సజీవ దహనం
- షార్ట్ సర్క్యూటే ఘటనకు కారణం?



చెన్నై, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో దిండుగల్‌లోని సిటీ ఆస్పత్రిలో గురువారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో ఏడుగురు సజీవ దహనం అయ్యారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఒక బాలుడు ఉన్నారు. తిరుచ్చి, దిండుగల్ జాతీయ రహదారిపై ఉన్న సిటీ ఆస్పత్రిలో రాత్రి 10 గంటల ప్రాంతంలో మంటలు సంభవించాయి. నాలుగు అంతస్తుల భవనమున్న ఈ ఆస్పత్రి దిగువ ఫ్లోర్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఏం జరిగిందో గ్రహించేలోపే మంటలు వార్డులకు వ్యాపించాయి. దీంతో రోగులు భయంతో బయటకు పరుగులు తీసారు. ఆ సమయంలో లిఫ్టులో ఉన్న ముగ్గురు మహిళలు, ఒక బాలుడు మంటలకు బలయ్యారు. మరో ముగ్గురి మృతదేహాలు కూడా లభ్యమయ్యాయి. 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో రోగులే ఎక్కువ ఉన్నట్టు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక దళాలు హుటాహుటిన ఘటనాస్థలికి వచ్చాయి. సుమారు 50 అంబులెన్సుల్లో రోగులను, క్షతగాత్రులను ఇతర ఆస్పత్రులకు తరలించినట్లు దిండుగల్ జిల్లా పోలీసులు తెలిపారు. కాగా, ఈ ఘటనలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఐ.పెరియస్వామి, దిండుగల్ కలెక్టర్ ఎం.ఎన్.పూంగుడి, ఎస్పీ ప్రదీప్ తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. అర్ధరాత్రి దాటాక కూడా మంటలు అదుపులోకి రాలేదు.

రాజ్యసభ ఛైర్మన్‌పై ప్రెస్‌మీట్‌లో విమర్శలా?

- ఖర్గే తీరు సరికాదు: జేపీ నడ్డా

న్యూఢిల్లీ, డిసెంబరు 12: రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బహిరంగంగా విమర్శలు చేయడం సరికాదని కేంద్ర మంత్రి జేపీ నడ్డా అన్నారు. "రాజ్యసభ ఛైర్మన్‌ను ప్రశ్నించడం ఆమోదయోగ్యం కాదు. ఛైర్మన్ ఆదేశాలను ప్రశ్నించడం లేదా విమర్శించడం తప్పు. ఒక వేళ అలా చేస్తే అది సభను, ఛైర్మన్‌ను ధిక్కరించినట్లే అవుతుంది" అని నడ్డా పేర్కొన్నారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత, సీనియర్ నాయకుడైన ఖర్గే మీడియా సమావేశంలో ఛైర్మన్‌పై విమర్శలు చేశారని, ఈ తప్పుడు చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

ప్రార్థన స్థలాలపై విచారణ ఆపండి

- మేం తదుపరి ఉత్తర్వులిచ్చేదాకా కొత్త వ్యాజ్యాలు స్వీకరించొద్దు
- కింది కోర్టులకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, డిసెంబరు 12: తాము తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంతవరకూ దేశంలోని ఏ కోర్టూ.. ప్రార్థనా స్థలాలకు సంబంధించి కొత్త వ్యాజ్యాలను తీసుకోరాదని, ఇప్పటికే ఉన్న కేసుల్లో సర్వే నిర్వహణ సహా ఎలాంటి మధ్యంతర ఆదేశాలు, తుది ఉత్తర్వులు జారీ చేయరాదని సుప్రీంకోర్టు ఆదేశించింది. "ఈ అంశం మా పరిధిలో ఉన్నందున, మేం తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంతవరకూ దీనిపై కొత్త కేసులు స్వీకరించడం, పాత కేసుల్లో చర్యలు తీసుకోవడం సముచితం కాదని భావిస్తున్నాం" అని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. "ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనల) చట్టం, 1991"లోని పలు నిబంధనలు సవాల్ చేస్తూ ప్రముఖ న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ దాఖలు చేసిన పిటిషన్ సహా ఆరు పిటిషన్ల విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. కాశీలో జ్ఞానవాపి, మథురలో షాహీ ఈద్గాహ్ మసీదు సహా దేశవ్యాప్తంగా 10మసీదులు/ముస్లిం ప్రార్థనా మందిరాల్లో సర్వే నిర్వహించాలని కోరుతూ దాఖలైన 18 వ్యాజ్యాల్లో తదుపరి విచారణలు ఈ ఆదేశాలతో నిలిచిపోనున్నాయి. 1947 ఆగస్టు 15నాటికి దేశవ్యాప్తంగా ఉన్న ప్రార్థనా స్థలాల మత స్వభావాన్ని మార్చడానికి వీల్లేకుండా 1991లో అప్పటి కాంగ్రెస్ సర్కారు.. "ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనల) చట్టం, 1991"ని రూపొందించింది. రామజన్మభూమి-బాబ్రీ మసీదు మాత్రం ఈ చట్టం పరిధిలోకి రాకుండా.. ఇదే చట్టంలోని సెక్షన్ ఐదు ద్వారా మినహాయింపునిచ్చారు. ఈ చట్టంలోని నిబంధనలను వ్యతిరేకిస్తూ.. ఈ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆరు పిటిషన్లు దాఖలయ్యాయి. అదే సమయంలో.. ఈ చట్టాన్ని రద్దు చేస్తే దేశంలో మతసామరస్యం దెబ్బతింటుందని, కాబట్టి దాన్ని రద్దు చేయకూడదని, హిందూ పక్షాలు కేసులు వేసిన మసీదుల యథాతథస్థితిని కొనసాగించాలని కోరుతూ కూడా పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లన్నింటినీ విచారిస్తున్న ధర్మాసనం.. తాము ఈ చట్టం న్యాయబద్ధతను, పరిధిని పరిశీలిస్తున్నామని, కాబట్టి దేశంలోని ఇతర కోర్టులు ఈ తరహా కేసుల్లో విచారణ చేపట్టవద్దని చెప్పడం అనివార్యంగా భావిస్తున్నామని పేర్కొంది. అయితే, ఒక హిందూ పక్షం తరఫున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది జె.సాయి దీపక్.. సుప్రీం ఆదేశాలను వ్యతిరేకించారు. ఇలాంటి ఆదేశాలు ఇచ్చేముందు అన్ని పక్షాల వాదనలూ వినాలని కోరారు. దీనికి సీజేఐ.. సుప్రీం కోర్టు విస్తృత పరిశీలనలో ఉన్న అంశాలపై ఎలాంటి ఆదేశాలూ జారీచేయొద్దని కోర్టులను కోరడం సహజమేనని గుర్తుచేశారు. ట్రయల్ కోర్టులు సుప్రీంకోర్టును కాదని విచారణ జరపవచ్చా? అని ప్రశ్నించారు. ఈ అంశంపై కేంద్రం వైఖరి ఏమిటో తెలియకుండా నిర్ణయం తీసుకోలేం కాబట్టి.. నాలుగు వారాల్లోగా సమాధానం దాఖలు చేయాలని, దాన్ని ఎవరైనా డౌన్‌లోడ్ చేసుకునే విధంగా వెబ్‌సైట్‌లో పెట్టాలని కేంద్రాన్ని ఆదేశించారు. కేంద్రం స్పందనపై సమాధానాల దాఖలుకు ఈ కేసుల్లో పార్టీలుగా ఉన్నవారికి మరో నాలుగు వారాల గడువిచ్చారు. అలాగే.. ఈ కేసులో కేంద్రం తరఫున కాను అగర్వాల్‌ను, చట్టాన్ని సవాల్ చేస్తున్న పిటిషనర్ల తరఫున విష్ణు శంకర్ జైన్‌ను, చట్టాన్ని సమర్థిస్తూ పిటిషన్లు దాఖలు చేసిన పక్షాల తరఫున ఇజాజ్ మక్బూల్‌ను నోడల్ న్యాయవాదులుగా నియమించిన సుప్రీంకోర్టు, తదుపరి విచారణను ఎనిమిది వారాలకు వాయిదా వేసింది.

ఆత్మహత్య చేసుకుని చచ్చిపో..

భార్య మాటలతోనే అతుల్ సుభాష్ సూసైడ్

- రూ. 5 లక్షలు డిమాండ్ చేసిన జడ్జి
- కేసులో కొత్త విషయాలు.. దేశ వ్యాప్తంగా చర్చ

న్యూఢిల్లీ, డిసెంబరు 12: భార్య వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న బెంగళూరు టెకీ అతుల్ సుభాష్ కేసు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పురుషులకు కూడా న్యాయం అందాలనే డిమాండ్ వినిపిస్తోంది. సుదీర్ఘమైన అతని సూసైడ్ నోట్‌లోని విషయాలు చర్చకు దారితీశాయి. ఈ కేసులో ఒక్కొక్కటిగా కొత్త విషయాలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. భార్య, అత్త ఎగతాళి మాటలే అతన్ని ఆత్మహత్యకు పురిగొల్పేలా చేశాయని స్పష్టమైంది. మరోపక్క అతుల్ కుటుంబ సభ్యులు మీడియా వద్ద తమ ఆవేదన వ్యక్తం చేశారు. సుభాష్ అన్న మాట్లాడుతూ.. 'నా సోదరుడు బెంగళూరు నుంచి యూపీలోని జౌన్‌పూర్ కోర్టుకు 40 సార్లు తిరిగాడు. నా సోదరుడికి న్యాయం జరగాలి. జడ్జిపై కఠిన చర్యలు తీసుకోవాలి. న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం తగ్గుతోంది. ఏటీఎం యంత్రాలం అయిపోతామనే భావన పురుషుల్లో ఉంది. పెళ్లిళ్లు అంటేనే మగవాళ్లు భయపడే పరిస్థితి వస్తోంది' అని అన్నారు. అతని బంధువు మాట్లాడుతూ.. భార్య తరఫు వారు నిత్యం సుభాష్‌ను డబ్బులు డిమాండ్ చేసేవారని చెప్పారు. కాగా, సుభాష్ కుటుంబంపై అతడి భార్య నికిత కూడా తీవ్ర ఆరోపణలు చేసింది. తన అత్త కట్నం కోసం వేధించినట్లు పేర్కొంది. "నా భర్త తాగి వచ్చి నన్ను కొట్టేవాడు. నన్ను ఒక పశువులా చూసేవాడు. నా జీతం మొత్తం తన ఖాతాలోకి మార్పించేవాడు. అత్తగారి వేధింపుల కారణంగా నా తండ్రి ఆరోగ్యం పాడై 2019లో మరణించారు" అని పేర్కొంది.

అందుకే ఆత్మహత్య నిర్ణయం..

విడాకుల విచారణ సందర్భంగా ఫ్యామిలీ కోర్టులో జరిగిన రెండు సంఘటనలు సూసైడ్ నోట్‌లో సుభాష్ ప్రముఖంగా ప్రస్తావించాడు. ఆత్మహత్య చేసుకుని చావచ్చు కదా.. అని భార్య అనడంతోనే కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాడు. "మార్చి నెలలో కేసు విచారణకు వెళ్లాను. ఈ కేసును నువ్వెందుకు సెటిల్ చేసుకోవడం లేదు అని ఫ్యామిలీ కోర్టు జడ్జి అడిగారు. నా భార్య మొదట రూ. కోటి డిమాండ్ చేసింది. కోర్టు ఇచ్చిన మధ్యంతర మెయింటెనెన్స్ ఆర్డర్ తర్వాత దానిని రూ. 3 కోట్లకు పెంచింది అని జడ్జికి చెబితే.. నీ దగ్గర డబ్బుంది కాబట్టే వాళ్లు అడుగుతున్నట్లు ఉన్నారు అని జడ్జి అన్నారు. జడ్జికి నా ఆర్థిక పరిస్థితి అంతా వివరించాను. నాలాగే భరణం కేసుల్లో ఎంతమంది మగవాళ్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారో చెప్పాను. ఎన్‌సీఆర్‌బీ రిపోర్టును కూడా చూపాను. ఆ సమయంలో అక్కడే ఉన్న నా భార్య 'ఇంకేం.. నువ్వు కూడా ఆత్మహత్య చేసుకుని చనిపో' అని అన్నది. ఆ మాటలకు జడ్జి కూడా నవ్వారు. ఆ తర్వాత తన భార్యను బయటకు పంపేసి.. రూ. 5 లక్షలు ఇస్తే కేసు సెటిల్ చేస్తానని జడ్జి చెప్పారు. అంత ఇవ్వలేను అని జడ్జికి బదులిచ్చాను" అని సుభాష్ లేఖలో పేర్కొన్నాడు. ఇక ఏప్రిల్ నెలలో కోర్టు విచారణకు వెళ్లినపుడు తన అత్తగారు ఎదురుపడి.. "నువ్వింకా ఆత్మహత్య చేసుకోలేదా.. నువ్వు పోతే ఆస్తి మొత్తం నా కూతురికి చెందుతుంది. అప్పుడు నీ తల్లిదండ్రులు కూడా కోర్టు చుట్టూ తిరుగుతారు" అని రెచ్చగొట్టేలా మాట్లాడిందని సుభాష్ తెలిపాడు. ఈ సమస్యల్నీ పోవడానికి ఆత్మహత్యే శరణ్యం అని భావించానని లేఖలో పేర్కొన్నాడు.

మనోవర్తి నిర్ధారణకు 8 సూత్రాలు

మార్గదర్శకాలు జారీ చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, డిసెంబరు 12: విడాకులు మంజూరు చేసే సమయంలో భార్యకు చెల్లించాల్సిన శాశ్వత మనోవర్తిని నిర్ణయించే సమయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. భర్త చెల్లించాల్సిన మనోవర్తి అతడిని శిక్షించే విధంగా ఉండకూడదని, అదే సమయంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడిపే విధంగా భార్యకు చెల్లింపులు జరపాల్సి ఉంటుదని తెలిపింది. ఇందుకు ఎనిమిది సూత్రాల విధానాన్ని సూచిస్తూ జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బి వరాలే ధర్మాసనం తీర్పు చెప్పింది. ఓ జంట ఆరేళ్ల పాటు కలిసి ఉండి, అనంతరం దాదాపు రెండు దశాబ్దాల పాటు విడిగా జీవించింది. చివరకు విడాకుల కోసం కోర్టును ఆశ్రయించింది. వాదనలు విన్న ధర్మాసనం తుది మనోవర్తి నిర్ధారించే సమయంలో గమనించాల్సిన అంశాలపై మార్గదర్శకాలు ఇచ్చింది.

- భార్య, భర్తల ఆర్థిక, సామాజిక హోదా
- భార్య, ఆమెపై ఆధారపడ్డ పిల్లల హేతుబద్ధమైన అవసరాలు
- ఆ జంట విద్యార్హతలు, ఉద్యోగాల హోదా
- భార్యకు ఉన్న సొంత ఆదాయం, ఆస్తులు
- అత్తవారింటిలో భార్య అనుభవించిన జీవన ప్రమాణాలు
- కుటుంబ బాధ్యతల కోసం ఆమె ఉద్యోగాన్ని త్యాగం చేసి ఉంటే ఆ వివరాలు...
- భార్య ఎలాంటి ఉద్యోగం చేయకుంటే కోర్టుల్లో న్యాయం కోసం ఆమె చేసిన వ్యయం...
- భర్త ఆదాయం, రుణాలు, మనోవర్తి భారం... తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. అన్ని కోర్టులు కూడా ఈ మార్గదర్శకాలను పాటించాలని తెలిపింది. అయితే మనోవర్తి నిర్ధారణకు కచ్చితమైన సూత్రం అంటూ ఏమీ ఉండదని, పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.



సదస్సులో పాల్గొన్న మెడ్‌టెక్ సీఈవో జితేంద్రశర్మ తదితరులు

వరల్డ్ హెల్త్ ఇన్నోవేషన్ ఫోరం-2024 సదస్సు ప్రారంభం

ఉక్కుటౌన్‌షిప్ (విశాఖపట్నం), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడ్‌టెక్ జోన్‌లోని కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ టెక్నాలజీ సెంటర్‌లో వరల్డ్ హెల్త్ ఇన్నోవేషన్ ఫోరం-2024 రెండో ఎడిషన్ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈ సదస్సు మూడు రోజులపాటు జరగనుంది. తొలిరోజు వైద్య రంగంలో నూతన ఆవిష్కరణపై చర్చించారు. వంద దేశాల నుంచి సుమారు వెయ్యి మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మెడ్ టెక్ జోన్ సీఈవో జితేంద్రశర్మ కీలక అంశాలపై ప్రసంగించారు.

దేశంలో మరో 50 కొత్త ఎయిర్‌పోర్టులు



ఎయిర్‌పోర్టు వద్ద మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్, చిత్రంలో ఎంపీలు పురందేశ్వరి, ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు నెహ్రూ, బలరామకృష్ణ



ఢిల్లీ నుంచి రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు వచ్చిన తొలి విమాన సర్వీస్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

» ఏపీలో అన్ని విమానాశ్రయాల నుంచి నూతన సర్వీసులు: రామ్మోహన్

రాజమహేంద్రవరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): దేశంలో కొత్తగా మరో 50 విమానాశ్రయాలు నిర్మించనున్నట్టు పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ చెప్పారు. ఢిల్లీ నుంచి రాజమహేంద్రవరానికి తొలి విమాన సర్వీస్ గురువారం ఉదయం చేరుకుంది. ఇందులో రామ్మోహన్, ఎంపీలు పురందేశ్వరి, ఉదయ్ శ్రీనివాస్ వచ్చారు. ఈ విమానానికి ఎమ్మెల్యేలు, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వర్ స్వాగతం పలికారు. అనంతరం రామ్మోహన్ మాట్లాడుతూ మోదీ ప్రధాని కాకముందు దేశంలో 74 ఎయిర్‌పోర్టులు ఉంటే, ఇప్పుడు ఆ సంఖ్య 150కు పెరిగిందన్నారు. రాష్ట్రంలో ఎయిర్‌పోర్టుల అభివృద్ధి, నిర్మాణాల విషయంలో సీఎం చంద్రబాబు పట్టుదలతో ఉన్నారన్నారు. ఢిల్లీకి సర్వీస్ ప్రారంభమైందని, త్వరలో తిరుపతి, వారాణసి, అహ్మదాబాద్, జైపూర్‌లకు సర్వీసులు ప్రారంభిస్తామన్నారు. తిరుపతి, షిర్డీ, బెంగుళూరుకు విమాన సర్వీసులు ప్రారంభించాలని ఎంపీ పురందేశ్వరి కోరారు.



సూపర్ సిక్స్‌కు దిక్కులేదు.. ఎన్నికల హామీల ఊసే లేదు

» వైసీపీ ఐదేళ్ల అక్రమాలపై దర్యాప్తు ఏదీ?: షర్మిల

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ ఆర్నెళ్ల పాలన అర్థరహితంగా మారిందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్‌కు దిక్కులేదని, మేనిఫెస్టోలో పెట్టిన 60 హామీలకు పత్తా లేదని గురువారం ఎక్స్ వేదికగా షర్మిల విమర్శించారు. ఉచితంగా ఇచ్చే మూడు సిలెండర్లలో ఈ ఏడాది ఒక్క సిలెండరే ఇచ్చి మమా అనిపించారని, నిరుద్యోగ భృతి ఊసేలేదని అన్నారు. స్కూల్‌కు వెళ్లే ప్రతిబిడ్డకూ రూ.15 వేలు ఇవ్వకుండా.. తల్లులకు పంగనామాలు పెట్టారని విమర్శించారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తానని చెప్పి రైతులను మోసం చేశారన్నారు. ఆడబిడ్డకు ప్రతి నెలా రూ.1500 ఇస్తానని చెప్పి అడ్రస్సే లేకుండా చేశారన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఇంతవరకూ అమలు చేయలేదన్నారు. ఈ ఏడాది జూన్12న తొలి సంతకం చేసిన డీఎస్సీకి ఇంతవరకు మోక్షం లేదన్నారు. వ్యవస్థలను అస్తవ్యస్తం చేసిన గత ఐదేళ్ల వైసీపీ పాలనపై దర్యాప్తు చేయరెందుకని ప్రశ్నించారు. నేల, నీరు, ఖనిజం లాంటివన్నీ జగన్ సేనలు కాజేశాయని షర్మిలరెడ్డి విమర్శించారు. రాష్ట్రాన్ని జగన్ దివాలా తీయించినందున వారి గ్రాఫ్ 11కు పడిపోయిందన్నారు.

పీఎంఏవై-అర్బన్ 1.0 పథకం కొనసాగింపు

» 6.40 లక్షల పెండింగ్ ఇళ్ల పూర్తికి ప్రభుత్వం అంగీకారం

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ (పీఎంఏవై-అర్బన్) 1.0 పథకాన్ని కొనసాగిస్తూ... ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 6.40 లక్షల ఇళ్లను పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈమేరకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పీఎంఏవై-అర్బన్ 1.0 పథకం కింద రాష్ట్రంలోని 125 పట్టణ స్థానిక సంస్థలు, మరో 21 పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలోని పేదలకు కేంద్రం 18,01,840 ఇళ్లు మంజూరు చేసింది. వాటిలో 6.40 లక్షల ఇళ్లు నిర్మాణంలోనే ఉన్నాయి. కాగా, కేంద్రం ఇటీవల పీఎంఏవై-అర్బన్ 2.0ను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పీఎంఏవై-అర్బన్ 1.0 పథకాన్ని కొనసాగిస్తూ పెండింగ్‌లో ఉన్న 6.40 లక్షల ఇళ్లను గతంలో ఉన్న మూడు ఆప్షన్ల పద్ధతిలోనే పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. పీఎంఏవై-జీ, పీఎం-జన్‌మన్ పథకాల కింద ఇళ్లను గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

ప్రాణాలు తీసిన కుటుంబ కలహాలు

పిల్లలకు విషమిచ్చి మహిళ ఆత్మహత్యాయత్నం.. తల్లి, కొడుకు మృతి, కూతురి పరిస్థితి విషమం



సుజాత, నాగ చైతన్య



చికిత్స పొందుతున్న రహిత్య

గార్లదిన్నె, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): దంపతుల మధ్య విభేదాలు రెండు నిండు ప్రాణాలను బలితీసుకున్నాయి. అనంతపురం జిల్లా గార్లదిన్నెలో ఓ మహిళ పిల్లలకు విషపు గుళికలు తినిపించి, తానూ తీసుకున్నారు. దీంతో తల్లీకొడుకు మృతిచెందగా, కుమార్తె పరిస్థితి విషమంగా మారింది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు ఎర్రగుంట్లకు చెందిన నిమ్మకాయల సురేష్, సుజాత (38) దంపతులకు కూతురు రహిత్య, కుమారుడు నాగ చైతన్య(12) ఉన్నారు. దంపతుల మధ్య కొన్నాళ్లుగా విభేదాలు కొనసాగుతున్నట్టు సమాచారం. ఈ క్రమంలో బుధవారం జరిగిన బంధువుల వివాహ వేడుకల్లోనూ దంపతులిద్దరూ గొడవపడినట్లు తెలిసింది. ఇంటికి వచ్చాక కూడా గొడవ కొనసాగినట్లు సమాచారం. కాగా.. సురేష్ గురువారం ఉదయమే ఎర్రగుంట్ల వెళ్లారు. ఆ సమయంలో సుజాత విషపు గుళికలను తీసుకుని నిద్రమత్తులో ఉన్న కొడుకు, కూతురుకు తినిపించి, తానూ మింగారు. గురువారం దుకాణం తెరవకపోవడంతో పక్కింటివారు వెళ్లి తలుపు తీసి చూశారు. అపస్మారక స్థితిలో ఉన్న ముగ్గురినీ అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి, ఆ తరువాత ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుజాత మృతి చెందారు. మెరుగైన చికిత్స నిమిత్తం కుమారుడు, కుమార్తెను బెంగళూరుకు తరలిస్తుండగా నాగచైతన్య మృతి చెందాడు. రహిత్య పరిస్థితి విషమంగానే ఉంది. తమ అల్లుడి వేధింపులు తట్టుకోలేకే కూతురు ఈ అఘాయిత్యానికి పాల్పడిందని సుజాత తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాన్నే స్ఫూర్తి.. ప్రజలే నాకు ఆదర్శం

» గద్దర్ జాతీయ సేవా అవార్డుల ప్రదానంలో వెన్నెల గద్దర్



గద్దర్ జాతీయ సేవా పురస్కార అవార్డులను ప్రదానం చేస్తున్న వెన్నెల గద్దర్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తన తండ్రి భౌతికంగా మన మధ్యలేనప్పటికి ఆయన ఇచ్చిన స్ఫూర్తి, ప్రజలను ఆదర్శంగా తీసుకుని గద్దర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్తున్నానని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ డాక్టర్ వెన్నెల గద్దర్ అన్నారు. గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలో జరిగిన గద్దర్ జాతీయ సేవా పురస్కారాల ప్రదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అధ్యక్షత వహించగా ఆమె పాల్గొని మాట్లాడారు. మనమందరం తెలుగు తల్లి పిల్లలు కావడంతో గజ్జల సవ్వడితో ఏపీలో కూడా ముందుకు వస్తున్నానని వెన్నెల చెప్పారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థి ఆత్మహత్య

ఎచ్చెర్ల, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ పరిధిలోని శ్రీకాకుళం సమీప ఎస్ఎం పురంలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సివిల్ ఇంజనీరింగ్ ఫస్టియర్ చదువుతున్న రమావత్ ప్రవీణ్ నాయక్ (19) బుధవారం అర్ధరాత్రి హాస్టల్ భవనం మూడో అంతస్థు పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంకు చెందిన ప్రవీణ్ 2022-23 బ్యాచ్‌లో శ్రీకాకుళం క్యాంపస్‌లో చేరాడు. గురువారం ఇంటర్నల్ ఎగ్జామ్ ఉండడంతో ప్రవీణ్ నాయక్ బుధవారం అర్ధరాత్రి 1.40 వరకు మెలకువగా ఉన్నాడు. ఆతర్వాత మూత్ర విసర్జన కోసం వెళతానని స్నేహితులకు చెప్పి బయటకు వచ్చాడు. మూడో అంతస్థు పైనుంచి కిందకు దూకాడు. దీనిని గమనించిన మొదటి అంతస్థులోని విద్యార్థులు బయటకు వచ్చి చూడగా రక్తపు మడుగులో ఉన్న ప్రవీణ్ నాయక్ కనిపించాడు. వెంటనే క్యాంపస్ అంబులెన్స్‌తో శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు.



ప్రవీణ్ నాయక్

ధాన్యం రైతులను ఎంత ఏడిపించారో గుర్తుందా?: టీడీపీ

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలపై రోడ్డెక్కుతామని ప్రకటనలు చేస్తున్న వైసీపీ నేతలకు తమ హయాంలో ధాన్యం రైతులను ఎంత ఏడిపించారో గుర్తుందా? అని తెలుగుదేశం పార్టీ ప్రశ్నించింది. రైతులకు నెలల తరబడి డబ్బులు చెల్లించలేదు. రూ.1,600 కోట్లు బకాయి పెడితే కూటమి ప్రభుత్వం ఆ డబ్బు చెల్లించింది. వైసీపీ హయాంలో మిల్లర్లు, దళారులు విపరీతంగా బాగుపడ్డారు. ఇప్పుడు రైతులకు 48 గంటల్లో డబ్బులు పడుతున్నాయి. జగన్ చెప్పాడని రోడ్డెక్కడం కాకుండా రైతులకు ఏం చేశారో ఆలోచించుకోండి. కర్రు కాల్చి వాతలు పెట్టినా మీ పాపాలకు నిష్కృతి లేదు' అని టీడీపీ నాయకుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి గురువారం విలేకరులతో సమావేశంలో విమర్శించారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బంగ్లాపై ఒత్తిడి!

భారత్, బంగ్లాదేశ్‌లు మాట్లాడుకోవడమే ఓ అద్భుతంగా చెప్పుకోవాల్సిన కాలం వచ్చింది. ఎవరివాదనమీద వాళ్ళు ఉన్నప్పటికీ, పొరుగుదేశంమీద కాస్తంత ఒత్తిడిపెంచడానికి భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పర్యటన ఉపకరించింది. రెండుదేశాలు క్రమంగా ఆరోపణల స్థాయినీ, విమర్శల తీవ్రతనీ పెంచేస్తున్న తరుణంలో మిస్రీ ఒక్కరోజు పర్యటన జరిగింది. ఆగస్టులో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తరువాత, దిగజారిన వాతావరణంలో, భారత్‌నుంచి ఒక ఉన్నతాధికారి ఢాకాలో కాలూనడం ఇదే తొలిసారి. మైనారిటీలను రక్షించాల్సిందే అని మిస్రీ గట్టిగా చెప్పడం వల్లనే 88మతవిద్వేషపూరిత ఘటనలు జరిగాయన్న వాస్తవాన్ని బంగ్లాదేశ్ ఒప్పుకుందని కొందరి నమ్మకం. ఇవి ప్రధానంగా హిందువులమీద జరిగాయనీ, ఈ సంఖ్య మరింతగా హెచ్చుగా ఉంటుందని వేరుగా చెప్పుకోనక్కరలేదు. అంతర్జాతీయ స్థాయిలోనూ ఒత్తిడిపెరుగుతోంది కనుక, రాజ్యభారాన్ని తాత్కాలికంగా మోస్తున్న నోబెల్ విజేత యూనిస్ ఏవో కొన్ని చర్యలు తీసుకుంటున్నట్టు కనిపించవలసిందే. ఉపేక్షించేది లేదని హెచ్చరిస్తున్నామనీ, వరుస అరెస్టులతో ఉన్మాదులను భయపెడుతున్నామనీ ఆ దేశం వివరణ కూడా ఇచ్చుకుంటోంది.

బంగ్లాదేశ్‌కు ఎంతో చేశామని, పుట్టుకనుంచి ఎదుగుదలవరకూ మనమే మోశామని, ఆ కృతజ్ఞత ఏమాత్రం లేకుండా ఆ దేశం వ్యవహరిస్తున్నదని చాలామంది బాధ. హసీనా పాలనలో ఆ దేశం ఆర్థికంగా మరింత ఎదిగింది, మనతో స్నేహం దానికి ఉపకరించినట్టుగానే, సరిహద్దును ప్రశాంతంగా ఉంచడంలో ఆ దేశం మనకు సాయపడ్డది. ఈశాన్య రాష్ట్రాల్లో నిప్పురాజేసే మిలిటెంట్ సంస్థలను, పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలను నిర్మూలించడంలో బంగ్లా సహకారం కాదనలేనిది. హసీనా లేని బంగ్లాదేశ్ మనకు సమస్యాత్మకంగా తయారవుతుందనీ, మతోన్మాదులకూ, పాక్ అనుకూల శక్తులకూ స్థావరంగా మారుతుందనీ ఊహించినదే. హసీనా నిరంకుశత్వం, ఆధిపత్యధోరణులు ఆమె పతనానికి దారితీశాయన్నది ఎంత నిజమో, ఆమెను దింపేసిన ఉద్యమంలో ప్రజాస్వామ్యాన్ని కాంక్షిస్తున్న యువతరంతో పాటు, ఖలేదాజియా పార్టీ, అనుబంధ ఇస్లామిక్ సంస్థలు ఉన్నాయన్నది అంతే నిజం.

మొదట్లో హిందువులమీద జరిగిన దాడులు పూర్తిగా రాజకీయమైనవేనని, అందులో మతం లేదని యూనిస్ ప్రభుత్వం కొట్టిపారేసింది. ఇప్పుడవి మతవిద్వేష దాడులని ఒప్పుకుంటున్నది కానీ, భారత్‌ను బూచిగా చూపిస్తున్నది. గతంలో ఇస్కాన్ సంస్థలో పనిచేసి, ఆ తరువాత వేరుకుంపటి పెట్టుకున్న చిన్మయి కృష్ణదాస్ వ్యవహారశైలి ఉభయదేశాల మధ్యా దూరాన్ని మరింత పెంచింది. ఆయన అరెస్టు, రాజద్రోహం కేసు, ఉద్రిక్తతల సందర్భంలో మనదేశం గట్టిగా ప్రతిస్పందించి అతడిని వెంటనే వదిలేయాలని డిమాండ్ చేయడంతో, చిన్మయిని మోదీ ఏజెంటుగా అభివర్ణించేందుకు పొరుగువారికి అవకాశం చిక్కింది. ఆఖరునిముషం వరకూ అధికారాన్ని కాపాడుకొనేందుకు ఉద్యమకారులను కాల్చిపారేసిన హసీనాకు ఆశ్రయం ఇవ్వడం కూడా భారతవ్యతిరేకత పెంచడానికి ఉపకరించింది. నిలువనీడ పొందిన ఆమె నోరువిప్పకపోయినా సరిపోయేది. కానీ, కొద్దిరోజుల్లోనే ఆమె అక్కడి రాజకీయ పరిణామాలమీద ఇక్కడనుంచి వ్యాఖ్యానించడం మొదలుపెట్టారు. ఆ తరువాత మరింత ఘాటుపెంచి, యూనిస్ ప్రభుత్వం మైనారిటీలను కాపాడలేకపోతున్నదని అంటూ, హిందువులను ఊచకోత కోస్తున్నారన్న అర్థంవచ్చే వ్యాఖ్యలు చేశారు. హసీనాను అప్పగించండి అని బంగ్లాదేశ్ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి మనం సరేననక్కరలేదు. కానీ, అక్కడి పరిస్థితులు మరింత దిగజారడానికీ, మనకు వ్యతిరేకంగా తయారవడానికి దోహదం చేసే వ్యాఖ్యలకు ఆమెను అనుమతించకూడదు. అక్కడి హిందువులపై జరుగుతున్న దాడులను ఇక్కడ తమ మత రాజకీయాలకు వాడుకోవడంలో భాగంగా యూపీ ముఖ్యమంత్రి యోగి వంటివారు బాబర్, సంభాల్, బంగ్లాదేశ్‌లను ముడిపెడుతూ చేసినటువంటి వ్యాఖ్యలు పొరుగుదేశంతో సంబంధాలను మరింత దిగజార్చుతాయి. బంగ్లాదేశ్‌లో ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకోవాలని మమతాబెనర్జీ ఓ అర్థంలేని వ్యాఖ్యచేయగానే, ఇండియాలో హిందువులు, బంగ్లాలో రజాకార్ వ్యతిరేకశక్తులు చేయికలిపితే ఐదునిముషాల్లో యూనిస్ చర్మం ఊడిపోతుందని పశ్చిమబెంగాల్ బీజేపీ నాయకుడు సువేందు అధికారి వ్యాఖ్యానించారు. మోదీ తలుచుకుంటే ఐదునిముషాల్లో బంగ్లాదేశ్ పని పూర్తవుతుందని మరోపెద్దమనిషి అన్నాడు. అక్కడి పరిణామాలు మనల్ని బాధిస్తున్నట్టుగానే, ఇక్కడి మాటలు సరిహద్దు ఆవల కూడా ప్రభావం చూపుతాయని మరిచిపోకూడదు.

దేశ ప్రయోజనాలు పట్టని కులగణన సమర్థన!

‘కులగణనతో దేశానికి హాని ఏమిటి?’ అనే శీర్షికతో భంగ్యా భూక్యా రాసిన వ్యాసం (డిసెంబర్ 5, 2024) అసంబద్ధంగా ఉంది. మాజీ డీజీపీ కె.అరవింద రావు తన వ్యాసంలో (‘ఈ విభజనలతో దేశం ఏమయ్యేట్టు?’–నవంబర్ 23) చెప్పని విషయాలను భూక్యా ప్రస్తావించడం విజ్ఞత అనిపించుకోదు.

రాజకీయ పార్టీల నాయకులు దేశ ప్రజలను కులాలవారీగా, మతాలవారీగా విభజించి, దేశ సమగ్రతకు, సమైక్యతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తిస్తున్నారని అరవిందరావు తన వ్యాసంలో చెప్పారు. ఆ విషయాన్ని అర్థం చేసుకోకుండా, “దళిత, బహుజన, మత మైనార్టీ వర్గాల్లో వస్తున్న చైతన్యం మీద” అరవిందరావు అక్కసు వెళ్ళగక్కుతున్నారంటూ భంగ్యా భూక్యా రాశారు. క్రైస్తవ సమాజంలోను, ఇస్లాం సమాజంలోను రుగ్మతలు ఉన్నట్లే హిందూ సమాజంలో కూడా రుగ్మతలు ఉన్నాయనే విషయాన్ని అందరూ అంగీకరించాల్సిందే! కానీ వ్యక్తి పుట్టుకను బట్టి హీనంగా చూడాలని హిందూ మతానికి సంబంధించిన ఏ గ్రంథమూ చెప్పలేదు. క్రైస్తవ దేశాలలో నల్ల క్రైస్తవులను అంటే నీగ్రోలను హీనంగా చూడడం పరిపాటి. అరబ్ ముస్లింలు అరబ్బేతర ముస్లింల పట్ల వివక్షత చూపడం ఉంది. అహమ్మదీయ, మొహజర్ తెగల ముస్లింలను కడు హీనమైన వృత్తుల్లో పెట్టడం ఇస్లామిక్ సమాజాలలో మనం చూడవచ్చు. అలాగే షియా, సున్నీల ఘర్షణలతో ఇరాన్, ఇరాక్‌లు సంవత్సరాలు తలపడ్డాయి. హిందూ మతాన్ని పనిగట్టుకుని తిట్టేవాళ్ళు ఈ విషయాలను దాచిపెడతారు. నాలుగు వర్ణాలుగా ఉన్న ప్రజలు అనేక కులాలుగా ఏర్పడడానికి కారణాలేమిటో నిష్పాక్షికంగా విశ్లేషించే వ్యక్తులు ఈ దేశంలో కరువయ్యారు. ఈ దేశంలో సామాన్య వ్యక్తులు రాష్ట్రపతులు కాగలరు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి ప్రధాని కాగలడు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇందుకు చక్కటి ఉదాహరణ. పర్షియా నుంచి తరిమి వేయబడిన కొందరు పారశీకులు ఈ దేశ ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారన్న విషయం ఈ దేశం నాది అనే భావన ఉన్న వ్యక్తులకు మాత్రమే అర్థమవుతుంది.

ఇక వైదిక మతంగా పిలవబడుతున్న హిందూ మతం “సహజ ప్రకృతి ధర్మంకు వ్యతిరేకం” అనీ, అందుకే ఆ మతం ఇతర దేశాలకు విస్తరించలేదనీ భంగ్యా భూక్యా చెప్పడం సరికాదు. ‘ఏకం సత్ విప్రా బహుదా వదన్తి’ (భగవంతుడు ఒక్కడే, జ్ఞానులు ఆయనను అనేక రూపాల్లో చెబుతారు) అన్న ఋషి వాక్యాన్ని ఈ దేశంలోని సనాతన భారతీయ సంస్కృతికి చెందిన ప్రజలు అర్థం చేసుకున్నారు కాబట్టే బౌద్ధం, జైనం, శాక్తేయం, ద్వైతం, అద్వైతం, విశిష్టాద్వైతం, శైవం వీరశైవం, వైష్ణవం ఇత్యాది ఆధ్యాత్మిక పరంపరలకు భారత భూమి వేదిక అయింది. ఇక కొండకోనల్లో, గ్రామాల్లో గ్రామ దేవతల గుళ్ళు నిర్మాణం కావడం, గ్రామదేవతలు కొలువు తీరడం భారతీయ ధార్మిక విషయంలో భాగమే. ఇస్లామిక్ దేశాలలో ఇస్లాం మతాన్ని దూషిస్తే కొట్టి చంపుతారు. క్రైస్తవ దేశాలలో కూడా క్రైస్తవాన్ని దూషిస్తే శిక్షలు ఉంటాయి. క్రైస్తవాన్ని విమర్శించిన గెలీలియో, కోపర్నికస్, బ్రూనోలకు పట్టిన గతి ఏమిటో ఎంతమందికి తెలుసు? హిందూ మతస్థులు మెజారిటీగా ఉండే ఈ దేశంలో మాత్రం హిందూ దేవతలను నగ్నంగా గీసి పైశాచిక ఆనందం పొందినా, హిందువుల మత గ్రంథాలను పనిగట్టుకుని దూషించినా ఎవరూ పట్టించుకోరు. ఈ విషయంలో హిందువులను బలహీనులు అనాలా, శాంతి కాముకులు అనుకోవాలా, లేక కుల పిచ్చిగాళ్లు అనాలా?



రాజకీయ పార్టీల నాయకులు దేశ ప్రజలను కులాలవారీగా, మతాలవారీగా విభజించి, దేశ సమగ్రతకు, సమైక్యతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తిస్తున్నారని అరవిందరావు తన వ్యాసంలో చెప్పారు. ఆ విషయాన్ని అర్థం చేసుకోకుండా, ‘దళిత, బహుజన, మత మైనార్టీ వర్గాల్లో వస్తున్న చైతన్యం మీద’ అరవిందరావు అక్కసు వెళ్ళగక్కుతున్నారంటూ భంగ్యా భూక్యా రాశారు.

దేశప్రజలను ముఖ్యంగా హిందువులను కులాల వారీగా విడదీసి, కులాల మధ్య ద్వేషాన్ని నింపింది బ్రిటిష్ పాలకులే అనేది అక్షర సత్యం. ఇదే పరిస్థితి కొనసాగాలని పాలకులు, కుల నాయకులు కోరుకుంటున్నారనే విషయం కులగణన డిమాండ్ ద్వారా స్పష్టమవుతోంది. ఇక భంగ్యా భూక్యా వ్యాసంలో మరో వివాదాస్పదమైన వ్యాఖ్య ఏమంటే– హిందూ ఫాసిజం వల్లనే బెంగాల్ విభజన జరిగిందని, హిందూ నాయకుల మొండి వైఖరి వల్లనే దేశ విభజన జరిగిందని, ఈ విషయంలో ముస్లింలది ఎలాంటి తప్పూ లేదనీ చెప్పడం. ఈ దేశంలోని వామపక్ష వర్గం స్వతంత్రం వచ్చినప్పటి నుంచీ ఈ వాదన చేస్తూనే ఉంది. దేశ విభజన సమయంలో వామపక్షవాదులు ముస్లిం లీగ్‌కు కొమ్ము కాశారనే విషయం ఈ దేశంలోని సామాన్య హిందువులకు తెలియదు. 1946లో రాజ్యాంగ సభకు జరిగిన ఎన్నికల్లో దేశ విభజన అజెండాతో 80 స్థానాలకు పోటీ చేసిన ముస్లిం లీగ్ 73 స్థానాలను గెలుచుకుంది. సమైక్య భారత్ అజెండాతో 1585 స్థానాలకు పోటీచేసిన జాతీయ కాంగ్రెస్ 925 మాత్రమే గెలిచింది. ముస్లిం లీగ్ కోర్కెను ముస్లింలు అంగీకరించారన్న విషయం స్పష్టమైంది. 1946లో ముస్లిం లీగ్ డైరెక్ట్ యాక్షన్‌కు పిలుపునిచ్చి, నరమేధం సృష్టించడంతో కాంగ్రెస్ నాయకులు వణికిపోయి, ముస్లిం నాయకులు అడిగిన రీతిలో తూర్పు, పశ్చిమ పాకిస్థాన్‌లను ఇచ్చారు. నిజం చెప్పాలంటే వారు తన్ని లాక్కున్నారు. ఇది పచ్చి నిజం. అదే రీతిలో కశ్మీర్ లోయలో– అంటే స్వదేశంలో మూడు లక్షల మంది హిందువులను తరిమి వేసిన విషయం ఇంకెంత కాలమో దాచలేరు. ఇస్లామిక్ పరిపాలనలో ఈ దేశంలో నిమ్న వర్గాలే కాకుండా, ఉన్నత వర్గాలు కూడా మనుగడ కోసం మతం మార్చుకున్నాయి. ప్రముఖ రచయిత తారిక్ ఫతే, ‘సారే జహాసే అచ్చా’ గీత రచయిత మహమ్మద్ ఇక్బాల్ మతం మార్చుకున్న బ్రాహ్మణులు అనే విషయం ఇక్కడ గమనార్హం. ప్రభుత్వాలు దేశ ప్రజలందరినీ సమానంగా ఆదరించాలి. ముస్లింలకు మాత్రమే దేశ వనరులపై ప్రథమ హక్కు ఉందని వాదించడం మూర్ఖత్వం.

కుల, మత అస్తిత్వాన్ని ఆధారంగా చేసుకొని మనుగడ సాగించడానికి ప్రయత్నించేవారికి ఈ దేశ విశాల ప్రయోజనాలు పట్టవు. దేశభద్రతకు నష్టంచేసే వారితో చేతులు కలపకుండా వీళ్లు ఉండలేరు!

● ఉల్లి బాలరంగయ్య

తెగలూ పగలూ తెగని మణిపూర్ సమస్య!



మణిపూర్ సంఘర్షణలకు భూములపై ఆధిపత్యం, హక్కులే ప్రధాన కారణాలుగా కనపడతాయి. ఆధునిక ఆర్థిక వ్యవస్థ అందించే ఉపాధి అవకాశాలు అంతగా లభించని కుకీలు, నాగాలకు ఉన్న భూములతో పాటు ఊహల్లో ఉన్న భూములను రక్షించుకోవటం అస్తిత్వ సమస్యగా మారిపోయింది. ఆందోళన చేస్తున్న వాళ్లని బయటి వాళ్లుగా ముద్రవేయటం సులభం. తెగలకు కుదురు తక్కువ. అనువైన భూముల వైపు అడుగులు వేయటమే వారికి వ్యాపకం. మనం ఘనంగా చెప్పుకొనే అహోం రాజ పాలకులూ వెలుపల నుంచే వచ్చారు. మత, తెగ తత్వాలను తెగేదాకా లాగితే ప్రజాస్వామ్యానికే ప్రమాదం!

ఏదో ఒక తత్వంలేని రాజకీయమే లేదు. అది సంకుచితమైతే చాలా ఇబ్బంది. ఇక అది మతం, తెగ చుట్టూ తిరిగేదైతే మరింత ఇబ్బంది. ఆ ఇబ్బంది తెచ్చే అనర్థం ఇంతనీ చెప్పలేం. మణిపూర్ హింసాకాండను ఈ కోణం నుంచి చూస్తేనే అర్థం చేసుకోగలం. మతం, ప్రాంతం, తెగ పునాదిగా రాజకీయాలను నడపటం నిప్పుతో చెలగాటమనటానికి దశాబ్దాలుగా రగులుతున్న అక్కడి వైషమ్యాలే నిదర్శనం.

మతం, ప్రాంతం, తెగ, భాషలనేవి ప్రజల అస్తిత్వాలే. కాదనలేం. ఇవి కొనసాగాలని కోరుకోటాన్ని తప్పుపట్టలేం! అస్తిత్వాల రక్షణ పోరాటాల్లో సందర్భాన్ని బట్టి ఏదో ఒక పక్షం వైపున న్యాయమూ ఉండొచ్చు. దాన్నీ కాదనలేం. ఆ సహేతుకతనూ విస్మరించలేం. కానీ విశాల ఆధునిక దృక్పథాన్ని విస్మరించి అస్తిత్వాలనే పట్టుకుని వేలాడితే రాజకీయాలూ సంకుచితమవుతాయి. అస్తిత్వ అనుకూల వాదనల్లో ద్వేషంపాళ్లు పెరగటమూ అందుకే జరుగుతోంది. ప్రజాస్వామిక ప్రవర్తన పడిపోవటమూ కనిపిస్తోంది.

మణిపూర్‌లో మూడు ప్రధాన జన సమూహాలైన మెయిటీలు, కుకీలు, నాగాలు సంకుచిత అస్తిత్వ రాజకీయాలపై ఆధారపడి సంఘర్షించినప్పుడల్లా హింస పెట్రేగింది. ఏదో ఒక సమూహానికి అపరిమిత అధికారం తోడైతే పరిస్థితి మరింత విషమిస్తుంది. మెయిటీలు మణిపూర్‌లో అధిక సంఖ్యాకులు. జనాభాలో 53 శాతం వారే. వారు అనుసరించేది వైష్ణవ హిందూమతం. సారవంతమైన మైదాన భూములపై వారిదే ఆధిపత్యం. వ్యాపారాలు, పరిశ్రమలు, సేవలు, ఉద్యోగాలు, భవన నిర్మాణం, ప్రసారసాధనాలు... ఇవీ అవీ అని కాదు... ఆధునిక ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అన్ని రంగాల్లోనూ మెయిటీలదే పైచేయి. రాజకీయాల్లో వారికి తిరుగులేదు. రాజకీయ పదవుల్లో కుకీలు, నాగాలు వారి దరిదాపులకు రాలేరు.

దేశంలో ఏదో ఒక రాష్ట్రంలో 50 శాతానికి పైగా ఒకే కులం వారు ఉండి.. ఆర్థికరంగంపై ఆధిపత్యాన్ని నెలకొల్పుకుని, మతపరంగా సంఘటిత శక్తిగా వ్యవహరిస్తూ, నిరంతరం సాంస్కృతికంగా తమని తాము ఉన్నతులుగా భావించుకుంటూ, రాజకీయ బలం చేజారకుండా పావులు కదుపుతుంటే ఎటువంటి పరిస్థితి తలెత్తుతుంది! దాన్ని మనం కలలో కూడా ఊహించలేం! కులవ్యవస్థను ఎంతగా తిట్టుకున్నా ఏ రాష్ట్రంలోనూ, ఏ ప్రాంతంలోనూ ఒక కులానికి 50 శాతం సంఖ్యా బలాన్ని అది కల్పించలేదు. 20శాతం ఓట్లున్న కులాలు ఒకటి రెండుంటేనే గొప్ప! ఒకవేళ ఉన్నా వాటి బలం ఒకచోట గాక అక్కడక్కడా చెల్లాచెదురై ఉంటుంది. ఏ కులానికి సంఖ్యాపరమైన ఆధిపత్యాన్ని ఇవ్వని ఈ వ్యవస్థే మన ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మగా కొందరు పాశ్చాత్య మేధావులు భావించారు. ఏ రకంగా చూసినా ఒక కులానికి 20 శాతం ఆధిపత్యం ఎక్కడా ఉన్నట్లు కనిపించదు. కానీ కుకీలు, నాగాలు మాత్రం మణిపూర్‌లో 50 శాతం పైగా ఆధిపత్యాన్ని చూస్తున్నామని భావిస్తున్నారు. అంతటి ఆధిపత్యం ఉన్న వాళ్లు వినయం ప్రదర్శిస్తూ వివేక దృష్టితో అభివృద్ధి ఫలాలు సమాజంలో ఇతర వర్గాలకు కొంతైనా చేరే ఏర్పాట్లను చేస్తే పరిస్థితి వేరేలా ఉంటుంది. మణిపూర్‌లో అది జరుగుతోందని చెప్పలేం.

బలమైన వర్గాలు ఆధిపత్య ప్రదర్శనలు చేసినా చేయకపోయినా... మితిమీరిన అసమానతలు వైషమ్య భావనలను పెంచుతాయి. చట్టబద్ధ పద్ధతుల్లోనే పైకి వచ్చామన్న భావన పైవర్గాలకు ఉండొచ్చు. పోటీ ప్రపంచంలో ప్రతిభతో నెగ్గామనే సిద్ధాంత ఊతమూ ఉండొచ్చు. అసమానతలు ఎంత పురాతనమైనవో వాటిని ప్రశ్నించే చరిత్రా అంతే పురాతనమైంది. తెగల అస్తిత్వంతో మమేకమయ్యే భావన బలంగా ఉన్నచోట తేలికగా సంఘటితమయ్యే అనుకూలతా ఉంటుంది. అట్లా ఉన్నచోట సంపదలో సముచిత వాటాలను ఆయుధబలంతో పొందాలన్న ప్రయత్నాలూ ఎక్కువగా ఉంటాయి. మణిపూర్‌లో నిరంతరం కాకపోయినా చాలా సందర్భాల్లో జరుగుతున్న చరిత్ర అదే!

మణిపూర్ మారణహోమాలను తరచి చూస్తే కనిపించేది ఈ దృశ్యమే. మెయిటీలు అక్కడి జనాభాలో 53 శాతం ఉన్నా వారు ప్రధానంగా ఉండేది ఇంఫాల్ (6 జిల్లాలు) లోయలోనే. దీని విస్తీర్ణం 10 శాతం మాత్రమే. మిగతా 90 శాతం (10 జిల్లాలు) కొండ ప్రాంతాలే. కుకీలు(16శాతం), నాగాల (20 శాతం) నివాసం అక్కడే. ముస్లింలు 8.4 ఉంటారు. కుకీలు, నాగాలు ప్రధాన తెగలైనా వీటిల్లో చేరే అన్ని తెగలను లెక్కిస్తే మొత్తం 33కు పైనే ఉంటాయి. ఇక పోరాట మార్గం పట్టిన మిలిటెంట్ గ్రూపులు 30కు పైగా ఉన్నాయి. అంటే సగటున ఒక లక్షకు ఒక మిలిటెంట్ గ్రూప్ ఉన్నట్లు! మొత్తం జనాభానే 32 లక్షలకు కాస్త అటుఇటుగా ఉంటుంది. ప్రతి మిలిటెంటు గ్రూపూ ఏదో ఒక ప్రధాన తెగ, ఉపతెగ అస్తిత్వాల రక్షణకు పోరాడేవిగా ప్రకటించుకున్నాయి. మెయిటీ, కుకీ, నాగాలుగా వర్గీకరించి ప్రజలను పిలవటం ఇప్పుడు సాధారణమైనా ఒకప్పుడు పలు తెగలను విడివిడిగానే పిలిచేవారు. బ్రిటిషు పాలకులు తమ పాలనా సౌలభ్యం కోసం సన్నిహితంగా ఉన్న తెగలను కలిపేసి పెద్ద సమూహాలుగా వర్గీకరించారు. నాగాలు, కుకీల జాబితాలో చాలా తెగలను అలాగే కలిపేశారు. వైష్ణవాన్ని అనుసరించే తెగలను మెయిటీలుగా వర్గీకరించారు. ఏకీకరణ బాగా జరిగి మెయిటీల్లో ఐక్యత బాలా బలపడింది.



■ రాహుల్ కుమార్

కులాలను కృత్రిమంగా వర్గీకరించి వందల ఏళ్ల నుంచి అవి స్థిరంగా ఉన్నట్లుగా ఎలా నమ్మేటట్లు చేయగలిగారో ఈశాన్య భారత తెగల విషయంలోనూ అలాగే చేశారు. జనాభా లెక్కలతో కులాలకు కొత్త బలాన్ని బ్రిటిషు పాలకులు కలగచేశారన్న వాదనా ఉంది. ఎన్నికల రాజకీయాలు కులాల అస్తిత్వాలను ఇంకా గట్టిపరచాయి. మిలిటెంట్ గ్రూపుల్లో కుకీ, నాగాలతో పాటు మెయిటీలు కూడా ఉన్నారు. ఒక దశలో కుకీల్లో 22 మిలిటెంట్ గ్రూపులు ఉంటే మెయిటీల్లో 10, నాగాల్లో 2 ఉండేవి. ఈ మిలిటెంట్ గ్రూప్‌ల్లో ఇప్పటికీ కొన్ని కొనసాగుతున్నాయి. కమ్యూనిస్టు భావజాలంతో ప్రేరణ పొందినవి కూడా వీటిల్లో ఉన్నాయి. లెనిన్ ప్రతిపాదించిన జాతుల స్వయంనిర్ణయాధికార సిద్ధాంతం అందుకు కారణం.

మణిపూర్ తెగల సంఘర్షణకు చాలా చరిత్ర ఉంది. దాని వెనుక భూముల కోసం ఆరాటాలూ ఉన్నాయి. ప్రాంతాలపై ఆధిపత్యాల కోసం పెనుగులాటలూ ఉన్నాయి. ఉద్యోగాల్లో విద్యా సీట్లల్లో వాటాలు కాపాడుకోవాలన్న వ్యూహాలూ ఉన్నాయి. కిందటి ఏడాది మే నెల నుంచి మెయిటీలు–కుకీల మధ్య మొదలైన హింసకు రిజర్వేషన్ల వ్యవహారంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశమే ప్రధాన కారణమైంది. మెయిటీలు తమను ఎస్టీల్లో చేర్చాలని 40 ఏళ్ల నుంచి డిమాండు చేస్తున్నారు. ఆ మేరకు కేంద్రానికి సిఫార్సుచేస్తూ నివేదికను పంపాలని రాష్ట్రాన్ని ఆదేశించాలని మెయిటీలు పిటీషను వేశారు. హైకోర్టు ఆ మేరకు ఆదేశాలు ఇవ్వటంతో కుకీలు, నాగాలు భగ్గుమన్నారు. కొండ ప్రాంతాల్లో గిరిజనేతరులు భూములు కొనటంపై నిషేధం ఉంది. 10 శాతం భూభాగంలో 50 శాతానికి పైగా జనాభా సర్దుకోవటం కష్టమనే వాదనను మెయిటీలు ఎప్పటి నుంచో చేస్తున్నారు. ఒకప్పుడు తామూ ఎస్టీలుగానే ఉన్నామనీ దాన్ని పునరుద్ధరణను మాత్రమే కోరుతున్నామని మెయిటీలు చేస్తున్న వాదనను అంగీకరిస్తే మణిపూర్ సామాజిక స్వరూపమే మారిపోతుంది. మెయిటీలకు కొండ ప్రాంతాల్లో భూములను కొనుగోలు చేసే అవకాశం లభిస్తుంది. ఇక మెయిటీలను 1995లోనే ఓబీసీలుగా గుర్తించారు. రెండు ఉపతెగలను కూడా 1956లోనే ఎస్సీల జాబితాలో చేర్చారు.

హైకోర్టు తీర్పు వ్యతిరేక ఆందోళనల్లో హింస తలెత్తటానికి కుకీల్లో, నాగాల్లో ఎప్పటి నుంచో మెయిటీలకు వ్యతిరేకంగా గూడు కట్టుకున్న ఆగ్రహమే ప్రధాన కారణం. తమ ప్రాబల్యం ఉన్న ప్రాంతాలతో ప్రత్యేక రాష్ట్రం చేయాలన్న డిమాండును కుకీలు ఎప్పటి నుంచో చేస్తూనే ఉన్నారు. కనీసం ప్రత్యేక పాలనా ప్రాంతాన్నైనా ఏర్పాటుచేసి స్వయంప్రతిపత్తి ఇవ్వాలనే డిమాండుతోనూ ఆందోళనలు చేశారు. బీరెన్‌సింగ్ ముఖ్యమంత్రి (2017) అయిన నాటి నుంచి నల్లమందు తయారీలో ఉపయోగించే గసగసాల సాగుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున చేపట్టిన చర్యలు కూడా వివాదమయ్యాయి. కుకీలతో సోదర సంబంధం ఉన్న మయన్మార్ తెగలు రాష్ట్రంలో చొరబడుతున్నాయని బీరెన్‌సింగ్ ఆరోపించారు. అడవుల్లో సర్వేలు నిర్వహించి ఆక్రమణదారుల్ని భూముల నుంచి తొలగించారు. అన్ని అక్రమ కార్యకలాపాల్లో కుకీల పాత్రే ఎక్కువనే రీతిలో పలుచోట్ల చేసిన వ్యాఖ్యలు మరింత అగ్గిని పుట్టించాయి. బీరెన్ ప్రతి మాటా చేతా తమకు వ్యతిరేకంగా ఉన్నట్లుగా కుకీలు భావించారు. అడవుల్లో కొత్త ప్రాంతాలకు విస్తరించటం తమ సంప్రదాయ హక్కనీ దీనికి గండికొడుతున్నారన్న కోపం కూడా కుకీల్లో నెలకొంది. తెగల పురాతన గాథలు ఆధారంగా ప్రస్తుతం తాము మెజారిటీగా లేని ప్రాంతాలు సైతం కుకీలు తమకే చెందుతాయని వాదిస్తున్నారు. కుకీలకు నాగాలకు ఒకప్పుడు గొడవ ఇక్కడే మొదలైంది. అందుకే కుకీల ప్రతిపాదనలను నాగాలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇక నాగాలు కుకీ ప్రాంతాలను కూడా కలుపుకొని దక్షిణ నాగాలాండ్ ఏర్పాటు కోసం ఆందోళనలు మొదలుపెట్టారు. రెండు తెగల మధ్య 1990ల్లో మొదలైన హింసకు వందల మందీ చనిపోయారు. వందల గ్రామాలు విధ్వంసమూ అయ్యాయి. వేల ఇళ్లు దగ్ధమూ అయ్యాయి. స్త్రీలపై లెక్కలేనన్ని అత్యాచారాలూ జరిగాయి. నాగాలు కూడా పలు ప్రాంతాలు తమవేనని చెప్పటానికి సంప్రదాయ గాథలపైనే ఆధారపడతారు. కుకీలు, నాగాల ప్రతిపాదన ఏదైనా మెయిటీలు ససేమిరా అంటారు.

> కులవ్యవస్థను ఎంతగా తిట్టుకున్నా ఏ రాష్ట్రంలోనూ, ఏ ప్రాంతంలోనూ ఒక కులానికి 50 శాతం సంఖ్యా బలాన్ని అది కల్పించలేదు. 20 శాతం ఓట్లున్న కులాలు ఒకటి రెండుంటేనే గొప్ప! ఒకవేళ ఉన్నా వాటి బలం ఒకచోట గాక అక్కడక్కడా చెల్లాచెదురై ఉంటుంది. ఏ కులానికి సంఖ్యాపరమైన ఆధిపత్యాన్ని ఇవ్వని ఈ వ్యవస్థే మన ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మగా కొందరు పాశ్చాత్య మేధావులు భావించారు.

మొత్తం మీద మణిపూర్ సంఘర్షణలకు భూములపై ఆధిపత్యం, హక్కులే ప్రధాన కారణాలుగా కనపడతాయి. ఆధునిక ఆర్థిక వ్యవస్థ అందించే ఉపాధి అవకాశాలు అంతగా లభించని కుకీలు, నాగాలకు ఉన్న భూములతో పాటు ఊహల్లో ఉన్న భూములను రక్షించుకోవటం అస్తిత్వ సమస్యగా మారిపోయింది. అందుకే ఈశాన్య భారత సంఘర్షణల్లో 50 శాతం మణిపూర్‌లోనే జరిగాయన్న లెక్కలను పూర్తిగా కొట్టేయలేం. ఆందోళన చేస్తున్న వాళ్లని బయటి వాళ్లుగా ముద్రవేయటం సులభం. తెగలకు కుదురు తక్కువ. అనువైన భూముల వైపు అడుగులు వేయటమే వారికి వ్యాపకం. మనం ఘనంగా చెప్పుకొనే అహోం రాజ పాలకులూ వెలుపల నుంచే వచ్చారు. మత, తెగ తత్వాలను తెగేదాకా లాగితే ప్రజాస్వామ్యానికే ప్రమాదం! అధిక సంఖ్యాక మతతత్వమూ దాన్ని రక్షించలేదు. మణిపూర్ నేర్పే పాఠమదే!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

ఇదేనా రాజ్యాంగ నిబద్ధత?

భారత రాజ్యాంగం నవంబర్ 26, 1949లో రాజ్యాంగ సభలో ఆమోదించబడి 26 జనవరి 1950 నుండి అమల్లోకి వచ్చింది. రాజ్యాంగ రూపకల్పన పూర్వాపరాలు అప్పటి నేపథ్యం సమీక్ష చేసుకోవడంలో అలసత్వంగా సాగుతున్నది. డాక్టర్ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన రాజ్యాంగ సభ ఏర్పాటైనప్పటికీ, డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్‌గా డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ చొరవ, పరిశీలనతో వాస్తవ సామాజిక ఆర్థిక స్థితిగతులు దృష్టిలో పెట్టుకొని విశాల భారతదేశానికి తలమానికం లాంటి రాజ్యాంగం రూపొందించబడింది. ప్రధానంగా ప్రవేశ పీఠికలో పేర్కొన్న రాజ్యాంగానికి దిశ నిర్దేశించే అంశాలు ఇప్పటికీ ఎప్పటికీ శాశ్వతంగా ఉండేవే, అలాగే 121–అధికరణపై ఎలాంటి రాజీ ఉండదు. నేటి మోదీ ప్రభుత్వం ప్రజలపైన కపట ప్రేమ చూపిస్తూ హిందుత్వ ఎజెండాను అమలు చేయడానికి ఉవ్విళ్లూరుతున్నారు. అందుకే అసలు సమస్య విభిన్న కులాలు, మతాలు భాషలు భావాలు ప్రాంతాలు ఉన్న దేశంలో భిన్నత్వంలో ఏకత్వం అనేది శాశ్వత పరిష్కారం. కానీ మోదీ ప్రభుత్వం మొసలి కన్నీరు కారుస్తూ రాజ్యాంగ మార్పునకు తిరగదోడ ప్రయత్నిస్తున్నది. ఉమ్మడి పౌరస్మృతి, జమ్మూ కశ్మీర్ 370 ఆర్టికల్ రద్దు లాంటి అంశాలు సజీవంగా చర్చనీయాంశంగా ఉంటాయి. ఈ మధ్య జరిగిన కశ్మీర్ ఎన్నికలలో గెలిచిన ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలలో 370 ఆర్టికల్ పునరుద్ధరించాలంటు నొక్కి వొక్కాణించింది. పౌర హక్కులకు విఘాతం కలిగిస్తూ రాజద్రోహం కేసులు, కుట్ర కేసులు లాంటివి పెడుతూ ప్రశ్నించే గొంతుకలను నొక్కడం లక్ష్యంగా మోదీ ప్రభుత్వం పావులు కదుపుతుంది.



కేంద్ర ప్రభుత్వ పాత్ర, బాధ్యతలను రాజ్యాంగం నిర్ధారించింది. ఫెడరల్ వ్యవస్థగా రూపొందించబడింది. అందుకే సర్కారియా కమిషన్ కేంద్ర రాష్ట్ర సంబంధాలపై చక్కటి రిపోర్టును అందించింది. దానిని అమలు చేయడానికి అంగీకరించడం లేదు. ప్రజాస్వామ్యంలో ప్రజల చేత ప్రజల ద్వారా ప్రజల కొరకు ఏర్పడేది ప్రజా ప్రభుత్వం. దానికి భిన్నంగా ఎన్నికల కమిషన్ పైన కూడా పెత్తనం లేదా జోక్యం చేసుకోవడానికి ప్రయత్నించడం అంటే ప్రజాస్వామ్య మూల సూత్రాలను పాతరేయడమే. ఎన్నికల కమిషన్ నియామకంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని పక్కన పెట్టడం అంటే ప్రజాస్వామ్యం ఎంత వరకు అమలవుతుందో విదితమవుతుంది. సుప్రీం కోర్టులో ఎన్నికల కమిషన్ నియామకం అంశం ప్రస్తావనకు రావడం ప్రధాన న్యాయమూర్తి ఆ పదవి నుండి వైదొలిగారు. కేంద్ర ప్రభుత్వ దుర్బుద్ధికి నిదర్శనం.

పార్టీ ఫిరాయింపుల చట్టం ఉన్నప్పటికీ ఎందుకు ఫిరాయింపులు కొనసాగుతున్నాయి అంటే నాగుపాముకు కోరలు లేకపోతే ఎవరూ భయపడరు. ఫిరాయింపుల చట్టం కోరలు స్వార్థ బుద్ధితో తీసివేయబడినాయి. అందుకే ఎవరికి భయం లేదు. పాలనాదక్షత గురించి మాట్లాడే మోదీ ఎందుకు ఫిరాయింపుల చట్టంలోని లొసుగులను తొలగించడం లేదు? ఏ పార్టీ గుర్తుతో గెలిస్తే ఆ పార్టీలోనే కొనసాగాలి, లేదా ఆ పదవికి రాజీనామా చేయాలి. అలా జరగకపోవడంతో ప్రజలలో రాజకీయ పార్టీల నాయకుల పట్ల చులకన భావం నెలకొంటున్నది. ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా భారత్ ఎదగాలని కలలు కనడం మంచిదే కానీ ప్రపంచ దేశాలలో అదానీ మూలంగా దేశ పరువు ప్రతిష్ట దెబ్బతింటున్నదన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. అదాని, అంబానీ, నీరవ్ మోదీ, లలిత్ మోదీ ఆర్థిక మోసాలు అంతా ఇంతా కాదు. బ్యాంకులలో అప్పులు ఎగవేత, సహజ వనరులను కొల్లగొట్టడం లాంటి అనేక అవినీతి కుంభకోణాలకు కారణమైన వారిపైన చర్యలు ఉండవా?

ప్రధాని ఏ దేశం పర్యటించిన దాదాపు అన్ని దేశాల్లో అదాని పెట్టుబడులు పెడుతున్నారు. ఆస్ట్రేలియాలో బొగ్గు గనుల ఏర్పాటుకు మన ఎస్‌బీఐ నుండి అదానికి రుణాలు ఇప్పించారు. అలాగే శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాల్లో పవర్ ప్రాజెక్టులు, పోర్టులు ఆ సంస్థ దక్కించుకుంది. ఇదంతా కూడా ప్రభుత్వ పెద్దల ఆశీస్సులు లేనిదే సాధ్యం కాదని ఎవరికైనా అర్థమవుతుంది. ఏది ఏమైనా ప్రపంచానికి తలమాణికం లాంటి రాజ్యాంగ అమలులో కేంద్ర ప్రభుత్వం వివక్ష కనబరుస్తూ, స్వపక్షం, ప్రతిపక్షం అనే భేదాలకు తావిస్తుంది. నిష్పాక్షిక నిబద్ధతతో కూడిన పాలనను ప్రజలు కోరుకుంటున్నారు. కులమత ప్రాంత లింగ విభేదాలకు తావులేని పారదర్శకతతో కూడిన ప్రజాస్వామ్య పరిరక్షణకై ప్రతి పౌరుడు దీక్షబూనాలి. రాజ్యాంగ విలువలను కాపాడుకోవడానికి మేధావులు, బుద్ధిజీవులు, యువకులు, విద్యార్థులు పూనుకోవాలి. దేశ సార్వభౌమత్వాన్ని నిలబెట్టుకోవడానికి ప్రతిజ్ఞ తీసుకోవాలి.

○ చాడ వెంకటరెడ్డి
సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు

బీమా స్ఫూర్తిని కూలదోసే చట్ట సవరణలు!

ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్ – ఎఫ్‌డిఐ) 74శాతం నుంచి 100 శాతానికి పెంచనున్న ప్రతిపాదనలపై డిసెంబర్ 10లోపు ప్రజల నుంచి అభిప్రాయాలు కోరుతూ ఆర్థికశాఖ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (డిఎఫ్ఎస్) ఓ ప్రకటన చేసింది. ఆర్థిక అంశాల మీద ప్రజలు ఆన్‌లైన్ ద్వారా తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచే అవకాశాలు ఈ దేశంలో చాలా తక్కువ. నిజంగా అలాంటి అభిప్రాయాలు స్వీకరించాలనుకుంటే ఇన్సూరెన్స్ రంగానికి సంబంధించిన ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు, ఏజెంట్లు, ఏజెంట్ల సంఘాలు, పాలసీదారులు, ఇతరత్రా మేధావుల నుంచి సేకరిస్తే ప్రయోజనం ఉండేది.

ప్రజాభిప్రాయ సేకరణకు ప్రాధాన్యతనిచ్చే ప్రభుత్వాలే అయితే 1998లోనే దేశవ్యాప్తంగా ఒక కోటీ 65 లక్షల సంతకాలు సేకరించి ఇన్సూరెన్స్ రంగంలో ప్రైవేట్ కంపెనీలకు అవకాశం ఇవ్వొద్దని అప్పటి లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి గారికి సమర్పించడం జరిగింది. ఇంకా అనేక సందర్భాలలోనూ సదరు ఎఫ్‌డీఐలు ఏ విధంగా సేవల రంగంలో ప్రధాన భూమిక పోషిస్తున్న ఇన్సూరెన్స్ రంగానికి నష్టం కలిగిస్తాయో కూడా ప్రభుత్వాలకు విడమర్చి చెప్పడం జరిగింది. ఇన్సూరెన్స్ రంగంలో ఎఫ్‌డీఐ పెంపుదలపై ఏర్పాటు చేసిన స్టాండింగ్ కమిటీ ముందు కూడా ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కామ్రేడ్ అమానుల్లా ఖాన్, కామ్రేడ్ కె.వేణుగోపాల్ తమ వాదనలు వినిపించి ఒప్పించారు కూడా. కానీ ఇలాంటి ఏ సందర్భంలోనూ ప్రజాభిప్రాయానికి గానీ సంఘాల అభిప్రాయాలకు గానీ విలువ ఇవ్వకుండా ఇప్పటి కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఇన్సూరెన్స్ రంగంలోకి ఎఫ్‌డీఐలను క్రమం తప్పకుండా పెంచుతూనే ఉంది.

1990 తర్వాత నూతన ఆర్థిక విధానాలలో భాగంగా ఇన్సూరెన్స్ రంగంలోనికి ప్రైవేట్ వ్యక్తులు ప్రవేశించే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. 1995 వరకు ఆర్థిక శాఖ ఆధ్వర్యంలో నడిచే ఇన్సూరెన్స్ రంగాన్ని రెగ్యులేట్ చేయడం కోసం ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అథారిటీ (ఐఆర్ఏ) అనే ప్రతిపాదనను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చింది. పార్లమెంట్‌లో ఈ బిల్లును పాస్ చేయించడం కోసం నాటి ఆర్థిక మంత్రులు ఐకే గుజ్రాల్, పి.చిదంబరం వేరు వేరు సందర్భాల్లో ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. 1999లో అధికారంలోకి వచ్చిన వాజ్‌పేయి ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం ఈ ఐఆర్ఏ అనే పదాన్ని ఐఆర్‌డీఏ (ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ)గా నామకరణం చేస్తూ పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ సాయంతో బిల్లును ఆమోదింపజేసుకున్నది. ఈ బిల్లు పాస్ అయినప్పుడు ఇన్సూరెన్స్ రంగంలోకి ప్రైవేట్ కంపెనీలు రావచ్చు అయితే 26 శాతం మాత్రమే ఎఫ్‌డీఐలు ఉండాలన్న నిబంధన ఉంచారు. ఆశించిన మేర ప్రైవేట్ కంపెనీలు నమోదు కాకపోవడంతో ఎఫ్‌డీఐని మరింత పెంచాలని తద్వారా ఫారిన్ కంపెనీస్ వస్తాయని చాలా ప్రయత్నాలు చేశారు. కానీ యూపీఏ–1 ప్రభుత్వానికి ప్రభుత్వ రంగాలకు పెద్దపీట వేసే వామపక్ష పార్టీల మద్దతుతో ఉండడంతో అది సాధ్యపడలేదు. మళ్ళీ కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత 2015లో ఎఫ్‌డీఐ 26 నుండి 49 శాతానికి పెంచారు. అయినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదనే నెపంతో 2021లో దీనిని 74 శాతానికి కూడా పెంచారు. ఆ తర్వాత కూడా ఈ 25 ఏళ్ల కాలంలో అన్ని ప్రైవేట్ కంపెనీలు కలిపి 25 సంఖ్యను కూడా చేరుకోలేకపోయాయి. అంచేత ఇప్పుడు ఇన్సూరెన్స్ రంగంలో వందశాతం ఎఫ్‌డీఐలను పెంచడం ద్వారా పుట్టగొడుగుల్లా ప్రైవేట్ కంపెనీలు వెలసి ఇన్సూరెన్స్ రంగాన్ని అభివృద్ధిపరచగలవని కేంద్ర ప్రభుత్వం గాలిలో మేడలు కడుతున్నది. అనగా ఇకపై దేశీయ భాగస్వామ్యం కలిగిన కంపెనీలేవీ ఇన్సూరెన్స్ రంగంలో ఉండకుండా విదేశీ కంపెనీలు తమ దుకాణాలను ఇక్కడ తెరవవచ్చు.



ఇప్పుడు ప్రతిపాదిస్తున్న ఇన్సూరెన్స్ చట్టాల సవరణ బిల్లులో అనేక ప్రమాదకర ప్రస్తావనలు ఉన్నాయి. లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రారంభించాలంటే వంద కోట్ల కనీస మూలధనం అవసరం. ఇప్పుడు దాన్ని తగ్గించాలన్న ప్రతిపాదన ఇందులో ఉన్నది. ఎల్ఐసీ ఆఫ్ ఇండియా పూర్తి ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్నది కాబట్టి వంద కోట్ల మూలధనం అవసరం లేదని మొర పెట్టుకున్నా వినకుండా ఎల్ఐసీ ఆఫ్ ఇండియా నుంచి వంద కోట్ల మూలధనాన్ని ఏర్పాటు చేయించారు. ఇప్పుడు ఇదే నిబంధనను విదేశీ కంపెనీలను సంతృప్తిపరచడం కోసం తొలగిస్తున్నారు. ఇన్సూరెన్స్ కంపెనీలు సింగిల్ రిజిస్ట్రేషన్‌తో లైఫ్, జనరల్, హెల్త్ ఇన్సూరెన్స్ వ్యాపారం చేసుకోవచ్చు. ఈ కాంపోజిట్ లైసెన్స్‌తో అడ్వర్స్ (నష్టదాయకమైనది) సెలక్షన్ జరగవచ్చనే ఆలోచనకు చరమగీతం పాడుతున్నారు. ఇన్సూరెన్స్ ఏజెంట్లు కూడా మూడు లైఫ్ ఇన్సూరెన్స్, మూడు జనరల్ ఇన్సూరెన్స్, మూడు హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఒకే లైసెన్స్‌తో పనిచేయవచ్చని మరో ప్రతిపాదన చేశారు. దీంతో ఏజెంట్ల వ్యవస్థ అస్తిత్వం ప్రమాదంలో పడనున్నది. ఇన్సూరెన్స్ సంస్థలు తమ ప్రధాన విధి అయినటువంటి బీమా కల్పనతో పాటు ఇతర ఇండెమినిటీ వ్యాపారాలు, ఆస్తిపాస్తుల అమ్మకాలు కొనుగోళ్లు వంటి ఇతర వ్యాపారాలు కూడా చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. దీనిద్వారా ప్రధాన ధ్యేయం పక్కదారి పడుతోంది. బీమా ‘సుగమ్’ పేరున ‘ఇన్సూరెన్స్ సొల్యూషన్స్ ఫ్రమ్ వన్ ప్లేస్’ అనే ప్రతిపాదన ద్వారా ఇన్సూరెన్స్ మూలసూత్రాలు, విలువలు ప్రమాదంలో పడనున్నాయి. ఇలాంటి సరళీకరించబడిన విధానాలు ప్రైవేట్ కంపెనీలకు లాభాల కోసం ఎంతకైనా ఒడిగట్టే అవకాశాన్ని ఇస్తాయి. దీర్ఘకాలిక కాంట్రాక్టులకు ఆలవాలమైన ఇన్సూరెన్స్ రంగంలో ఇలాంటి సరళీకరణ విధానాలు ప్రమాదకరంగా పరిణమిస్తాయి. ఇలాంటి కీలక అంశంపై ప్రజల నుండి మొక్కుబడి అభిప్రాయాన్ని సేకరణలు కాకుండా ఇన్సూరెన్స్ రంగంలోని సంఘాలతో చర్చిస్తే మంచిది.

■ గూళ్ల తిరుపతయ్య





నగరంలో నేడు ట్రాఫిక్ ఆంక్షలు

ఇందిరాగాంధీ స్టేడియంలో స్వర్ణాంధ్ర విజన్-2047

- ఉదయం 5 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అమల్లోకి ఆంక్షలు.. పోలీసుల పటిష్ఠ బందోబస్తు
- వివిధ వాహనాల దారి మళ్లింపు
- సీఎం చంద్రబాబు సహా వీవీఐపీల హాజరు
- పార్కింగ్ కోసం 24 ప్రాంతాల గుర్తింపు

6

ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాటుచేసిన సభావేదిక (ఇన్‌సెట్‌లో) ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, నివాస్, మంత్రి సత్యకుమార్



● పోటాపోటీ

మారిస్ స్టెల్లా కళాశాలలో గురువారం కృష్ణా యూనివర్శిటీ బాస్కెట్‌బాల్ పోటీలు ఉత్కంఠభరితంగా జరిగాయి.

8లో

గుట్టుగా గోడౌన్లు

నగరంలో రేషన్ మాఫియా గోడౌన్లు అనేకం

గోనె సంచుల నుంచి పాలిథిన్ బ్యాగుల్లోకి బియ్యం మార్పు

ఆ తర్వాత వివిధ ప్రాంతాలకు అక్రమంగా రవాణా

సివిల్ సప్లయిస్, నిఘా సంస్థలకు తెలిసినా దాడుల్లేవ్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ నగరం, శివారు ప్రాంతాల్లోని రేషన్ మాఫియా అక్రమంగా గోడౌన్లు నిర్వహిస్తున్నా అధికారులు కన్నెత్తి చూడట్లేదు. సివిల్ సప్లయిస్, పర్యవేక్షణ సంస్థలు మాఫియా గోడౌన్లను గాలికొదిలేశాయి. లంచాల మత్తులో జోగుతున్న నిఘా సంస్థలు పట్టించుకోవడమే మానేశాయి. దీంతో పేదల బియ్యం బస్తాలను ఈ గోడౌన్లలోనే రీ సైక్లింగ్ చేస్తున్నారు. నేరుగా గోనె సంచులతో సీళ్లతో వచ్చే బస్తాలను ఈ గోడౌన్లలోనే ఉంచి పాలిథిన్ బ్యాగుల్లోకి మారుస్తున్నారు. ఆ తర్వాత వాటిని వాహనాల్లో కొంతమేర మిల్లులకు, మిగిలింది కాకినాడ, ముంబయి పోర్టులకు తరలిస్తున్నారు.

ఎక్కడెక్కడ..?

పాయకాపురంలోని శాంతినగర్‌లో రేషన్ మాఫియా అక్రమ గోడౌన్ ఉంది. ఈ గోడౌన్ గురించి సివిల్ సప్లయిస్, నిఘా సంస్థలకు కూడా సమాచారం తెలుసు. కానీ, ఒక్కసారి కూడా ఇటువైపు కన్నెత్తి చూడట్లేదు. దేవినగర్‌లో కూడా గోడౌన్లు ఉన్నాయి. ఇక్కడి ఎనిమిదో లైన్‌లో నిర్వహించే గోడౌన్ గురించి నిఘా సంస్థలకు కూడా తెలుసు. కానీ, ఆ గోడౌన్‌పై ఒక్క రోజు కూడా రైడ్ చేయలేదు. జక్కంపూడి కాలనీలోని ఓ ఫ్లాట్‌లో రేషన్ మాఫియా గోడౌన్ నిర్వహిస్తోంది. ఎవరికీ అనుమానం రాదన్న ఉద్దేశంతో ఈ కాలనీలో గుట్టుచప్పుడు కాకుండా వ్యవహారం నడుపుతున్నారు. విచిత్రమేమిటంటే.. ఇక్కడ నివాసం ఉంటున్న వేలమంది ప్రజలకు కూడా తెలియకుండా ఈ గోడౌన్‌ను నిర్వహిస్తున్నారు. రాత్రి ఒంటిగంట నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు మాత్రమే ఇది పనిచేస్తుంది. ఆటోనగర్ కేంద్రంగా కూడా రేషన్ మాఫియా రెండు గోడౌన్లను నిర్వహిస్తోంది. వీటికి సంబంధించి నిఘా వర్గాల వద్ద కూడా సమాచారం ఉంది. కానీ, అటువైపు కన్నెత్తి చూడలేదు. పటమట పోలీసులు ఈ ప్రాంత పరిధిలో రెండుసార్లు శివప్రసాద్ అనే అక్రమంగా బియ్యం వ్యాపారం చేసే వ్యక్తిని పట్టుకున్నారు. ఇలాంటప్పుడైనా సివిల్ సప్లయిస్ అధికారులు.. సదరు వ్యాపారి గోడౌన్ ఎక్కడ నిర్వహిస్తున్నాడు? ఎవరి దగ్గర బియ్యం సేకరిస్తున్నాడు? వంటి వివరాలు కూపీ లాగితే వివరాలు తెలిసే అవకాశం ఉండేది. సివిల్ సప్లయిస్ కానీ, నిఘా సంస్థలు కానీ ఆ పనిచేయలేదు. కబేళా ప్రాంతంలో కూడా రేషన్ మాఫియా గోడౌన్ నిర్వహిస్తోంది. ఈ గోడౌన్‌పై స్థానికుల నుంచి సివిల్ సప్లయిస్ అధికారులకు ఫిర్యాదులు కూడా వచ్చాయి. వారు నిఘా సంస్థలకు సమాచారం ఇచ్చి ఊరుకున్నారు. నిఘా సంస్థలు పట్టించుకోలేదు. నగరానికి అత్యంత సమీపంలో ఉండే గోసాల ప్రాంతంలో కూడా రేషన్ మాఫియా గోడౌన్‌ను నిర్వహిస్తోంది. పెద్ద ఎత్తున అక్రమ బియ్యాన్ని నిల్వ చేస్తున్నారు. వేలాది క్వింటాళ్ల బియ్యం బస్తాలను ఇక్కడ నిల్వ చేసి సంచులు మార్చి గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. జాయింట్ కలెక్టర్ నిధి మీనా ఈ అక్రమ గోడౌన్లపై దాడులు చేయిస్తే వేలాది క్వింటాళ్ల పేదల బియ్యం బయటపడే అవకాశముంది.

గౌతంరెడ్డి ఎక్కడ?



హత్యాయత్నం కేసులో వైసీపీ నేత పూనూరు గౌతంరెడ్డి మరోమారు అజ్ఞాతంలోకి వెళ్లారు. ఇప్పటికే ఒకసారి పోలీసులను తప్పించుకు తిరిగిన ఆయన బెయిల్ పిటిషన్ పేరుతో బయటకు వచ్చారు. తాజాగా కోర్టు ఆయన బెయిల్ పిటిషన్‌ను రద్దు చేయడంతో మరోమారు పోలీసుల కళ్లుగప్పి పారిపోయిన గౌతంరెడ్డి కోసం వేట మొదలైంది.

మరోసారి వైసీపీ నేత గౌతంరెడ్డి జంప్

- ఇప్పటికే ఒకసారి పోలీసులకు చిక్కకుండా అజ్ఞాతం
- బెయిల్ పిటిషన్ పేరుతో బయటకు వచ్చి హడావిడి
- తాజాగా కోర్టు పిటిషన్‌ను రద్దు చేయడంతో షాక్
- తీర్పు రాకముందే పోలీసుల కళ్లుగప్పి పలాయనం
- ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టిన ఖాకీలు
- రంగంలోకి నాలుగు ప్రత్యేక బృందాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సత్యనారాయణపురంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గండూరి ఉమామహేశ్వరశాస్త్రిపై సుపారీ గ్యాంగ్‌తో హత్యాయత్నం చేయించిన వైసీపీ నేత పూనూరు గౌతంరెడ్డి మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఈ కేసులో బెయిల్ కోసం తీవ్రంగా ప్రయత్నించిన ఆయన ఆశలకు న్యాయస్థానం బ్రేక్ వేసింది. తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని గౌతంరెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌ను కోర్టు రెండు రోజుల క్రితం డిస్మిస్ చేసింది. దీంతో పోలీసులు అరెస్టు చేస్తారని భావించిన గౌతంరెడ్డి రాత్రికి రాత్రి నగరం నుంచి పారిపోయాడు. గతనెల 6వ తేదీన ఉమామహేశ్వరశాస్త్రిపై సుపారీ గ్యాంగ్ హత్యాయత్నం చేసింది. ఈ కేసులో ఇప్పటి వరకు ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు. తొమ్మిది మంది నిందితుల్లో మరో ఇద్దరు పోలీసులకు చిక్కాల్సి ఉంది. వారిలో గౌతంరెడ్డి ఒకరు కాగా, ఆయన అనుచరుడు పురుషోత్తం రెండో నిందితుడు. ఇందులో సనత్‌నగర్‌కు చెందిన పురుషోత్తం లా చదువుతున్నాడు. అతడికి పరీక్షలు ఉండటంతో హైకోర్టు మినహాయింపు ఇచ్చింది. ప్రస్తుతం ఎల్ఎల్ఎం పరీక్షలు రాస్తున్నాడు. దీంతో హైకోర్టు ఈనెల 16 వరకు అరెస్టు నుంచి మినహాయింపు ఇచ్చింది. పురుషోత్తం నగరంలోనే ఉన్నాడు. గౌతంరెడ్డి మాత్రం కోర్టులో బెయిల్ పిటిషన్ డిస్మిస్ కాగానే, ఇంటి నుంచి పరారయ్యాడు. పిటిషన్ కోర్టు విచారణలో ఉండగా, సత్యనారాయణపురం పోలీసుల ముందు హాజరయ్యాడు. పోలీసులు పలు విధాలుగా ప్రశ్నించినా మౌనవ్రతం చేసి తప్పించుకున్నాడు. హైకోర్టు తనకు కచ్చితంగా ముందస్తు బెయిల్ మంజూరు చేస్తుందన్న ధీమాతో పోలీసు విచారణకు హాజరయ్యాడు. తర్వాత సీన్ రివర్స్ కావడంతో నగరం విడిచి పారిపోయాడు. ఘటన జరిగాక పోలీసులు కేసు నమోదు చేయగానే, హైదరాబాద్‌కు పారిపోయాడు. ఇప్పుడూ అక్కడికే వెళ్లిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

మిగతా 6లో..

నాలుగు బృందాల గాలింపు

గౌతంరెడ్డిని అరెస్టు చేయడానికి పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు నాలుగు ప్రత్యేక బృందాలను నియమించారు. ఇందులో రెండు టాస్క్‌ఫోర్స్ నుంచి, మరో రెండు లా అండ్ ఆర్డర్ నుంచి పనిచేస్తున్నాయి. ప్రస్తుతం గౌతంరెడ్డి సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. వేర్వేరు నెంబర్లతో అనుచరులు, న్యాయవాదులతో సంప్రదింపులు చేస్తున్నట్టు తెలిసింది. ఎక్కువగా వాట్సాప్ కాల్స్‌లో మాట్లాడుతున్నట్టు సమాచారం. హైదరాబాద్ నుంచి కడపకు కానీ, బెంగళూరుకు కానీ వెళ్లి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గౌతంరెడ్డి చేతులకు సంకెళ్లు వేస్తామని పోలీసులు చెబుతున్నారు. టాస్క్‌ఫోర్స్, లా అండ్ ఆర్డర్ బృందాలు మామూలుగా గాలింపు చర్యలు చేపడుతుండగా, కొన్ని బృందాలు సాంకేతికంగా విశ్లేషణలు చేస్తున్నాయి. గౌతంరెడ్డి తన సామాజికవర్గం అధికంగా ఉండే జిల్లాల్లో తలదాచుకునే అవకాశాలు ఉన్నాయన్న అనుమానం వ్యక్తమవుతోంది.

అమరావతిలో 'ఫైవ్'స్టార్ హోటళ్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాజధాని అమరావతిలో స్టార్ హోటళ్ల ఏర్పాటుకు పోటీ ఏర్పడింది. ఇక్కడ త్వరలో ఐదు స్టార్ హోటళ్లు నిర్మించనున్నారు. వీటి ఏర్పాటుకు ఆయా సంస్థల యాజమాన్యాల నుంచి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయి. నూతన పర్యాటక పాలసీ తీసుకొస్తున్న నేపథ్యంలో ఈ హోటళ్ల ఏర్పాటు ఆసక్తిగా మారింది. ప్రస్తుతం భూ ప్రతిపాదనల దశలో ఉన్నాయి. ఐఆర్‌సీటీసీ, అట్మాస్పియర్ కేర్, ఒబెరాయ్ గ్రూప్, తాజ్ గ్రూపునకు చెందిన ఐహెచ్‌సీఎల్, రహేజా గ్రూపులు ఉన్నాయి. ఐఆర్‌సీటీసీ 3 ఎకరాలు, అట్మాస్పియర్ కేర్‌కు 10 ఎకరాలు, ఐహెచ్‌సీఎల్‌కు 10 ఎకరాలు, ఒబెరాయ్ గ్రూపునకు 10 ఎకరాలు, రహేజా గ్రూపునకు 5 ఎకరాల చొప్పున కావాల్సి ఉంది. రహేజా గ్రూప్.. విజయవాడలో కూడా కృష్ణానది ఒడ్డున స్టార్ హోటల్ ఏర్పాటుకు ఆసక్తి చూపిస్తోంది. ఇందుకు ఐదెకరాలు కావాల్సి ఉంది. వాంటేజ్ గ్రూప్ మచిలీపట్నంలోని మంగినపడి బీచ్ దగ్గర స్టార్ హోటల్ ఏర్పాటుకు ఆసక్తి చూపిస్తోంది. దీనికి 10 ఎకరాలు కావాల్సి ఉంది. ఆయా సంస్థలతో తుది అగ్రిమెంట్లు చేసుకునే క్రమంలో భూములను స్వాధీనం చేసే అవకాశం ఉంది.

రేపు దుర్గగుడికి ఆర్ఎస్ఎస్ చీఫ్



వన్‌టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ మధుకర్‌రావు భగవత్ ఈ నెల 14 ఉదయం 7 గంటలకు ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకోనున్నారు. భగవత్ రాక సందర్భంగా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. కాగా, భగవత్ గురువారం నగరంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా మదింపు

జనవరి 1 నాటికి ఎస్ఎస్ఆర్-2025

6న తుది ఓటర్ల జాబితాల ప్రచురణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్-2025) మదింపు ప్రక్రియను జనవరి 1న నిర్వహించేందుకు ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. 2024 సంవత్సరానికి ఓటర్ల తుది జాబితా స్వచ్ఛీకరణ చేసేందుకు వీలుగా ఎన్నికల సంఘం ఎస్ఎస్ఆర్-2025కు శ్రీకారం చుట్టింది. జనవరి 6న ఓటర్ల జాబితాల తుది ప్రచురణ చేపట్టనున్న నేపథ్యంలో అప్పటికే మదింపు ప్రక్రియను పూర్తిచేయనున్నారు.

పరిశీలన పూర్తి

ఎస్ఎస్ఆర్-2025లో భాగంగా సార్వత్రిక ఎన్నికలకు ముందే ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించారు. అభ్యంతరాలను స్వీకరించారు. బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాల ప్రకారం స్థానికంగా ఉంటున్నారా? వలస వెళ్లారా? వంటి వివరాలను సేకరించారు. బోగస్, చనిపోయిన వారి ఓట్లు ఉంటే తొలగించారు. ఒక నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గం మారితే అలాంటి ఓటర్లను కూడా ఆయా నియోజకవర్గాల పరిధిలోకి తీసుకొచ్చారు. డోర్ నెంబర్లు లేకుండా నమోదైన ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో వారి ఇళ్ల వద్దకే వెళ్లి పరిశీలించారు. ఎన్నికల తర్వాత దశలో అక్టోబరు నుంచి నవంబరు మాసాల్లో డ్రాఫ్ట్ ఎన్నికల జాబితాలపై వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించారు. డిసెంబరు 24 నాటికి అన్ని రకాల క్లెయింలను, అభ్యంతరాలను పరిశీలించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. జనవరి 1న సమగ్ర ఓటర్ల జాబితాలకు సంబంధించిన డేటాబేస్‌ను ఎన్నికల సంఘం పరిశీలించే ఒదుకు అందజేస్తారు. ఎన్నికల సంఘం పరిశీలన అనంతరం జనవరి 6న ఓటర్ల జాబితాల తుది ముద్రణ చేపడతారు.



జిల్లాలో 17,04,611 మంది ఓటర్లు

జిల్లాలో 2024, అక్టోబరు 29 నాటికి ప్రచురించిన తుది ఓటర్ల జాబితా ప్రకారం మొత్తం 17,04,611 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 8,30,717 మంది కాగా, మహిళలు 8,73,744 మంది. థర్డ్ జెండర్ ఓటర్లు 150 మంది, 85 ఏళ్ల పైబడిన ఓటర్లు 11,185, సర్వీసు ఓటర్లు 381 మంది ఉన్నారు. ఓటర్ల లింగ నిష్పత్తిని బట్టి చూస్తే ప్రతి వెయ్యిమంది పురుష ఓటర్లకు 1,052 మంది మహిళా ఓటర్లు ఉండటం గమనార్హం. జనాభా పరంగా ప్రతి వెయ్యిమందిలో 703 మంది ఓటర్లుగా ఉన్నారు. జిల్లాలో 24,25,098 మంది జనాభా ఉన్నారు. వీరిలో పురుషులు 12,37,671 మంది కాగా, మహిళలు 12,37,671 మంది. స్పెషల్ సమ్మరీ రివిజన్-2025 ప్రకారం జిల్లాలో 1,792 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి.





పిడికిలి బిగించి..

ఏపీ గిరిజన సంక్షేమ గురుకులాల అవుట్‌సోర్సింగ్ టీచర్స్, లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చౌక్‌లో గురువారం ధర్నా చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు.

8లో

విద్యుత్ టవర్ల మార్పిడిపై ఆందోళన

- జక్కంపూడి, నున్నలో ప్లాట్ల యజమానులు, రైతుల నిరసన.. నినాదాలు
- మద్దతు పలికిన వైసీపీ, బీజేపీ నేతలు



రైతులతో మాట్లాడుతున్న బీజేపీ నేత అడ్డూరి శ్రీరామ్

విజయవాడ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మూతపడిన ల్యాంకో పవర్ ప్లాంట్ హైటెన్షన్ ట్రాన్స్‌మిషన్ టవర్ల మార్పిడి పేరుతో రైతులు, ప్రజల ఆస్తులను ఛిన్నాభిన్నం చేస్తున్నారని రాజకీయ పక్షాలు ఆందోళనకు దిగాయి. జక్కంపూడి ప్రాంతంలో భూములు కలిగిన రైతులు, ప్లాట్ల యజమానులతో కలిసి వైసీపీ, బీజేపీ నేతలు గురువారం నిరసన చేపట్టాయి. మూతపడిన ల్యాంకో కంపెనీ ప్రయోజనాల కోసం కాంట్రాక్టు సంస్థ మేఘా, జాతీయ రహదారుల సంస్థ ఆరాటపడటం వెనుక పెద్ద కుంభకోణమే కనిపిస్తోందని ఆరోపించాయి. రైతులకు అన్ని విధాలా అండగా ఉంటామని, ఈ వ్యవహారాన్ని తేల్చే వరకు వారి వెంటే ఉంటామని చెప్పారు. అంతకుముందు రైతుల భూముల్లో మేఘా కంపెనీ తవ్వకాలు జరుపుతున్న ప్రాంతాలను రాజకీయ నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా వైసీపీ నేత పోతిన మహేశ్ మాట్లాడుతూ రైతులకు సమాచారం ఇవ్వకుండా, వారి అభిప్రాయాలను తెలుసుకోకుండా ఏ విధంగా వారి భూముల్లో తవ్వకాలు జరుపుతారని ప్రశ్నించారు. తక్షణం ఎన్‌హెచ్ అధికారులు, రైతులు, రెవెన్యూ, మేఘా కంపెనీ యాజమాన్యంతో కలెక్టర్ కమిటీని వేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ రైతుల అనుమతి లేకుండా, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తవ్వకాలు జరపడం అన్యాయమన్నారు. అలాగే, హైటెన్షన్ విద్యుత్ వైర్ల కోసం జక్కంపూడితో పాటు నున్న పంచాయితీ పరిధిలోనూ మేఘా సంస్థ తవ్వకాలు జరపడంపై అప్రూవ్డ్ వెంచర్‌లోని ప్లాట్ల యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం రైతులతో పాటు ఆందోళన చేశారు.

స్వర్ణాంధ్ర-2047కి సర్వ సన్నద్ధం



- విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణకు పకడ్బందీ ఏర్పాట్లు
- ఐఏఎస్ అధికారుల నేతృత్వంలో ప్రత్యేక బృందాల పర్యవేక్షణ



ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సీట్ల ఏర్పాట్లు

కృష్ణలంక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఐశ్వర్యం, ఆరోగ్యం, ఆనంద (వెల్తీ, హెల్తీ, హ్యాపీ) శోభిత ఆంధ్రప్రదేశ్ సాకారం లక్ష్యంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమం ఈనెల 13వ తేదీ శుక్రవారం ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో వైభవంగా జరగనుంది. ఇందుకోసం ఐఏఎస్ అధికారుల సారథ్యంలో ప్రత్యేక బృందాలు పకడ్బందీ ఏర్పాట్లు చేశాయి. 26 జిల్లాల నుంచి అతిథులు కార్యక్రమా



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ బాబు.ఎ

నికి హాజరుకానున్నారు. విద్య, మహిళా సాధికారత, టెక్నాలజీ, ఆరోగ్యం, వ్యవసాయం, స్వచ్ఛందసేవ.. ఇలా వివిధ విభాగాల్లో విశేష సేవలందిస్తున్న వారు ప్రత్యేక ఆహ్వానితులుగా కార్యక్రమంలో పాల్గొంటారు.

500 బస్సులు, ప్రత్యేక పార్కింగ్‌లు

500 బస్సుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు రానున్నారు. దాదాపు 30వేల మంది కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేశారు. వివిధ జిల్లాల అధికారులతో సమన్వయానికి ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. 500 బస్సులతో పాటు కార్లకు అవసరమైన 24 పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటుచేశారు. బస్సుల కోసం ప్రత్యేకంగా ఏడు పార్కింగ్ ప్లేస్‌లను సిద్ధం చేశారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగింది.

పాసుల వారీగా గ్యాలరీలు

స్టేడియంలో వీవీఐపీ, వీఐపీ, పబ్లిక్ తదితర గ్యాలరీలకు ఇన్‌చార్జిలను నియమించి పాసులను కేటాయించారు. ప్రతి గ్యాలరీకి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు బృందాలను ఏర్పాటు చేశారు. పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్, ఎల్ఈడీ భారీ తెరలను ఏర్పాటు చేశారు. విజన్ డాక్యుమెంట్‌ను ప్రతిబింబించేలా 10 ఇతివృత్తాలతో ప్రదర్శనలు కార్యక్రమంలో భాగం కానున్నాయి. విజన్ డాక్యుమెంట్ ప్రజంటేషన్, స్టాళ్లు, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీటి సరఫరా, అల్పాహారం, పారిశుద్ధ్యం, రవాణా, వైద్య శిబిరాలు తదితర ఏర్పాట్లను గురువారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ బాబు.ఎ, ముఖ్యమంత్రి కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, సెర్ప్ సీఈవో జి.వీరపాండ్యన్, అదనపు కార్యదర్శి (ఫైనాన్స్) జె.నివాస్, శాప్ వీసీ అండ్ ఎండీ గిరీశ పీఎస్, ఐఅండ్‌పీఆర్ డైరెక్టర్ హిమాన్షు శుక్లా తదితర రాష్ట్రస్థాయి అధికారులతో పాటు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ నిధి మీనా పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తదితరులు చర్చించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు జరగకుండా కార్యక్రమాన్ని విజయవంతంగా చేయడానికి సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.

స్టేడియంలో ఏర్పాట్ల పరిశీలన

లబ్బీపేట : స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమ ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం స్టేడియంలో కార్యక్రమ ఏర్పాట్లను ఆయన



స్టేడియంలో ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరపాలక సంస్థ ఏర్పాటు చేస్తున్న తాగునీటి సరఫరాలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, తాత్కాలిక మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానెట్ జీవీజీఎస్వీ ప్రసాద్, ఇంచార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ సురేష్ బాబు, సూపరిండెంటింగ్ ఇంజనీర్(వర్క్స్) పి.సత్యనారాయణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ రామకోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

విజయవాడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర విజన్-2047 సందర్భంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు తెలిపారు. ఉదయం 5 నుంచి నుంచి సాయంత్రం 4గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయి.

- హైదరాబాద్-విశాఖపట్నం-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, మైలవరం, నూజివీడు, హనుమాన్ జంక్షన్ మార్గంలో వెళ్లాలి.
- విశాఖపట్నం-చెన్నై-విశాఖపట్నం వైపు రాకపోకలు సాగించే వాహనాలను హనుమాన్ జంక్షన్ బైపాస్, గుడివాడ, పామర్రు, అవని గడ్డ, రేపల్లె, బాపట్ల, చీరాల, త్రోవగుంట, ఒంగోలు మీదుగా మళ్లిస్తారు.
- గుంటూరు-విశాఖపట్నం-గుంటూరు వైపు రాకపోకలు సాగించే వాహనాలు బుండపాడు, తెనాలి, కొల్లూరు, వెల్లటూరు జంక్షన్, పెనుమూడి బ్రిడ్జి, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి.
- చెన్నై-హైదరాబాద్-చెన్నై వైపు వాహనరాలు మేదరమెట్ల, అద్దంకి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్లగొండ, నార్కెట్‌పల్లి మీదు వెళ్లాలి.
- విశాఖపట్నం వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు రామవరప్పాడు రింగ్, గుణదల, బీఆర్టీఎస్ రోడ్డు, ఏలూరు లాకులు, పాత ప్రభుత్వాసుపత్రి, పీసీఆర్ జంక్షన్ మీదుగా పీఎన్‌బీఎస్‌కు వెళ్లాలి.
- మచిలీపట్నం నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు ఆటోనగర్ గేటు, బెంజ్‌సర్కిల్, మహానాడు జంక్షన్, రామవరప్పాడు, ఏలూరు రోడ్డు, గుణదల, చుట్టుగుంట, దీప్తి జంక్షన్, అప్సర జంక్షన్, పీసీఆర్ మీదుగా పీఎన్‌బీఎస్‌కు వెళ్లాలి.
- పీఎన్‌బీఎస్ నుంచి విశాఖ వైపు వెళ్లే బస్సులు పీసీఆర్ జంక్షన్, ఆర్టీసీ వై జంక్షన్, చల్లపల్లి బంగ్లా, హనుమాన్‌పేట, ఏలూరు లాకులు, బీఆర్టీఎస్ రోడ్డు, గుణదల, రామవరప్పాడు నుంచి వెళ్లాలి.
- పీఎన్‌బీఎస్ నుంచి మచిలీపట్నం వైపు వెళ్లే బస్సులు పీసీఆర్, ఆర్టీసీ వై జంక్షన్, చల్లపల్లి బంగ్లా, విజయ టాకీస్, దీప్తి జంక్షన్, గుట్టుగుం ట, మాచవరం, పడవలరేవు జంక్షన్, గుణదల, రామవరప్పాడు రిం గ్, ఎనికేపాడు జంక్షన్, తాడిగడప 100 అడుగులు రోడ్డు మీదుగా వెళ్లాలి.
- బెంజ్‌సర్కిల్ నుంచి ఎంజీ రోడ్డులో వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సులు మహానాడు, రామవరప్పాడు రింగ్, ఏలూరు రోడ్డు, గుణదల, చుట్టుగుంట, దీప్తి జంక్షన్, అప్సర జంక్షన్, పీసీఆర్ జంక్షన్ నుంచి వెళ్లాలి.
- ఎంజీ రోడ్డులో ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆటోలు, ఆర్టీసీ బస్సులను అనుమతించరు.
- బెంజ్‌సర్కిల్ నుంచి సీపీఆర్ మధ్యలో స్వర్ణాంధ్ర విజన్ కార్యక్రమానికి వచ్చే వాహనాలను తప్ప ఇతర వాహనాలను అనుమతించరు.
- సీతారామపురం జంక్షన్ నుంచి ఆర్టీఏ జంక్షన్ వరకు ఈట్‌స్ట్రీట్ వైపు స్వర్ణాంధ్ర విజన్‌కు వచ్చే వాహనాలను మాత్రమే అనుమతిస్తారు.
- శిఖామణి సెంటర్ నుంచి చుట్టుగుంట వరకు ఎలాంటి వాహనాలను అనుమతించరు.

వాహనాల పార్కింగ్ ఇలా..

స్వర్ణాంధ్ర విజన్-2047 కార్యక్రమానికి వచ్చే వీవీఐపీ, వీఐపీ, ప్రముఖులు, అధికారులు, మీడియా తదితర వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం 24 ప్రదేశాలను ఎంపిక చేశారు.

* మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌ల వాహనాలను స్టేడియం వెనుక వైపు గేట్ నంబరు2, 4 వద్ద నిలుపుకోవాలి.
* ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌ల వాహనాలు బిషప్ అజరయ్య స్కూల్ ప్రాంగణంలో నిలుపుకోవాలి.
* వివిధ జిల్లాల నుంచి వచ్చే ప్రముఖ వ్యక్తుల వాహనాలను వజ్ర గ్రౌండ్, సిద్ధార్థ మహిళా కళాశాల, సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్స్‌లో పార్కింగ్ చేసుకోవాలి.
* మీడియాకు సంబంధించిన వాహనాలను అంబేడ్కర్ విగ్రహం వెనుక వైపు ఉన్న గ్రౌండ్‌లో నిలుపుదల చేయాలి.
* వివిధ జిల్లాల నుంచి వచ్చే అధికారుల వాహనాలను సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్స్, సబ్‌కలెక్టర్ కార్యాలయం, కలెక్టర్ కార్యాలయం, స్టేట్‌గెస్ట్‌హౌస్ ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో నిలుపుదల చేయాలి
* అగ్రికల్చర్, టూరిజం, కల్చర్, ఎన్జీవో, హెల్త్‌కేర్, ఎస్‌హెచ్‌జీ, వెల్ఫేర్ విభాగాల నుంచి వచ్చే వాహనాలను బీఆర్టీఎస్ రోడ్డులో నిలుపుకోవాలి.
* హెల్త్‌కేర్, వీఐపీ ఇండస్ట్రీ, ఎంఎస్ఎంఈ, ఐటీ విభాగాల నుంచి వచ్చే వాహనాలను ఎంజీ రోడ్డులోని డీసీపీ బంగ్లా ఎదురుగా ఉన్న పార్థసారథి ప్రాంగణంలో నిలుపుదల చేయాలి.
* విద్యారంగానికి సంబంధించి వాహనాలను ఆర్‌అండ్‌బీ ఆఫీసు ప్రాంగణంలో నిలుపుదల చేయాలి.
* ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల నుంచి వచ్చే ప్రజలు, కార్యకర్తల వాహనాలు విశాలాంధ్ర రోడ్డులో ఉన్న శాతవాహన కళాశాల గ్రౌండ్స్‌లో పార్కింగ్ చేయాలి.
* కృష్ణాజిల్లా నుంచి వచ్చే వాహనాలను సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రాంగణం, ఎన్టీఆర్ జిల్లా నుంచి వచ్చే వాహనాలను ఆంధ్రా లయోల కళాశాల ప్రాంగణం 1లో నిలుపుదల చేయాలి.
* రాయలసీమ, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి వచ్చే వాహనాలను ఆంధ్రా లయోలా కళాశాల గ్రౌండ్-2లో పార్కింగ్ చేయాలి.
* పాసులు ఉన్న వారు, పారిశ్రామికవేత్తలు, ఎంఎల్ఎస్ విభాగాలకు చెందిన వాహనాలు స్టేడియం లోపల పార్కింగ్ చేయాలి.
* పోలీసుశాఖ వాహనాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రాంగణంలో పార్కింగ్ చేయాలి.
* ప్రజలు, కార్యకర్తల వాహనాలను సీఎస్ఐ చర్చి, లయోలా కాలేజీ దేవయ్య ఆడిటోరిం, సిద్ధార్థ ఆడిటోరియం వద్ద నిలుపుదల చేయాలి.

ఆలపాటికి అఖండ విజయం చేకూర్చాలి

- ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్

గొల్లపూడి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థిగా పోటీలో ఉన్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ (రాజా) కోసం కూటమి కుటుంబసభ్యులంతా యుద్ధంలో సైనికుల్లా పనిచేసి ఆయన్ని అఖండ మెజార్టీతో గెలిపించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పిలుపునిచ్చారు. గొల్లపూడిలోని దత్త కల్యాణ మండపంలో గురువారం రాత్రి ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ చిత్ర పటానికి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ (రాజా), ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబుతో కలిసి వసంత పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మైలవరం నియోజకవర్గం నుంచి రికార్డు స్థాయిలో 16 వేల మంది గ్రాడ్యుయేట్లు ఓట్లను నమోదు చేసుకున్నారన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోనే ఓట్ల చేరికలో మైలవరం నియోజకవర్గం ప్రథమ స్థానంలో



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత, వేదికపై ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఎమ్మెల్సీ అశోక్‌బాబు

కృష్ణా-గుంటూరు జిల్లాలో ద్వితీయ స్థానంలో ఉందన్నారు. కూటమి సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లోను సత్తా చాటాలన్నారు. టీడీపీ సభ్యత్వాల నమోదులోను 53వేలతో మైలవరం నియోజకవర్గం ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఇందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. ఆలపాటికి అఖండ మెజార్టీ ఇచ్చి చంద్రబాబు నాయకత్వాన్ని మరింత బలపర్చాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ పరుచూరు అశోక్‌బాబు మాట్లాడుతూ, కూటమి నేతలంతా ఎలాంటి బేధాభిప్రాయం లేకుండా ఉండటం అభినందనీయమన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి రాజాను అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈప్రాంతానికి తీరని అన్యాయం చేశాడన్నారు. ఓట్ల నమోదులో తన నియోజకవర్గంను ప్రథమ స్థానంలో నిలిపిన వసంతకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో ప్రజలు ఏ రకంగా నష్టపోయారో కళ్లారా చూశామన్నారు. రాష్ట్రంలో ఐదు కోట్లమంది ప్రజలు వైసీపీ పాలనతో అసహనం చెందారన్నారు. స్వాతంత్ర్యం రాక ముందు బ్రిటీష్ వాళ్ల పాలన ఎలా ఉందో దాన్ని కళ్లకు కట్టినట్టు జగన్ చూపించాడు కనుకే ప్రజలు ఆయనను 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. ఈసమావేశంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

అమరావతి రైతుల ప్లాట్లకు ఈ-లాటరీ

తుళ్లూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి రైతుల రిటర్నబుల్ ప్లాట్లకు విజయవాడ సీఆర్డీఏ కార్యాలయంలో గురువారం ఈ- లాటరీ నిర్వహించారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు రాజధానిలో తొమ్మిది రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని సీఆర్డీఏ అదనపు ల్యాండ్స్ డైరెక్టర్ బీ ఎల్ రాజకుమారి తెలిపారు. లాటరీలో ప్లాట్లు పొంది ప్రొవిజనల్ సర్టిఫికెట్లు



రైతులకు ప్లాటు పత్రాలు అందజేస్తున్న అదనపు ల్యాండ్స్ డైరెక్టర్ రాజకుమారి

అందుకున్న రైతులు వారం రోజులలోపు సంబంధిత రిజిస్ట్రేషన్ కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ క్రతువు పూర్తి చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా ఈ-లాటరీ నిర్వహించారు. మొత్తం 14 గ్రామాలకు చెందిన 261 మంది రైతులకు రెసిడెన్షిల్-130, కమర్షియల్-113 ప్లాట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ ఆఫీసు మేనేజర్ వల్లభనేని శ్రీనివాసరావు, ఎస్టేట్ జాయింట్ డైరెక్టర్ వి.డేవిడ్ రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తులు ..

మచిలీపట్నంటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వైద్యఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు సమర్పించాలని డీఎంహెచ్‌వో జి.గీతాబాయి కోరారు. జనరల్ ఫిజీషియన్ 1, 5 స్టాఫ్ నర్స్ 1 ఆడియాలజిస్టు, 2 మేనేజర్ పోస్టులకు దరఖాస్తులను ఈనెల 17లోగా సమర్పించాలన్నారు.



హద్దు మీరుతున్నారు!

- తెలంగాణకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాల సీజ్

జగ్గయ్యపేట రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చిల్లకల్లు వద్ద జాతీయ రహదారిపై తెలంగాణాకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆరు లారీలను గురువారం ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ అదుపులోకి తీసుకుని వేల్డా కేసు నమోదు చేశారు. చందర్లపాడు మండలం కాసరబాద ఇసుక ర్యాంపులో లోడ్ చేసుకుని వస్తున్నట్టు డ్రైవర్‌లు తెలిపినట్టు చెప్పారు. వాహనాల వద్ద ఇసుకకు సంబంధించిన ఎటువంటి పత్రాలు లేవన్నారు. తెలంగాణాకు చెందిన నాతి అశోక్, దొంతగాని నగేష్, కర్నాటి సత్యనారాయణ, కర్నాటి శేఖర్, బైరు బాలకిషన్, గండు ఆంజనేయులు డ్రైవర్‌లపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు!

ఇసుక రీచ్‌ల్లో తెలంగాణా రిజిస్ట్రేషన్ వాహనాలకు ఇసుక లోడ్ చేయవద్దని జిల్లా అధికారులకు ఆదేశాలున్నా క్షేత్రస్థాయిలో నిబంధనలను తుంగలో తొక్కి ఏ వాహనానికైనా ఇసుక లోడ్ చేస్తున్నారనటానికి పట్టుబడుతున్న తెలంగాణా వాహనాలే నిదర్శనం. అంతే కాకుండా ఆయా రీచ్‌ల్లో ఎస్కవేటర్‌లను కూడా వినియోగించి ఇసుక లోడ్ చేస్తున్నా ఏ శాఖ అధికారి స్పందించకపోవటంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేసి ఓవర్ లోడ్ చేస్తుండటం గమనార్హం.

పట్టించుకోని రవాణా శాఖాధికారులు

నిబంధనల ప్రకారం ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనాలతో పాటు వాహనాల రిజిస్ట్రేషన్, నంబర్ ప్లేట్‌లు, నంబర్ ప్లేట్‌ల అమరిక, పర్మిట్‌లపై దృష్టి సారించి దాడులు చేయాల్సిన రవాణాశాఖ అధికారులు ఇసుక అక్రమార్కులు ఇచ్చే ముడుపులతో ఆ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే ఆరోపణలు సర్వత్రా వినబడుతున్నాయి. పట్టుబడిన వాహనాలలో ఒకదానికి వినహా ఏ వాహనానికి కూడా నంబర్ ప్లేట్‌లు లేవు. ఒందు భాగంలో ఉన్నవి కూడా అరకొరగా కనిపించేలా ఏర్పాటు చేసుకున్నారు. వాహనాలకు ఏపీ రోడ్డులోకి పర్మిట్ కూడా లేదని సమాచారం.

నడకుదురు రేవులో..

చల్లపల్లి : ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను చల్లపల్లి పోలీసులు అడ్డుకుని కేసులు నమోదు చేశారు. నడకుదురు రేవులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు గురువారం తెల్లవారుజామున ఎస్ఐ సుబ్రహ్మణ్యం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. అప్పటికే రేవులో రెండు ట్రాక్టర్లు లోడుతో ఉండగా, మిగిలిన ట్రాక్టర్లలో ఇసుకను లోడు చేస్తున్నారు. ఇసుక లోడుతో ఉన్న రెండు ట్రాక్టర్లు, ఐదు ఖాళీ ట్రాక్టర్లను ఎస్ఐ సీజ్‌చేసి చల్లపల్లి స్టేషన్‌కు తరలించారు. నిందితులపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.



గౌతంరెడ్డి ఎక్కడ..?

(5వ పేజీ తరువాయి)

గౌతంరెడ్డి విషయాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. పోలీసులపై ఆరోపణలు చేస్తూ అతడు బెయిల్ పిటిషన్ దాఖలు చేశాడు. మరోపక్క పోలీసులపైకి న్యాయవాదులను ఉసిగొల్పే ప్రయత్నాలు చేశాడు. గౌతంరెడ్డి పాత నేరచరిత్రను పైకి తీసిన పోలీసులు అతడికి సంకెళ్లు వేయడానికి సిద్ధమయ్యారు. ఇప్పటి వరకు హైకోర్టు ఆదేశాలతో ముందుకు అడుగులు వేయకుండా ఉన్న పోలీసులు బుధవారం నుంచి దూకుడు పెంచారు. రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్లలో తీవ్రంగా నిఘా పెట్టారు. మరోపక్క సత్యనారాయణపురంలోని ఇంటి చుట్టూ వేగులను ఏర్పాటు చేశారు. అయినా గౌతంరెడ్డి తప్పించుకున్నాడు. తీర్పు రావడానికి ముందే అతడు ఇక్కడి నుంచి పారిపోయి ఉంటాడని అనుమానిస్తున్నారు.



విద్యుదీపాలంకరణలో డోకిపర్రు భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం

నేటినుంచి సాలికట్ల బ్రహ్మోత్సవాలు

గుడ్లవల్లేరు, డిసెంబరు, 12 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి డోకిపర్రు శ్రీ భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ సాలికట్ల బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 13వ తేదీ శుక్రవారం నుంచి 16వ తేదీ సోమవారం వరకు వేడుకలు నిర్వహించనున్నారు. తొలిరోజు శుక్రవారం అంకురార్పణ, తిరుచ్చి(పల్లకీ) సేవలు, శనివారం ధ్వజారోహణ, సూర్యప్రభ వాహనం, శేషవాహనం, హంస వాహన సేవలు, ఆదివారం గజ వాహనోత్సవం, రథోత్సవం, గరుడోత్సవాలు, సోమవారం చూర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, శ్రీ శ్రీనివాస కళ్యాణం, ధ్వజ అవరోహణ, చంద్రప్రభ వాహనోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్తలు పి.వి.కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు తెలిపారు.



నాట్య స్థూపానికి స్వాగతం పలుకుతున్న కళాకారులు

కూచిపూడి పతాక స్వర్ణోత్సవాలకు శ్రీకారం

కూచిపూడి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి 29 వరకు మూడు రోజులపాటు నిర్వహించే నాట్యోత్సవాలకు సంబంధించిన కార్యక్రమాలు చురుగ్గా ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా కూచిపూడి సాంప్రదాయాలను ప్రతిబింబించే రీతిలో 50 అడుగుల నాట్య స్థూపాన్ని ప్రతిష్ఠించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్య కళా పీఠం ప్రాంగణం సమీపంలో ఏర్పాటు చేసే ఈ స్థూపం కూచిపూడి గ్రామానికి చేరుకుంది. ఏక శిలపై రూపొందించిన ఈ స్థూపంలో నాట్యానికి సంబంధించిన హస్తముద్రికలతోపాటు శ్రీ సిద్ధేంద్ర యోగి, నటరాజ స్వామి, యక్షగాన ఆభరణాలు, సత్యభామ జడ చిత్రాలను చిత్రీకరించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత పసుమర్తి రత్తయ్య శర్మ, ప్రముఖ నాట్యాచార్యులు వేదాంతం రాధేశ్యామ్, ఉత్సవ కమిటీ కన్వీనర్ వేదాంతం వెంకటాచలపతి, వేదాంతం రామలింగశాస్త్రి, కళాపీఠం వైస్ ప్రిన్సిపాల్ చింతా రవిబాలకృష్ణ, పతాక రూపశిల్పి కృష్ణ, పలువురు కళాకారులు, గ్రామస్థులు స్థూపానికి స్వాగతం పలికారు.



యానాదులకు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

యానాదులకు చేపల వేట సామగ్రి పంపిణీ

నాగాయలంక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న యానాది కుటుంబాల జీవన ప్రమాణాలను పెంచేందుకు కృషి చేస్తున్నట్టు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గురువారం నాగాయలంక శ్రీరామపాదక్షేత్రంలోని ఫుడ్ కోర్టు వద్ద జరిగిన కార్యక్రమంలో కోడూరు, నాగాయలంక మండలాలకు చెందిన 80 మంది నిరుపేద యానాది మత్స్యకార కుటుంబాలకు నాబార్డ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ (టీడీఎఫ్) ద్వారా, ప్రజా ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు పరుచూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రూ.50 లక్షల విలువైన పడవలు, ఐస్ బాక్సులు, వేట సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రతిభ, యానాది సంఘ నేతలు నక్కా విజయబాబు, శ్రీనివాసరావు, మత్స్యకార నాయకులు లకనం నాగాంజనేయులు, కర్రి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్ల సర్పంచ్‌కు రాష్ట్రపతి అవార్డు ప్రదానం

చందర్లపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ముప్పాళ్ల గ్రామ సర్పంచ్ కుసుమరాజు వీరమ్మ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి జాతీయ పురస్కారం అందుకున్నారు. దీన్‌దాళ్ ఉపాధ్యాయ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారాలకు ముప్పాళ్ల పంచాయతీ ఎంపికైంది. గురువారం ఢిల్లీలోని రాష్ట్రపతిభవన్‌లో గ్రామం తరఫున సర్పంచ్ వీరమ్మ అవార్డును అందుకున్నారు. సామాజిక భద్రత, సామాజిక రక్షణ వంటి అంశాలపై ముప్పాళ్లకు ఈ పురస్కారం లభించింది. అవార్డు అందుకున్న వీరమ్మకు గ్రామస్థులు అభినందనలు తెలిపారు.



రాష్ట్రపతి అవార్డు అందుకుంటున్న ముప్పాళ్ల సర్పంచ్ వీరమ్మ



గెలుపొందిన మజ్దూర్ యూనియన్ నాయకులు

మజ్దూర్ యూనియన్ ఘన విజయం

ఇబ్రహీంపట్నంరూరల్, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో ఈనెల 4, 5న జరిగిన రైల్వే ట్రేడ్ యూనియన్ గుర్తింపు సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికల్లో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఘనవిజయం సాధించింది. మజ్దూరు యూనియన్‌కు 809 ఓట్లు రాగా సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్‌కు 757 ఓట్లు వచ్చాయి. 52 ఓట్ల మెజార్టీతో మజ్దూర్ యూనియన్ గెలుపొందింది. ఈసందర్భంగా యూనియన్ వర్క్‌షాపు బ్రాంచ్ సెక్రటరీ ఎంవీఎం నాగేశ్వరరావు కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా పని చేస్తామన్నారు.

క్వారీలో విరిగిపడిన బండరాళ్లు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపట్నం మండలం కాచవరం గ్రామ పరిధిలోని రాతి క్వారీలో కొండరాళ్లు జారిపడిన ప్రమాదంలో కార్మికులు త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటనలో ఒక ట్రాక్టర్ నుజ్జునుజ్జవగా పొక్లెయిన్ తాత్కాలికంగా దెబ్బతిన్నట్టు తెలిసింది. పదే పదే బండరాళ్లు జారిపడుతున్నా, కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా క్వారీ యజమానులు సరైన జాగ్రత్తలు పాటించడం లేదని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సైతం నిబంధనలు పాటించని క్వారీ యజమానులపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా ఉంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



బండరాళ్లు జారి నుజ్జయిన ట్రాక్టర్

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	98,106, 117
చికెన్ విత్ స్కిన్	188
చికెన్ స్కిన్‌లెస్	198

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 630



నాల్గో డివిజన్‌లోని ఎల్ఐసీ కాలనీలో రోడ్డు మరమ్మతు పనులు శుక్రవారం కాలనీ పెద్దల సమక్షంలో చురుగ్గా సాగాయి.
భారతీనగర్, ఆంధ్రజ్యోతి

గ్యాస్ లీకై ప్రమాదం
మహిళ మృతి

ఆటోనగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో గురువారం అవివాహిత మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు హైదరాబాద్‌లో ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్న భార్గవి(29) ఇటీవల ఏపీఐఐసీ కాలనీలో తన తల్లి వద్దకు వచ్చింది. నెల రోజులపాటు ఉద్యోగానికి సెలవుపై వచ్చిందని తెలిపారు. గురువారం ఉదయం వంట గదిలో గ్యాస్ లీకైనట్లు వాసన రావడంతో గదిలోకి వెళ్లి లైటు ఆన్ చేసింది. అప్పటికే గ్యాస్ లీక్ అవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి ఆమెకు అంటుకున్నాయి. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు మంటలను ఆర్పారు. తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు కొత్త ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మధ్యాహ్నం 3 గంటలకు మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పటమట సీఐ వి. పవన్ కిషోర్ తెలిపారు.



విద్యుత్ స్తంభం వద్ద భూమిలో నుంచి ప్రమాదకరంగా బయట ఉన్న వైర్లు, కాల్వలో తొలగించిన సిల్టు గుట్ట, పూడుకుపోయిన సైడు కాల్వ

రోడ్డంతా అస్తవ్యస్తం

- సైడ్ కాల్వలు ఉన్నా.. మురుగు పారదు
- మరికొన్ని చోట్ల పూడుకుపోయిన సైడ్ కాల్వలు
- స్థానికుల ఇబ్బందులు...పట్టించుకోని కార్పొరేషన్
- ఇదీ 5వ నెంబరు రూట్ రోడ్డు దుస్థితి

(మొగల్రాజపురం, ఆంధ్రజ్యోతి)

ఐదవ నెంబరు రూట్ రోడ్డు పరిస్థితి అస్తవ్యస్తంగా ఉండడంతో ఆ ప్రాంతవాసులు, వాహనదారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. తూర్పు నియోజకవర్గంలో 8వ డివిజన్ ఐదవ నెంబరు రూట్ రోడ్డు పేరు ఘనంగా ఉంటుంది. క్రీస్తురాజపురం నుంచి ఏలూరు రోడ్డు పాలిటెక్నిక్ కళాశాల వరకు కిలోమీటరు వరకు ఉంటుంది. ఈ రోడ్డులో పెద్ద కార్పొరేట్ పాఠశాల, బహుళ అంతస్తుల అపార్టుమెంట్‌లు, బంగ్లాలు, వ్యాపారసంస్థలు ఉంటాయి. ఈ రోడ్డు మీదుగా 5, 333 నెంబరు ఆర్టీసీ బస్సులు వెళుతుంటాయి.

సైడు కాల్వలు ఒక చోట ఉంటాయి. పారుదల ఉండదు. మరో చోట అసలు సైడు కాల్వలే లేవు. ఉన్న చోట పూడ్చేశారు. కొన్ని చోట్ల సిల్టు కూడా తీయకుండా వదిలేశారు. ఇటీవల కొత్తగా నిర్మాణాలు జరుపుకున్న బహుళ అంతస్తుల అపార్టుమెంట్‌ల ముందు సైడు కాల్వల మీద ర్యాంపులు, చప్టాలు కట్టేశారు.

లోపల ఫ్లోరింగ్‌లు శుభ్రం చేసిన నీరు సైడు కాల్వలోకి కాకుండా రోడ్డు మీదకు వచ్చి మడుగు కడుతోంది. దీంతో ఉన్న రోడ్డు కాస్త పాడయిపోతోంది. కొన్ని చోట్ల కరెంటు స్థంభాలు ఇంకా సైడు కాల్వలోనే ఉన్నాయి. వీఎంసీకి భారీగా పన్నులు వస్తాయి. కానీ రోడ్డు, సైడు కాల్వల వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు.



సైడు కాల్వలో కరెంటు స్తంభం



అపార్టుమెంట్ ముందు చప్టా కట్టడంతో రోడ్డు మీదకు చేరిన వాడకం నీరు

రూ.90 లక్షలతో సైడు కాల్వలకు అంచనాలు సిద్ధం



గతంలో టీడీపీ ఉన్నపుడు స్ట్రామ్ వాటర్ డ్రెయిన్స్ కోసం ప్రయత్నం చేశాం. కొంత మేర నిర్మాణం జరిగింది. తరువాత వైసీపీ వచ్చాక పట్టించుకోలేదు. మొన్నటి కౌన్సిల్‌లో ఈ సమస్యపై మాట్లాడాను. రూ.90 లక్షలతో సైడు కాల్వల నిర్మాణానికి అంచనాలు ఆమోదించారు. టెండరు పిలవబోతున్నారు. త్వరలో సమస్య పరిష్కారం అవుతుంది.

\- చెన్నుపాటి ఉషారాణి,
8వ డివిజన్ కార్పొరేటర్

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి

వీఎంసీ ఇంజనీరింగ్ అధికారులకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూచన



కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు కూటమి ప్రభుత్వ హయాంలో తూర్పు అభివృద్ధికి రెక్కలు తొడగాయని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలపై చర్చించి పరిష్కరించటానికి కూటమి ప్రభుత్వం పక్కా ప్రణాళికను రూపొందించిందన్నారు. అశోక్‌నగర్‌లోని తన కార్యాలయంలో గురువారం సమస్యలపై కార్పొరేషన్ అధికారులతో సమావేశం నిర్వహించగా, కార్పొరేషన్ ఇంజనీరింగ్ చీఫ్ ఇంజనీర్ శ్రీనాథ్‌రెడ్డి, ఈఈ సామ్రాజ్యంతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. గద్దె మాట్లాడుతూ ప్రధాన సమస్యల పరిష్కారానికి కార్పొరేషన్ పరంగా అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. కృష్ణా రిటైనింగ్ వాల్ సమీపంలో 80 అడుగులు రోడ్డు నిర్మాణం చేయాల్నన్నారు. నది పక్క గోడ పక్కనే భూ గర్భ డ్రెయినేజీ నిర్మాణం చేసి రామలింగేశ్వర్‌నగర్‌లోని ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు అనుసంధానం చేయాలని చెప్పారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి కనకదుర్గా నగర్, రామచంద్రనగర్ మీదుగా వెళ్లే పంట కాల్వలో పూడికను తొలగించాలని, గుంట తిప్ప డ్రెయిన్‌లో పూడికను తీయించి నీరు పారుదల ఉండేలా చూడాలని కోరారు. మహానాడు రోడ్డును అభివృద్ధి చేసి మాస్టర్ ప్లాన్‌లో ఉన్న ప్రకారం కామినేని హాస్పిటల్ 100 అడుగుల రోడ్డుకు కలపాలని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. పటమట, రామలింగేశ్వర్ నగర్లోని తాగునీటి సమస్య పరిష్కారానికి వాటర్ ట్యాంకులు మంజూరయ్యాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, గద్దె క్రాంతికుమార్, గద్దె రమేష్ పాల్గొన్నారు.

పీబీ సిద్ధార్థ కళాశాల, సోలెట్ మధ్య ఒప్పందం



ఒప్పంద పత్రాల మార్పిడి

మొగల్రాజపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ కళాశాల, సోలెట్ (సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీస్) మధ్య ఒప్పందం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ చెప్పారు. కళాశాలలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒప్పందం ద్వారా కళాశాల విద్యార్థులు, బోధనా సిబ్బందికి అత్యాధునిక టెక్నాలజీలు, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలెజిన్స్ బయోఇన్ఫర్మేటిక్స్ రంగాల్లో శిక్షణ అందించబడుతుందన్నారు. వర్కుషాపులు, స్కిల్ ఆధారిత కోర్సులు, సర్టిఫికెట్ కోర్సులు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐ, డేటా సైన్స్ హెడ్ డాక్టర్ కే.ఉదయశ్రీ, సోలెట్ కార్యదర్శి టి.క్రాంతికుమార్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, యూజీ డిప్యూటీ హెడ్ కె. సుధీర్, సైకాలజిస్టు డాక్టర్ రమేష్ భవిశెట్టి పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

భారతీనగర్, డిసెంబరు 12 (ఆంధ్ర జ్యోతి): ఎంజీ రోడ్లోని ఇందిరాగాంధీ స్టేడియంలో శుక్రవారం జరగనున్న స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నాల్గో డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నేతలు అందరూ పాల్గొనాలని కోరారు.



బందరు రోడ్డులోని పోస్టల్ కాలనీ బస్టాప్ పేరుకు మాత్రమే అది బస్టాప్. అక్కడ ప్రయాణి కులు కూర్చోవటానికి బెంచీలు ఉండవు. బస్సు వచ్చే వరకు ప్రయాణికులు నిలువు కాళ్ల మీద నిలబడాల్సిందే. సంబంధిత అధికారులు తగు ఏర్పాట్లు చేసి బస్‌షెల్టర్‌ను వినియోగంలోకి తీసుకు రావాల్సిందిగా ప్రయాణీకులు కోరుతున్నారు.

\-పటమట, ఆంధ్రజ్యోతి

దుర్గగుడిలో దక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు



విజయవాడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానం మల్లేశ్వరాలయ కుడ్యంలో ఉన్న దక్షిణామూర్తికి గురువారం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ఈవో కె.ఎస్.రామరావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. జ్ఞానాన్ని కలిగించే దక్షిణామూర్తికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేక అర్చనలు, షోడశోపచార పూజలను నిర్వహించి, మంత్రపుష్పం ఇచ్చారు.

సమస్య పరిష్కరించడమే రెవెన్యూ సదస్సు లక్ష్యం

సత్యనారాయణపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలపై బాధితులు ప్రభుత్వం చుట్టూ తిరగడం కాదు.. ప్రభుతమే ప్రజల వద్దకు వెళ్లి సమస్య పరిష్కరించాలనేది ప్రభుత్వ ఉద్దేశ్యమని నార్త్ తహసీల్దార్ సూర్యారావు అన్నారు. సత్యనారాయణపురం సర్కిల్ టూ కార్యాలయంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఇన్‌కం, బర్త్ సర్టిఫికెట్లకోసం దరఖాస్తు చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 33వ డివిజన్ ఇన్‌చార్జి గార్లపాటి విజకుమార్, వీఆర్వో లలిత, సర్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ స్థలం స్వాధీనం

ప్రసాదంపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రామవరప్పాడు గ్రామంలోని ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన రేకుల షెడ్డు కూల్చివేత పనులు ప్రారంభించినట్లు ఈవో గంటా రామ్మోహన్‌రావు తెలిపారు. గురువారం ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో ఇరిగేషన్ స్థలంలోని నిర్మాణాల కూల్చివేత పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ టి. జానకి దేవి ఇరిగేషన్‌కు చెందిన స్థలాన్ని ఆక్రమించారన్నారు. దీనిపై ఇరిగేషన్, పంచాయతీ అధికారులు కోర్టును ఆశ్రయించారని వెల్లడించారు. స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని న్యాయస్థానం ఉత్తర్వులు ఇవ్వడంతో రేకుల షెడ్డు నిర్మాణాన్ని కూల్చినట్లు వెల్లడించారు.

ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి

సిద్ధార్థ అకాడమీ జాయింట్ సెక్రటరీ నిమ్మగడ్డ లలిత్ ప్రసాద్



మాట్లాడుతున్న నిమ్మగడ్డ లలిత్ ప్రసాద్ తదితరులు

మొగల్రాజపురం, డిసెంబరు 12 (ఆంధ్ర జ్యోతి): మాతృభాషతో పాటు ఆంగ్ల భాష మీద పట్టు సాధించినపుడు అనుకున్న రంగాల్లో ముందుకు వెళ్లడానికి మంచి అవకాశాలు వస్తాయని సిద్ధార్థ అకాడమీ జాయింట్ సెక్రటరీ నిమ్మగడ్డ లలిత్ ప్రసాద్ చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల ఆంగ్ల విభాగం అధ్వర్యంలో లీమస్ 2కె24 రాష్ట్ర స్థాయి లిటరరీ పోటీలు గురువారం జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్స్ అలవరచుకోవడం వల్ల ఉద్యోగావకాశాలు పెరుగుతాయన్నారు. అనంతరం వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ రాజేష్ సి. జంపాల, ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ శ్రీలత, ఇతర అత్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలు జీవితంలో అంతర్భాగం కావాలి

- డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్



విద్యార్థుల క్రీడా విన్యాసాలు

సత్యనారాయణపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు జీవితంలో అంతర్భాగం కావాలని, ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ అన్నారు.

పీఎంసీ కేంద్రీయ విద్యాలయం నెంబర్ వన్‌లో గురువారం వార్షిక క్రీడా దినోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఆర్ఎం మాట్లాడుతూ క్రీడాకారులు భవిష్యత్తులో భారత దేశం తరుపున ప్రాతినిధ్యం వహించేలా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు శరీర దృఢత్వాన్ని పెంచుతాయన్నారు. తైక్వాండో, పలు సాంస్కృతికి క్రీడా విన్యాసాలు ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ ఆదిశేష శర్మ, వ్యాయామ ఉపాధ్యాయుడు ఏడుకొండలు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీ కేశినేని నాని

శ్రీ దుర్గా మల్లేశ్వరాలయానికి రూ.100 కోట్లు ఇవ్వండి

● కేంద్ర మంత్రి షెకావత్‌కు ఎంపీ నాని విజ్ఞప్తి

న్యూఢిల్లీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలోని అతిపెద్ద, ప్రాచీన దేవాలయం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రసాద్ పథకం కింద రూ.100 కోట్లు మంజూరు చేయాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని విజ్ఞప్తి చేశారు. గురువారం, కేంద్ర మంత్రితో ఆయన నివాసంలో భేటీ అయిన ఎంపీ దుర్గగుడి అభివృద్ధి గురించి చర్చించారు. ఈ దేవాలయం అభివృద్ధికి ప్రసాద్ పథకం కింద రూ.100 కోట్లు విడుదల చేయాలని ఆగస్టులో చేసిన విజ్ఞప్తిపై త్వరగా చర్యలు తీసుకుని నిధులు మంజూరు చేయాలని కోరారు. తన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారని ఎంపీ కేశినేని మీడియాకు తెలిపారు.

బాలిక కిడ్నాప్ కథ సుఖాంతం

● పోలీసుల అదుపులో నిందితుడు రాహుల్?

గుడివాడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7న కిడ్నాప్‌కు గురైన మైనర్ బాలిక (16) కథ సుఖాంతమైంది. గుడివాడ ఇన్‌చార్జ్ డీఎస్పీ షేక్ సుభాన్ ఆధ్వర్యంలో టూటౌన్ సీఐ సీహెచ్ నాగప్రసాద్ నేతృత్వంలో రెండు ప్రత్యేక బృందాల కృషి ఫలితంగా బాలికను సురక్షితంగా బుధవారం రాత్రి గుడివాడకు తీసుకువచ్చారు. నిందితుడు రాహుల్ పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం. బాలికను స్థానిక తహసీల్దార్, మండల మేజిస్ట్రేట్ వి.రామకోటేశ్వరరావు ఎదుట హాజరుపరచగా స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసుకున్నారు. బాలిక రాకను తెలుసుకుని బంధువుల టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. రాహుల్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిందితుడు రాహుల్ తమను బెదిరిస్తున్నాడని బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాహుల్‌పై కిడ్నాప్, రేప్, పోక్సో కేసును నమోదు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు. శుక్రవారం నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్టు సమాచారం.

మాపై ఎందుకు వివక్ష..!

● సమస్యల పరిష్కారం కోరుతూ గిరిజన సంక్షేమ గురుకులాల టీచర్లు, లెక్చరర్ల ధర్నా

● రేపటి నుంచి నిరసన బాట పడతామని హెచ్చరిక

ధర్నాచౌక్, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ గిరిజన సంక్షేమ గురుకులాల్లో విధులు నిర్వర్తించే ఔట్‌సోర్సింగ్ టీచర్స్, లెక్చరర్లు కొన్ని రోజులుగా వివిధ రూపాల్లో తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం చలో విజయవాడలో భాగంగా ఏపీ గిరిజన సంక్షేమ గురుకులాల ఔట్‌సోర్సింగ్ ఔట్ సోర్సింగ్ టీచర్స్, లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో ధర్నా చేపట్టారు. తమను కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చి ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇతర విభాగాల్లోని ఉద్యోగుల మాదిరిగా 12 నెలల వేతనాలు చెల్లించాలన్నారు. స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్, టీచర్స్ జేఏసీ చైర్మన్ ఏవీ నాగేశ్వరరావు ఈ దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం వీరిని అన్యాయంగా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలోకి మార్చారని విమర్శించారు. పదేళ్ల నుంచి గిరిజన విద్యార్థులకు విద్యను అందిస్తున్న వీరికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రజా సమాఖ్య అధ్యక్షుడు కే రాజునాయక్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, లెక్చరర్ల పట్ల వివక్ష తగదన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ గిరిజన ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారానికి చేసే పోరాటాలకు తమ మద్దతును ప్రకటించారు. ఈ నెల 14, 15న విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి మద్దతు కోరాలని, 16న ఐటీడీఏ/డీటీడబ్ల్యూ కార్యాలయాల వద్ద ధర్నాలు, 17న భిక్షాటన, 18న పిల్లలకు ధర్నా శిబిరాల్లో పాఠాలు చెప్పడం, 19న ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద ధర్నాలు, సామూహిక వినతిపత్రాలు 20న విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాలల ఎదుట నిరసనలు, 21న వంటావార్పు నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శి కే లక్ష్మీనాయక్, జే మల్లికార్జున నాయక్, కార్యనిర్వాహక అధ్యక్షురాలు ఎన్.సునీత అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు, లెక్చరర్లు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న ఔట్‌సోర్సింగ్ టీచర్లు, లెక్చరర్లు, చిన్నారితో కలిసి ధర్నాలో పాల్గొన్న టీచర్

అట్టహాసంగా వాలీబాల్ టోర్నీ ప్రారంభం

● హాజరైన ఎమ్మెల్యేలు బోడె, గద్దె

విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ వాలీబాల్ టోర్నీతో విజయవాడకు క్రీడా శోభ సంతరించుకుందని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ ప్రమాణాలతో నూతనంగా నిర్మాణం చేసిన ఇండోర్ స్టేడియంలో నాదెళ్ల బసవపూర్ణయ్య (ఎన్‌బీపీ) ట్రస్ట్ అఖిల భారత ఇన్విటేషన్ వాలీబాల్ మహిళల టోర్నమెంట్ గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఈ పోటీలను ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కలిసి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు.

జాతీయ పోటీలతో విజయవాడ ఖ్యాతిని దేశానికి చాటుతున్న ఎన్‌బీపీ ట్రస్ట్ ప్రతినిధులను అభినందించారు. ఎన్‌బీపీ ట్రస్ట్ చైర్మన్ నాదెళ్ల బ్రహ్మాజీరావు మాట్లాడుతూ ఎస్ఆర్ఎం వర్సిటీ, తమిళనాడు క్రీడా ప్రాధికార సంస్థ, జీఈపీఏఐఆర్ వర్సిటీ, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుజరాత్ స్పోర్ట్స్ హాస్టల్, పీకేఆర్ వర్సిటీ జట్లు లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో ఈ నెల 15 వరకు తలపడతాయన్నారు. విజేతలకు రూ.2.75లక్షల నగదు బహుమతి, ట్రోఫీలను, మెడల్స్ అందజేస్తామన్నారు. సిద్ధార్థ విద్యాసంస్థల అధ్యక్షుడు పీ నాగేశ్వరరావు, కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి సూరెడ్డి విష్ణు, కళాశాల ప్రిన్సిపాల్ పీ వెంకటేశ్వరరావు, అర్జున అవార్డీ అరికెపూడి రమణరావు, శాప్ డిప్యూటీ డైరెక్టర్, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు గోపీచంద్, ఉమ్మడి కృష్ణా వాలీబాల్ సంఘం కార్యదర్శి దోనేపూడి దయాకరరావు పాల్గొన్నారు.



టోర్నీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, గద్దె రామ్మోహన్



కొల్లు రవీంద్రను పరామర్శిస్తున్న దేవినేని ఉమా, కొనకళ్ల నారాయణ, కాగిత కృష్ణప్రసాద్, వెనిగండ్ల రాము తదితరులు

మంత్రి కొల్లు రవీంద్రకు కూటమి నేతల పరామర్శ

» కొల్లు వెంకటరమణ అంతిమయాత్రలో నేతలు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మంత్రి కొల్లు రవీంద్ర సోదరుడు కొల్లు వెంకటరమణ హఠాన్మరణంపై ఉమ్మడి కృష్ణాజిల్లా టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు గురువారం సంతాపం వ్యక్తం చేశారు. మచిలీపట్నంలో రవీంద్ర ఇంటి వద్ద దివంగత కొల్లు వెంకటరమణ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రవీంద్రను ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, వెనిగండ్ల రాము, బోడె ప్రసాద్, వర్ల కుమార్‌రాజా, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, దేవినేని ఉమామహేశ్వరరావు, రావి వెంకటేశ్వరరావు, బండి రామకృష్ణ తదితరులు పరామర్శించారు. వెంకటరమణ అంతిమయాత్రలో రవీంద్ర, బండి రామకృష్ణతో పాటు నియోజకవర్గ టీడీపీ నేతలు కొనకళ్ల బుల్లయ్య, గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, ఇలియాస్ పాషా, బత్తిన దాసు తదితరులు పాల్గొన్నారు.



17న ఉయ్యూరులో జాబ్‌మేళా

ఉయ్యూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధికల్పన శాఖ, డీఆర్డీఏ - సీడాప్, ఎస్ఏసీ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈనెల 17న ఉయ్యూరులో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్‌బాబు, నైపుణ్యాభివృద్ధి అధికారి పి.నరేశ్‌కుమార్ గురువారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. బస్టాండ్ సమీపాన శ్రీలంక కాలనీలో ఎస్ఏసీ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగే జాబ్ మేళాలో బజాజ్ క్యాపిటల్, మెడ్‌ప్లస్ హెల్త్‌సర్వీసెస్, గూగుల్ పే వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ పూర్తిచేసి 18 నుంచి 35 సంవత్సరాల లోపు వారు అర్హులని, ఎంపికైన వారికి నెలకు రూ. 12 వేల నుంచి రూ. 20వేల వరకు అనుభవాన్ని బట్టి వేతనంతో పాటు ఇతర సౌకర్యాలు ఉంటాయని తెలిపారు.

చదును పేరుతో కలప, గ్రావెల్ హాంఫట్!

● రాత్రి పూట అక్రమంగా తరలిస్తున్న అక్రమార్కులు ● కొరవడిన అధికారుల పర్యవేక్షణ





ట్రాక్టర్‌పై కలప తరలింపు, గ్రావెల్ తవ్వుతున్న ఎస్కకవేటర్

హనుమాన్‌జంక్షన్ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మల్లవల్లి పారిశ్రామికవాడలో అక్రమార్కులకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. పారిశ్రామికవాడకు కేటాయించిన భూములను చదును చేయాల్సి ఉండగా దాన్ని అదనుగా చేసుకుని అక్రమాలకు తెరతీస్తున్నారు. భూముల్లో పెరిగిన చెట్లను తొలగించి ప్రత్యేకంగా వేలంపాట ద్వారా విక్రయించగా వచ్చిన నిధులను ఏపీఐఐసీకి వినియోగించాల్సి ఉండగా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారీతిగా అమ్ముకుంటున్నారు. ఒక ఎకరా చెట్లు తొలగిస్తే ట్రాక్టర్ కలప వస్తుందని, ఇప్పటికి సుమారు 79 ఎకరాల్లో చెట్లను తొలగించగా ఒక్కో ట్రాక్టర్ కలప రూ.6వేల వరకూ అమ్ముకుంటున్నారని స్థానికులు తెలియజేస్తున్నారు. దీంతో ఏపీఐఐసీకి లక్షల్లో నష్టం వాటిల్లినా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. అంతేకాక గత ప్రభుత్వంలో గ్రావెల్ తరలింపులో కీలకపాత్ర పోషించిన వ్యక్తి, మండల నేత కనుసన్నల్లో తిరిగి గ్రావెల్ తరలింపు ఊపందుకుంది. చదును నిమిత్తం స్థానిక వైసీపీకి చెందిన కాంట్రాక్టరే మళ్లీ పనులు దక్కించుకున్నట్టు సమాచారం. చదును పేరుతో అర్ధరాత్రి పూట గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. గత వారం మట్టి తరలిస్తున్నవారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నా గ్రావెల్ తరలింపు మాత్రం ఆగకపోవడం గమనార్హం. గ్రామాల్లో ఇల్లు కట్టుకునేందుకు ట్రాక్టర్‌తో మట్టి తోలుకుంటుంటే అడ్డుకునే అధికారగణం పారిశ్రామికవాడలో ఇన్ని అక్రమాలు జరుగుతున్నా అటు రెవెన్యూ అధికారులు గానీ, ఇటు ఏపీఐఐసీకి చెందిన అధికారులు గానీ అదుపు చేయలేకపోవడాన్ని ప్రజలు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. ప్రభుత్వం మారినా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హెచ్చరికలు జారీ చేసినా అధికారుల అండదండలతో అక్రమ వ్యాపారం నిరాటంకంగా సాగుతోంది. ఇప్పటికైనా అధికారులు పర్యవేక్షించి అక్రమ తోలకాలు జరిపేవారిపై కఠినచర్యలు చేపట్టకపోతే అక్రమార్కులకు మరింత ఊతమిచ్చినట్లవుతుందని మల్లవల్లి గ్రామస్థులు కోరుతున్నారు.





బ్యాటింగ్ చేస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్, క్రీడాకారులు, క్రికెట్ ట్రోఫీతో డీఆర్ఎం

8వ డీఆర్ఎం కప్ క్రికెట్ పోటీలు ప్రారంభం

రైల్వేస్టేషన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే మినీ స్టేడియంలో గురువారం 8వ డివిజనల్ రైల్వే మేనేజర్ కప్ అంతర్ శాఖల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ నెల 20 వరకు కొనసాగనుంది. టోర్నమెంట్‌ను డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ ప్రారంభించారు. బ్యాటింగ్, బౌలింగ్ చేసి ఆకట్టుకున్నారు. టోర్నమెంట్‌లో మొత్తం 15 శాఖలు పాల్గొననున్నాయి. లీగ్ మ్యాచ్‌లలో క్రికెటర్లు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు. 20 ఓవర్ల వైట్‌బాల్ ఫార్మాట్‌లో మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ మ్యాచ్‌లలో గెలిచిన జట్లకు జోనల్, జాతీయ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. డివిజనల్ స్పోర్ట్స్ ఆఫీసర్ వాలేశ్వర బీ తోకల స్వాగత ప్రసంగం చేశారు. డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రైల్వే స్టేషన్ బ్రాంచ్ అధికారులకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతూ టోర్నమెంట్‌కు స్పాన్సర్ చేసినందుకు అభినందనలు తెలిపారు. సౌత్ సెంట్రల్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ మ్యాచ్ నిర్వహణకు తగు ఏర్పాట్లు చేసినందుకు కొనియాడారు. యువతలోని నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇటువంటి టోర్నమెంట్‌లు వేదికలుగా ఉపయోగపడతాయన్నారు. అనంతరం నరేంద్ర ఏ పాటిల్, బ్రాంచ్ ఆఫీసర్లు ఆటగాళ్లకు 4 క్రికెటింగ్ కిట్లు, మెమెంటోలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ట్రోఫీతో ఆయన క్రీడాకారులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. డీఆర్ఎం, బ్రాంచి ఆఫీసర్లు రెండు ఓవర్ల స్నేహపూర్వక ఎగ్జిబిషన్ మ్యాచ్‌ను ఆడారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ - డీజిల్ లోకో షెడ్ మొదటి రోజున తలపడ్డాయి. సీనియర్ డీఈఎన్ ఎస్.వరుణబాబు, సీనియర్ డీఎంఈ సంజయ్ అంగోతు, ఎఎస్ఈ జి.మధుసూదనరావు, బ్రాంచి అధికారులు, ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.



న్యాయవాదుల సమస్యలపై బార్ కౌన్సిల్ కార్యదర్శికి వినతిపత్రం సమర్పిస్తున్న కృష్ణా, గుంటూరు జిల్లాల బార్ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించండి

● బార్ కౌన్సిల్ కార్యదర్శికి వినతిపత్రం

విజయవాడ లీగల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా బార్ ఫెడరేషన్, గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ న్యాయవాదులంతా కలిసి గురువారం హైకోర్టు ఆవరణలోని బార్ కౌన్సిల్ సెక్రటరీకి న్యాయవాదుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. కృష్ణాజిల్లా బార్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా విజయవాడ బార్ ప్రెసిడెంట్ కొత్త చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా మచిలీపట్నం బార్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్, కార్యదర్శిగా బెజవాడ బార్ ప్రధాన కార్యదర్శి అరిగెల శివరాంప్రసాద్ (రాజా), ఉపాధ్యక్షులుగా జగ్గయ్యపేట బార్ అధ్యక్షుడు సుందరరావు, గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా కాసు వెంకటరెడ్డి నియామకాన్ని అందరూ హర్షించారు.



అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదల చేస్తున్న యూనివర్సిటీ యాజమాన్యం

వీఆర్ సిద్ధార్థ కళాశాలలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు ఆహ్వానం

పెనమలూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కానూరులోని వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల (డీమ్డ్ టుబీ యూనివర్సిటీ) వచ్చే విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశానికి అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్, మేనేజిమెంట్, సైన్సెస్, ఆర్ట్స్ అండ్ కామర్స్, స్కూల్ ఆఫ్ లా కోర్సుల్లో ప్రవేశాలకు గురువారం ప్రకటన విడుదల చేసింది. గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్‌తో పాటు, పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాములు, పీహెచ్‌డీ ప్రోగాముల్లో ప్రవేశాలు నిర్వహించనున్నట్లు వర్సిటీ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఆయా కోర్సుల్లో ప్రవేశానికి విద్యార్థుల వ్యక్తిగత ప్రతిభతోపాటు వర్సిటీ స్కూల్స్ నిర్వహించే పరీక్షలు, రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో ప్రతిభను నిరూపించుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రతిభ గల 30 శాతం విద్యార్థులకు రూ.3కోట్ల విలువైన స్కాలర్‌షిప్‌లు అందిస్తారన్నారు. అడ్మిషన్ల వివరాలకు కళాశాల డీన్‌ను సంప్రదించాలని కోరారు.

భవానీలకు ఇబ్బందులు కలిగించొద్దు

● కలశజ్యోతి ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన ఈవో రామారావు

వన్‌టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కలశజ్యోతి ఉత్సవంలో పాల్గొనటానికి వచ్చే భవానీలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని దుర్గగుడి ఈవో కె.ఎస్.రామారావు అధికారులను ఆదేశించారు. భవానీ దీక్షల విరమణలను పురస్కరించుకుని ఈనెల 14న దేవస్థానం ఆధ్వర్యంలో కలశజ్యోతి ఉత్సవం జరగనుంది. ఆరోజు సాయంత్రం 5 గంటలకు సత్యనారాయణపురం రామకోటి మైదానం నుంచి పెద్ద ఎత్తున భవానీలు కలశ జ్యోతులతో ఊరేగింపు దేవస్థానం వరకు నిర్వహించనున్నారు. ఘాట్‌రోడ్డులో ఓం టర్నింగ్ వద్ద కలశజ్యోతులను పెట్టి అమ్మవారిని దర్శించుకోనున్నారు. దేవస్థానానికి వచ్చే భవానీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈవో గురువారం కొండపైన, దిగువన కనకదుర్గనగర్ ప్రాంతాలను పరిశీలించారు. ఆరోజున కనకదుర్గనగర్‌లో వాహనాలను లోపలికి రానీయకుండా నిలిపేయాలని, భవానీల రాకపోకలకు అంతరాయం లేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.







కలశజ్యోతి ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో రామారావు, కళావేదికపై కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శన, మేజర్ రాంగోపాల్ నాయుడుకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

దుర్గగుడి మహామండపం 7వ అంతస్తు, కళావేదికపై గొల్లపూడికి చెందిన నాట్యాంజలి కూచిపూడి నృత్యాలయం ఆధ్వర్యంలో గురువారం జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. గురువు మాగులూరి త్రినాథచారి పర్యవేక్షణలో జరిగిన నృత్య ప్రదర్శనలో మూషిక వాహన, ఆనంద తాండవం, శివతాండవ స్తోత్రం, కామాక్షి స్తుతి, కొండలలో నెలకొన్న కొలువైన రంగశాయి, ఇంకా పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం అధికారులు కళాకారులను అభినందించి ప్రశంసా పత్రం, ప్రసాదం అందజేశారు.

దుర్గమ్మ సన్నిధిలో కీర్తిచక్ర అవార్డు గ్రహీత

ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను కీర్తిచక్ర అవార్డు గ్రహీత మేజర్ రాంగోపాల్ నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు వారికి అమ్మవారి దర్శనం చేయించి వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం దేవస్థానం ఈవో కేఎస్ రామారావు అయనకు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేశారు.

స్టెల్లాలో బాస్కెట్‌బాల్ టోర్నీ ప్రారంభం

పటమట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మారిస్ స్టెల్లా కళాశాలలో కృష్ణా వర్సిటీ, స్టెల్లా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం కాల్కెజియాట్ బాస్కెట్ బాల్ టోర్నీని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ లేన క్వాడ్రస్, ప్రిన్సిపాల్ డాక్టర్ జసింతా క్వాడ్రస్‌లు పద్మజ సుజుకి సీఈవో అనురాధ, బాస్కెట్ బాల్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ జీ బోజ్, విజయవాడ జేవియర్ బోర్డు పూర్వపు డైరెక్టర్ ఫాదర్ ధన్‌పాల్ ప్రారంభించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ధారుడ్యానికి దోహదపడతాయని, కీడల్లో మంచి ప్రావీణ్యం సాధించి మెరుగైన ఫలితాలు పొందటమే కాకుండా, ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకోవాలని తెలిపారు. పోటీల్లో నగరంలోని పలు కళాశాలలు క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు 7 టీమ్‌లు, కోచ్ రాజా, వ్యాయామ ఉపాధ్యాయురాలు సునీత, మౌనిక పాల్గొన్నారు.





బాస్కెట్ బాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు, మూడోస్థానంలో నిలిచిన సిద్ధార్థ మహిళా కళాశాల

బాస్కెట్‌బాల్‌లో సిద్ధార్థ మహిళా జట్టుకు మూడో స్థానం

విజయవాడ స్పోర్ట్స్: మారిస్ స్టెల్లా కళాశాలలో గురువారం జరిగిన కృష్ణా వర్సిటీ బాస్కెట్‌బాల్ టోర్నీలో సిద్ధార్థ మహిళా కళాశాల జట్టు మూడోస్థానంలో నిలిచిందని ఎస్‌డీఎం కళాశాల ప్రిన్సిపాల్ కల్పన తెలిపారు. ఇద్దరు బాలికలు త్వరలో జరిగే పోటీలకు సౌత్‌జోన్ టీమ్‌కు ఎంపికయ్యారని వివరించారు. ఈ టోర్నీలో ప్రథమస్థానంలో స్టెల్లా కళాశాల నిలవగా, ఆంధ్ర లయోలా కళాశాలలో రెండోస్థానంలో నిలిచాయి.

రేపు విజయవాడలో మెగా జాబ్‌మేళా

● నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం


● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అడుగులు ముందుకు వేశారు. ఎన్నికల సమయంలో నియోజకవర్గంలోని 15వేల మందికి పైగా ఉద్యోగాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. అందులో భాగంగా ఈ నెల 14న మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నారు. హెచ్‌సీఎల్ సంస్థతో ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడి జాబ్ మేళాకు వచ్చేలా చేశారు. అందులో సుమారు వందకు పైగా ఉద్యోగాలు రానున్నాయి. అలాగే మరికొన్ని ప్రముఖ కంపెనీలు కూడా రానున్నాయి. ఇందులో సుమారు 5వేల మందికి ఉపాధి కల్పించనున్నారు. 7వ తరగతి నుంచి డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంసీఎస్, డిప్లొమో, ఫార్మసీ, నర్సింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, పూర్తి చేసిన 18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వరకూ జాబ్ మేళాలో పాల్గొనవచ్చు.

జాబ్‌మేళాకు వచ్చే కంపెనీలు ఇవే..

ఎనికేపాడు శక్తి కళ్యాణమండపం రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఈ మెగా జాబ్ మేళా జరగనుంది. హెచ్‌సీఎల్, ఇండిగో ఎయిర్ లైన్స్, హెచ్‌డీఎఫ్‌సీ, కొటక్, శ్రీరామ్, బ్యాంక్ జోన్, అపోలో, అరోరే, వరుణ్ మోటార్స్, ఎంపవర్‌మెంట్, కాసా ఆటో గ్రూప్, రిలయన్స్, ఎస్‌వీఎల్ మ్యాన్‌పవర్ సొల్యూషన్స్, మెడ్‌ప్లస్, ఆరోబిందో, పేటీఎం, నవత, విజేత, ట్రెంట్, స్టాఫింగ్ టైటాన్స్, యత్వ వంటి 50కిపైగా ప్రముఖ సంస్థలు ఎంపికలు నిర్వహించనున్నాయి. అర్హతను బట్టి ఇంటర్వ్యూ నిర్వహించి జాబ్ ఇవ్వనున్నారు.

15వేల మందికి ఉపాధి కల్పిస్తా: యార్లగడ్డ



నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చా. 15వేల మందికిపైగా ఉపాధి కల్పించటంలో ఎలాంటి సందేహం లేదు. ఐటీ మంత్రి నారా లోకేష్ సహకారం పూర్తిగా ఉంది. మల్లవల్లి కారిడార్‌కు పునర్జీవం పోశాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మూసివేసిన కంపెనీల యాజమాన్యలతో మాట్లాడగా సానుకూలంగా స్పందించారు. ప్రముఖ సంస్థ అశోక్ లేల్యాండ్ పునః ప్రారంభం కానుంది. హెచ్‌సీఎల్ సంస్థతో మాట్లాడగా జాబ్ మేళాకు అంగీకరించారు. 14న నిర్వహించే జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి.

నివేదన

శుక్రవారం • 13 డిసెంబరు 2024



తిరువెంబావై...

ధనుర్మాసంలో శివ వ్రతం

ధనుర్మాసంలో 'తిరుప్పావై' పాశురాలకు ఉన్న ప్రాధాన్యత సర్వవిదితం. ఆండాళ్ పాడిన ఆ పాశురాలను వైష్ణవ సంప్రదాయానికి పట్టుకొమ్మలుగా భావిస్తారు. కాగా అదే కోవలోకి వచ్చే శైవ పాశురాలు కూడా ఉన్నాయి. అవే మాణిక్య వాచకర్ రచించిన 'తిరువెంబావై' పాశురాలు. మాణిక్య వాచకర్ శివుడికి మహా భక్తుడు. దివ్య భక్తిపూరితమైన 'తిరువాసగం'ను ఆయన చెబుతూ ఉంటే... సాక్షాత్తూ శివుడే వాటిని రాశాడని ప్రతీతి. తిరుప్పావై - మార్గళి (శ్రీ) వ్రతం గురించి వివరిస్తే, తిరువెంబావై 'శివవ్రతా'న్ని ప్రబోధిస్తుంది. ధనుర్మాస ఉషోదయ కాలంలో... శివవ్రతంలో భాగంగా చల్లని నీటిలో స్నానం చేయడానికి కొందరు యువతులు ఇంటింటికీ వెళ్ళి, తోటి చెలులను మేలుకొలుపడానికి పాడిన పాశురాలు దీనిలో చోటు చేసుకున్నాయి. ఈ కావ్యం సారాంశం వైష్ణవులు ఆచరించే మార్గళి వ్రతాన్ని పోలి ఉంటుంది. ఇందులోని పాశురాలు కూడా... ఆండాళ్ తన చెలికత్తెలను మేలుకొలపడానికి వెళ్ళినప్పుడు పాడిన రీతిలోనే ఉంటాయి. తిరుప్పావై... వైష్ణవ గ్రంథరాజమైన నాలాయిర ప్రబంధంలో చోటు చేసుకోగా, తిరువెంబవై... మాణిక్యవాచకార్ 'తిరువాసగం'లో చోటు దక్కించుకుంది. తిరుప్పావైలో ముప్పై పాశురాలు ఉండగా, తిరువెంబావైలో ఇరవై పాశురాలు, వాటికి అనుబంధంగా మరో పది గీతాలు ఉంటాయి. అయితే తిరుప్పావై అంతటి ప్రాచుర్యం తిరువెంబావై పొందలేదు.

16 నుంచి ధనుర్మాసం

పోలికలు, తేడాలు...

తిరుప్పావై, తిరువెంబావై పాశురాల్లో చాలా పోలికలు కనిపిస్తాయి. రెండిటిలోనూ ప్రకృతి వర్ణన, భక్తి, జ్ఞాన మార్గాలను సూచించడం, ఉపనిషత్తుల సారాన్ని పొందుపరచడం జరిగింది. శ్రీరంగనాథుణ్ణి ఉద్దేశించి ఆండాళ్ పాడిన పాశురాలు... తిరుప్పావై కాగా, చిదంబరేశ్వరుణ్ణి కీర్తిస్తూ మాణిక్య వాచకర్ ఆలపించిన పాశురాలు... తిరువెంబావై. వీటిలో ఇరవై పాశురాలను తిరువణ్ణామలైలో కొలువుతీరి ఉన్న అరుణాచలేశ్వరుని సన్నిధిలో, మరో పది గీతాలను మదురైకి సమీపంలోని తిరుప్పరుందరైలో ఆయన గానం చేశారని చెబుతారు. తిరుప్పావైలో ఆండాళ్ తన స్నేహితురాళ్ళతో మార్గళి వ్రతం ఆచరించడం కోసం ఉషఃకాలంలో ఇంటింటికీ వెళ్ళి వారిని మేలుకొలుపుతుంది. తిరువెంబావైలో కూడా కొందరు యువతులు తమతోటి వారిని ఇదే విధంగా మేలుకొలపడం కనిపిస్తుంది. అయితే ఈ రెంటికీ తేడా ఉంది. తిరుప్పావైలో యువతులు శ్రీరంగనాథుణ్ణి కీర్తించినట్టు... తిరువెంబవైలో యువతులు శివుణ్ణి ప్రార్థిస్తారు. అక్కడ వారు శ్రీరంగనాథుణ్ణి భౌతికమైన కోరికలు కోరుకుంటే... ఇక్కడ వీరు శివుడి అనుగ్రహాన్ని ఆకాంక్షిస్తారు. తిరుప్పావైలో శ్రీరంగనాథుణ్ణి



విశేషం

చేరుకోవడానికి నీలాదేవి అనుగ్రహం కోసం ఆమెను స్తుతించినట్టే... తిరువెంబావైలో యువతులు పరాశక్తి అయిన ఉమాదేవి అనుగ్రహం కోరుతారు, తమకు శివ సాన్నిధ్యాన్ని అందించాలని ప్రార్థిస్తారు. జీవులను 'మనోన్మని, సర్వభూతదమని, బలప్రమథని, బలవికరణి, కలవికరణి, కాళీ, రౌద్రి, జ్యేష్ఠ, వామ' అనే తొమ్మిది రకాల తామస శక్తులు ఆవహించి ఉంటాయి. వాటిని పారద్రోలి, అజ్ఞానం నుంచి మానవులను మేలుకొలిపి, మాలిన్యం నుంచి బయటపడడానికి 'జ్ఞానం' అనే చన్నీటి స్నానం చేయడమే మార్గం అనే భావాన్ని తిరువెంబావై పాశురాల్లో అంతర్లీనంగా చెప్పడం జరిగింది.

పరమాచార్యుల ద్వారా ప్రాచుర్యం

శాస్త్రానుసారం శివ కేశవులకు ప్రీతికరమైనది ధనుర్మాసం. ఈ మాసంలోని ఆరుద్ర నక్షత్రం రోజున పరమ శివుడు అరుణాచలంలో అగ్నిలింగంగా ఆవిర్భించాడని శివపురాణంతో సహా పలు గ్రంథాలు పేర్కొంటున్నాయి. శివ పార్వతుల కల్యాణాన్ని ఈ మాసంలోని ఏదో ఒక సోమవారం నిర్వహించే సంప్రదాయం ఉంది. ధనుర్మాసంలో ఉషఃకాల వ్రతంగా 'శివవ్రతం' ఆచరిస్తారు. ఈ వ్రతం ఆచరించే సమయంలో తిరువెంబావైని పఠించడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీమద్రామానుజుల పరంపర ద్వారా దక్షిణాదిలో తిరుప్పావై ప్రాచుర్యం పొందింది. ఈ విధానం తెలుగునాట కుడా ఆనవాయితీగా మారింది. కానీ తమిళ శైవాచార్యులు తగిన ప్రచారాన్ని కల్పించకపోవడంతో మన ప్రాంతాల్లో తిరువెంబావై గురించి ఎక్కువ మందికి తెలియదు. ధనుర్మాసంలో తిరుప్పావై, తిరువెంబావై... ఈ రెండూ అవశ్య పఠనీయాలుగా పేర్కొని, వాటికి ప్రాచుర్యం కల్పించినవారు కంచి పరమాచార్యులు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి. మహా మహిమాన్వితమైన 'తిరువాసగం' గురించి, దానిలో పొందుపరిచి ఉన్న తిరువెంబావై, దాని ఆవిర్భావం గురించి భగవాన్ శ్రీ మహర్షి విపులంగా వివరించారు. కంచి పీఠంలో, శ్రీరమణాశ్రమంలో.. ధనుర్మాస కాలంలో తిరుప్పావై, తిరువెంబావై... ఈ రెండిటినీ గానం చేస్తారు.

• ఆయపిళ్ళ రాజపాప

సహజయోగ

యోగసాధనకు మార్గశిరం...

భగవద్గీతలో శ్రీకృష్ణుడు 'మాసానాం మార్గశీర్షోహం' అన్నాడు. అంటే 'మాసాలలో మార్గశిర మాసాన్ని నేను' అని అర్థం. మరి ఈ మాసానికి ఉన్న విశిష్టత ఏమిటి? మార్గశిర మాసాన్నే శ్రీకృష్ణుడు ప్రత్యేకంగా ఎందుకు చెప్పాడు? 'శీర్షము' అంటే శిఖరము లేదా తల. 'మార్గము' అంటే దారి. 'మార్గశీర్షము' అంటే శిఖరానికి తీసుకుపోయే దారి. మన సూక్ష్మ శరీరంలో శీర్షం అంటే తల మాడు భాగంలో ఉండే సహస్రారం. దాని దగ్గరకు తీసుకువెళ్ళే దారి... సుషుమ్న నాడి. మన వెన్నెముక అడుగు భాగాన ఉండే కుండలినీ శక్తి... ఈ నాడి ద్వారానే సహస్రారానికి చేరుతుంది. దానికి అధిష్ఠాన దేవత శ్రీ మహాలక్ష్మి. అందుకే మార్గశిర మాసంలో ప్రతి గురువారం లక్ష్మీ దేవికి పూజలు చేస్తారు. అంతే కాకుండా... సుషుమ్న నాడి ద్వారా మానవులందరిలో ధర్మాన్ని, సంతృప్తిని, సమతుల్యతను, సత్యాన్వేషణను, జీవ పరిణామ శక్తిని శ్రీమహావిష్ణువు పరిరక్షిస్తాడు. అందుకే "మాసాలలో నేను మార్గశీర్షాన్ని" అని శ్రీకృష్ణుడు చెప్పాడు.

మనలోని ధర్మానికి ఆధారం ఆయనే...

మన సూక్ష్మశరీరంలో మూడు నాడులు ఉంటాయి, ఎడమవైపున ఉన్నదాన్ని 'ఇడా నాడి' అని, కుడివైపు నాడిని 'పింగళా నాడి' అనీ, మధ్యలో ఉండే నాడిని 'సుషుమ్న నాడి' అని పిలుస్తారు. ఇడా, పింగళ నాడులు మనలో సహానుభూత నాడీ వ్యవస్థకు, సుషుమ్న నాడి మనలోని ఆధ్యాత్మిక ఉన్నతికి దోహదపడే పర సహానుభూతి నాడీ వ్యవస్థకు బాధ్యత వహిస్తాయి. అమీబా నుంచి మానవ దశ వరకూ మన పరిణామ క్రమానికి ఈ సుషుమ్న మార్గమే కారణం. దాని వల్లనే మనం మానవులం అయ్యాం. నాభీ చక్రం నుంచి మానవులలో సత్యాన్వేషణ మొదలవుతుంది. జంతువులు ఆహారాన్ని, మానవులు దైవాన్ని వెతకడానికి ఈ చక్రమే కారణం. దైవాన్ని అన్వేషించే శక్తి మానవుల్లో అంతర్లీనంగా ఉంటుంది. ఆ అన్వేషణ నెరవేరేవరకూ అతను సంతృప్తి చెందలేడు. 'యోగక్షేమం వహామ్యహం' అని శ్రీకృష్ణుడు చెప్పినట్టు... భగవంతుడితో యోగం పొందిన తరువాతే మానవుడికి అన్ని వైపుల నుంచి పోషణ లభిస్తుంది. అతను సంతృప్తి చెందుతాడు అప్పటివరకూ ఏదో రూపంలో సత్యం కోసం అన్వేషణ చేస్తూనే ఉంటాడు. మన సూక్ష్మ శరీరం అంతటా విష్ణుమూర్తి ఒక్కో చక్రం దగ్గర ఒక్కో రూపంలో ఉంటాడు. నాభి చక్రం దగ్గర శ్రీమన్నారాయణుడిగా, అనాహత చక్రం దగ్గర శ్రీరామునిగా, విశుద్ధి చక్రం దగ్గర శ్రీకృష్ణుడిగా, ఆజ్ఞా చక్రం దగ్గర మహా విష్ణువుగా, సహస్రారం దగ్గర కల్కి రూపంలో ఉంటాడు. వీటిలో కల్కి అవతారం ఇంకా భూమి మీదకు రావలసి ఉంది. మనలో లోపల ఉన్న ధర్మానికి ఆధారం మహా విష్ణువు. మనలో ధర్మం ఉన్నప్పుడే మనకు సమతుల్యత లభిస్తుంది. దాని ద్వారా వివేకం ఏర్పడుతుంది. అలాంటి మానవులు కుండలినీశక్తి ఉత్థానానికి చాలా అనుకూలమైనవారు. ఆత్మసాక్షాత్కారం పొంది ధ్యానం చేస్తే, కుండలినీ శక్తి ఉత్థానమై, పరిపూర్ణమైన నిరానంద అనుభూతి ప్రసాదిస్తుంది.



జీవ పరిణామక్రమం... అవతారాలు

మానవుల్లో ధర్మాన్ని పరిరక్షించి, వారిని పరిణామక్రమంలో ముందుకు తీసుకువెళ్ళినది విష్ణువు. ఆ కార్య నిర్వహణకోసమే ఆయన దశావతారాలు ధరించాడు. వాటిని గమనిస్తే... మొదటిది మత్స్యావతారం. సైన్స్‌ప్రకారం కూడా జీవరాశి మొదట నీటిలోనే ఏర్పడింది. వాటిలో కొన్ని జలచరాలు నేలమీదకు వచ్చి నడవడం మొదలుపెట్టాయి. అదే కూర్మావతారం. అలా నడవడం మొదలుపెట్టిన జీవులు మొదట నాలుగు కాళ్ళతో నడిచాయి అదే వరాహావతారం. వాటిలో కొన్ని రెండు కాళ్ళతో నడవడం ప్రారంభించాయి. కానీ వాటి పశులక్షణాలు పూర్తిగా పోలేదు. అదే నరసింహావతారం. అంటే సగం మనిషి, సగం సింహం. వాటి నుంచి కురచగా ఉండే మానవజాతి మొదలయింది. అది వామనావతారం. ఆ తరువాత పూర్తిస్థాయి మానవుడు రూపు దిద్దుకున్నా... క్రూరత్వం సంపూర్ణంగా పోలేదు. అది పరశురామావతారం. అనంతరం పూర్తిస్థాయి మానవుడు రూపుదిద్దుకున్నాడు. అదే రామావతారం. అయితే మానవులు ధర్మాన్ని కచ్చితంగా ఆచరించాలనే ఆలోచనతో... సంఘంలో అందరితో కలిసి ఆనందించడం లేదు. వారికి అది నేర్పించడానికి వచ్చిన అవతారమే శ్రీకృష్ణావతారం. అంటే పరిణామక్రమంలోని ప్రతి స్థాయిలో... ధర్మానికి భంగం కలుగుతున్నప్పుడల్లా... అధర్మాన్ని ఖండించి, ధర్మమార్గంలో ఉన్న జీవులను ఉద్ధరించడానికి భగవంతుడు స్వయంగా ఒక రూపం ధరించి భూమి మీదకు వస్తున్నాడు.

ఎప్పుడూ వర్తమానంలోనే ఉండాలి...

మానవ పరిణామ క్రమంలో తదుపరి ఉన్నత దశ... ఆత్మ సాక్షాత్కారం పొందిన యోగులుగా మారడం. ఆత్మ సాక్షాత్కారం పొందిన వ్యక్తి 'నేను ఈ శరీరాన్ని కాదు ఆత్మను' అనే విషయాన్ని తన కేంద్ర నాడీవ్యవస్థలో కలిగే అనుభూతి ద్వారా తెలుసుకుంటాడు. అలా తెలుసుకోవాలంటే... మనలోపల సుషుమ్న నాడి పూర్తిగా తెరుచుకొని ఉండాలి. అది ఎంత తెరుచుకుంటే అంత ఎక్కువగా కుండలినీ శక్తి పైకి వచ్చి, సూక్ష్మ శరీరానికి అవసరమైన పోషణను ఇస్తుంది. సుషుమ్న నాడి విశాలంగా తెరుచుకొని ఉండాలంటే... మనం ఎల్లప్పుడూ వర్తమానంలో ఉండాలి. పని మీదనే మన ధ్యాస ఉండాలి. తీసుకొనే ఆహారం సమతుల్యతతో ఉండేలా చూసుకోవాలి. ఏది చేసినా అతి కాకుండా జాగ్రత్త వహించాలి. అరిషడ్వర్గాలలో మూడవదైన లోభం మన నాభీ చక్రాన్ని దెబ్బతీస్తుంది. దానివల్ల మన లోపల ఉన్న సుషుమ్న నాడి కూడా బలహీనపడుతుంది. లోభాన్ని అధిగమించాలంటే... దాతృత్వం కలిగి ఉండాలి. మన జీవనానికి అవసరమైన ధనాన్ని ధర్మమార్గంలోనే సంపాదించాలి. సంపాదించిన దానితో సంతృప్తి పొంది, ధార్మిక జీవనాన్ని గడపాలి.

దైవచింతనతో గడిపితే...

"సహజ యోగానికి సంబంధించిన ఈ జ్ఞానం అంతా ప్రాచీన కాలంలోని ఆధ్యాత్మిక గ్రంథాలలో ఉంది. కబీర్‌దాసు కూడా తన రచనల్లో దాని గురించి స్పష్టంగా చెప్పారు" అని సహజయోగ ప్రదాత శ్రీమాతాజీ నిర్మలాదేవి పేర్కొన్నారు. అటువంటి ప్రాచీనమైన సహజయోగ సాధనకు మార్గశిరమాసం చాలా అనుకూల సమయం. ఈ మాసంలోనే శ్రీగోదాదేవి ధనుర్మాస వ్రతాన్ని ఆచరించి, శ్రీరంగనాథునిలో ఐక్యమయింది. ఈ మాసంలోనే దత్తజయంతి కూడా వస్తుంది. ఈ మాసం మొదటివారంలో సుబ్రహ్మణ్య షష్ఠి ఉంటుంది. ఆధ్యాత్మికంగా ఈ మాసం ఎంతో విశిష్టమైనది. దైవచింతనతో ఈ మాసాన్ని గడపడం వల్ల పరిపూర్ణమైన ప్రయోజనాలు సిద్ధిస్తాయి.

డాక్టర్ పి. రాకేష్ 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



బిజినెస్

రష్యాతో రిలయన్స్ భారీ డీల్ !

» రోజుకు 5 లక్షల బ్యారళ్ల చమురు దిగుమతికి ఒప్పందం

న్యూఢిల్లీ: భారత-రష్యా ఇంధన బంధం మరింత బలపడుతోంది. గుజరాత్ జామ్‌నగర్‌లోని తన రిఫైనరీకి రష్యా నుంచి పదేళ్ల పాటు రోజుకు ఐదు లక్షల బ్యారళ్ల చమురు దిగుమతి చేసుకునేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్).. రష్యా ప్రభుత్వ నిర్వహణలోని రాస్‌నెఫ్ట్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఇది ఏటా 1,300 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.10 లక్షల కోట్లు)కు సమానం. దుబాయ్ క్రూడ్ కంటే మూడు డాలర్ల డిస్కౌంట్‌తో రష్యా ఈ చమురు సరఫరా చేయనుంది. అవసరమైతే ఈ ఒప్పందాన్ని మరో పదేళ్ల పాటు పొడిగించుకునేందుకు అవకాశం ఉంది. అయితే ఈ ఒప్పందంపై రెండు కంపెనీలు ఇంకా అధికారికంగా నోరు మెదపడం లేదు. తన చమురు దిగుమతులపై యూరోపియన్ యూనియన్ (ఈయూ), అమెరికా ఆంక్షల నేపథ్యంలో రాస్‌నెఫ్ట్, రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో ఈ దీర్ఘకాలిక ఒప్పందం కుదుర్చుకోవడం విశేషం. కాగా రిలయన్స్ గతంలో రాస్‌నెఫ్ట్‌తో ఏడాది కాలపరిమితితో రోజుకు 3 లక్షల బ్యారళ్ల చమురు సరఫరా చేసేలా ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం రిలయన్స్ జామ్‌నగర్‌లో పూర్తిగా ఎగుమతుల కోసమే రోజుకు 5.8 లక్షల బ్యారళ్ల సామర్థ్యం గల రిఫైనరీని నిర్వహిస్తోంది. దేశీయ అవసరాల కోసం రోజుకు 6.6 లక్షల బ్యారళ్ల సామర్థ్యంతో మరో రిఫైనరీని కూడా నిర్వహిస్తోంది.

తగ్గిన ధరల కాక

నవంబరులో రిటైల్ ద్రవ్యోల్బణం 5.48 శాతం



న్యూఢిల్లీ: దేశంలో ధరల మంట కాస్తంత ఉపశమించింది. అక్టోబరులో 6.21 శాతానికి దూసుకుపోయి అటు ప్రభుత్వంలోను, ఇటు ప్రజల్లోను అలజడి రేకెత్తించిన రిటైల్ ద్రవ్యోల్బణం నవంబరు నెలలో 5.48 శాతానికి దిగి వచ్చింది. ఆహార వస్తువుల ధరల్లో తగ్గుదల ఇందుకు దోహదపడినట్టు ప్రభుత్వ గణాంకాలు తెలుపుతున్నాయి. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) గురువారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఆహార వస్తువుల ధరల విభాగంలో ద్రవ్యోల్బణం అక్టోబరుతో పోల్చితే 10.87 శాతం నుంచి 9.04 శాతానికి తగ్గింది. గత ఏడాది నవంబరులో ఇది 8.70 శాతంగా ఉంది. నవంబరు నెలలో కూరగాయలు, పప్పులు, పప్పు ఉత్పత్తులు, చక్కెర, కన్ఫెక్షనరీ, పళ్లు, పాలు, పాల ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాలు, రవాణా, కమ్యూనికేషన్, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గాయని ఎన్ఎస్ఓ తెలిపింది. జూలై, ఆగస్టు నెలల్లో సగటున 3.6 శాతం ఉన్న వినియోగ వస్తువుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం సెప్టెంబరులో 5.5 శాతానికి, అక్టోబరులో 6.2 శాతానికి దూసుకుపోయిన విషయం విదితమే. తాజా పరిస్థితిని పరిశీలనలోకి తీసుకున్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం అంచనాను 4.5 శాతం నుంచి 4.8 శాతానికి పెంచింది. ఆహార ధరల ఒత్తిడి కారణంగా డిసెంబరు త్రైమాసికంలో కూడా ద్రవ్యోల్బణం అధికంగానే ఉండవచ్చని కూడా పేర్కొంది.

మందగించిన పారిశ్రామికం

మైనింగ్, విద్యుత్, తయారీ రంగాలు మందగించడంతో అక్టోబరు నెలలో పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ) వృద్ధి రేటు 3.5 శాతానికి పరిమితమైంది. గత ఏడాది అక్టోబరులో వృద్ధి రేటు 11.9 శాతంతో పోల్చితే పారిశ్రామిక వృద్ధి గణనీయంగా తగ్గినా సెప్టెంబరులో నమోదైన 3.1 శాతంతో పోల్చితే మాత్రం మెరుగుపడినట్టు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ గణాంకాలు వెల్లడించాయి. ఏప్రిల్-అక్టోబరు నెలల మధ్య కాలంలో కూడా ఐఐపీ వృద్ధి రేటు వార్షిక ప్రాతిపదికన 7 శాతం నుంచి 4 శాతానికి క్షీణించింది. అక్టోబరులో గనుల రంగంలో వృద్ధిరేటు 13.1 శాతం నుంచి 0.9 శాతానికి క్షీణించగా తయారీ రంగంలో 10.6 శాతం నుంచి 4.1 శాతానికి, విద్యుత్ రంగంలో 20.4 శాతం నుంచి 2 శాతానికి, యంత్ర పరికరాల విభాగంలో 21.7 శాతం నుంచి 3.1 శాతానికి వృద్ధి రేటు పడిపోయింది. వినియోగ ఆధారిత వర్గీకరణ కింద ఉత్పత్తి కన్స్యూమర్ నాన్ డ్యూరబుల్స్ విభాగంలో కూడా 9.3 శాతం నుంచి 2.7 శాతానికి క్షీణించింది.

మస్క్ @ 447 బిలియన్ డాలర్లు

» ప్రపంచంలో ఈ స్థాయి సంపద కలిగిన తొలి వ్యక్తిగా టెస్లా అధిపతి సరికొత్త రికార్డు

» ఒక్కరోజే 5.33 లక్షల కోట్లు పెరిగిన ఆస్తి

» మొత్తం 37.93 లక్షల కోట్లకు చేరిక



న్యూయార్క్: ప్రపంచ కుబేరుడు, అమెరికన్ విద్యుత్ కార్ల కంపెనీ టెస్లా అధిపతి ఎలాన్ మస్క్ వ్యక్తిగత సంపద సరికొత్త రికార్డు స్థాయికి పెరిగింది. బ్లూంబర్గ్ బిలియనీర్స్ రియల్‌టైం ఇండెక్స్ ప్రకారం.. బుధవారం మస్క్ ఆస్తి ఏకంగా 62.8 బిలియన్ డాలర్లు (6,280 కోట్ల డాలర్లు = రూ.5.33 లక్షల కోట్లు) పెరిగి మొత్తం 447 బిలియన్ డాలర్లకు(44,700 కోట్ల డాలర్లు= రూ.37.93 లక్షల కోట్లు) చేరుకుంది. ప్రపంచంలో 400 బిలియనీర్ల వ్యక్తిగత సంపద కలిగిన తొలి వ్యక్తి ఈయనే. ఈ ఏడాదిలో మస్క్ నెట్‌వర్త్ 218 బిలియన్ డాలర్ల మేర పుంజుకుంది. ప్రధానంగా గత నెల 5న జరిగిన అమెరికా ఎన్నికల్లో కొత్త అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైనప్పటి నుంచి మస్క్ కంపెనీల షేర్ల ధరలతో పాటు ఆయన ఆస్తి శరవేగంగా పెరుగుతూ వచ్చింది. ఎన్నికల్లో ట్రంప్‌కు మస్క్ గట్టి మద్దతుదారుగా నిలిచారు. ఆయన కోసం భారీగా ఖర్చు కూడా చేశారు. ట్రంప్ ప్రభుత్వంలో మస్క్ కీలక పాత్ర పోషించనుండటం కూడా తన కంపెనీ షేర్లకు గిరాకీ అమాంతం పెంచింది. ట్రంప్ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైనప్పటి నుంచి టెస్లా షేరు ధర 65 శాతం వృద్ధి చెందడమే ఇందుకు నిదర్శనం.

సెన్సెక్స్ 236 పాయింట్లు పతనం

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు గురువారం నష్టాల్లో ముగిసాయి. సెన్సెక్స్ 236.18 పాయింట్లు కోల్పోయి 81,289.96 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 93.10 పాయింట్ల నష్టంతో 24,548.70 వద్ద స్థిరపడింది. ద్రవ్యోల్బణం, పారిశ్రామికోత్పత్తి గణాంకాల విడుదల నేపథ్యంలో మదుపరులు ముందుజాగ్రత్తగా రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎల్ అండ్ టీ, హెచ్‌యూఎల్ సహా పలు బ్లూచిప్ కంపెనీల షేర్లలో అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, రూపాయి క్షీణత, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ అంశాలూ మార్కెట్ సెంటిమెంట్‌ను కుంగదీశాయి. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 18 నష్టాల్లో ముగిసాయి.

- భారత కరెన్సీ సరికొత్త ఆల్‌టైం కనిష్ఠ స్థాయికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 5 పైసల నష్టంతో రూ.84.88 వద్ద ముగిసింది. డాలర్ బలోపేతం, ఈక్విటీ మార్కెట్లో నష్టాలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, ముడి చమురు ధరల పెరుగుదల ఇందుకు కారణమయ్యాయి.
- అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒక దశలో 0.30 శాతం పెరిగి 73.74 డాలర్లకు ఎగబాకింది.

న్యూలాండ్ ల్యాబ్స్‌కు క్యాపిటల్ గ్రూప్ గుడ్‌బై

3.77% వాటా రూ.756 కోట్లకు విక్రయం

న్యూఢిల్లీ: హైదరాబాద్‌కు చెందిన న్యూలాండ్ లేబొరేటరీస్ నుంచి అమెరికాకు చెందిన క్యాపిటల్ గ్రూప్ పూర్తిగా వైదొలిగింది. న్యూలాండ్‌లో తనకున్న 3.77 శాతం వాటాను రూ.756 కోట్లకు విక్రయించింది. బహిరంగ మార్కెట్లో బల్క్ డీల్స్ ద్వారా ఈ వాటాను ఉపసంహరించుకుంది. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం.. 3.77 శాతం వాటాకు సమానమైన 4.84 లక్షల షేర్లను ఒక్కొక్కటి సగటున రూ.15,618.16కు విక్రయించింది. ఎన్ఎస్ఈలో న్యూలాండ్ షేరు 5.54 శాతం నష్టంతో రూ.16,014.95 వద్ద ముగిసింది.

టాటా మోటార్స్ ట్రక్కులు, బస్సుల ధరల పెంపు

న్యూఢిల్లీ: టాటా మోటార్స్ తన వాణిజ్య వాహనాలైన ట్రక్కులు, బస్సుల ధరలను 2 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. పెంచిన ధరలు జనవరి 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని తెలిపింది. ఇండివిడ్యువల్ మోడల్, వేరియంట్‌ను బట్టి ఈ పెంపు ఉంటుందని పేర్కొంది. ఉత్పత్తి వ్యయాలు పెరగటంతో ధరలు పెంచక తప్పటం లేదని టాటా మోటార్స్ తెలిపింది. కాగా కంపెనీ ఇప్పటికే తన ప్యాసింజర్ కార్ల ధరలను 3 శాతం వరకు పెంచింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,500 ▲	72,900 ▲	1.04.000 ▲
విజయవాడ	81,000 ▲	73,500 ▲	96,000 ▲
విశాఖపట్నం	78,690 ▲	72,130 ▲	95,200 ▲
రాజమండ్రి	79,470 ▲	72,850 ▲	95,600 ▲
ప్రొద్దుటూరు	79,700 ▲	73,800 ▲	95,000 ▲
ముంబై	78,147 ▲	71,583 ▲	93,300 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

13వ తేదీ			
హైదరాబాద్	620	విజయవాడ	630
వరంగల్	622	గోదావరి	630
చిత్తూరు	633	విశాఖపట్నం	620
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	86	విజయవాడ	96
వరంగల్	86	గుంటూరు	96
కరీంనగర్	86	ఒంగోలు	96
మహబూబ్‌నగర్	86	చిత్తూరు	83
కర్నూలు	86	నెల్లూరు	83
విశాఖపట్నం	98	అనంతపురం	83
గోదావరి	96		

నైట్ ఫ్రాంక్ ఇండియా

2030 నాటికి ఇన్‌ఫ్రాలోకి రూ.187 లక్షల కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ: భారత్ 2030 నాటికి 7 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం భారీగానే ఖర్చు చేయాల్సి ఉంటుందని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా ఒక నివేదికలో తెలిపింది. ఈ మొత్తం ఎంతలేదన్నా 2.2 లక్షల కోట్ల డాలర్లు (ప్రస్తుత మారకం రేటు ప్రకారం సుమారు రూ.186.56 లక్షల కోట్లు) వరకు ఉంటుందని అంచనా. భారీ సంస్కరణల ద్వారా పెద్ద ఎత్తున ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడం ఒక్కటే ఇందుకు మార్గమని స్పష్టం చేసింది. మన ఆర్థిక వ్యవస్థను 2030 నాటికి ఏడు లక్షల కోట్ల డాలర్ల స్థాయికి తీసుకువెళ్లేందుకు 2024-30 మధ్య కాలంలో మన జీడీపీ ఏటా సగటున 10.1 శాతం చొప్పున వృద్ధి చెందడం అవసరమని స్పష్టం చేసింది. మౌలిక రంగంలో ప్రైవేట్ పెట్టుబడులు పెరిగితే ప్రభుత్వాల ద్రవ్యలోటూ తగ్గుతుందని నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది.

విమానాశ్రయాల కోసం రూ.60,000 కోట్లు

విమానాశ్రయాల అభివృద్ధి కోసం భారత్ వచ్చే మూడేళ్లలో పెద్ద మొత్తం ఖర్చు చేయక తప్పేలా లేదు. ఇందుకోసం ఎంతలేదన్నా రూ.60,000 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుదని క్రిసిల్ అంచనా. 2027 నాటికి ఏటా 6.5 కోట్ల విమాన ప్రయాణికుల సామర్థ్యం కోసం ఈ పెట్టుబడులు తప్పవని తెలిపింది.



టాప్‌గేర్‌లో ఆటోమొబైల్ విడిభాగాల పరిశ్రమ

దేశంలో ఆటోమొబైల్ విడి భాగాల పరిశ్రమ టాప్‌గేర్‌లో దూసుకుపోతోంది. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి ఆరు నెలల్లో ఈ పరిశ్రమ రూ.3.32 లక్షల కోట్ల టర్నోవర్ నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 11 శాతం ఎక్కువని ఈ పరిశ్రమకు ప్రాతినిధ్యం వహించే ఆటోమొబైల్ కాంపోనెంట్స్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఏసీఎంఏ) తెలిపింది. అంతర్జాతీయ ఆటుపోట్లతో ఎగుమతుల వృద్ధి సన్నగిల్లినా పరిశ్రమ ఈ అభివృద్ధి నమోదు చేసిందని ఏసీఎంఏ జాతీయ అధ్యక్షుడు శ్రద్ధా సూరి మార్వా చెప్పారు.

ఈ సెక్యూరిటీ రూ.10 లక్షల పైమాటే!!

దేశంలో అత్యంత ఖరీదైన సెక్యూరిటీగా ప్రాప్‌షేర్ ప్లాటినా రీట్

ముంబై: తాజాగా స్టాక్ మార్కెట్లో నమోదైన ఓ చిన్న కంపెనీ సరికొత్త రికార్డును సృష్టించింది. ఏకంగా రూ.10.5 లక్షల వద్ద లిస్టయి దేశంలో ట్రేడింగ్‌కు అందుబాటులో ఉన్న అత్యంత ఖరీదైన సెక్యూరిటీగా ప్రాప్‌షేర్ ప్లాటినా రీట్ నిలిచింది. మార్కెట్లో అత్యంత ఖరీదైన ఎల్సిడ్ ఇన్వెస్ట్‌మెంట్ (రూ.2.07 లక్షలు), ఎంఆర్ఎఫ్ (రూ.1.32 లక్షలు) షేర్ల ధర కంటే చాలా రెట్లు అధికమిది. ఈ మధ్యనే ఐపీఓకు వచ్చిన ప్రాపర్టీ షేర్ ప్లాటినా రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్).. ఈ నెల 10న తన యూనిట్లను బీఎస్ఈలో నమోదు చేసింది. రూ.10.5 లక్షల వద్ద లిస్టయిన ఈ సెక్యూరిటీ.. ప్రస్తుతం రూ.10.35 లక్షల వద్ద ట్రేడవుతోంది.

విలువపరంగా టాప్-5 సెక్యూరిటీలు
(ఈ నెల 12న బీఎస్ఈలో ముగింపు ధరల ఆధారంగా)

కంపెనీ	రూ.
ప్రాప్‌షేర్ ప్లాటినా రీట్	10,35,001
ఎల్సిడ్ ఇన్వెస్ట్‌మెంట్స్	1,97,405
ఎంఆర్ఎఫ్	1,31,861
ది యమున సిండికేట్	45,600
హనీవెల్ ఆటోమేషన్	40,864

స్టైలిష్ వెంకీ



వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్ రాజు, శిరీశ్ నిర్మాతలు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. సినిమా సంక్రాంతికి రాబోతోంది. కాగా, నేడు వెంకటేశ్ పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ మూవీ నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. వెంకటేశ్ డైనమిక్ అండ్ స్టైలిష్ అవతార్‌లో కనిపించిన ఈ బ్రాండ్ న్యూ పోస్టర్ అదిరిపోయింది. నేడు ఈ సినిమా నుంచి సింగిల్ ప్రోమోని అభిమానులకు కానుకగా ఇవ్వబోతోంది చిత్ర యూనిట్.

ఓ ఫైటర్‌లా పదేళ్ల కెరీర్ పూర్తి చేశాడు



'సాయిదుర్గ తేజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'సంబరాల ఏటిగట్టు' అనే టైటిల్ నిర్ణయించారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్నేజ్ లాంచ్ ఈవెంట్‌లో వీడియో ద్వారా టైటిల్‌ను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రామ్‌చరణ్ మాట్లాడుతూ 'ఓ ఫైటర్‌లా పదేళ్ల కెరీర్‌ను పూర్తి చేసిన తేజ్‌కి అభినందనలు. అతను మంచి నటుడే కాదు మంచి వ్యక్తి కూడా. తేజ్ ఊచకోత ఎలా ఉంటుందో ఈ సినిమాతో చూడబోతున్నారు. ఇంత బడ్జెట్ పెట్టి సినిమా తీస్తున్న నిర్మాతలు నిరంజన్, చైతన్యలకు ఆల్ ద బెస్ట్' అన్నారు. తను ఈ స్థాయికి రావడానికి కారణమైన ముగ్గురు మావయ్యలకు సాయిదుర్గా తేజ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లు అరవింద్, టీజీ విశ్వప్రసాద్, అనిల్ రావిపూడి, మారుతి, ప్రశాంత్ వర్మ, వైవీఎస్ చౌదరి, దేవ్ కట్టా హీరోయిన్ ఐశ్వర్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. రోహిత్ కేపీని దర్శకుడిగా పరిచయం చేస్తూ కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం వచ్చే ఏడాది సెప్టెంబర్ 25న విడుదలవుతుంది.

అలుసుగా తీసుకుంటే సహించేది లేదు

సాయిపల్లవి



తనపై నిరాధార వార్తలు ప్రచురిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని కథానాయిక సాయిపల్లవి హెచ్చరించారు. తన మౌనాన్ని అలుసుగా తీసుకొని ఇష్టం వచ్చినట్లు అసత్యాలను ప్రచారం చేస్తున్నారంటూ మీడియా వైఖరిని తప్పుపట్టారు. 'ఇక సహించేది లేదు. నా సినిమాలు, వ్యక్తిగత జీవితానికి సంబంధించి నిరాధార వార్తలు ప్రచురిస్తే, అది ఎంత పెద్ద మీడియా సంస్థ అయినా చర్య తీసుకోవడానికి వెనుకాడేది లేదు' అని ఆమె ఘాటుగా స్పందించారు. ఓ కోలీవుడ్ మీడియా సంస్థ రాసిన వార్త సాయిపల్లవిలో ఈ ఆగ్రహానికి కారణమైంది. బాలీవుడ్ చిత్రం 'రామాయణ'లో సాయిపల్లవి సీత పాత్ర పోషిస్తున్నారు. ఈ పాత్ర కోసం సాయిపల్లవి తన అలవాట్లను పక్కనపెట్టారనీ, పద్ధతులు మార్చుకున్నారని ఓ కోలీవుడ్ వెబ్‌సైట్ వార్తను ప్రచురించింది. మాంసాహారం త్యజించి, పూర్తి శాఖాహారిగా మారారని, బయట భోజనం చేయడం లేదని, విదేశాలకు వెళ్లినా వంటవాళ్లను వెంటపెట్టుకు వెళుతున్నారనేది ఆ వార్తల సారాంశం. అయితే శాఖాహారిగా మారడం, ఇంటిభోజనం తినడం అసత్యమే అయినా ఈ మాత్రానికే సాయిపల్లవి మనసు ఇంతలా నొచ్చుకోవడం ఏవిటో అర్థం కావడం లేదంటున్నారు నెటిజన్లు. భారత సైన్యాన్ని అవమానించారనీ, కశ్మీర్ వేర్పాటువాదులను, గోసంరక్షణ ఉద్యమకారులను ఒకే గాటన కట్టారని గతంలో తనపై సోషల్ మీడియాలో తీవ్రంగా ట్రోలింగ్ జరిగినప్పుడు ఏమీ మాట్లాడని సాయిపల్లవి ఇప్పుడు మాత్రం ఇంత తీవ్రంగా స్పందించడం ఆశ్చర్యం కలిగిస్తుందని అంటున్నారు. అయితే పురాణేతిహాసాల ఆధారంగా తెరకెక్కే చిత్రాల్లో దేవీ దేవతల పాత్రలను పోషించే నటీనటులు భక్తిభావంతో తమ ఆహార విహారాల్లో మార్పులు చేసుకోవడం, సాత్వికంగా మారడం చాలాకాలంగా ఉన్నదే.

ఏడడుగుల బంధంలోకి







ప్రముఖ నటి కీర్తి సురేష్ గురువారం ఏడడుగుల బంధంలోకి అడుగుపెట్టారు. తన స్నేహితుడు ఆంటోనీ తట్టిల్‌ను ఆమె పెళ్ళి చేసుకున్నారు. గురువారం గోవాలోని ప్రముఖ రిసార్టులో వీరి వివాహం ఘనంగా జరిగింది. కొద్దిమంది కుటుంబ సభ్యులు, సన్నిహితులు మాత్రమే ఈ పెళ్ళి వేడుకలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ పెళ్ళికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ వివాహానికి కోలీవుడ్ నుంచి అగ్రహీరో విజయ్ తమిళ సంప్రదాయ పంచెకట్టులో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కాగా, కీర్తి సురేష్ - ఆంటోనీలు గత 15 యేళ్ళుగా మంచి స్నేహితులుగా ఉన్నారు. కొచ్చిన్‌లో కాలేజీ చదువుకునే రోజుల నుంచే వీరిద్దరికి మంచి పరిచయముంది. వ్యాపార కుటుంబ నేపథ్యం కలిగిన ఆంటోనీకి చెన్నై, కొచ్చిన్‌లలో వ్యాపారాలు ఉన్నాయి.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

భారీ బడ్జెట్ సినిమాలన్నీ ఆడాలి

మోహన్‌లాల్



మలయాళ చిత్రరంగ సూపర్ స్టార్ మోహన్‌లాల్ తొలిసారిగా దర్శకత్వం వహిస్తున్న సోషియో ఫాంటసీ 3డి చిత్రం 'బర్రోజ్' ఈ నెల 25న విడుదలవుతోంది. ఇటీవలే ముంబైలో జరిగిన వేడుకలో చిత్రం ట్రైలర్‌ను అక్షయ్‌కుమార్ విడుదల చేశారు, 44 ఏళ్ల క్రితం మోహన్‌లాల్ తొలి చిత్రం 'మంజిల్ విరింజ పూక్కళ్' విడుదలైన రోజునే ఆయన దర్శకత్వం వహించిన మొదటి సినిమా విడుదలవుతుండడం విశేషం. మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మోహన్‌లాల్ మాట్లాడుతూ ' భారీ చిత్రాలు ఇప్పుడు వరుసగా వస్తున్నాయి. 'పుష్ప 2' మాత్రమే కాదు అన్నీ హిట్ కావాలి. ప్రేక్షకులు వాటినీ ఆదరించాలి. నేను 1996లో 'కాలాపానీ' అనే సినిమా చేశాను. అది పాన్ ఇండియా హిట్ అయింది. అలాగే ఇప్పుడు 'బర్రోజ్' కూడా పెద్ద హిట్ కావాలి' అన్నారు.

కొత్త తరహా స్క్రిప్ట్‌తో..



డా.హరిత గోగినేని దర్శకత్వంలో వేదిక లీడ్‌రోల్‌లో నటించిన చిత్రం 'ఫియర్'. డా.వంకి పెంచలయ్య, ఏఆర్ అభి నిర్మాతలు. సుజాత రెడ్డి కో ప్రొడ్యూసర్. సినిమా ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకురాలు హరిత గోగినేని మాట్లాడుతూ 'ఇది స్క్రీన్‌ప్లే ఓరియెంటెడ్ మూవీ. వేదిక డ్యూయెల్ రోల్‌లో నటించారు. పిల్లలు, పెద్దలు, ఫ్యామిలీ అంతా కలసి చూడొచ్చు. ఫియర్ సినిమాలో ఎన్నో సర్‌ప్రైజ్ ఎలిమెంట్స్ ఉన్నాయి' అని తెలిపారు. ప్రొడ్యూసర్ ఏఆర్ అభి మాట్లాడుతూ 'టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. మేము అనుకున్న దానికంటే చాలా ఎక్కువగా 70 పర్సెంట్ బుకింగ్స్ ఉన్నాయి. చాలా సంతోషంగా ఉంది' అని అన్నారు. కో ప్రొడ్యూసర్ సుజాత రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాను చాలా కొత్త తరహా స్క్రిప్ట్‌తో హరిత రూపొందించారు' అని తెలిపారు. హీరో సొహైల్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో లవ్ స్టోరీతో పాటు థ్రిల్లర్ హారర్ ఎలిమెంట్స్ కలసిన ఒక కొత్త తరహా స్క్రీన్‌ప్లే ఉంటుంది. ఇలాంటి స్క్రిప్ట్, స్క్రీన్‌ప్లేతో తెలుగులో మూవీ రాలేదని చెప్పగలను' అని అన్నారు. కార్యక్రమంలో నటి సాహితి దాసరి, నటుడు షానీ, నిర్మాత బెక్కెం వేణుగోపాల్ తదితరులు మాట్లాడారు.

తప్పు చేయలేదు భయపడను

నయనతార



నా తప్పు లేనప్పుడు అవతలి వ్యక్తి ఎంత బలవంతుడైనా భయపడాల్సిన అవసరమేముంది అంటూ స్పందించారు నయనతార. తమిళ అగ్రహీరో ధనుష్‌ను ఉద్దేశించి ఆమె ఆ వ్యాఖ్యలు చేశారు. 'నయనతార: బియాండ్ ద ఫెరీటేల్' డాక్యుమెంటరీకు సంబంధించిన కాపీరైట్ వివాదంతో నయనతార, ధనుష్ తరచూ వార్తల్లో నిలుస్తున్న విషయం తెలిసిందే. ధనుష్ వ్యక్తిత్వాన్ని తప్పుపడుతూ తీవ్ర పదజాలంతో బహిరంగ లేఖను రాసిన నయనతార ఆ తర్వాత పలు వేదికలపై నుంచి ధనుష్‌పై విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ వివాదంపై ఓ ఇంటర్వ్యూలో నయనతార మరోసారి మాట్లాడారు. తమిళ సినీ రంగంలో ప్రముఖుడు, అగ్రహీరో అయిన ధనుష్‌ను సవాల్ చేసేంత ధైర్యం మీకెలా వచ్చింది అని ప్రశ్నించగా, న్యాయం తనవైపు ఉందని బదులిచ్చారు. 'ధనుష్‌కు బహిరంగ లేఖ రాయడం నేను నా డాక్యుమెంటరీ ఫిల్మ్ ప్రచారం కోసం చేసిన ఎత్తుగడ అని కొందరు అనుకుంటున్నారు. నాకు ఆ అవసరం లేదు. నమ్మినదానికోసమే నేను గట్టిగా నిలబడ్డాను. ధనుష్ నుంచి వీడియో క్లిప్స్‌కు సంబంధించిన అనుమతిని పొందేందుకు నేనూ, విఘ్నేశ్ చాలా రకాలుగా ప్రయత్నించాం. మాకు తెలియకుండా ఎప్పుడైనా ఆయన మనసు నొప్పించి ఉంటే మాట్లాడి పరిష్కరించుకుందాం అనుకున్నాం. ఆయన్ను కలిసేందుకు చాలా ప్రయత్నించాం. పలుమార్లు ధనుష్‌కు ఫోన్ చేశాం. అయినా ఆయన స్పందించలేదు. మా మధ్య ఎలాంటి శత్రుత్వం లేదు. ఆయన నాకు మిత్రుడే. ఆయన కోపానికి కారణం నాకు తెలియదు' అని నయనతార తెలిపారు.

అసామాన్యుడి కథ



హీరో విజయ్ సేతుపతి, దర్శకుడు వెట్రిమారన్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'విడుదల-2'. వీరి కాంబినేషన్‌లోనే వచ్చిన 'విడుదల-1'కు సీక్వెల్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. డిసెంబరు 20న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. నిర్మాత చింతపల్లి రామారావు ఈ సినిమా తెలుగు హక్కులను దక్కించుకున్నారు. తెలుగు ట్రైలర్‌ను కథానాయకుడు విజయ్‌సేతుపతి ఇటీవల చెన్నయ్‌లో విడుదల చేశారు. పాటలకు, ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. పరిపాలకుల అహంకారానికి అణచివేతకు గురైన సామాన్యుల నుంచి ఉద్భవించిన ఒక అసామాన్యుడి వీర విప్లవ గాథనే 'విడుదల-2' అని చిత్రబృందం పేర్కొంది. పెరుమాళ్(నక్సలైట్) పాత్రలో విజయ్ సేతుపతి నటించారు. సినిమాకు ఇళయరాజా సంగీతం అందించారు. మంజు వారియర్, సూరి, భవాని శ్రీ, గౌతమ్ వాసుదేవ్ మీనన్, సూర్య సేతుపతి, అనురాగ్ కశ్యప్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

ప్రేమకు వారధి



అనిల్ అర్కా, విహారికా చౌదరి హీరో హీరోయిన్లుగా శ్రీ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన మూవీ 'వారధి'. పెయ్యాల భారతి, ఎం.డి. యూనస్ నిర్మాతలు. తాజాగా ఈ యూత్‌ఫుల్ లవ్ స్టోరీ సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీ కృష్ణ మాట్లాడుతూ 'ఈ కథ లవ్, రొమాన్స్ థ్రిల్లర్‌తో అందరినీ ఆకట్టుకుంటుంది. ప్రేక్షకులందరికీ నచ్చే కథను అందించామనే నమ్మకం ఉంది. త్వరలోనే మూవీని విడుదల చేస్తాం' అని అన్నారు. కాగా, ఈ సినిమా సాంకేతిక నిపుణుల కృషి, కథా కథనాల ప్రత్యేకత, నటీనటుల అభినయం చిత్రానికి ప్రధాన బలంగా నిలుస్తాయని చిత్ర యూనిట్ పేర్కొంది.

బియ్యం స్మగ్లింగ్‌లో జగన్, ముఠా పాత్ర: యనమల

రేషన్ బియ్యాన్ని రీ సైకిల్ చేసి స్మగ్లింగ్ చేయడం వెనుక జగన్, ఆయన ముఠా పాత్ర ఉందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ఆరోపించారు. అందువల్లే జగన్ రేషన్ బియ్యం రీ సైక్లింగ్‌ను సమర్థిస్తూ ప్రకటనలు చేస్తున్నారని ఎక్స్‌లో విమర్శించారు. 'బియ్యం స్మగ్లింగ్‌ను సమర్థించే రీతిలో జగన్ ప్రకటనలు చేయడం చట్ట వ్యతిరేకం' అని చెప్పారు.

సీన్ 1

విజయవాడలో బెంజ్ సర్కిల్. ఉదయం విపరీతంగా ట్రాఫిక్ ఉన్న సమయం. ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నా.. పని చేయడం లేదు. ట్రాఫిక్ పోలీసులు ఉన్నారు కానీ... వాళ్లను వాహనదారులు పట్టించుకోవడంలేదు. బైక్‌లపై ముగ్గురు, కుదిరితే నలుగురు... ట్రాఫిక్ కానిస్టేబుల్ ముందే 'హాయ్' అంటూ వెళ్లిపోతున్నారు. హెల్మెట్, సీట్‌బెల్టుల సంగతి మరిచిపోండి!

సీన్ 2

కేంద్ర పాలిత ప్రాంతం చండీగఢ్‌లో ఒక ఉదయం. మంచి రద్దీ సమయం. ట్రాఫిక్ బాగానే ఉంది. వాహనాలు నిర్ణీత వేగంతో దూసుకెళ్తున్నాయి. ట్రాఫిక్ సిగ్నల్ ఆరెంజ్‌లోకి మారగానే వాహనాలు నెమ్మదించాయి. రెడ్ పడగానే వాహనాలు స్టాప్ లైన్‌కు ఐదారు అడుగుల వెనకే ఆగిపోయాయి. తలపాగాలు పెట్టుకున్న సర్దార్జీలు వినహా... ప్రతి ఒక్కరి తలపైనా హెల్మెట్లు! కారులో డ్రైవర్‌తోపాటు పక్కనున్న ప్రయాణికులకూ సీట్ బెల్టులు! ఆ జంక్షన్‌లో ట్రాఫిక్ కానిస్టేబుల్ కూడా లేడు. అయినా... ట్రాఫిక్ ఉల్లంఘనలు లేవు!

ఈ రెండు దృశ్యాల నడుమ ఎంత తేడా?
మన దగ్గర ఇంత అడ్డగోలుతనానికి కారణమేమిటి?
అక్కడ అంత పద్ధతిగా ఉండడం ఎలా సాధ్యమైంది?

'చలాన్'గఢ్!

చండీగఢ్ నుంచి చాలా నేర్వాలి!

- ట్రాఫిక్ ఉల్లంఘనలపై కొరడా
- అక్కడ నూరు శాతం హెల్మెట్ ధారణ
- గీత దాటితే చలాన్‌లు తథ్యం
- ఏపీలో ఏదీ ట్రాఫిక్ సెన్స్!?
- హైకోర్టు చెప్పినా పట్టింపే లేదు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్ల మన రాష్ట్రంలో మూడు నెలల్లో 667 మంది చనిపోయారు. దీనిపై హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తూ, హెల్మెట్ లేనివారిపై కఠిన చర్యలు అవసరమని నొక్కిచెప్పింది.

విదేశాలకు వెళ్లినప్పుడు మన దేశంలో రోడ్డు ప్రమాదాల అంశం ప్రస్తావనకు వస్తే తల దించుకోవాల్సి వస్తోందని కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ గురువారం పార్లమెంటు సాక్షిగా ఆవేదన వ్యక్తంచేశారు. రెడ్ సిగ్నల్ పడితే ఆగరు.. హెల్మెట్ పెట్టుకోమంటే పెట్టుకోరు.. అందుకే ఇన్ని మరణాలు అంటూ ఆక్రోశించారు.

హైకోర్టు ఆగ్రహించినా, కేంద్ర మంత్రి ఆవేదన వ్యక్తంచేసినా.. ప్రజల్లో మార్పు వస్తేనే రోడ్డు ప్రమాదాలకు చెక్ చెప్పడం సాధ్యమవుతుంది. కొన్ని విషయాల్లో ఆ మార్పు మంచి మాటలతో వస్తే, మరికొన్ని విషయాల్లో కఠినాతి కఠినంగా నిబంధనల అమలు ద్వారానే సాధ్యం. 'ఏక్ భారత్.. శ్రేష్ఠ్ భారత్' కార్యక్రమంలో భాగంగా ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ), విజయవాడ విభాగం ఇటీవల తెలుగు పాత్రికేయుల బృందాన్ని పంజాబ్ పర్యటనకు తీసుకెళ్లింది. ఈ సందర్భంగా చండీగఢ్‌లో కనిపించిన దృశ్యాలు నిబంధనల అమలు, ట్రాఫిక్ ఉల్లంఘనల విషయంలో కఠినంగా ఉండాల్సిన ఆవశ్యకతను కళ్లకు కట్టాయి. వాస్తవానికి చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతం. ప్రణాళికాబద్ధంగా నిర్మించిన నగరం. జనాభా సుమారు 13 లక్షలు. కాస్త అటూఇటుగా బెజవాడ జనాభా కూడా ఇంతే. కాకపోతే విశాలమైన రోడ్లు, వాటి పక్కన సర్వీసు రోడ్లు ఇలా మొదటి నుంచే అక్కడ అంతా ప్రణాళికాబద్ధంగా జరిగిందన్నది వాస్తవం. అయినా అక్కడ ఉండేదీ ప్రజలే కదా. దాంతో అక్కడా ట్రాఫిక్ ఉల్లంఘనలు సహజమే.. అనుకుంటే పొరబడినట్లే! మన రాష్ట్రంలో నిబంధనల అమలు కఠినంగా జరగడం లేదు. అక్కడ చాలా కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇదీ అక్కడికీ ఇక్కడికీ తేడా! గత ఏడాది చండీగఢ్‌లో విధించిన ట్రాఫిక్ చలాన్ల సంఖ్య దాదాపు 8 లక్షలు. అందుకే.. 'గీత'కు అవతలే వాహనదారులు ఆగిపోతారు. నిబంధనలను నిక్కచ్చిగా పాటిస్తారు. ఏ చిన్న ఉల్లంఘననూ సహించని చండీగఢ్‌ను 'చలానాగఢ్' అని కూడా అంటారు.



చండీగఢ్‌లో సిగ్నల్ దగ్గర ఆగిన వాహనాలు.. అందరికీ హెల్మెట్‌లు

మార్పు తెచ్చారు!

చాలీ చాలని ఆదాయంతో బతుకీడ్చే మధ్య తరగతిపై చలాన్ల విధింపు భారమన్న వాదన ఉంది. మరి... ప్రాణాల సంగతేమిటి? పోతే రావు కదా! చండీగఢ్‌లో కఠినంగా అమలు చేస్తున్న చలానా రాజ్ వల్ల ఇప్పుడు ఆ నగర రోడ్లపై హెల్మెట్ లేని వారే కనిపించడంలేదంటే అతిశయోక్తి కాదు. సిటీ టూర్ కోసం ఏర్పాటు చేసిన బస్సులో డ్రైవర్ పక్క సీటులో కూర్చోగానే, 'సీట్ బెల్ట్ పెట్టుకోండి సాబ్' అని ఆ డ్రైవర్ కరాఖండీగా చెబుతారు. ఇదీ... అక్కడి 'రూల్'! 114 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణమున్న చండీగఢ్‌లో రోడ్డు ప్రమాద మరణాలను ఏడాదికి వంద లోపునకు పరిమితం చేయగలగడం 'చలాన్'లు సాధించిన విజయమే!

ప్రజలూ చెప్పొచ్చు!

పోలీసులే కాదు... సామాన్య పౌరులూ చండీగఢ్‌లో 'ట్రాఫిక్ డ్యూటీ' చేస్తారు. ఎవరైనా ఉల్లంఘనులు కనిపిస్తే వెంటనేపౌరులే ఫొటో తీసి పంపేందుకు ఒక ప్రత్యేక వాట్సాప్ నెంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు. తప్పు చేసిన వాళ్లకు జరిమానా... సమాచారం ఇచ్చిన వారికి నజరానా!

చండీగఢ్ ప్రధాన వీధుల్లో సైకిళ్ల కోసం ప్రత్యేకంగా చిన్న రోడ్డు కూడా పక్కన ఏర్పాటు చేయడం మరో విశేషం. ఆ రోడ్డు ఖాళీగా ఉన్నా ఏ బైకూ దానిలోకి వెళ్లడానికి వీల్లేదు. వెళితే ఏం జరుగుతుందో మీకు ఈపాటికే అర్థమై ఉంటుంది కదా! మరో చలాన్ ఖాయం! రాజధాని ఢిల్లీ, చెన్నై వంటి నగరాల్లోనూ హెల్మెట్ ధరించడం, సీటు బెల్టు పెట్టుకోవడం వంటివి పకడ్బందీగా అమలవుతున్నాయి. మనమూ మారాల్సిన అవసరాన్ని అవి చెబుతున్నాయి.

గీత దాటితే అంతే!

ట్రాఫిక్ నిబంధనల అమలుకు చండీగఢ్ ట్రాఫిక్ పోలీసు విభాగం అత్యంత పకడ్బందీగా వ్యవహరిస్తోంది. అన్ని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఏ వాహనదారు స్టాప్ లైన్ దాటినా, హెల్మెట్ లేకుండా రోడ్డెక్కినా, రాంగ్ రూట్‌లో వెళ్లినా కెమెరా క్లిక్ మనడం, ఈ-చలాన్ జారీ అవడం క్షణాల్లో జరిగిపోతుంది. కూడళ్లలో సీసీ కెమెరాలే కాదు.. హైస్పీడ్ బాబుల కట్టడికి స్పీడ్ రాడార్లు, ట్రాఫిక్ కానిస్టేబుళ్ల చేతిలో హ్యాండీక్యామ్స్, వారి టోపీలపై అమర్చిన కెమెరాలు అన్నీ పకడ్బందీగా సమకూర్చారు. చలానాలు విధించినా చాలా మంది చెల్లించకపోవడంపై ఏపీ హైకోర్టు ఘాటుగా స్పందించింది. అలాంటి వారి ఇళ్లకు కరెంటు, నీటి సరఫరా ఆపేయాలని సూచించింది. చండీగఢ్‌లోనైతే చలానాలు కట్టని వాళ్లపై కోర్టు ద్వారానే చర్యలు తీసుకుంటారు.



కఠోర వాస్తవాలు

- ఈ ఏడాది ఇప్పటిదాకా దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారి సంఖ్య 1.68 లక్షలు.
- హెల్మెట్ ధరించకపోడం వల్ల దేశవ్యాప్తంగా ఏడాదికి చనిపోతున్న వారి సంఖ్య 30 వేలపైనే.
- హెల్మెట్ ధరించక రాష్ట్రంలో 3 నెలల్లో మరణించిన వారి సంఖ్య 667.
- రాష్ట్రవ్యాప్తంగా అవసరమైన ట్రాఫిక్ పోలీసుల సంఖ్య 8,770. ఉన్నది 1,994 మందే.
- చండీగఢ్ నగరంలో గత ఏడాది జారీ చేసిన ట్రాఫిక్ చలాన్ల సంఖ్య దాదాపు 8 లక్షలు.
- ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబరు వరకు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా వేసిన చలాన్లు 5.62 లక్షలు.

కర్మయోగి పోర్టల్‌లో ఏపీ అగ్రస్థానం

- ఏడు లక్షల మంది ఉద్యోగుల చేరిక

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన కర్మయోగి పోర్టల్‌లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. గురువారం నాటికి ఇందులో 7లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు చేరారు. మరే రాష్ట్రంలోనూ ఇంత సంఖ్యలో ఉద్యోగులు చేరలేదు. అత్యుత్తమ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల పనితీరును మెరుగుపర్చే లక్ష్యంతో కేంద్రం ఈ పోర్టల్‌ను ప్రారంభించింది. దీనికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా మరికొన్ని శిక్షణ కార్యక్రమాలు జత చేసింది. ప్రతి ఉద్యోగి ఏడాదిలో కనీసం 50 గంటలు ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనాలని, వారికి సర్టిఫికెట్లు, ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించింది. ప్రమోషన్లలో ఈ శిక్షణను ప్రాతిపదికగా తీసుకోవాలని యోచిస్తున్నారు. స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్‌పై కూడా ఉద్యోగులకు శిక్షణ ఇచ్చే యోచనలో ప్రభుత్వం ఉంది.

కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఏర్పాటు

ఆంధ్రప్రదేశ్ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేస్తూ కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖ తాజాగా గెజిట్ ఉత్తర్వులు జారీచేసింది. మూడేళ్ల కాలపరిమితి ఉండే ఈ అథారిటీకి రాష్ట్ర అటవీశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఎక్స్‌అఫీషియో సభ్యులుగా రెవెన్యూ (విపత్తుల నిర్వహణ), మత్స్య, పరిశ్రమలు, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖ కార్యదర్శులు లేదా కమిషనర్లు, కాలుష్య నియంత్రణ మండలి సభ్యకార్యదర్శి, ఎక్స్‌పర్ట్ మెంబర్లుగా నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ చీఫ్ సైంటిస్ట్ షేక్ బాషా, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషినోగ్రఫీ చీఫ్ సైంటిస్ట్ వీవీఎస్ఎస్ శర్మ, కృష్ణా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎల్.సుశీల, విశాఖకు చెందిన ఎన్.వెంకట భాస్కరరావు, ఎన్జీవో ఎన్ఎస్ఎస్.శరత్‌చంద్ర నియమితులయ్యారు.

అమల్లోకి ఐటీ అండ్ జీసీసీ పాలసీ

అమరావతి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) అండ్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్ (జీసీసీ) 2024-29 పాలసీ అమలుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈమేరకు ఐటీ శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. అంతర్జాతీయంగా ప్రఖ్యాతి గాంచిన సంస్థలతో సహా రాష్ట్రంలోని ఐటీ రంగ యువత స్థాపించే స్టార్టప్‌లకు ప్రోత్సాహకాలు ఇచ్చేలా పాలసీని రూపొందించారు.

రంజాన్‌ను బట్టి టెన్త్ సోషల్ పరీక్ష

పదో తరగతికి బుధవారం ప్రకటించిన పరీక్షల షెడ్యూలులో సోషల్ పరీక్ష మార్చి 31న జరుగుతుందని తెలిపారు. కానీ ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన సాధారణ సెలవుల్లో అదే రోజు రంజాన్ పండుగ ఉంది. నెలవంక ఆధారంగా ఆ తేదీ మారుతుందని సాధారణ సెలవుల జీవోలో పేర్కొంది. దీంతో సోషల్ పరీక్ష కూడా నెలవంక ఆధారంగా మార్చి 31న లేదా ఏప్రిల్ 1న జరుగుతుందని గురువారం సవరణ షెడ్యూల్ జారీ అయింది.

భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు 52 శాతం పూర్తి: కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణ పనులు నవంబరు నాటికి 52.44 శాతం పూర్తయ్యాయని విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ తెలిపారు. గురువారం లోక్‌సభలో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు.

'సరస్వతి'లో అసైన్డ్ భూములు వెనక్కి!

(మొదటి పేజీ తరువాయి)

నిర్ధయించింది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో సరస్వతి పవర్ ఇండస్ట్రీస్ నిర్మాణం పేరిట జగన్ కుటుంబసభ్యులు ఉమ్మడి గుంటూరు జిల్లా (ప్రస్తుతం పల్నాడు జిల్లా) మాచవరం మండలం చెన్నాయపాలెం, పిన్నెల్లి, వేమవరం, తంగెడ, ముత్యాలంపాడు గ్రామాల్లో 1,032 ఎకరాలను రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఇందులో 956.42 ఎకరాలు పట్టాభూమి కాగా.. 76.33 ఎకరాలు చుక్కల భూమి అని రెవెన్యూ రికార్డులో నమోదైంది. భూములు సేకరించిన ఐదారేళ్లలోపు పరిశ్రమ నిర్మించి.. రైతులకు, భూములు కోల్పోయిన కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అప్పట్లో నమ్మించారు. కానీ కొనుగోలు చేసి సుమారు 14 ఏళ్లు కావస్తున్నా పరిశ్రమ నిర్మించలేదు. రైతులకు ఉపాధి చూపకపోగా ఆ భూముల్లో ఫ్యాక్టరీ నిర్మించే వరకు పంట సాగుచేసుకుంటామని ముందుకొచ్చినవారిపై 2014లో మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బాంబులు, వేట కొడవళ్లతో దాడులకు పాల్పడ్డారు. ఆ తర్వాత 2019లో అధికారం చేపట్టిన జగన్ ఫ్యాక్టరీ నిర్మించకుండానే నీటి కేటాయింపులు, మైనింగ్‌కు లీజులు మంజూరు చేసుకున్నారు.

డిప్యూటీ సీఎం పవన్ రాకతో..

సరస్వతి పవర్ భూములపై వివాదం ఏర్పడడంతో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గత నెల 4వ తేదీన వాటిని పరిశీలించారు. అంతకు ముందు సంబంధిత రెవెన్యూ అటవీ శాఖల అధికారులు ఉమ్మడి సర్వే నిర్వహించి.. 74 ఎకరాల వరకు అటవీ, అసైన్డ్ భూమి ఉన్నట్లు తేల్చారు. వేమవరంలో 19 మంది రైతులు 13.80 ఎకరాలు, పిన్నెల్లిలో 13 మంది రైతులు 3.89 ఎకరాల అసైన్డ్ భూమిని ఫ్యాక్టరీకి రిజిస్ట్రేషన్ చేసినట్టు నిర్ధారణ అయింది. అసైన్డ్ భూములు ఎలా విక్రయించారని ఆయా రైతులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీచేశారు. వారు స్పందించకపోవడంతో ఆ భూమిని స్వాధీనం చేసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. సరస్వతి యాజమాన్యం అసైన్డ్ భూమిని ఎలా కొనుగోలు చేసిందో తేలాల్సి ఉంది.

కూతుర్ని వేధించాడని..

కువైత్ నుంచి వచ్చి చంపేశాడు

- అన్నమయ్య జిల్లాలో ఘటన.. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం
- భార్యతో కలిసి బతుకుతెరువు కోసం కువైత్ వెళ్లిన తండ్రి
- కుమార్తె బాగోగులు చూడాలని మరదలికి అప్పగింత
- బాలికపై కన్నేసిన మరదలి మామ
- అసభ్యంగా ప్రవర్తన.. తండ్రికి చెప్పిన బాలిక
- పోలీసులను ఆశ్రయించినా న్యాయం జరగలేదని వేదన

రాయచోటి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లె మండలానికి చెందిన ఓ వ్యక్తి బతుకు దెరువు కోసం తన భార్యతో సహా కొంతకాలం క్రితం కువైత్‌కు వెళ్లాడు. తన 12 ఏళ్ల కూతురు బాగోగులు చూడమని తన భార్య సోదరికి అప్పగించాడు. ఆ మరదలి ఇంట్లో ఆమె మామ కూడా ఉంటున్నాడు. బాలిక హాస్టల్లో ఉంటూ అప్పుడప్పుడు పిన్ని ఇంటికి వచ్చి వెళ్లేది. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల క్రితం ఇంటికి వచ్చిన బాలిక పట్ల వరుసకు తాత అయిన పిన్ని మామ అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని బాలిక ఫోన్‌లో తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో ఆందోళన చెందిన తల్లి తన సోదరికి ఫోన్ చేసి మాట్లాడింది. ఆమె సరిగా స్పందించకపోవడంతో కువైత్ నుంచి వచ్చి ఇక్కడి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని పోలీసులు పిలిపించి మందలించి పంపేశారు. తర్వాత బాలిక తల్లి తిరిగి కువైత్ వెళ్లిపోయి భర్తకు జరిగిన విషయం చెప్పింది. పోలీసులను ఆశ్రయించినా తమకు న్యాయం జరగలేదని భావించిన ఆ తండ్రి కువైత్ నుంచి ఈనెల 6వ తేదీన స్వగ్రామానికి వచ్చాడు. శనివారం తెల్లవారుజామున ఇంటి వద్ద నిద్రిస్తున్న మరదలి మామను ఇనుపరాడ్డుతో కొట్టి హత్య చేశాడు. వెంటనే కువైత్‌కు వెళ్లిపోయాడు. దీంతో హత్య కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణ చేయడం మొదలుపెట్టారు. దీంతో బాలిక తండ్రి బుధవారం ఈ హత్యకు గల కారణాలను వివరిస్తూ ఓ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఈ హత్యతో ఇతరులకు సంబంధం లేదని తాను పోలీసులకు లొంగిపోతానని పేర్కొన్నాడు. ఈ వీడియో తెలుగురాష్ట్రాల్లో తీవ్ర సంచలనం సృష్టించింది. నిందితుడు యూట్యూబర్ అని, అతనికి లక్షల మంది ఫాలోవర్లు ఉన్నట్లు తెలిసింది. వివిధ రకాల అంశాలపై అతను వీడియోలు చేస్తూ.. యుట్యూబ్‌లో పోస్టు చేస్తాడు. ప్రస్తుతం నిందితుడు కువైత్ నుంచి వచ్చి ఓబులవారిపల్లె పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. హత్య ఘటనపై పూర్తి స్థాయిలో పోలీసులు విచారిస్తున్నారు.

తండ్రి ఆరోపణల్లో నిజం లేదు: ఎస్పీ

పోలీసులు చర్యలు తీసుకోనందునే తాను హత్య చేసినట్లు నిందితుడు చేసిన ఆరోపణలో నిజం లేదని అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆంధ్రజ్యోతికి తెలిపారు. చెల్లి మామగారిపై కేసు నమోదు చేయాలని బాలిక తల్లి తమను కోరలేదని, అతడిని పిలిపించి హెచ్చరించాలనే చెప్పిందని తెలిపారు. రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామన్నా.. ఆమె చేయలేదన్నారు. సోషల్ మీడియాలో నిందితుడు వీడియో పోస్టు చేసి సానుభూతి కోసం ప్రయత్నిస్తున్నాడన్నారు. మృతుడు బాలికను తాకి అసభ్యకరంగా ప్రవర్తించిన మాట వాస్తవమని, అయితే అతను వికలాంగుడని, పూర్తిగా నిలబడలేడన్నారు. విచారణలో పూర్తి వివరాలు వెలుగులోకి వస్తాయని చెప్పారు.

3 జిల్లాల్లో ఎడతెరపిలేని వాన

- రెండు రోజుల్లో మరో అల్పపీడనం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

నైరుతి బంగాళాఖాతంలోని తీవ్ర అల్పపీడనం పశ్చిమ వాయవ్యంగా పయనించి శుక్రవారం నాటికి బలహీనపడనుంది. దీని ప్రభావంతో తమిళనాడు, రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాల్లో బుధవారం రాత్రి నుంచి వర్షాలు కురుస్తున్నాయి. గురువారం ఉదయం నుంచి తిరుపతి, పరిసర ప్రాంతాల్లో ఎడతెరిపిలేకుండా వర్షాలు కురిశాయి. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు తిరుపతి జిల్లా బీఎన్ కండ్రిగలో 162.6 మి.మీ., పడమలలో 121.25, భీములవారిపాలెంలో 119.5, తొట్టంబేడులో 94.75, బాలయ్యపల్లెలో 94.5, శ్రీకాళహస్తిలో 92.75, లాలాపేటలో 92.25, తడలో 90.25 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. స్వర్ణముఖి, కాళంగి నదులతో పాటు పలు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కాజ్‌వేలపైకి వరద నీరు చేరడంతో పలు మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. 12 మార్గాల్లో 43 బస్సు సర్వీసులను ఆర్టీసీ నిలిపివేసింది. వాకాడు మండలం స్వర్ణముఖి బ్యారేజీలోకి భారీగా వరద చేరడంతో గేట్లు తెరిచి పది వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు. పిచ్చాటూరు మండలం ఆరణియార్, కేవీబీపురం మండలం కాళంగి రిజర్వాయర్లు నిండిపోయాయి. రేణిగుంట మండలం మల్లిమడుగు, చంద్రగిరి మండలం కళ్యాణి డ్యాముల్లోకి వరద నీరు వస్తోంది. గురువారం పాఠశాలలకు కలెక్టర్ సెలవు ప్రకటించగా రెవెన్యూ సదస్సులు సైతం రద్దయ్యాయి. చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లోనూ రోజంతా ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది.

తిరుమలలో భక్తులకు ఇబ్బందులు..

తిరుమలలో వర్షం కురవడంతో శ్రీవారి భక్తులు ఇబ్బందులు పడ్డారు. గాలులు జతకావడంతో చలి విపరీతంగా పెరిగింది. చాలా మంది దర్శనం పూర్తికాగానే తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. కొందరు గదులకే పరిమితయ్యారు. ఎడతెరిపి లేని వర్షానికి తిరుమల రెండవ ఘాట్‌రోడ్డుపై కొండచరియలు విరిగిపడ్డాయి. హరిణి విశ్రాంతి షెడ్ సమీపంలో ఓ భారీ బండరాయితోపాటు మట్టి, చిన్నపాటి రాళ్లు విరిగిపడ్డాయి. తిరుమలలోని జలాశయాల్లో భారీగా నీరు చేరింది. రానున్న 24 గంటల్లో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల్లో భారీవర్షాలు, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న 2రోజుల్లో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. ఇది తమిళనాడు, శ్రీలంక దిశగా పయనించే క్రమంలో 17 నుంచి దక్షిణ కోస్తా, సీమల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. 18న రాష్ట్రంలో అనేకచోట్ల వర్షాలు కురుస్తాయన్నారు.

వర్షాలపై అప్రమత్తం: హోంమంత్రి

భారీ వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత ఆదేశించారు. కాగా మధ్య భారతంలో నెలకొన్న శీతలగాలుల ప్రభావంతో రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాలు, శివారు ప్రాంతాల్లో చలి ప్రభావం పెరిగింది. అల్లూరి జిల్లా జి.మాడుగులలో 12.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

అవంతి ఓ ఊసరవెల్లి: బుద్దా వెంకన్న



విజయవాడ(వన్‌టౌన్), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): 'అవంతి శ్రీనివాస్... నీలాంటి ఊసరవెల్లులు మాకేం సమయం ఇవ్వాల్సిన అవసరం లేదు' అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు. గురువారం అవంతిని ఉద్దేశించి ఆయన ఎక్స్‌లో స్పందించారు. వైసీపీ ప్రభుత్వంలో నాయకులు సర్వం స్వాహా చేశారన్న విషయం ప్రజలకు తెలుసన్నారు. 'ఆ దోపిడీలో జగన్‌రెడ్డి, నువ్వూ భాగస్వాములే. నీకు రాజకీయ జన్మ ఇచ్చిన చిరంజీవికి, పవన్ కల్యాణ్‌కు ద్రోహం చేశావు. రాజకీయ పునర్జన్మ ఇవ్వటమే కాకుండా గల్లీస్థాయి వ్యక్తివైన నిన్ను ఢిల్లీకి తీసుకెళ్లిన చంద్రబాబునూ అవమానించావు. నీ సానుభూతి కూటమికి అవసరం లేదు' అని అన్నారు.

దశ దిశ

ఎక్సైజ్‌లో అవకతవకలు

- వెంటనే ఫుల్‌స్టాప్ పెట్టాలి
- అవినీతిని పూర్తిగా నిర్మూలించాలి
- అధికారులకు సీఎం ఆదేశం

అమరావతి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖలో కొన్ని అవకతవకలు జరుగుతున్నాయని, వెంటనే వాటికి ఫుల్‌స్టాప్ పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఎక్సైజ్ అనగానే అవినీతి జరుగుతుందని, ఏమైనా చేయొచ్చనే అభిప్రాయం ఉంటుందని, అవినీతిని పూర్తిగా నిర్మూలించాలని స్పష్టం చేశారు. ప్రతి షాపులో డిజిటల్ చెల్లింపులు తప్పనిసరి చేసేలా భవిష్యత్తులో నిబంధనలు పెట్టాలన్నారు. గత ప్రభుత్వం నాణ్యత లేని మద్యం విక్రయించిందని, డిజిటల్ చెల్లింపులు లేకుండా అక్రమాలకు పాల్పడ్డారని చంద్రబాబు ఆరోపించారు. ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా మాట్లాడుతూ.. నాటుసారా నియంత్రణకు జనవరి మొదటి వారంలో ప్రత్యేక కార్యక్రమం ప్రారంభిస్తున్నామని తెలిపారు. 2025 చివరికి రాష్ట్రంలో నాటుసారా రహితంగా ప్రకటించడం లక్ష్యమని చెప్పారు.

రవాణా చార్జీలు తగ్గించడంపై దృష్టి సారించాలి: చంద్రబాబు

సామాన్యుడికి ఉచిత ఇసుక ఇవ్వాలి

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సామాన్యుడికి ఇసుక అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్లను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రణాళిక శాఖ మంత్రి ప్రతి జిల్లాలో కలెక్టర్, ఎస్పీలతో కలిపి సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక విషయంలో తాము కూడా సమాచారం తెప్పిస్తున్నామని, ఇప్పుడు సరఫరా దారిలో పడిందన్నారు. ఇంకా రవాణా చార్జీలు తగ్గించేందుకు అవకాశం ఉందని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇదే సమయంలో మంత్రి నాదెండ్ల మనోహర్ కల్పించుకుని.. ఇసుకపై కలెక్టర్లు, ఎస్పీలు ఎవరూ మాట్లాడలేదన్నారు. క్షేత్రస్థాయిలో ఇసుక అందుబాటులో ఉన్నప్పటికీ, జిల్లాల్లో కొంతమంది గ్రూప్‌లుగా ఏర్పాటై ధరలను నియంత్రిస్తున్నారన్నారు. తొలుత మైనింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేశ్‌కుమార్ మీనా ప్రజెంటేషన్‌లో మైనింగ్‌పై స్పష్టత ఇచ్చారు. పట్టా భూముల్లో మైనింగ్‌కు కలెక్టర్లు అనుమతులు ఇవ్వాలన్నారు. ఇసుకపై విజిలెన్స్ చాలా ముఖ్యమని, ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయన్నారు. ధరలు ఎక్కువగా వసూళ్లు చేయడంతోపాటు ఇసుక సరిహద్దులు దాటిపోతోందని, చెక్‌పోస్టుల్లో నిఘా పెంచాలని, రవాణా వెనుక ఎవరున్నారో గుర్తించాలన్నారు. ప్రత్యేక కాల్‌సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు.

నేరాల కట్టడికి.. త్రిముఖ వ్యూహం!

- అనుభవజ్ఞులతో టెక్నో పోలీసింగ్‌పై కమిటీ
- 'సోషల్' సైకోల కట్టడికి కఠిన చట్టాలు
- ఎస్పీలు, కలెక్టర్లకు చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో నేరాల నియంత్రణకు కూటమి ప్రభుత్వం త్రిముఖ వ్యూహం సిద్ధం చేసింది. సోషల్ మీడియా ద్వారా రెచ్చిపోతున్న సైకోలు, సైబర్ నేరగాళ్ల కట్టడికి కఠిన చట్టాలు ప్రయోగించబోతోంది. అధునాతన టెక్నాలజీని వినియోగించి అన్ని రకాల నేరాల నియంత్రణకు ముగ్గురు అనుభవజ్ఞులైన అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి 15 రోజుల్లోనే చర్యలకు ఉపక్రమించనుంది. గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణ కోసం 'ఈగిల్' విభాగానికి పోలీసు, ఎక్సైజ్ శాఖలు సహకరించాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. గురువారం కలెక్టర్లు, ఎస్పీలతో జరిపిన సమావేశంలో రాష్ట్రంలో శాంతి భద్రతలపై ఆయన సమీక్షించారు. ప్రస్తుతం నేరాల తీరు మారిందని, సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేసి ప్రజల్ని దోచుకుంటుంటే.. వ్యవస్థీకృత నేరస్థులు గంజాయి సరఫరా చేసి సమాజాన్ని, భావితరాలను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. మరోవైపు నేరగాళ్లు రాజకీయాల్లోకి వచ్చి అసభ్య భాషతో సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ సమాజంలోని అన్ని వర్గాలనూ మానసికంగా వేధిస్తున్న తీరు అత్యంత ప్రమాదకరమన్నారు. వీటి కట్టడికి పోలీసులు నడుం బిగించాలని, అవసరమైన సహకారం ప్రభుత్వం అందిస్తుందని భరోసా ఇచ్చారు. గడచిన ఐదు నెలల్లో నేరాల కట్టడి తీరు బాగుందని.. టెక్నాలజీని వినియోగించుకుని సమర్థ పోలీసింగ్ నిర్వహిస్తే నేరస్థులు తోక ముడుస్తారని చెప్పారు. సోషల్ మీడియాలో బూతులను అదుపు చేశారని..ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని.. ఇందుకు పోలీసులను అభినందిస్తున్నానని అన్నారు. 'మద్యం అక్రమాలపై సీఐడీ, ఇసుక దోపిడీపై ఏసీబీ విచారణ జరుగుతోంది. ఇసుక అక్రమ రవాణా ఆగాలి. ముఖ్యంగా సరిహద్దు జిల్లాల్లో నిఘా పెట్టాలి. సీసీటీవీ కెమేరాలు ఏర్పాటు చేసి ఒక్క టన్ను కూడా ఎగుమతి కాకుండా ఆపాలి' అని ఆదేశాలిచ్చారు. ఇందులో ఏ పార్టీ వ్యక్తులున్నా చర్యలు తీసుకోవాలని తేల్చి చెప్పారు.

> ఒకప్పుడు ఫ్యాక్షన్, రౌడీయిజం, మావోయిస్టు, కమ్యూనల్ సమస్యలు ఉండేవి. ఇప్పుడు గంజాయి, డ్రగ్స్ సవాల్‌గా మారాయి.
>
> బ్రహ్మకుమారీల వ్యక్తిత్వాన్ని కూడా కించపరుస్తూ నీచాతినీచంగా సోషల్ మీడియాలో పెడుతున్నారు. వీళ్లను వదిలేస్తే సమాజానికి చాలా ప్రమాదం.
>
> - ముఖ్యమంత్రి చంద్రబాబు



రెండో రోజైన గురువారం కలెక్టర్ల సదస్సులో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు

తాగినోళ్లు అబద్ధం చెప్పరు..

ఎన్నికల్లో మాటిచ్చినవిధంగా నాణ్యమైన లిక్కర్ సరఫరా చేయిస్తున్నామని, నాసిరకం మద్యం కట్టడికి చర్యలు తీసుకుంటున్నామని సీఎం చెప్పారు. మద్యం కొనుగోలుకు డిజిటల్ పేమెంట్లు చేసే వారి నంబర్లకు ఫోన్‌చేసి ఎక్కువ ధర వసూలు చేస్తున్నారో లేదో ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని చంద్రబాబు సూచించగా.. అందుకు 14405 టోల్‌ఫ్రీ నంబర్ ఉందని, ప్రతి షాపులో రెండు సీసీ కెమేరాలు పెడుతున్నామని ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా చెప్పారు. 'తాగినోడు అబద్ధం చెప్పడు.. ఫీడ్ బ్యాక్ తీసుకోండి' అని సీఎం చమత్కరించడంతో సమావేశంలో నవ్వులు విరిశాయి. గంజాయి వల్ల గిరిజనులకు వచ్చే ప్రయోజనం కన్నా జరిగే నష్టం వంద రెట్లు ఎక్కువని, దీనిపై గిరిజనుల్లో చైతన్యం తీసుకురావాలని సీఎం సూచించారు.

సోషల్ సైకోలకు శాస్తి చేయాలి..

సమాజంలో అన్ని వర్గాలను మానసిక వేదనకు గురిచేస్తూ రెచ్చిపోతున్న సోషల్ మీడియా సైకోలకు తగిన శాస్తి చేయాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. ఈ అరాచకాలపై అధ్యయనానికి హోంమంత్రి అనిత, ఐటీ మంత్రి లోకేశ్, పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ సభ్యులుగా మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. 'పోలీసింగ్ సమర్థంగా ఉంటేనే క్రిమినల్స్ తగ్గుతారు. టెక్నాలజీ వినియోగిస్తే ఎంత తెలివైన క్రిమినల్ అయినా దొరుకుతాడు.. పోలీసులు అసమర్థులైతే నేరగాళ్లు సమర్థులవుతారు.. వారు రాజకీయ నాయకులైతే అసభ్యత పరాకాష్ఠకు చేరుతుంది' అని చెప్పారు.

బీసీల స్వయం ఉపాధికి ప్రాధాన్యం

- 1,878 కోట్లతో 1.38 లక్షల మందికి లబ్ధి
- బీసీ విద్యార్థులకు డీఎస్సీ కోచింగ్: సీఎం

బీసీ సంక్షేమ శాఖకు రూ.1,878 కోట్లు కేటాయించామని, దీనిద్వారా 1.38 లక్షల మందికి లబ్ధి కలుగుతుందని సీఎం చంద్రబాబు చెప్పారు. గురువారం కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడారు. బీసీ విద్యార్థులకు మెగా డీఎస్సీ కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. హాస్టళ్లు పరిశుభ్రంగా ఉండాలని, విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫీడర్ అంబులెన్సులు ఉన్నా.. గిరిజన ప్రాంతాల్లో ఇంకా డోలీలు మోసే పరిస్థితి ఉండటం ఇబ్బందికరమన్నారు. అంగన్వాడీల్లో మౌలిక వసతులకు నిధులు కేటాయించామని, తక్షణమే పనులన్నీ పూర్తిచేయాలని ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి పోలా భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 46 బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించేందుకు నిధులు కేటాయించాలన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి కన్నబాబు మాట్లాడుతూ రూ.143 కోట్లతో హాస్టళ్ల మరమ్మతులు చేపడుతున్నామన్నారు. సింగిల్ విండో ద్వారా గిరిజనులకు ధ్రువపత్రాలు, రేషన్‌కార్డులు జారీ చేయాలన్నారు.

లోన్ యాప్ కొత్త పెళ్లికొడుకు ప్రాణాలు తీసింది: మంత్రి లోకేశ్

'రాష్ట్రంలో లోన్ యాప్‌ల సమస్య కూడా ఉంది. కేవలం రెండు వేల అప్పు కోసం ఓ యువకుడిని విశాఖలో లోన్ యాప్ బలి తీసుకుంది. వడ్డీలపై వడ్డీలు వేసి కొత్త పెళ్లికొడుకు ఫోను నుంచి ఫొటోలు లాగేసి అతని భార్య ఫొటో మార్ఫింగ్ చేసి బంధువులకు పంపి అవమానానికి గురిచేసి ఆత్మహత్యకు పాల్పడేందుకు కారణమయ్యారు. కఠిన చట్టం తీసుకొచ్చి చర్యలు తీసుకోవాలి' అని మంత్రి లోకేశ్ అన్నారు. దీనితో ఏకీభవించిన సీఎం.. సమస్య పరిష్కారానికి కీలక సూచనలు చేయాలంటూ మంత్రివర్గ ఉపసంఘాన్ని ప్రకటించారు. దీనిపై విజిలెన్స్ డీజీ హరీశ్‌కుమార్ గుప్తా స్పందిస్తూ 'ప్రజల ప్రాణాలు తీస్తున్న చైనా యాప్‌లపై ఆరా తీస్తున్నాం.. విదేశాలకు చెందిన వీటికి ఇక్కడి ఆర్గనైజర్లు, ఏజెంట్లు ఎవరో, ఇతరత్రా వ్యవహారాలన్నీ సేకరిస్తున్నాం. 15 రోజుల్లో కొలిక్కి తెస్తాం' అని చెప్పారు.


అక్కడ ఆచారం.. ఇక్కడ నేరం..!

రాష్ట్రంలో గంజాయి, మత్తు పదార్థాల కట్టడికి ఏర్పాటైన 'ఈగిల్' విభాగం అధిపతి ఐజీ రవికృష్ణ సమీక్షలో ఆసక్తికరమైన అంశాలు వెల్లడించారు. 'నరసరావుపేట క్వారీల్లో గంజాయి వినియోగంపై సమాచారం వచ్చింది.. వెళ్లి చూడగా అక్కడ పనిచేస్తున్న ఒడిశా కూలీలు సొంత రాష్ట్రం నుంచి తెచ్చుకుని వాడుతున్నారు. చర్యలకు ఉపక్రమించగా ఇది తమ ఆచారమని, త్రినాథ స్వామి జాతరలో, పూజలో ఉపయోగించి స్వీకరిస్తామని చెప్పారు. అయితే ఇక్కడ అలా చేయడం నేరమని చెప్పాం. రాష్ట్రవ్యాప్తంగా ఐదారు లక్షల మంది ఒరియా కూలీలున్నారు. వారందరిలో అవగాహన కల్పిస్తున్నాం.. విజయనగరంలో పదహారేళ్ల కుమార్తె అర్ధరాత్రి దాటినా ఇంటికి రాలేదంటూ తల్లి ఫోన్ చేశారు.. కుమార్తె మత్తుకు బానిసైంది.. ఆరా తీస్తే పదమూడేళ్ల ఆమె తమ్ముడు కూడా ఈ ఊబిలో చిక్కుకున్నాడు.. గుంటూరు పట్టాభిపురం పోలీసు స్టేషన్ పరిధిలో 17 మంది విద్యార్థులపై కేసు నమోదైంది.. గంజాయి, మత్తు పదార్థాల కట్టడిలో.. మూలం, రవాణా, సరఫరా అవుతున్న ప్రాంతం, డిమాండ్‌పై ఈగిల్ దృష్టి పెట్టింది. అల్లూరి జిల్లాలోని 9 మండలాల్లో 358 గ్రామాల పరిధిలో గతంలో గంజాయి సాగయ్యేది. ఇప్పుడు ప్రత్యామ్నాయ పంటలు సాగవుతున్నాయి. ఒడిశా ఏఎన్‌టీఎఫ్‌తో ఈగిల్ సమన్వయంతో వ్యవహరిస్తోంది. తమిళనాడు, తెలంగాణ, కేరళ పోలీసుల నుంచి సమాచారం తీసుకుంటున్నాం. అన్ని పాఠశాలల్లో 'డ్రగ్స్ వద్దు బ్రో' నినాదాన్ని కోటి మంది వరకూ తీసుకెళ్లాం' అని తెలిపారు.

టెక్నాలజీ లేకుంటే పోలీసులు ఏంచేస్తారు?

తాను ముఖ్యమంత్రి అయిన తొలినాళ్లలో జరిగిన ఓ ఘటనను చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. 'తిరుపతిలో ఒక క్రిమినల్ సైకోలాగా మహిళల తలలపై రాళ్లతో కొట్టి చంపేవాడు.. ఒంటిపై నగలు కూడా తీసుకెళ్లేవాడు కాదు.. అప్పటి డీజీపీ హెచ్‌జే దొరను పిలిచి 30 మందిని చంపినా అతడెవరో గుర్తించలేరా అని అడిగా. ఫింగర్ ప్రింట్స్ లేవని ఆయన చెప్పారు.. ఇప్పుడు కూడా ఫేషియల్ రికగ్నైజేషన్ లేదు. పోలీసులకు ఏమీ ఇవ్వకుంటే ఏం పని చేస్తారు..? మీకు కావలసింది ఇస్తా.. మూడు నెలల్లో నేరాలను కట్టడి చేయాలి' అని స్పష్టం చేశారు.

టెక్నాలజీతో నేరాలకు బ్రేకులు: డీజీపీ



నేరాల నియంత్రణలో టెక్నాలజీ వినియోగించి మూడేళ్ల పిల్ల నుంచి 73 ఏళ్ల వృద్ధురాలి హత్య వరకూ వెలికి తీశాం. ఆలయాల దొంగలను పట్టుకున్నాం. అమ్మవారి, స్వామి వారి నగలు రికవరీ చేశాం.. ఆరు నెలల్లో సైబర్ నేరగాళ్లు రూ.293 కోట్లు దోచేశారు.. 44 కోట్లు రికవరీ చేసి బాధ్యులను గుర్తించాం. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన తెస్తున్నాం. ఇప్పటి వరకూ 2.93 లక్షల మంది సైబర్ సభ్యులయ్యారు. విజయనగరం పోలీసులు డిజిటల్ అరెస్టు నిందితులను అదుపులోకి తీసుకుని రూ.20 లక్షలకు గాను 19.2 లక్షలు రికవరీ చేశారు.

ఇది ఉపాధి రాజధాని

- నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలి
- కలెక్టర్ల సదస్సులో మున్సిపల్‌శాఖపై సీఎం సమీక్ష

అమరావతి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అమరావతి ప్రజారాజధాని అని, యువతకు ఉపాధి కల్పించే రాజధాని అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో విశాఖ, తిరుపతి, అమరావతి నగరాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలను కల్పించే లక్ష్యంతో పనిచేస్తున్నామన్న ఆయన.. నైపుణ్యాభివృద్ధి శిక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త అనే విధానం రాష్ట్రమంతా అమలు కావాలని కోరారు. అమరావతి రాజధాని పనులు పునఃప్రారంభానికి అవసరమైన నిధుల్లో రూ.20,500 కోట్లకు సీఆర్‌డీఏ అథారిటీ ద్వారా పరిపాలన ఆమోదం తీసుకున్నామని సీఆర్‌డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్ తెలిపారు. కాగా, ఇక నుంచి ప్రతి మూడో శనివారాన్ని స్వచ్ఛభారత్ రోజుగా జరపాలని సీఎం అన్నారు. రాష్ట్ర స్థాయిలో అన్న క్యాంటీన్లకు సంబంధించి ఒక కమిటీ వేస్తామని మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖపై సమీక్ష చేస్తూ చంద్రబాబు తెలిపారు. ప్రతి పట్టణంలో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ద్వారా తాగునీరు అందించాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ సెక్రటరీ కన్నబాబు తెలిపారు.

ఆర్నెల్ల పాలనలో అనేక అడుగులు

"రాష్ట్ర ప్రజల బలమైన కోరికతో ఆవిర్భవించిన ప్రజా ప్రభుత్వ పాలనకు ఆరు నెలలు నిండాయి. తమ అభివృద్ధి కోసం, తమ పిల్లల భవిష్యత్తు కోసం ఎన్నో ఆశలతో కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకున్నారు. బాధ్యతలు చేపట్టిన తొలి క్షణం నుంచీ ప్రజల ఆశలను, ఆకాంక్షలను తీర్చేందుకు నేను, నా మంత్రివర్గ సహచరులు కృషి చేస్తున్నాం. గాడి తప్పిన వ్యవస్థల్ని ఈ ఆరు నెలల్లో సరిదిద్దాం. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి నిలబెట్టాం. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాం. రాష్ట్రమే ఫస్ట్...ప్రజలే ఫైనల్ అనే నినాదంతో ప్రతి క్షణం పనిచేస్తున్నాం. చేయాల్సింది ఎంతో ఉందనే బాధ్యతను గుర్తెరిగి.. ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. మీ ఆశీస్సులు, భాగస్వామ్యంతో...స్వర్ణాంధ్ర -2047 విజన్‌తో ఆంధ్రప్రదేశ్‌ను నంబర్ 1గా నిలబెడతాం" అని ఎక్స్‌లో సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.



అమరావతి రాజధానిలోని ఎన్‌జీవోల కోసం భవనాలు నిర్మించే ప్రాంతంలో విద్యుత్ లైన్ల ఏర్పాటు శరవేగంగా సాగుతోంది. మంచినీటి తరలింపు కోసం కాలువల నిర్మాణం, వాటికి పైపులు వేసే పనులు కొనసాగుతున్నాయి.



అమరావతి.. రయ్... రయ్!

(మొదటి పేజీ తరువాయి)

బ్యాంకు బోర్డు సమావేశంలో ఈ ప్రతిపాదనకు అనుమతి వస్తుందని ఆశిస్తున్నారు. మొత్తంగా రెండు బ్యాంకుల నుంచి రూ.13,600 కోట్ల రుణం అందనుంది. మరో రూ.1,400 కోట్లను కేంద్రం మంజూరు చేయనుంది. ఈ నెలాఖరు నాటికి మొత్తం అప్పులో 25శాతం (రూ.3,750 కోట్లు) అడ్వాన్సు రూపంలో ఇస్తారు. ఈ రుణంపై ఐదేళ్ల పాటు మారటోరియం ఉంటుంది. ఐదేళ్ల తర్వాత చెల్లింపు ప్రక్రియ మొదలవుతుంది. 6నెలలకు ఒక వాయిదా చొప్పున 23 సంవత్సరాల పాటు రుణం చెల్లించే వెసులుబాటు ఉంది. ఈ నిధులతో రాష్ట్ర ప్రభుత్వం కీలక పనులు చేపట్టనుంది. అమరావతి ప్రాంతాన్ని గ్రోత్ హబ్‌గా తీర్చిదిద్దడంతో పాటు అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం, ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇచ్చిన రైతులకు మేలు చేయడంతో పాటు గ్రీన్ అండ్ స్మార్ట్ సిటీ అభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పన, పచ్చని ప్రదేశాల అభివృద్ధి, నీరు, పారిశుధ్యం, కర్బన ఉద్గారాలను తక్కువగా వెలువరించే రవాణా సదుపాయాలకు ప్రాధాన్యం ఇవ్వనుంది. వరద ముప్పును తగ్గించడానికి డ్రయినేజీ వ్యవస్థలను మెరుగుపరుస్తారు. పెట్టుబడిదారులను ఆకర్షించడంలో ప్రభుత్వానికి మద్దతు ఇస్తారు. ప్రైవేట్ పెట్టుబడులు సృష్టించి మహిళలు, యువతకు కొత్త ఉద్యోగాలను సృష్టిస్తారు. కాగా, రుణం మంజూరుపై ఏడీబీ ఇండియా డైరెక్టర్ మియో ఓకా కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రీన్‌ఫీల్డ్ నగరాలను అభివృద్ధి చేయడానికి నిధులు కేటాయిస్తున్నట్టు వివరించారు. భవిష్యత్తులోను మరిన్ని నగరాల అభివృద్ధి జరగబోతోందని, వాటికి అమరావతి రోల్‌మోడల్‌గా మారబోతోందని వ్యాఖ్యానించారు. అమరావతిని గ్రీన్ అండ్ స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చేయడానికి మొత్తం 121.97 బిలియన్ల యెన్లను (రూ.6,800 కోట్లు) మంజూరు చేసినట్టు ఏడీబీ వెల్లడించింది.



మరో రూ.16వేల కోట్ల రుణానికి చర్చలు

అమరావతి నిర్మాణం కోసం హడ్కో నుంచి రూ.11,000 కోట్లు, కేఎఫ్‌డబ్ల్యూ సంస్థ నుంచి రూ.5వేల కోట్ల రుణం కోసం కూడా సీఆర్‌డీఏ చర్చలు జరుపుతోంది. ఈ ప్రయత్నాల పురోగతి ఆశాజనకంగా ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మరో రూ.20వేల కోట్ల విలువైన పనులకు సంబంధించి త్వరలో నిర్వహించబోయే సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో పరిపాలనా అనుమతులు తీసుకోనున్నారు. తొలిదశలో రూ.20,296 కోట్ల పనులకు సీఎం చంద్రబాబు ఆమోదించిన నేపథ్యంలో తాజాగా పరిపాలనా అనుమతులను ఇస్తూ జీవో కూడా జారీ చేశారు. రాజధాని పునర్నిర్మాణానికి ఒకవైపు పనులకు శ్రీకారం చుట్టడం, మరోవైపు ఆర్థిక వనరులు సమకూర్చుకోవటం ద్వారా నూతన సంవత్సరం అమరావతిలో నూతనాధ్యాయం ప్రారంభం కానుందన్న ఆశాభావం అధికార వర్గాల్లో వ్యక్తమవుతోంది.

సోది చెబుతానమ్మ.. సోది!

- గాడి తప్పిన కలెక్టర్ల సదస్సు
- కొందరు సీనియర్ ఐఏఎస్‌ల మెహర్బానీ
- విషయం సూటిగా చెప్పకుండా... సాగదీత
- సీఎం వారిస్తున్నా వినకుండా స్పీచులు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రెండు రోజులు... 26 జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు... భారీ సంఖ్యలో సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్‌లు... అంతా కలిసి 26 గంటలకు పైగా చర్చలు! అంతిమంగా... 'మనకు ఏం చెప్పారు? జిల్లాలకు వెళ్లి ఏం చేయాలి?' అని కలెక్టర్లు ప్రశ్నించుకుంటే కళ్లముందు కదలాడేది పెద్ద ప్రశ్నార్థకమే! ఇదీ బుధవారం, గురువారం రెండురోజులపాటు జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్ తీరు! కూటమి సర్కారు వచ్చాక జరిగిన రెండో కలెక్టర్ల సదస్సు ఇది! ఆగస్టులో జరిగిన మొదటి సదస్సు ఒకే ఒక్కరోజులో సూటిగా, సుత్తిలేకుండా, కలెక్టర్లకు దిశానిర్దేశం జరిగేలా సాగింది. తాజా సదస్సు అందుకు పూర్తి భిన్నంగా ముగిసిందని కొందరు ఉన్నతాధికారులే పెదవి విరుస్తున్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ దృష్టిలో పడి, వారిని ప్రసన్నం చేసుకునేందుకు కొందరు సీనియర్ ఐఏఎస్‌లు పారించిన 'ప్రజెంటేషన్ల వరద'తో అసలు ఉద్దేశం కొట్టుకుపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. 'సూటిగా చెప్పండి. సోది వద్దు' అని స్వయంగా చంద్రబాబు పలుమార్లు చెప్పినా వారు పట్టించుకోలేదు.

సొంత మెహర్బానీ...

ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలు, లక్ష్యాలపై చర్చించి, వాటి సాధనలో క్షేత్రస్థాయిలో కలెక్టర్లకు ఎదురవుతున్న ఇబ్బందులు తెలుసుకుని, వాటికి పరిష్కారం సూచించడం... గత సదస్సు నుంచి ఇప్పటిదాకా సాధించిన విజయాలను మదింపు చేసుకోవడమే కలెక్టర్లకాన్ఫరెన్స్ ముఖ్య ఉద్దేశం. అయితే... కొందరు స్పెషల్ సీఎస్‌లు, ప్రిన్సిపల్ సెక్రటరీలు దీనిని గాడి తప్పించారు. 'చంద్రబాబుకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు అంటే ఇష్టం... వాటిద్వారా ఆయనను ఇంప్రెస్ చేయవచ్చు' అనే తప్పుడు భావనతో... ఆయన సహనానికే పరీక్ష పెట్టారు. తమ శాఖల ఉద్దేశాలు, చరిత్ర, వారు సాధించిన విజయాలు, గొప్పల గురించి పేజీల కొద్దీ పీపీటీలు సమర్పించారు. కృష్ణబాబు, సాయి ప్రసాద్, రాజశేఖర్, సురేశ్ కుమార్, కన్నబాబు తదితర అధికారులు ప్రజెంటేషన్లకే గంటలకొద్దీ సమయాన్ని గుటుక్కుమనిపించారు. విద్యాశాఖకు సంబంధించి కోన శశిధర్ చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ గతంలో వేర్వేరు సందర్భంలో చేసిన ప్రసంగాల వీడియోను ప్రదర్శించి గంట గుటుక్కుమనిపించారు. మహిళా సంక్షేమ శాఖకు చెందిన సూర్యకుమారి... జిల్లాలో తమ శాఖ అధికారులకు చెప్పాల్సిన విషయాలన్నీ కలెక్టర్ల సమావేశంలో చదివి వినిపించారు. సీఎం రోజువారీగా చేసే సమీక్షలకు, ఈ సదస్సుకు తేడా లేకుండా పలువురు కార్యదర్శులు పేజీల కొద్దీ నివేదికలు తీసుకొచ్చారు.

అసలు విషయం ఏదీ?

కలెక్టర్ల సదస్సు తొలిరోజు అజెండాను గణాంకాలు, అనుబంధాలు, నివేదికలు, పీపీటీలతో కలిపి 600 పేజీలతో రూపొందించారు. మొదటి రోజున ఎనిమిది అంశాలు చర్చకు రాలేకపోవడంతో... వాటిని గురువారానికి వాయిదా వేశారు. ఇక... రెండోరోజూ అదే పరిస్థితి. చివరికి... అత్యంత కీలకమైన శాంతిభద్రతల అంశంపై చర్చను తూతూమంత్రంగా ముగించారు. 'సంక్షేమం' పైనా అదే పరిస్థితి. కలెక్టర్లు క్లుప్తంగా ముగించినా... కొందరు ఉన్నతాధికారులు మాత్రం తమ మెహర్బాణీ కోసం అనవసరమైన ప్రసంగాలు చేశారు. స్వయంగా ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని వారించినా ఫలితంలేకుండా పోయింది. పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ మాత్రం తన శాఖకు చెందిన పీపీటీని పది నిమిషాల్లో సూటిగా, క్లుప్తంగా ముగించారు.

సందేహాలకు సమాధానాల్లేవ్..

సమావేశాలు షెడ్యూలు ప్రకారం జరగలేదు. పైగా... ఒకరు చెప్పిందే మరొకరు చెప్పడంతో పునరుక్తులు దొర్లాయి. ఇంతా చేసి... కలెక్టర్లు అడిగిన సందేహాలకు చాలామంది కార్యదర్శులు సమాధానాలు చెప్పలేకపోయారు. సాగునీరు, గృహ నిర్మాణం, విద్య, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల్లో పెండింగ్ అంశాలపై సీఎం అడిగిన ప్రశ్నలకూ సమాధానాల్లేవు. ప్రభుత్వ పాలన, పథకాల అమలు, సమస్యల పరిష్కారంపై ప్రజా స్పందన తెలియచేసే నివేదికపై చంద్రబాబు సందేహం వ్యక్తం చేశారు. దీనికి సంబంధిత అధికారి సురేశ్ కుమార్ సరైన సమాధానం ఇవ్వలేదు. ప్లానింగ్, రెవెన్యూ విభాగాలు, సీఎంవోల మధ్య సమన్వయ లోపం వల్లే కలెక్టర్ల సదస్సు ఇలా జరిగిందని కొందరు అధికారులు అభిప్రాయపడ్డారు.

స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ నేడే

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో నెంబర్ వన్‌గా నిలిపేందుకు ప్రభుత్వం రూపొందించిన స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్‌ను సీఎం చంద్రబాబు శుక్రవారం ఆవిష్కరించనున్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి మంత్రులు, కలెక్టర్లు, ఎస్పీలు, హెచ్‌ఓడీలు అందరూ రావాలని సీఎం ఆహ్వానించారు. ఈ విజన్ డాక్యుమెంట్ దేశానికి ఒక రోల్‌మోడల్‌గా నిలుస్తుందని అన్నారు. 6 నెలల్లో రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నామని, ఇందులో అధికారులు, ఉద్యోగుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ గవర్నెన్స్ పెరగాలని, ప్రజలకు సత్వర సేవలందించాలని సూచించారు. ఆర్థికేతర సమస్యలన్నింటినీ పరిష్కరించాలని, పరిష్కరించలేకపోతే అందుకు కారణం రాయాలని చెప్పారు. వినూత్నంగా పనిచేసి సంపద సృష్టించాలని చంద్రబాబు పేర్కొన్నారు. సూపర్-6లో మిగిలిన పథకాలను కూడా అమల్లోకి తెస్తామన్నారు. ప్రజలకు సత్వర మెరుగైన సేవలు అందించేందుకు కలెక్టరేట్లలో రిసెప్షన్లు పెట్టే ఆలోచనలో ఉన్నట్టు సీఎం చెప్పారు. ఇకనుంచి ప్రతి 1వ తేదీని పేదల సేవ కార్యక్రమానికి, మూడో శనివారాన్ని స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలకు అంకితం చేయాలన్నారు. మంత్రులైనా, అధికారులైనా పని చేయకపోతే ఇంటికి పంపిస్తామని సీఎం హెచ్చరించారు.

ఐదేళ్లలో పేదలందరికీ ఇళ్లు

▸ నెలాఖరుకు లక్ష గృహప్రవేశాలు: సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ ఈ ఐదేళ్లలోనే పక్కా ఇళ్లు నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ల సదస్సులో పేదల ఇళ్ల నిర్మాణంపై గృహ నిర్మాణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్ ప్రజెంటేషన్ ఇచ్చారు. నిర్మాణంలో ఉన్న దాదాపు లక్ష ఇళ్లను ఈ నెలాఖరుకల్లా పూర్తి చేసి సామూహిక గృహప్రవేశాలు చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామన్న హామీని నెరవేర్చేందుకు పురపాలక, పంచాయతీరాజ్‌శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇళ్లు లేని పేదలను గుర్తించి వారికి స్థలాలను మంజూరు చేసేందుకు అవసరమైన భూములను సర్వే చేయాలని సూచించారు. పీఎంఏవై అర్బన్, గ్రామీణ్ పథకాల కింద వచ్చే నిధులను సద్వినియోగం చేసుకుని పేదలకు ఇచ్చే స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు గడువులు నిర్ణయించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి 1.5 లక్షల ఇళ్లు, 2026 మార్చి నాటికి 6.40 లక్షల ఇళ్లను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు.



ఐటీ పార్కులకు 400 ఎకరాలు!

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ పార్కుల కోసం విశాఖలోని మధురవాడ లేదా కాపులుప్పాడలో కనీసం 200 ఎకరాలు, గుంటూరు జిల్లా మంగళగిరిలో 200 ఎకరాలను సేకరించాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. వెలగపూడి సచివాలయంలో రెండో రోజు కలెక్టర్ల సదస్సులో ఐటీ రంగంపై సమీక్ష జరిగింది. తిరుపతిలో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ కోసం కనీసం 599 ఎకరాలను, తిరుపతి నగరం పరిధిలో ఐటీ పార్కు కోసం కనిష్ఠంగా 50 ఎకరాలను, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ-తిరుపతి కోసం 15 ఎకరాలను సమీకరించాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. కడప జిల్లా కొప్పర్తిలో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. రాష్ట్రంలో ఐటీ రంగాన్ని విస్తృత పరిచేందుకు వీలుగా ఇప్పటికే ఏపీ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీ 4.0ను, ఏపీ డేటా సెంటర్ 4.0 పాలసీని, ఏపీ సెమీ కండక్టర్ ఫ్యాబ్ పాలసీ, ఏపీఐటీ అండ్ జీసీసీ పాలసీలను ప్రభుత్వం విడుదల చేసింది. డ్రోన్ పాలసీని కూడా విడుదల చేసింది. సమీక్షలో సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేశ్, ఆ శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎనర్జీ హబ్‌గా ఏపీ

▸ ఇంటికి కరెంటు పాత మాట ..

▸ ఇప్పుడు ఇల్లే కరెంటు ఉత్పత్తి సంస్థ

▸ గ్రీన్ కారిడార్‌లను తయారుచేయాలి

▸ సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజీ లాంటి న్యూఎనర్జీ విధానాలు అమలు

▸ కలెక్టర్ల సదస్సులో చంద్రబాబు నిర్దేశం

అమరావతి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు రంగం చాలా శక్తివంతమైనదని .. కరెంటు లేకపోతే ప్రగతి ఆగిపోతుందని .. జన జీవనం స్తంభించిపోతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్రాన్ని ఎనర్జీ హబ్‌గా మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ కారిడార్‌గా మార్చాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఒకప్పుడు ఇంటికి కరెంటు అనేది పాతమాటని .. ఇప్పుడు ప్రతి ఇల్లూ సోలార్ కరెంటు ఉత్పత్తి సంస్థగా మారుతోందని వ్యాఖ్యానించారు. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజీలాంటి న్యూఎనర్జీ విధానాలు అమలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. వెలగపూడి సచివాలయంలో గురువారం కలెక్టర్ల సదస్సు రెండోరోజున ఇంధన శాఖపై జరిగిన సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త పాలసీ ప్రకారం చార్జింగ్ స్టేషన్లను పెట్టబోతున్నామని, ఎలక్ట్రిక్ వాహనాలతో కాలుష్య నియంత్రణ సాధ్యమవుతుందని చెప్పారు. సూర్యఘర్ కింద ప్రతి ఇంటి మీద సోలార్ ప్యానల్‌ను బిగించి కరెంటు ఉత్పత్తి చేసే పరిస్థితి రావాలని, ఈ పథకంలో సబ్సిడీ కూడా వస్తుందని చంద్రబాబు చెప్పారు. వాడుకోగా మిగిలిన కరెంటును గ్రిడ్‌కు పంపి అమ్ముకునే వీలుందని, ఇప్పటికే కుప్పంలో ఒక మోడల్‌ను అమలు చేసేందుకు కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలన్నింటిపైనా సోలార్ ప్యానళ్లను బిగించి విద్యుదుత్పత్తిని చేస్తామన్నారు. గ్రీన్, సోలార్ ఎనర్జీ వినియోగంలో రైతులను భాగస్వాములను చేస్తామన్నారు.

యూనిట్ ఆదా 2 యూనిట్ల ఉత్పత్తితో సమానం

ఎనర్జీ తయారీ, వినియోగాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. ఒక యూనిట్ కరెంటును ఆదా చేస్తే .రెండు యూనిట్ల కరెంటును ఉత్పత్తి చేసినట్లుగా గ్రహించాలని చెప్పారు. ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) చేపడుతున్న పొదుపు కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. విద్యుత్తు ప్రమాదాలను నివారించాలని చంద్రబాబు ఆదేశించారు. విద్యుత్తు ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు చేపట్టాలని ఇంధన శాఖకు సలహా ఇచ్చారు. కలెక్టర్లు కూడా దీనిపై దృష్టి సారించాలని కోరారు. విద్యుదుత్పత్తి ధరలు తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని .. ఇందుకు గ్రీన్ ఎనర్జీ ఉపయోగపడుతుందని చంద్రబాబు చెప్పారు. కేంద్రం అమలు చేస్తోన్న పీఎం సూర్యఘర్ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నామని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వివరించారు. రాష్ట్రంలోని మూడు డిస్కమ్‌ల పరిధిలో 6.39 లక్షల రైతులు సూర్యఘర్ పథకం కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వెల్లడించారు. వీరిలో 77,009 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 65000 మంది ఇళ్లలో బిగించడం పూర్తయిందని, ఈ పథకం కింద కేంద్రం ఒక కిలోవాట్‌కు రూ.30,000, రెండు కిలోవాట్‌లను రూ.60,000, మూడు కిలోవాట్‌లకు రూ.78,000 చొప్పున సబ్సిడీ ఇస్తుందని విజయానంద్ వివరించారు. ఈ పథకంకింద డిస్కమ్‌లు రూ.25.27 కోట్లను సబ్సిడీ కింద విడుదల చేశాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 20,17,947 మంది ఎస్సీఎస్టీ విద్యుత్తు వినియోగదారులు పీఎం సూర్యఘర్ కింద దరఖాస్తులు చేసుకున్నారని విజయానంద్ వివరించారు. సీఎం కుసుమ్ పథకం కింద రైతులకు 3725 మెగావాట్ల సామర్థ్యంతో వ్యవసాయ ఫీడర్లను ఏర్పాటుచేస్తున్నామని చెప్పారు. 0.5 నుంచి ఐదు మెగావాట్ల వరకు సోలార్ విద్యుత్తుప్లాంట్లను ఏర్పాటు చేసే కార్యాచరణకు సిద్ధమయ్యామన్నారు. ఒక మెగావాట్‌కు ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని సమీకరిస్తున్నామని విజయానంద్ వెల్లడించారు. జిల్లా ఎలక్ట్రిసిటీ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని, ఏపీ ఇంటిగ్రేటెట్ క్లీనర్ ఎనర్జీ పాలసీలో భాగంగా బయోగ్యాస్ ప్లాంట్లను నెలకొల్పుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో సోలార్ పార్కులను ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని విజయానంద్ తెలిపారు. న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ విధానంలో భాగంగా 1000 మెగావాట్ల సామర్థ్యంతో ప్రకాశం జిల్లా సీఎస్ పురంలో ప్లాంటును ఏర్పాటు చేస్తున్నామన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 1500 మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని విజయానంద్ చెప్పారు.

ఇతర రాష్ట్రాలతో పోటీపడాలి: లోకేశ్

పెట్టుబడుల కోసం దేశంలోని అన్నిరాష్ట్రాలూ పోటీ పడుతున్నాయని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా ఇతర రాష్ట్రాల కన్నా ముందుండాలని అధికారులకు సూచించారు. ఒక్క ఎంఎస్ఎంఈ సెక్టార్‌లోనే 80 శాతం ఉద్యోగాలు కల్పించవచ్చునని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అనుమతులు త్వరగా మంజూరు చేయాలన్నారు. రూ.5 కోట్లు, 10 కోట్లు పెట్టుబడి పెట్టే ప్రతి పెట్టుబడిదారుడు మనకు చాలా ముఖ్యంగా భావించాలని సూచించారు.

175 నియోజకవర్గాల్లో

పారిశ్రామిక పార్కులు

▸ ఉద్యోగాల కల్పనకే ప్రథమ ప్రాధాన్యం

▸ పరిశ్రమల అనుమతులపై అలసత్వం వద్దు

▸ సానుకూల వాతావరణం కల్పించాలి

▸ పారిశ్రామికాభివృద్ధిపై కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలిస్తామని ప్రజలకు హామీ ఇచ్చామని, ఉద్యోగాల కల్పనకు ప్రథమ ప్రాధాన్యమిచ్చి పని చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్లను ఆదేశించారు. గురువారం రెండోరోజు జరిగిన కలెక్టర్ల సదస్సులో పరిశ్రమల శాఖపై సమీక్ష నిర్వహించారు. జిల్లాల్లో ఎంతమందికి ఉద్యోగాలు కల్పించారో ఆ వివరాలతో వచ్చే కలెక్టర్ల సమావేశానికి రావాలని, ఆన్‌లైన్ పోర్టల్‌లో కూడా వివరాలు నమోదు చేయాలని చంద్రబాబు సూచించారు. జిల్లాల్లో కలెక్టర్ల అధ్యక్షతన డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ (డీఐఈపీసీ) సమావేశాలను సక్రమంగా నిర్వహించకపోవడం పట్ల సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. చిత్తూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఈ ఏడాదిలో ఒక్క సమావేశం కూడా నిర్వహించకపోవడం సరికాదన్నారు. కృష్ణా జిల్లాలో 5 సమావేశాలు నిర్వహించగా.. ఇతర జిల్లాల్లో అంతకన్నా తక్కువ నిర్వహించారన్నారు. 'పశుసంవర్థక శాఖ, సీఆర్‌డీఏ, ఈడీబీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఉన్నత విద్య, హౌసింగ్, పెట్టుబడులు-మౌలిక సదుపాయాలు, ఐటీ-ఎలక్ట్రానిక్స్, మున్సిపల్, మైనింగ్, నెడ్‌క్యాప్, రోడ్లు-భవనాలు, స్కిల్ డెవలప్‌మెంట్, టూరిజం తదితర శాఖల ద్వారా కొత్తగా ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉంది. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి స్ట్రీమ్‌లైన్ చేస్తే ఉద్యోగాలు వస్తాయి. జిల్లాల్లో ఎన్ని పెట్టుబడులు పెట్టారు? ఎన్ని ఉద్యోగాలు కల్పించామనే దానిపై ప్రత్యేక దృష్టి సారించి, అందుకనుగుణంగా పనిచేయాలి' అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

> పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసే విషయంలో సంబంధిత శాఖల అధికారులు జాప్యం చేయవద్దు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా ప్రాజెక్టులను త్వరగా ప్రారంభించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలి. భూ కేటాయింపులు, కాలుష్య-పర్యావరణ అనుమతులు వేగంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలి.
> - చంద్రబాబు

రైతుల భాగస్వామ్యంతో పరిశ్రమలు

"ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్త' నినాదంతో జిల్లాల్లో విరివిగా పరిశ్రమలను ప్రోత్సహించాలి. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కుల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలి. భూసేకరణలో రైతులను భాగస్వాములను చేయాలి. రైతులే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని, మిగిలిన భూములు అమ్ముతామన్నా అభ్యంతరం లేదు. అమరావతి రాజధాని కోసం భూసేకరణ ఏవిధంగా చేశామో.. అదే విధంగా పీ4 మోడల్‌లో పరిశ్రమల ఏర్పాటుకు భూసేకరణ చేయాలి. అంతిమంగా పరిశ్రమలకు భూములిచ్చిన రైతులకు లబ్ధి చేకూరాలి. ఉదాహరణకు నక్కపల్లి దగ్గర ఆర్సిలర్ మిట్టల్ స్టీల్ ఫ్యాక్టరీ రాబోతోంది. ఆ ప్రాంతం ఒక టౌన్‌షిప్‌గా అభివృద్ధి చెందుతుంది. త్వరలో రామాయపట్నంలో బీపీసీఎల్ ఆయిల్ రిఫైనరీ వచ్చే అవకాశం ఉంది. వీటి కోసం భూములను త్యాగం చేసే రైతులకు అక్కడే ప్రయోజనం చేకూర్చాలి. రాష్ట్రంలో ఇప్పటికే దాదాపు 30 లక్షల ఎంఎస్ఎంఈలు ఉన్నాయి. వీటిలో కొన్ని బాగాలేవు. అందుకే ఎంఎస్ఎంఈలను సర్వే చేసి ఎన్యుమరేట్ చేయాలన్నాం. ఇది పూర్తయిన తర్వాత ప్రమాణాల ప్రకారం పరిశ్రమలను వర్గీకరణ చేస్తాం. ఒక తరహా పరిశ్రమలన్నింటినీ గ్రూపింగ్ చేసి వాటి ఉత్పత్తులను ప్రోత్సహిస్తాం. ఒక పరిశ్రమలో తయారైన ఉత్పత్తులు మరో కంపెనీకి ముడిసరుకు అవుతుంది. ఈ విధంగా ఎక్కడికక్కడ ఇంటిగ్రేషన్ చేసి, టెక్నాలజీని అందించి, మార్కెటింగ్‌పరంగా ప్రభుత్వపరంగా అవసరమైన సాయం అందిస్తాం' అని సీఎం తెలిపారు.

పవర్ రిఫార్మ్స్ తెచ్చి పవర్ పోగొట్టుకున్నా: బాబు

దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణలు తెచ్చానని, దానివల్ల తన అధికారాన్ని కూడా పోగొట్టుకోవాల్సి వచ్చిందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రెండోరోజు కలెక్టర్ల సదస్సులో ఇంధనశాఖపై సమీక్ష సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ "1998 నాటికి విద్యుత్ రంగంలో సంస్కరణలు మొదలుకాలేదు. నా చొరవతోనే రాష్ట్రంలో తొలిసారిగా విద్యుత్తు నియంత్రణ మండలి ఏర్పడింది. టెలికాం రెగ్యులేటరీ అప్పటికి రాలేదు. కానీ, నేను ఏపీలో విద్యుత్తు సంస్కరణలు తెచ్చాను. దానివల్ల 2004లో అధికారాన్ని కోల్పోవాల్సి వచ్చింది" అని తెలిపారు.

నమ్మకం కలిగించాలి

'పెద్ద ప్రాజెక్టులకు ఆరు నెలలు, ఒక సంవత్సరం పాటు అనుమతుల మంజూరు ఆలస్యమైతే కొన్ని సందర్భాల్లో అవి వెనక్కిపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వ, పాలనా యంత్రాంగం మొత్తం వేగం పుంజుకోవాలి. గత ప్రభుత్వంలో పెట్టుబడిదారులు మన రాష్ట్రానికి రావాలంటే భయపడేవారు. 'ఇక చచ్చినా ఆంధ్రప్రదేశ్‌కు రాం' అని కామెంట్లు చేసి మరీ వెళ్లిపోయారు. దాంతో మన రాష్ట్రంపై పెట్టుబడిదారులకు నమ్మకం పోయింది. నమ్మకాన్ని తిరిగి తెచ్చుకోవాలంటే ప్రభుత్వ యంత్రాంగమంతా సానుకూల దృక్పథంతో కష్టపడి పనిచేయాల్సిన అవసరం ఉంది. అధికారులు లెక్క చేయడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ ధోరణి మంచిది కాదు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు.

వ్యక్తిగతంగా చొరవ తీసుకున్నా

'నక్కపల్లి దగ్గర ఆర్సిలర్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు ముడిసరుకు ఐరన్ ఓర్ ఎన్ఎండీసీ నుంచి రావాల్సి ఉంది. విట్టల్ కంపెనీ వాళ్లు అడుగుతున్నది ఏమిటంటే.. వారికి పైప్‌లైన్ ఉంది కాబట్టి అక్కడ ఐరన్ ఓర్ ఇస్తే పైప్‌లైన్ ద్వారా స్లర్రీని నేరుగా ప్లాంట్‌కు తెచ్చుకునే వెసులుబాటు ఉంటుందని, రవాణా వ్యయం తగ్గుతుందని అంటున్నారు. దాని కోసం నేను ఇప్పటికి మూడుసార్లు కేంద్రమంత్రి కుమారస్వామికి ఫోన్ చేశాను. ఎన్ఎండీసీ చైర్మన్‌తో కూడా ఫోన్‌లో మాట్లాడాను' అని సీఎం చంద్రబాబు తెలిపారు.



కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు అనగాని, లోకేశ్

> "అన్ని వ్యవస్థలను గాడినపెట్టడం ఒక ఎత్తు. రెవెన్యూశాఖను దారిలో పెట్టడం మరో ఎత్తు. గత ప్రభుత్వంలో రెవెన్యూ శాఖలో జరిగిన తప్పులు, అవకతవకలు అన్నీ ఇన్నీ కావు. ప్రభుత్వానికి వచ్చిన ఫిర్యాదుల్లో దాదాపు 70 శాతం రెవెన్యూ శాఖకు సంబంధించినవే. పాలకులు వస్తుంటారు. వెళ్తుంటారు. భూమి, ప్రజల ఆస్తి శాశ్వతం. భూమి పత్రాలపైనా, సర్వే రాళ్లపైనా గతసీఎం తన బొమ్మలు వేయించుకున్నారు. వాటిని తొలగించడానికి రూ. 37 కోట్ల ప్రజాధనం వాడాల్సి రావడం బాధాకరం"
> - సీఎం చంద్రబాబు

భూ వివాదాలపై టాస్క్‌ఫోర్స్

(మొదటి పేజీ తరువాయి)

దాదాపు 70శాతం ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు సంబంధించినవే ఉన్నాయి. ప్రధానంగా కడప, తిరుపతి, ప్రకాశం, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో రెవెన్యూ అక్రమాలు ఎక్కువగా జరిగాయి. 13లక్షల ఎకరాలు ఫ్రీహోల్డ్ చేసి... అందులో 25 వేల ఎకరాలను రిజిస్ట్రేషన్ చేసేశారు. ఇప్పుడు ఈ తప్పులన్నీ సరిచేసి బాధ్యులకు చట్టప్రకారం శిక్షపడేలా చేయాలి. బాధితుల్లో నమ్మకం కల్పించాలి" అని చంద్రబాబు నిర్దేశించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులపై కాలపరిమితి పెట్టుకుని అధికారులు ఒక లాజికల్ ముగింపునకు రావాలని, అంతిమంగా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. భూ వివాదాలు, భూ కబ్జాల కేసుల పరిష్కారానికి జిల్లాల స్థాయిలో జాయింట్ టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. భూ సంబంధిత వివాదాల పరిష్కారానికి రెవెన్యూ, హోంశాఖలు కలిసి పనిచేస్తే బాగుంటుందని హోంమంత్రి అనిత అభిప్రాయపడగా, చంద్రబాబు స్పందించారు. కలెక్టర్, ఎస్పీ, ఆర్డీవో, డీఎస్పీ సభ్యులుగా జాయింట్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డిజిటల్ కీని ఉపయోగించి ఎవరైనా భూములు మారిస్తే పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

నేను జాంబవంతుడ్ని... మీరంతా హనుమంతులు..

▸ సిసోడియా చమత్కారం

రామాయణంలో హనుమంతుడికి ఆయనకే తెలియనంత శక్తి ఉన్నదని.. కలెక్టర్లు కూడా తమకు ఉన్న విశేషాధికారాలను గుర్తించాల్సి ఉన్నదని రెవెన్యూ స్పెషల్ సీఎస్ ఆర్పీ సిసోడియా వ్యాఖ్యానించారు. "ఒక శాపం కారణంగా హనుమంతుడికి తన శక్తి తనకు తెలియదు. సముద్రం అవతలకు ఎవరు వెళ్లగలరని హనుమంతుడు ఆలోచిస్తుంటాడు. జాంబవంతుడు వచ్చి హనుమంతుడికి తన బలాన్ని గుర్తుచేస్తాడు. అప్పుడు హనుమంతుడు తన శక్తినంతా కూడదీసుకుని సముద్రాన్ని దాటేశాడు. ఈ కథలో నేను జాంబవంతుడిని. మీరంతా హనుమంతులు" అని సిసోడియా వివరించారు. ఆయన చెప్పిన కథ విని చంద్రబాబుతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా కాసేపు నవ్వుకున్నారు. జిల్లాల్లో ఎమ్మార్వోలు డిజిటల్ కీ ఇంకెవరికి ఇవ్వకూడదని సిసోడియా సూచించారు.

రోడ్లన్నీ రెండేళ్లలో పూర్తి కావాలి: సీఎం

రాష్ట్రంలో రోడ్ల నిర్మాణ పనులు వచ్చే రెండేళ్లలో పూర్తి చేయాల్సిందేనని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కలెక్టర్ల సదస్సు చివరిరోజు గురువారం ఆర్అండ్‌బీ శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. "రహదారుల నిర్మాణం విషయంలో రాజీ పడొద్దు. స్టేట్ హైవేస్, నేషనల్ హైవే ప్రాజెక్టు పురోగతిపై కలెక్టర్లు 15రోజులకోసారి సమీక్షించాలి. హైవే పనులకు ఎవరైనా అడ్డుపడితే తీవ్ర పరిణామాలు ఉంటాయి" అని హెచ్చరించారు. ఆ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతీలాల్ దండే... రోడ్లు, భవనాల శాఖ ప్రగతిని వివరించారు. జిల్లాల్లో రోడ్ల నిర్మాణాలకు ఎదురవుతున్న భూసేకరణ సమస్యలపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టిపెట్టాలని కోరారు. రోడ్ల నిర్మాణాలకు రూ.65వేల కోట్లు ఖర్చు చేస్తున్నామనీ, ఎక్కడా అడ్డంకులు లేకుండా ప్రభుత్వం మార్గదర్శకాలు ఇచ్చిందని సీఎం అన్నారు. అందువల్ల నిర్దేశించుకున్న సమయంలోగా పనులు పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు.

విజ్ఞాన సమాజమే మన లక్ష్యం

▸ ఎప్పటికప్పుడు కరిక్యులమ్‌లో మార్పులు రావాలి

▸ ప్రైవేటు, ప్రభుత్వం..రెండు రంగాలనూ ప్రోత్సహించాలి

▸ పాఠశాలల్లో అందరికీ రేటింగ్ అవసరం: సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): విజ్ఞాన సమాజాన్ని సృష్టించడం మనందరి లక్ష్యమని సీఎం చంద్రబాబు అన్నారు. అందుకోసం అన్నివిధాలుగా విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలని, ప్రభుత్వం, ప్రైవేటు అని వేర్వేరుగా చూడొద్దని, రెండింటినీ ప్రోత్సహించాలని నిర్దేశించారు. చేతగానప్పుడే ప్రైవేటురంగాన్ని వేరుగా చూపిస్తుంటారని, వారితో పోటీ పడాలన్నారు. అంతిమంగా తెలుగు విద్యార్థులు నంబర్ వన్ కావడం లక్ష్యం కావాలన్నారు. కలెక్టర్ల సదస్సులో మానవ వనరుల అభివృద్ధిపై సమీక్ష సందర్భంగా సీఎం మాట్లాడారు. కరిక్యులమ్‌లో మార్పులు చేయడం అనేది నిరంతర ప్రక్రియగా మారాలని, భవిష్యత్తు ఆధారంగా ఈ ప్రక్రియ సాగాలన్నారు. సాధారణ యూనివర్సిటీలతోపాటు సివిల్ ఏవియేషన్, ఎనర్జీ, లాజిస్టిక్స్ లాంటి ఫంక్షనల్ యూనివర్సిటీలు వచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. పాఠశాలల్లో రేటింగ్ అనేది అందరికీ ఉండాలనీ, దానివల్ల మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు.

పిల్లలు ఎక్కడో ఒకచోట చదవాలి: లోకేశ్

ప్రైవేటు బడుల్లో లేదా ప్రభుత్వ బడుల్లో ఎక్కడో ఒకచోట పిల్లలు చదువుకోవడం ముఖ్యమని మంత్రి లోకేశ్ అన్నారు. ఇప్పటికే చాలా మంది పిల్లలు ఎక్కడ చదువుతున్నారో తెలియక డ్రాప్‌బాక్స్‌లో పెడుతున్నారని, డ్రాప్‌బాక్స్‌లో ఎవరూ ఉండకూడదని స్పష్టంచేశారు. పాఠశాల విద్యలో పనితీరు ఆధారంగా జిల్లా కలెక్టర్లకు ప్రగతి కార్డులు ఇస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం పెరగాలనీ, ఉన్నత విద్యలో మెస్‌లపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని కలెక్టర్ల దృష్టికి తెచ్చారు. ఇకపై విద్యార్థుల నుంచి ప్రతివారమూ అభిప్రాయాలు తీసుకుంటామన్నారు. ప్రతి కాలేజీ, పాఠశాలలో ఈగల్ క్లబ్స్ ఏర్పాటుచేయాలని ఆదేశించారు. కేజీ నుంచి పీజీ వరకు మొత్తం బోధనావిధానం మారుస్తున్నామన్నారు. ఏపీ మోడల్ విద్యా విధానం దేశానికి ఆదర్శంగా నిలవడం లక్ష్యంగా పనిచేయాలని కోరారు. గత ప్రభుత్వంలో పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పనులపై మంత్రులు అనుమానాలు వ్యక్తం చేశారని, వాటిపై ఆడిట్ నిర్వహించనున్నామని అన్నారు ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీని మెరుగుపరిచేందుకు త్వరలో సమగ్ర విధానం (ఎఫ్ఎల్ఎన్- ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) తీసుకొస్తామని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. విద్యార్థుల హాజరు, అకడమిక్ అంశాలను వాట్సాప్ ద్వారా తల్లిదండ్రులకు పంపుతామన్నారు. ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత శాతం చాలా తక్కువగా ఉందని, దీనిపై స్థానిక యంత్రాంగం దృష్టి పెట్టాలన్నారు. 2029 నాటికి రాష్ట్రంలోని 15 యూనివర్సిటీలు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో టాప్-100 ఉండటం లక్ష్యంగా పనిచేయాలని నిర్దేశించారు.

నైపుణ్య గణన ఇంకెప్పుడు పూర్తిచేస్తారు?

▸ ఆ శాఖ పనితీరుపై సీఎం తీవ్ర అసహనం

నైపుణ్యాభివృద్ధి శాఖ పనితీరు, నైపుణ్య గణన పురోగతి తీరుపై చంద్రబాబు తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. మొక్కుబడి రోజులు పోవాలని అధికారులకు స్పష్టంచేశారు. నైపుణ్యాభివృద్ధిపై ప్రజెంటేషన్‌లోనే స్పష్టత లేదని, దీనిపై మరింత కసరత్తు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ల సదస్సులో నైపుణ్యాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మంగళగిరిలో నైపుణ్య గణన పైలట్‌గా చేపట్టామని వివరిస్తున్నప్పుడు...సీఎం జోక్యం చేసుకుని మాట్లాడారు. "రాష్ట్రం మొత్తం 6నెలల్లో పూర్తికావాలి. కానీ, ఇంకా ఒక్క నియోజకర్గంలోనే ఉన్నారు. మొత్తం నైపుణ్య గణన ఎప్పుడు పూర్తిచేస్తారు? సమయాన్ని నిర్దేశించుకుని పనిచేయండి. రొటీన్‌గా పనిచేస్తే నైపుణ్యాభివృద్ధి జరగదు. నైపుణ్యాల కల్పనలో కేంద్ర పథకంపై ప్రచారం కూడా మొక్కుబడి ఉంది" అని అన్నారు. నైపుణ్య గణన వివరాల సేకరణలో ప్రజలపై ఒత్తిడి చేయకుండా ఐచ్ఛికంగానే చేపట్టాలనీ, మానవ వనరులు, నైపుణ్యాలను అనుసంధానం చేయాలన్నారు. విద్యారంగంలో ఆఫ్‌లైన్‌తోపాటు ఆన్‌లైన్ డిగ్రీలను కూడా గుర్తించాలన్నారు. కాగా, సీఎం అసంతృప్తి వ్యక్తం చేయడంతో ముఖ్య కార్యదర్శి తన ప్రజెంటేషన్ ఆపేశారు.

అనర్హులను తొలగించాలి

▸ బోగస్ పింఛన్లపై మూడునెలల్లో నివేదిక: చంద్రబాబు

రాష్ట్రంలో అనర్హులకిచ్చిన పెన్షన్లు తొలగించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, సదరం సర్టిఫికెట్లను జారీ చేసేటప్పుడు మార్గదర్శకాలు సక్రమంగా పాటిస్తున్నారా? లేదా? పరిశీలించాలని సీఎం చంద్రబాబు... కలెక్టర్లకు సూచించారు. బోగస్ పెన్షన్లు తొలగించేందుకు సాంకేతిక, హైబ్రిడ్ విధానాలను వినియోగించాలన్నారు. ఎక్కడైనా సదరం సర్టిఫికెట్ల జారీలో మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే సంబంధిత డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కడప జిల్లాల్లో ఇటీవల చేసిన సర్వేలో భారీసంఖ్యలో అనర్హులు బయటపడటంతో, వారి పెన్షనుల తొలగించామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. ఎన్నికలకు ముందు 6లక్షల బోగస్ పెన్షన్లు గత ప్రభుత్వం మంజూరు చేసిన విషయం సెర్ప్ తనిఖీల్లో వెల్లడైందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. 3నెలల్లో పెన్షన్లపై సమగ్ర నివేదిక ఇవ్వాలని, తర్వాత తాను కూడా దానిపై విచారిస్తానని చంద్రబాబు తెలిపారు. 2027లో పుష్కరాలు జరగనున్నాయని, ఘాట్‌లను ఉపాధి నిధులతో చేపట్టేలా చర్యలు తీసుకోవాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి కోరారు. దానిపై ప్రత్యేకంగా మరో సమావేశంలో చర్చిద్దామని చంద్రబాబు తెలిపారు. నాగార్జునసాగర్ వద్ద విజయపురి కాలనీని పంచాయతీగా మార్చాలని, శ్రీశైలం వద్ద సున్నిపెంటను దేవదాయశాఖ నిధులతో అభివృద్ధి చేయాలని ఆ శాఖ మంత్రి రామనారాయణరెడ్డికి సీఎం సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు నిధులిచ్చినా పూర్తిస్థాయిలో ప్రగతి చూపించలేకపోతున్నారనీ, నిధులు లేక కొన్ని శాఖలు పనులు చేయలేకపోతే...నిధులిచ్చినా ఎందుకు వెనకబడి ఉన్నారని ఆ శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్‌ను సీఎం ఆరా తీశారు. సిమెంట్‌రోడ్ల నిర్మాణంలో ఒక జిల్లాలో 54 శాతం పనులు చేసి, మరో జిల్లాలో 1.6శాతం పనులే ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు. గ్రామాల్లో ముందుగా రోడ్లకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు.

భారత్ నెట్-2లో ఫైబర్‌గ్రిడ్

▸ కేంద్ర నిధులతో సేవల విస్తరణ.. భూగర్భ వైరింగ్ విధానమే మేలు

▸ మౌలిక సదుపాయాల సమీక్షలో చంద్రబాబు

▸ సీప్లేన్లకు 10 ప్రాంతాల గుర్తింపు

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): భారత్ నెట్-2లో భాగంగా కేంద్రం నిధులతో ఫైబర్ గ్రిడ్ సేవలను రాష్ట్రంలో విస్తరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. కలెక్టర్ల సదస్సులో మౌలిక సదుపాయల కల్పనపై సమీక్షించారు. డ్రోన్, మారిటైమ్, పోర్టులు, ఫైబర్‌నెట్ విభాగాలపై పెట్టుబడులు, మౌలిక వసతుల కల్పన శాఖ కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ ప్రజెంటేషన్ ఇచ్చారు. భారత్ నెట్-2 కింద భూగర్భ ఫైబర్ గ్రిడ్‌కు కేంద్రం నిధులు ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని వివరించారు. విద్యుత్తు స్తంభాలకు ఫైబర్ నెట్ కేబుళ్లను ఏర్పాటు చేసినందున సముఖత వ్యక్తం చేయలేదని తెలిపారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి.. ఫైబర్ గ్రిడ్ విస్తరణకు భూగర్భ కేబుల్ విధానమే శాశ్వతమన్నారు. దీనివల్ల ఫైబర్ వైర్లు 50ఏళ్ల దాకా భద్రంగా ఉంటాయని చెప్పారు. డ్రోన్, మారిటైమ్‌పైనా చంద్రబాబు సమీక్షించారు. డ్రోన్ తయారీపై పలు వర్సిటీలతో సంప్రదింపులు జరుపుతున్నామని సురేశ్‌కుమార్ చెప్పారు. అమరావతి తరహాలోనే పోర్టుల కోసం భూసేకరణలో రైతులను కీలక భాగస్వాములను చేస్తున్నామని వివరించారు. పోర్టుల నిర్మాణంకోసం భూములను సేకరించాలని కలెక్టర్లను కోరారు. పోర్టులు గ్రోత్ ఇంజన్‌గా మారుతాయని వెల్లడించారు. డ్రోన్ శిక్షణ కోసం ఔత్సాహికులను గుర్తించాలన్నారు. వాటర్ డ్రోన్, సీప్లేన్లు ఏర్పాటు చేయడానికి పది ప్రాంతాలను గుర్తించామని వెల్లడించారు. ప్రకాశం బ్యారేజీ, శ్రీశైలం, అరకు, లంబసింగి, రుషికొండ కోనసీమ, కాకినాడ, తిరుపతి, గండికోట, నరసాపురంలో సీప్లేన్‌లను ఎగురవేసేందుకు అనువైన ప్రాంతాలుగా గుర్తించామన్నారు. దగదర్తిలో నైట్ ల్యాండింగ్ ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు.

మైనారిటీ సంక్షేమానికి పెద్దపీట

▸ ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాలకు ఆదేశాలు ఇచ్చాం: సీఎం

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని సీఎం చంద్రబాబు అన్నారు. ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం ఇవ్వాలని ఇప్పటికే ఆదేశించామని, కొత్త వక్ఫ్ బోర్డు ఏర్పాటుకు ఉత్తర్వులు ఇచ్చామని చెప్పారు. కలెక్టర్ల సదస్సు చివరిరోజు గురువారం మైనారిటీ సంక్షేమశాఖపై సీఎం సమీక్ష జరిపారు. పీఎం జన్‌వికాస్ కార్యక్రమం కింద రూ.643 కోట్లతో 8,033 పనులు చేపట్టేందుకు అనుమతులు లభించాయని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి హర్షవర్ధన్ తెలిపారు. అందులో రూ.252 కోట్లతో 100 పనులకు అనుమతులు మంజూరయ్యాయని చెప్పారు. రాష్ట్రంలో మైనారిటీ పథకాల అమలుకు రూ.104 కోట్లు ఖర్చు పెడుతున్నామని చెప్పారు. నేషనల్ మైనార్టీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి రూ.300 కోట్లు ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించిందని, అందుకుగాను కౌంటర్ గ్యారంటీ అడుగుతున్నారని తెలిపారు. మైనారిటీ సంస్థల నిర్మాణానికి భూములు కేటాయింపుపై కలెక్టర్లకు డైరెక్షన్ ఇచ్చామన్నారు. పాస్టర్లకు గౌరవ వేతనం ఇచ్చే అంశాన్ని ఆలోచిస్తున్నామన్నారు. ఏపీజే అబ్దుల్ కలాం ఓవర్సీస్ ఎడ్యుకేషన్ స్కీమ్‌కు రూ. 8.86 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. మైనారిటీ విద్య విషయంలో చర్యలు తీసుకోవాలని ఆ శాఖ సలహాదారు షరీఫ్ కోరారు. "చాలీచాలని గదుల్లో మైనారిటీ రెసిడెన్సియల్ స్కూళ్లు నడుస్తున్నాయి. అనంతపురంలో ఈ సమస్య ఎక్కువగా ఉంది. గుంతకల్లు, ఆదోనీల్లో బిల్డింగ్‌లు కట్టారు. కానీ, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది లేరు" అని వివరించారు. వక్ఫ్ బోర్డు భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని... అధికారుల దృష్టికి మంత్రి ఫరూక్ తెచ్చారు.



తీరమంతా నల్లటి ఇసుక మేటలతో నిండిపోయిన ఈ చిత్రం విజయనగరం జిల్లాలోని భోగాపురం మండలం ముక్కాం మత్స్యకార గ్రామంలో తీసినది. గ్రామ పడమటి దిక్కున సముద్ర తీరమంతా ఇలా నల్లటి దిబ్బలా ఇసుక మేటతో నిండిపోయింది. తుఫాను సమయంలో సముద్ర తీరమంతా ఇసుక మేటలతో నిండిపోతుందని స్థానికులు చెబుతున్నారు. **- విజయనగరం, ఆంధ్రజ్యోతి**



'ఇజ్రాయెల్' పక్షి నెల్లూరులో ప్రత్యక్షం!

పొడవాటి ముక్కు... తలపై అందమైన రంగురంగుల ఈకల కిరీటం... ఈ పక్షి పేరు హుపో. ఇది ఇజ్రాయెల్ దేశపు జాతీయ పక్షి. అయితే దేశాలు దాటి వచ్చిన హుపో నెల్లూరులో ప్రత్యక్షమైంది. నెల్లూరు రూరల్ మండలం దొంతాలి అటవీ ప్రాంతంలో విహరిస్తున్న ఈ పక్షి చూపరులను ఆకట్టుకుంది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు



టమోటా కిలో రూపాయే!

పత్తికొండ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కిలో టమాటా ధర 20 నుంచి 35 రూపాయల దాకా ఉంది. కర్నూలు జిల్లా పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌లో మాత్రం టమాటా ధరలు భారీగా పడిపోయాయి. నాణ్యతను బట్టి గురువారం వీటి ధర 1 నుంచి 8 రూపాయల వరకు పలికింది. పత్తికొండ మార్కెట్‌కు రోజూ 200 టన్నుల టమాటా అమ్మకానికి వస్తోంది. ఇక్కడ టమాటాలు కొనుగోలు చేసిన వ్యాపారులు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. ఆయా ప్రాంతాల్లో స్థానికంగా పండుతున్న టమాటా దిగుబడులు మార్కెట్లకు వస్తుండడంతో పత్తికొండ నుంచి ఎగుమతి అవుతున్న టమాటాకు డిమాండ్ తగ్గింది. దీంతో వ్యాపారులు తక్కువ ధరకు కొంటున్నారు. గురువారం మార్కెట్లో 20 కిలోల బాక్స్‌లు జత రూ.40కి వ్యాపారులు కొనుగోలు చేయడంతో రైతులు ఆగ్రహంతో టమాటాలను మార్కెట్లోనే పారబోసి వెళ్లిపోయారు. మరికొందరు గుత్తి-పత్తికొండ రహదారిపై రాస్తారోకో చేశారు.



అంకుడుకర్రతో కనకదుర్గమ్మ కళాఖండం

ఎలమంచిలి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ప్రసిద్ధి చెందిన అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మండలం ఏటికొప్పాక హస్త కళాకారులు అంకుడు కర్రను ఉపయోగించి సహజ సిద్ధమైన రంగులతో కనకదుర్గమ్మ బొమ్మను రూపొందించారు. 8 సెంటీమీటర్ల పొడవు, 6 సెంటీమీటర్ల వెడల్పు కలిగిన ఈ కళాఖండాన్ని తయారుచేసేందుకు రెండు రోజులు పట్టినట్టు కళాకారులు తెలిపారు. ఈ దేవతామూర్తి కళాఖండానికి ఆన్‌లైన్‌లో మంచి డిమాండ్ ఏర్పడింది.

అంటార్కిటికాకు సాహస యాత్ర

▸▸ మచిలీపట్నం యువకుడి ఘనత



మచిలీపట్నం టౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన యువకుడు సిర్విశెట్టి చక్రవర్తి గణేష్ మంచు ఖండం అంటార్కిటికాకు సాహసయాత్ర చేశాడు. ప్రపంచ దేశాలను చుట్టిరావాలనే తపనతో మైనస్ 30 డిగ్రీల వాతావరణం ఉండే ఆ దక్షిణ ధ్రువంలో అడుగుపెట్టాడు. స్థానిక వ్యాపారవేత్త సిర్విశెట్టి అంజిబాబు కుమారుడైన చక్రవర్తి గణేష్ చిన్న వయసులోనే 52 దేశాల్లో పర్యటించాడు. ఎంతో క్లిష్టమైన అంటార్కిటికా యాత్ర పూర్తి చేసుకుని మచిలీపట్నం తిరిగొచ్చిన సందర్భంగా ఆ యాత్ర విశేషాలు గురువారం ఆంధ్రజ్యోతికి వివరించాడు. 130 మంది బృందంతో కలిసి ఈ యాత్రలో పాల్గొనడం తనకెంతో సంతోషాన్ని కలిగించిందన్నాడు. మూడు రోజుల పాటు 1,100 కిలోమీటర్లు సముద్రంలో ప్రయాణించి అంటార్కిటికాకు చేరుకున్నామన్నాడు. ఈ ప్రయాణం సాహసంతో కూడుకున్నదని తెలిపాడు. మధ్యలో వాతావరణ పరిస్థితులు అనుకూలించలేదని, ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని భయంతో గడిపామని చెప్పాడు. మానవ సంచారం లేని ఆ ప్రాంతంలో 8 గంటలు గడిపామన్నారు. ప్రకృతి సౌందర్యం అలరాలుతున్న అక్కడ పాకుడుజాతి చెట్లు, కొన్ని వింత పక్షులు, తిమింగలాలు, సీల్స్‌ను చూశామన్నారు. ఈ సందర్భంగా గణేష్‌ను మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పి.శ్రీరామ్, అయ్యప్ప స్వామి, ఆదిత్య అభినందించారు.

బై బై జగన్

(మొదటి పేజీ తరువాయి)

భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కూడా రాజీనామా ప్రకటించారు. వీరిద్దరూ ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచి వైసీపీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు.

వ్యక్తిగత కువిమర్శలు చేయలేక..

ఎవరైనా ఒకసారి రాజకీయ జీవితాన్ని ప్రారంభించారంటే.. తరాలు కొనసాగుతుంది. తాత, తండ్రి, మనవళ్లు, కొడుకులు, కూతుళ్లు, భార్య ఇలా ఎవరో ఒకరు వారసులుగా కొనసాగుతుండడం పరిపాటిగా మారింది. కొన్ని సందర్భాల్లో పార్టీలు మాత్రమే మారుతుంటారు. శాశ్వతంగా రాజకీయాలు వదిలేయరు. గత ఐదేళ్లలో జగన్‌ను నమ్ముకున్నవారిలో చాలా మంది ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాలని భావిస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం ఆయన అనుసరించిన రాజకీయ విధానమేనని రాజకీయ వర్గాలు అంటున్నాయి. సైద్ధాంతిక విమర్శలకు తిలోదకాలిచ్చి.. రాజకీయ ప్రత్యర్థులపై వ్యక్తిగత దాడులకు దిగే విష సంస్కృతికి 2019లోనే ఆయన శ్రీకారం చుట్టారు. మరీ ముఖ్యంగా కుటుంబ సభ్యులపై కూడా సోషల్ మీడియాలో విషం చిమ్మడంవంటి వికృత పోకడలకు వైసీపీ నాయకత్వం తెరలేపింది. కన్నతల్లి, తోడబుట్టిన చెల్లెలు కూడా ఇందుకు వినహాయింపు లేదు. ఎవరికైనా వయసు మీదపడుతుంది. అది ప్రకృతి ధర్మం. చంద్రబాబును ముసలోడని జగన్ పదే అంటుంటారు. ఎంపీ విజయసాయిరెడ్డి సైతం సీఎం ముసలోడని.. వచ్చే ఎన్నికల నాటికి బతికి ఉండడని.. బతికి ఉంటే వైసీపీ తిరిగి అధికారంలోకి రాగానే జైలుకు పంపిస్తామని ఏకంగా విలేకరుల సమావేశంలోనే ప్రకటించడం చూస్తే.. వారి రాజకీయాలు ఏ స్థాయికి దిగజారాయో అర్థమవుతోంది. 2024 ఎన్నికల్లో వైసీపీ కేవలం ఓడిపోవడమే కాదు.. కనీసం ప్రధాన ప్రతిపక్షం హోదా కూడా దక్కలేదు. అయినా తనకు ప్రధాన ప్రతిపక్ష నేత పదవి ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని జగన్ మొండికేయడం సొంత పార్టీ నేతలనే విస్మయానికి గురిచేసింది. ప్రజాతీర్పును అపహాస్యం చేయడం ఆయనకు కొత్త కాదు. కానీ దీనిపై ఏకంగా హైకోర్టుకే వెళ్లడం.. సీఎం హోదాలో తనకున్న భద్రతను పునరుద్ధరించాలని పేచీపెట్టడం వంటివి.. తమ రాజకీయ భవిష్యత్‌ను కూడా ప్రశ్నార్థకం చేస్తున్నాయని వైసీపీ సీనియర్లు ఆందోళన చెందుతున్నారు. ప్రత్యర్థులను అసభ్యంగా దూషిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేవారిపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుండడంతో చాలా మంది మెడకు చుట్టుకుంటోంది. ప్రజలు కూడా ఏవగించుకుంటున్నారు. జగన్ ప్రభావంతో గతంలో నోటికి, చేతికి పనిచెప్పిన కొందరు నాయకులపై తాజాగా కేసులు నమోదవుతున్నాయి.

అప్పుడలా చేసి..

టీడీపీ కూటమి ప్రభుత్వం పెడుతున్న కేసులపై రాజకీయ పోరాటం చేయాలని వైసీపీ నేతలకు జగన్ పిలుపిచ్చారు. ఈ కేసులతో వైసీపీపై ప్రజల్లో సానుభూతి వస్తుందని ఆయన ఆశించారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అలా లేదు. ఆయన ఐదేళ్ల హయాంలో రాజకీయ ప్రత్యర్థులపైనే కాదు.. జనంపైనా తప్పుడు కేసులు బనాయించారు. ప్రతిపక్ష నేతలు పాదయాత్రలు, ర్యాలీలు, సభలు నిర్వహించకుండా నిరోధిస్తూ ప్రత్యేక జీవోనే తెచ్చారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ధూళిపాళ్ల నరేంద్ర.. చివరకు చంద్రబాబును సైతం అక్రమంగా అరెస్టుచేసి జైలు పాల్జేయడం వైసీపీకి రాజకీయంగా శాపంగా మారాయి. నాటి వైసీపీ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. వాటిపై సీఐడీ, ఏసీబీ విచారణలు జరుగుతున్నాయి. జగన్‌తో అంటకాగి అక్రమాలకు పాల్పడిన అధికారులు కొందరు అరెస్టు కూడా అయ్యారు. దీంతో వైసీపీ నేతలు భయంతో నోరుమెదపడం లేదు. కొందరు ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటుండగా.. మరికొందరు వేరే పార్టీలకు వెళ్లిపోతున్నారు. వైసీపీలో కొనసాగడం అనవసరమని భావించి మోపిదేవి వెంకటరమణారావు, బీద మస్తాన్‌రావు పార్టీకి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసి మరీ టీడీపీలో చేరిపోయారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, సామినేని ఉదయభాను, కిలారు వెంకటరోశయ్య జనసేనలో చేరగా.. రాజకీయాలకు దూరంగా ఉంటానంటూ వైసీపీకి రాజీనామా చేసిన మాజీ ఉపముఖ్యమంత్రి ఆళ్ల నాని టీడీపీలోకి వెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.



వైసీపీకి ఝలక్!

మాజీ మంత్రి అవంతి, మాజీ ఎమ్మెల్యే గ్రంధి రాజీనామా

▸▸ పార్టీ అధ్యక్షుడు జగన్‌కు లేఖలు

▸▸ 5 నెలలకే పాలక పక్షంపై ఎదురుదాడి సరికాదు

▸▸ ఓటమి తర్వాత జగన్ తప్పులు దిద్దుకోలేదు

▸▸ అన్ని పార్టీల నుంచీ నాకు ఆహ్వానం ఉంది

▸▸ ప్రజా సేవ కోసం మంచి పార్టీలోనే చేరతా: ముత్తంశెట్టి

▸▸ జగన్‌కు ఓ విధానమే లేదు

▸▸ వలంటీర్లతో కార్యకర్తలకు గుర్తింపు పోయింది

▸▸ మిగులు బడ్జెట్ ఉంటే బిల్లులెందుకు ఇవ్వలేదు?

▸▸ ఫీజులు ఎందుకు చెల్లించలేదు: గ్రంధి శ్రీనివాస్

విశాఖపట్నం/భీమవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి గురువారం గట్టి షాక్ తగిలింది. మాజీ మంత్రి, భీమిలి మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి (అవంతి) శ్రీనివాసరావు, భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తమ రాజీనామా లేఖలను జగన్‌కు పంపించారు. సీతమ్మధారలోని తన స్వగృహంలో అవంతి విలేకరులతో మాట్లాడారు. 'భీమిలి ఇన్‌చార్జి పదవికి, వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేశా. గడప గడపకూ కార్యక్రమం నిర్వహణలో భీమిలిని రాష్ట్రంలో టాప్-10 నియోజకవర్గాల్లో నిలిపా. పార్టీలతో సంబంధం లేకుండా అత్యధిక శాతం ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించా. ఈ క్రమంలో వ్యక్తిగత జీవితం కోల్పోయా. ఇప్పుడు కొన్నాళ్లు ప్రశాంతంగా ఉండాలనుకుంటున్నా. వైసీపీ హయాంలో నా అవంతి కాలేజీలకు ఫీజులు తగ్గించారు. ఇతర పార్టీలనాయకుల సంస్థలకు యూనివర్సిటీ హోదాలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం పరిపాలన చేపట్టి కొద్దికాలమే అయింది. ఐదేళ్లు పాలించేందుకు వారికి ప్రజలు పట్టం కట్టారు. కానీ ఐదు నెలలకే విమర్శిస్తూ వైసీపీ ధర్నాలు, ఆందోళనలకు దిగడం సరికాదు. ఎన్నికల్లో ఓటమి తర్వాత జగన్మోహన్‌రెడ్డి అన్నీ సమీక్షించుకుని, తప్పులు సరిచేసుకుని పార్టీని ముందుకు తీసుకెళ్తారని భావించా. అయితే అటువంటి మార్పేదీ కనిపించలేదు. ఆయన ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారు. వాటి ఫలితం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు అనుభవిస్తున్నారు. విశాఖలో పరిపాలనా రాజధాని ఏర్పాటుచేస్తామని చెప్పినా ఇక్కడి ప్రజలు విశ్వసించలేదు. నాకు అన్ని పార్టీల నుంచీ ఆహ్వానం ఉంది. కొంత సమయం తీసుకుని ప్రజాసేవ కోసం మంచి పార్టీలోనే చేరతా' అని చెప్పారు.



గ్రంధి శ్రీనివాస్

నేతలు బుజ్జగించినా..

గ్రంధి శ్రీనివాస్ రాజీనామాతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వైసీపీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే ఏలూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ ఉపముఖ్యమంత్రి ఆళ్ల నాని పార్టీ నుంచి వైదొలగగా.. తాజాగా భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి కూ డా వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూశాక ఆయన ఆ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. జిల్లా పార్టీ సమావేశాలకూ హాజరు కావడం లేదు. పార్టీ ముఖ్యులు పలుమార్లు ఆయన ఇంటికి వచ్చి బుజ్జగించారు. ఇటీవల ఆయనే జగన్‌ను కలిశారు. మే నెల వరకు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనని.. ఆ తర్వాత తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని అధ్యక్షుడికి స్పష్టం చేశారు. ఈలోపు ధాన్యం కొనుగోలుపై కలెక్టరేట్ వద్ద ధర్నాలకు జగన్ పిలుపిచ్చారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరావు గ్రంధిని పక్కనపెట్టి.. భీమవరంలో నిర్వహించే ధర్నాకు రావాలని పార్టీ నాయకులు, ముఖ్యులను ఫోన్ ద్వారా ఆహ్వానించారు. ఇది మాజీ ఎమ్మెల్యేను గాయపరిచింది. దీంతో కొంత కాలం వేచి ఉండాలన్న నిర్ణయాన్ని మార్చుకున్నారు. తన అనుచరగణంతో చర్చించి వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు గురువారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. 'జగన్ ప్రవేశపెట్టిన వలంటరీ వ్యవస్థతో కార్యకర్తలకు, నాయకులకు గుర్తింపు లేకుండా పోయింది. ఆయనకో విధానమంటూ లేదు. తమ ప్రభుత్వం రూ.7 వేల కోట్ల మిగిల్చి వెళ్లిందని చెబుతున్నారు. మరి ఎన్నికల ముందు అది ఎందుకు ఖర్చు పెట్టలేదు? కాంట్రాక్టర్లకు బిల్లులు ఎందుకివ్వలేదు? ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎందుకు ఇవ్వలేకపోయాం.. దీనిపై ప్రజలు నిలదీస్తుంటే సమాధానం చెప్పలేకపోతున్నాం. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వైసీపీలో కొనసాగితే జనాభిమానం పొందలేం. అందుకు రాజీనామా చేశా' అని ప్రకటించారు.

రూ.10కే పురుగుమందుల అవశేషాల గుర్తింపు పరీక్ష

▸▸ పళ్లు, కూరగాయలు, నీళ్లలో అవశేషాలను గుర్తించే సాధనం

▸▸ బిట్స్ హైదరాబాద్ పరిశోధకుల ఆవిష్కరణ

▸▸ త్వరలో మార్కెట్లోకి తీసుకొచ్చే ప్రయత్నాలు



బిట్స్‌పిలానీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పళ్లు, కూరగాయలు, నీళ్లలో.. పురుగుమందుల అవశేషాలను త్వరగా, అత్యంత చవకగా రూ.10కే గుర్తించే పరికరాన్ని హైదరాబాద్‌లోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) పరిశోధకులు రూపొందించారు. సాధారణంగా పురుగుమందుల అవశేషాలను గుర్తించాలంటే.. పళ్లు, కూరగాయలను జూస్‌లాగా మార్చి ఆ ద్రావకాన్ని పరీక్షిస్తారు. కానీ, బిట్స్ శాస్త్రవేత్తలు తయారుచేసిన సాధనంతో జూస్‌లాగా మార్చాల్సిన అవసరం లేకుండానే పరీక్ష జరపవచ్చు. సదరు పళ్లు, కూరగాయలను కడిగిన నీటిని పరీక్షించటం ద్వారా పురుగు మందుల అవశేషాలను ఈ సాధనం గుర్తిస్తుంది. తద్వారా అవి పాడవకుండా, వినియోగించుకోవటానికి వీలుగా ఉంటాయి. మనదేశంలో వినియోగించే 8 రకాల సేంద్రియ ఫాస్ఫరస్ పురుగుమందుల (మలాథియాన్, క్లోర్‌పైరిఫోస్, డైమీథేట్ మొదలైనవి) అవశేషాలను ఈ సాధనంతో కనుగొనవచ్చు. పళ్లను, కూరగాయలను కడిగిన నీళ్లలో కేవలం ఐదు మిల్లీలీటర్ల నీటితో పరీక్ష జరపవచ్చని ప్రధాన పరిశోధకుడు కేఎస్ దీపక్ తెలిపారు. పురుగు మందుల అవశేషాలుంటే.. సాధనంలో ఉండే ఒక ద్రావకం రంగు మారుతుందని, దాని ద్వారా ఏ అవశేషాలు, ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చన్నారు. సాధారణంగా ఈ తరహా పరీక్షకు ప్రస్తుతం రూ.1500 వరకు వ్యయం అవుతుండగా, తాము రూపొందించిన 'పోర్టబుల్ మైక్రోఫ్లూయిడిక్ డివైజ్'తో రూ.10కే సాధ్యమని తెలిపారు. త్వరలో మార్కెట్లోకి తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తామన్నారు.

సీసీటీవీ ఫుటేజ్‌లో ఆ కార్పొరేటర్ ఉన్నారా?

▸▸ నిర్ధారించి నివేదిక సమర్పించండి.. ఏపీపీ, పిటిషనర్‌కు హైకోర్టు ఆదేశం

▸▸ ఉన్నారని తేలితే ఆయన జైలుకే.. విచారణ 2 వారాలకు వాయిదా



అమరావతి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి జరిగిన రోజు తాను మేనల్లుడి పెళ్లిలో ఉన్నానని పిటిషనర్.. ఆయన నేర ఘటన జరిగిన ప్రాంతంలోనే ఉన్నాడని సీఐడీ పరస్పర విరుద్ధంగా చెబుతున్న నేపథ్యంలో హైకోర్టు కీలక ఆదేశాలిచ్చింది. ప్రాసిక్యూషన్ వద్ద ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించి అందులో వైసీపీ కార్పొరేటర్ పి.సుబ్బారెడ్డి ఉన్నారో లేదో పరిశీలించి నివేదిక సమర్పించాలని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) సందీప్‌ను, పిటిషనర్ తరఫు న్యాయవాది వై.నాగిరెడ్డిని ఆదేశించింది. ఫుటేజ్‌లో ఉన్నది పిటిషనరో కాదో నిర్ధారించుకుని అఫిడవిట్ దాఖలు చేయాలని సీఐడీ డీఎస్పీని నిర్దేశించింది. ఫుటేజ్‌లో ఉన్నది సుబ్బారెడ్డి అని తేలితే మధ్యంతర ఉత్తర్వులను ఉపసంహరించి.. అతడిని జైలుకు పంపిస్తామని.. కాదని నిర్ధారణయితే దర్యాప్తు అధికారిపై చర్యలకు ఆదేశిస్తామని స్పష్టం చేసింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. పిటిషనర్‌పై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను నాలుగు వారాలు పొడిగించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై 2021 అక్టోబరు 19న జరిగిన మూకదాడి కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ కార్పొరేటర్ పి.సుబ్బారెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా.. ఘటన జరిగిన రోజు పిటిషనర్ టీడీపీ కార్యాలయం వద్దే ఉన్నారని, అందుకు ఆధారాలు ఉన్నాయని సీఐడీ కౌంటర్ దాఖలు చేసింది. అయితే తాను పెళ్లిలో ఉన్నానంటూ సుబ్బారెడ్డి కోర్టుకు నివేదించారు. దీనిపై వివరణ ఇచ్చేందుకు కోర్టు ముందు హాజరుకావాలని సీఐడీ డీఎస్పీని న్యాయమూర్తి ఆదేశించారు. గురువారం నాటి విచారణకు డీఎస్పీ జి.లక్ష్మయ్య హాజరయ్యారు. 'ఘటన జరిగిన రోజు సుబ్బారెడ్డి అక్కడే ఉన్నారా.. సీసీటీవీ ఫుటేజ్‌ను మీరు పరిశీలించారా? అందులో ఉన్నది సుబ్బారెడ్డేనని నిర్ధారించుకున్నారా' అని న్యాయమూర్తి ఆయన్ను ప్రశ్నించారు. డీఎస్పీ బదులిస్తూ.. సుబ్బారెడ్డి ఘటన జరిగిన ప్రాంతంలో ఉన్నట్లు సాక్షులు వాంగ్మూలం ఇచ్చారని.. వీడియో ఫుటేజ్‌ను పరిశీలించి కూడా నిర్ధారించుకున్నామని.. పూర్వ దర్యాప్తు అధికారి సైతం ఫుటేజ్‌లో ఉన్నది సుబ్బారెడ్డేనని గుర్తించారని తెలిపారు. ఏపీపీ వాదనలు వినిపిస్తూ..టీడీపీ కార్యాలయంపై దాడి జరిగినరోజు ఉదయం రోసుబ్బారెడ్డి నరసరావుపేటలో మేనల్లుడి ప్రి-వెడ్డింగ్ కార్యక్రమానికి హాజరయ్యారని.. మధ్యాహ్నం భోజనం చేశాక అక్కడి నుంచి వెళ్లిపోయారని తెలిపారు. నరసరావుపేట నుంచి ఘటన జరిగిన ప్రాంతానికి వచ్చేందుకు ఎంత సమయం పడుతుందని న్యాయమూర్తి ప్రశ్నించారు. గంట నుంచి గంటన్నర సమయం పడుతుందని ఏపీపీ జవాబిచ్చారు. ఇరుపక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించి తమ ముందుకు రావాలని ఆదేశించారు.



విచారణకు హాజరైన మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య

ఆ పోస్టులతో సంబంధం లేదు

▸▸ పోలీసుల విచారణలో మాజీ ఎమ్మెల్యే రోశయ్య

పొన్నూరు టౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కుటుంబ సభ్యులపై అసభ్య పోస్టులు పెట్టిన కేసులో మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య గురువారం పోలీసు విచారణకు హాజరయ్యారు. 2021లో ధూళిపాళ్ల కుటుంబ సభ్యులపై వైసీపీ నాయకులు, కార్యకర్తలు అసత్యాలతో అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెట్టారు. దీనిపై వారు అప్పట్లోనే పోలీసులకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేయకుండా జాప్యం చేస్తూ వచ్చారు. ఇటీవల ఈ కేసులో గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త షేక్ గోపీలాల్‌ను పోలీసులు అరెస్టు చేసి విచారించారు. రోశయ్య ప్రోద్బలంతోనే నరేంద్రకుమార్ కుటుంబ సభ్యులపై అనుచిత పోస్టులు పెట్టినట్లు అతను అంగీకరించినట్లు సమాచారం. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని, కేసు కొట్టివేయాలని రోశయ్య హైకోర్టును ఆశ్రయించారు. అయితే పోలీసు విచారణకు హాజరు కావాలని హైకోర్టు ఆయన్ను ఆదేశించింది. దీంతో గురువారం పొన్నూరు రూరల్ పోలీసు స్టేషన్‌కు వచ్చిన రోశయ్యను సీఐ వై కోటేశ్వరరావు నేతృత్వంలో సుదీర్ఘంగా విచారించారు. తనకు ఏమీ తెలియదని, తాను గ్రూప్ అడ్మిన్‌నే కానీ పోస్టులతో తనకు సంబంధం లేదని రోశయ్య సమాధానాలు దాటవేసినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో మరోమారు విచారణకు రావాల్సి ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు.

శివశంకర్‌రెడ్డికి ముందస్తు బెయిల్

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌పై అనుచిత, అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో వైసీపీ సానుభూతిపరుడు పెసల శివశంకర్‌రెడ్డికి హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. కంకిపాడు ఎస్‌హెచ్‌వో సంతృప్తి మేరకు రూ.10వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని పిటిషనర్‌ను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. హరినాథ్ ఉత్తర్వులు జారీ చేశారు.



టీడీపీ కండువాతో టోల్ ఫీజు వసూలు చేస్తున్న ప్రేమ్‌కుమార్

టీడీపీ కండువాతో... టోల్ నాటకం

▸▸ రక్తికట్టించేలా వైసీపీ నేత డ్రామా.. సోషల్ మీడియాలో వైరల్

గుంటూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): అతడి పేరు కొరిటిపాటి ప్రేమ్‌కుమార్. గుంటూరుకు చెందిన ఇతడు వైసీపీలో చోటా నాయకుడు. వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీమంత్రి అంబటి రాంబాబులకు అనుచరుడిగా ఉంటూ కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత తెచ్చేందుకు వీడియోలు చేస్తున్నాడు. ఇటీవల చేసిన రెండు వీడియోలపై కర్నూలులో టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఒక వీడియోలో.. 'ప్రేమ్‌కుమార్ మెడలో టీడీపీ కండువా వేసుకుని అనుచరులతో కలిసి ఓ పల్లెటూళ్లో రోడ్డుకు అడ్డుగా బైక్‌పై కూర్చుంటాడు. సెక్యూరిటీ గార్డుతో వాహనాల నుంచి టోల్ ఫీజు వసూలు చేస్తుంటాడు. పల్లెటూరులో టోల్‌ఫీజు ఏంటని కారులో వచ్చిన వ్యక్తి ప్రశ్నించగా.. పల్లెటూరైతే రోడ్లు ఉండవా... వాటిపై గుంతలు ఉండవా? అవి పూడ్చడానికి డబ్బులు లేవని డిప్యూటీ సీఎం అన్నారు కదా, డబ్బు కట్టి వెళ్లు అంటూ దబాయిస్తాడు. దీంతో కారులో నుంచి దిగిన వ్యక్తి 'నమ్మి ఓట్లు వేసినందుకు భలే బుద్ధి చెప్పారు' అంటూ ప్రభుత్వంపై నిందలు వేసి.. రూ.వంద ఫీజు చెల్లిస్తాడు. ఈ వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. ప్రేమ్‌కుమార్‌పై కర్నూలు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రేమ్‌కుమార్‌ను గురువారం గుంటూరులో కర్నూలు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

విజయసాయిరెడ్డి వ్యాఖ్యల వెనుక కుట్ర కోణం

▸▸ ఆయనపై కేసుపెట్టి విషయాన్ని నిగ్గు తేల్చండి

▸▸ గుంటూరు పోలీసులకు టీడీపీ అభిమాని ఫిర్యాదు

గుంటూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన తీవ్ర వ్యాఖ్యలు వెనుక కుట్ర కోణం దాగి ఉందని తెలుగుదేశం పార్టీ అభిమాని నల్లూరి ప్రదీప్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. "విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ... 'మళ్లీ మా పాలన అంటే వైసీపీ అధికారంలోకి వస్తుంది. ఈలోగా చంద్రబాబు బతికి ఉండడు. ఒకవేళ బతికి ఉంటే ఆయన్ని బయట ఉంచం. జైల్లో పెడతాం' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విజయసాయిరెడ్డి ఏ ఉద్దేశంతో ఈ వ్యాఖ్యలు చేశారో తేల్చాలి. విజయసాయిరెడ్డిపై కేసు పెట్టి విషయం నిగ్గుతేల్చాలి" అని కోరుతూ పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబుకు రాతపూర్వకంగా ఫిర్యాదు అందించారు.

నేడు పోలీసు కస్టడీకి విజయ్‌పాల్

▸▸ రెండు రోజులపాటు విచారించనున్న పోలీసులు

ఒంగోలు క్రైం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసు దర్యాప్తు వేగం పుంజుకుంది. సీఐడీ మాజీ ఏఎస్పీ విజయ్‌పాల్‌ను రెండు రోజుల పోలీసు కస్టడీకి ఇస్తూ కోర్టు ఆదేశాలివ్వడంతో శుక్రవారం ఉదయం గుంటూరు జైలు నుంచి పోలీసులు ఆయనను ఒంగోలు తీసుకొస్తారు. రెండు రోజులపాటు ఎస్పీ దామోదర్ నేతృత్వంలో విజయ్‌పాల్‌ను విచారించనున్నారు.

రెండు రోజుల పోలీసు కస్టడీకి వర్రా

కడప రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా కడప జిల్లా కో-కన్వీనర్ వర్రా రవీంద్రరెడ్డిని న్యాయస్థానం రెండ్రోజుల పాటు పోలీసు కస్టడీకి అనుమతించింది. ఈ మేరకు గురువారం ఎస్సీ, ఎస్టీ కోర్టు (నాల్గవ అదనపు జిల్లా కోర్టు) న్యాయాధికారి దీనబాబు ఉత్తర్వులు వెలువరించారు. వర్రాను 10రోజులు కస్టడీకివ్వాలని పోలీసులు కోరగా..కోర్టు రెండ్రోజులే ఇచ్చింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.